

'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 129

మంగళవారం 24-1-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



చిరునవ్వు.. కోటి కాంతులు

నేషనల్ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా ప్రత్యేక కథనం - 11లో



క్లీన్‌స్వీప్ లక్ష్యంగా..


నేడు న్యూజిలాండ్‌తో భారత్ చివరి వన్డే.. పరువు కోసం కివీస్ పోరు - 12లో



మహా యోధుడు బోస్

నేతాజీ మహా యోధుడని ప్రధాని మోదీ అన్నారు. అండమాన్‌లోని 21 దీవులకు పరమ వీరచక్ర గ్రహీతల పేర్లను పెట్టారు.

వివరాలు 6లో ▸



నేవీ అమ్ములపొదిలోకి వాగీర్

ఆధునిక ఆయుధ వ్యవస్థ, వేగంగా దూసుకెళ్లే సామర్థ్యం, గుట్టుగా మోహరించే దమ్మున్న ఐఎన్ఎస్ వాగీర్ భారత నేవీలో చేరింది.

వివరాలు 6లో ▸



పాకిస్తాన్‌లో చీకట్లు

పాక్‌లో చీకట్లు అలుముకున్నాయి. పవర్ గ్రిడ్ వైఫల్యం వల్ల ఇస్లామాబాద్, కరాచీ సహా చాలా చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

వివరాలు 6లో ▸



అనుమానితుడు ఆత్మహత్య

లాస్‌ఏంజెలెస్‌లో లూనార్ న్యూ ఇయర్ వేడుకల కాల్పుల ఘటనలో అనుమానితుడు తుపాకీతో కాల్చుకుని చనిపోయాడు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

శ్రీవాణి ట్రస్టు నిధులతో 2,068 ఆలయాల నిర్మాణం



శ్రీవాణి ట్రస్టు నిధులతో ఏపీ, తెలంగాణ, పాండిచ్చేరి, కర్ణాటకలో మొత్తం 2,068 ఆలయాల నిర్మాణం జరుగుతోందని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. శ్రీవాణి ట్రస్టుకు రూ.650 కోట్ల విరాళాలు సమకూరాయని, నిధులు దుర్వినియోగమయ్యే అవకాశమే లేదన్నారు. దుష్ప్రచారాన్ని నమ్మొద్దని భక్తులకు సూచించారు.

వివరాలు 5 ▸

మళ్లీ మన్యం గజగజ



అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలుచోట్ల ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. చలిగాలులు తీవ్రంగా వీస్తున్నాయి. అరకు లోయలో 6.5 డిగ్రీలు, చింతపల్లిలో 7 డిగ్రీలు, మినుములూరులో 9 డిగ్రీలుగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వివరాలు 5 ▸

ఐకమత్యంతోనే దేశం పురోగమిస్తుంది



'నేను అని సరిపెట్టుకోవడం కంటే.. మనం అని ఐకమత్యంతో సాగితేనే ఏ దేశమైనా పురోగమిస్తుంది' అని క్యూబా విప్లవ నాయకుడు చే గువేరా కుమార్తె అలైదా గువేరా అన్నారు. మాటల్లోనే కాదు.. చేతల్లోనూ దేశభక్తి ఉండాలన్నారు. సంఘీభావం అనేది ఒకరి నుంచి తీసుకోవడం కాదని, ఇవ్వడమనే అందమైన భావన అని చెప్పారు.

వివరాలు 3 ▸

సరైన అమ్మాయి దొరికితే పెళ్లి చేసుకుంటా

– రాహుల్‌గాంధీ

6లో

ఇదండీ సంగతి



కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు తిరిగినా దొరకలేదంటే.. ఇంకేం దొరుకుతుంది సార్!!

చీఫ్ జస్టిస్ స్థానాన్ని కించపరిచారు!

వెకేషన్ బెంచ్ తీరును తప్పుబట్టిన సీజే ధర్మాసనం

- డీఫాక్టో ప్రధాన న్యాయమూర్తిలా వ్యవహరించారు.. ప్రతి వెకేషన్ జడ్జి ఇలాగే వ్యవహరిస్తే వ్యవస్థ ఏమవుతుంది?
- ఇది తేలిగ్గా తీసుకునే విషయం ఎంత మాత్రం కాదు
- వెకేషన్ కోర్టులో ఏం జరిగిందో ప్రతిదీ తెలుసు
- మాకు తెలియదనుకుంటే అది పెద్ద పొరపాటు
- మూలాల్లోకి వెళ్లి ఈ వ్యవహారాన్ని తేలుస్తాం
- సీజే అధికారాలు ఏమిటో మాకు బాగా తెలుసు
- హైకోర్టు సీజే ప్రశాంత్‌కుమార్ మిశ్రా స్పష్టీకరణ
- వాటి విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించి తీరుతాం
- జీవో1పై అంత అత్యవసరంగా ఎందుకీ పిటిషన్?
- ధర్నాలు, రాస్తారోకోలు చేశారా? మీకేం ఇబ్బంది కలిగింది?.. ఏం మునిగిపోయిందని వెకేషన్ కోర్టులో పిల్ వేశారని సీపీఐ రామకృష్ణకు ప్రశ్న
- మధ్యంతర ఉత్తర్వులు పొందాక ఏవైనా నిరసన కార్యక్రమాలు చేపట్టారా? అదీ లేదు కదా?
- ఇలాంటి పిటిషన్‌తో తీవ్ర గందరగోళ పరిస్థితులు సృష్టించారు
- ఇందుకు సమాధానం చెప్పి తీరాల్సిందే
- పిటిషనర్‌కు తేల్చి చెప్పిన హైకోర్టు ధర్మాసనం



సాక్షి, అమరావతి: సెలవుల్లో ఎలాంటి అత్యవసర కేసులను విచారించాలో ప్రధాన న్యాయమూర్తి (సీజే) పరిపాలనాపరంగా నిర్దిష్ట ఆదేశాలు జారీ చేసినప్పటికీ అందుకు విరుద్ధంగా జస్టిస్ బట్టు దేవానంద్ నేతృత్వంలోని వెకేషన్ బెంచ్ వ్యవహరించడాన్ని సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. సంక్రాంతి సెలవుల సందర్భంగా వెకేషన్ బెంచ్ వ్యవహరించిన తీరు చాలా దురదృష్టకరమంది. ఆ బెంచ్ డీఫాక్టో ప్రధాన న్యాయమూర్తిలా వ్యవహరించిందని ఆక్షేపించింది. సీజే నిర్దేశించిన ఆదేశాలకు విరుద్ధంగా సెలవుల్లో ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించడం ద్వారా సీజే స్థానాన్ని వెకేషన్ బెంచ్ కించపరిచిందని ఘాటుగా వ్యాఖ్యానించింది. ప్రతి వెకేషన్ జడ్జి ఇలాగే వ్యవహరిస్తే వ్యవస్థ ఏమవుతుందంటూ ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి వాటిని అనుమతిస్తే రేపు ప్రతి వెకేషన్ జడ్జి ప్రధాన న్యాయమూర్తిలా వ్యవహరిస్తారని వ్యాఖ్యానించింది. ఇది తేలిగ్గా తీసుకునే విషయం ఎంత మాత్రం కాదని, మూలాల్లోకి వెళ్లి

మిగతా 2వ పేజీలో ▶

మే 15 నుంచి ఏపీ ఈఏపీసెట్



మే 5న ఈసెట్

అదే నెల 20న లాసెట్, ఎడ్‌సెట్

25, 26 తేదీల్లో ఐసెట్

పలు ప్రవేశపరీక్షల షెడ్యూళ్లు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఈఏపీ సెట్)ను మే 15 నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఈఏపీసెట్‌లో భాగంగా మే 15 నుంచి 22 వరకు ఎంపీసీ విభాగం పరీక్షలు నిర్వహిస్తారు. ఇక మే 23, 24, 25 తేదీల్లో బైపీసీ విభాగం ప్రవేశపరీక్షలు ఉంటాయి.

ఈసారి ముందుగానే..

రాష్ట్రంలో వివిధ ఉన్నత విద్యాకోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఇతర ప్రవేశపరీక్షల షెడ్యూళ్లను కూడా

మిగతా 10వ పేజీలో ▶

ఈ మూడున్నరేళ్లలోనే ఎంతో లాభం

- ఎస్సీ, ఎస్టీలకు నిజమైన 'ఉపకారం' ఈ కాలంలోనే..
- 2014–19 మధ్య ఎస్సీలకు రూ.33,625 కోట్లు, ఎస్టీలకు 12,487 కోట్లు మాత్రమే ఖర్చు
- అదే ఈ మూడున్నరేళ్లలో ఎస్సీలకు రూ.48,899 కోట్లు, ఎస్టీలకు రూ.15,589.38 కోట్లు ఖర్చు

10లో

రాష్ట్రంలో జీతభత్యాల వ్యయం భారీగా పెరుగుదల

రాష్ట్రాల ఆర్థిక వ్యవహారాలు, బడ్జెట్‌లపై ఆర్‌బీఐ నివేదిక

- 2018–19లో అది రూ.32,743 కోట్లే..
- 2022–23 నాటికి రూ.54,768 కోట్లకు చేరిన ఖర్చు
- నాలుగేళ్లలో ఈ వ్యయం రూ.22,025 కోట్లు పెరుగుదల



- తెలంగాణలో జీతాలకు రూ.29,682 కోట్లే ఖర్చు

2లో

మిలమిల మెరవాలి

రాష్ట్రంలో రోడ్లన్నీ బాగుండాలి.. నాణ్యంగా కొత్తవి నిర్మాణం: సీఎం జగన్

- రోడ్డు నిర్మిస్తే కనీసం ఏడేళ్లపాటు పాడవకుండా చూడాలి.. క్రమం తప్పకుండా మెయింటెనెన్స్‌తో ఇలా చేయడం సాధ్యం
- ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అప్‌గ్రేడెడ్ టెక్నాలజీతో రోడ్లు
- తొలిదశలో వెయ్యి కిలోమీటర్లు జూన్, జూలై కల్లా నిర్మాణం.. అధికారుల ప్రతిపాదనకు అప్పటికప్పుడే సీఎం గ్రీన్ సిగ్నల్
- ఇంత ఖర్చు చేసినా కొందరు నెగెటివ్ ప్రచారం
- వారి కడుపు మంటకు మందులేదు
- బాగు చేసిన రోడ్ల ఫొటోలను నాడు–నేడు ద్వారా ప్రదర్శించాలి
- ప్రభుత్వ శాఖలన్నీ అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచాలి
- పట్టణాలు, నగరాల్లో రోడ్ల మరమ్మతులకు 'ఏపీ సీఎం ఎంఎస్ యాప్'
- ఫిర్యాదు అందిన 60 రోజుల్లోగా రిపేర్లు
- కడప–బెంగళూరు రైల్వే లైన్‌పై ఫోకస్
- విశాఖ–భోగాపురం రోడ్డుపైనా దృష్టి





సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రహదారులను పూర్తిగా బాగు చేయడంతో పాటు కొత్తగా నిర్మిస్తున్న రోడ్లను నాణ్యతతో చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. రహదారుల నిర్మాణం పూర్తయ్యాక మళ్లీ రెండేళ్లకే మరమ్మతులకు ఏమాత్రం ఆస్కారం ఉండకూడదని స్పష్టం చేశారు. ఏదైనా రోడ్డు వేశాక కనీసం ఏడేళ్లపాటు పాడవకుండా ఉండేలా చూసుకోవాలని, క్రమం తప్పకుండా మెయింటెనెన్స్‌తో నిర్వహణ సజావుగా, నాణ్యతతో సాగుతుందన్నారు. దీనిపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రధాన రోడ్లన్నింటినీ పూర్తి చేయాలని సూచించారు. నేల స్వభావం రీత్యా త్వరగా రోడ్లు పాడవుతున్న ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో

మిగతా 2వ పేజీలో ▶

శ్రీరస్తు.. కల్యాణమస్తు

25 నుంచి పెళ్లి ముహూర్తాలు ప్రారంభం.. ఈ ఏడాదిలో 104 ముహూర్తాలు.. ఏప్రిల్, జూలై నెలలు మినహా ఏడాదంతా మోగనున్న పెళ్లిబాజాలు

భీమవరం (ప్రకాశం చౌక్): ఈ ఏడాది శుభకార్యాలకు మంచి తరుణం. ప్రస్తుతం తెలుగు సంవత్సరాది శుభకృత్ నామ సంవత్సరం నడుస్తోంది. మార్చి నుంచి శోభకృత్ నామ సంవత్సరం ప్రారంభమవుతుండడంతో అంతా శుభం కలగనుంది. అధిక సంఖ్యలో పెళ్లి ముహూర్తాలు ఉండడంతో కల్యాణ నామ సంవత్సరంగా ఈ ఏడాదిని చెప్పొచ్చు. ఏప్రిల్ నెలలో గురుమూఢమి, జూలై నెలలో ఆషాఢం, అధిక శ్రావణం కావడంతో ఈ ఏడాది ఈ రెండు నెలల మినహా మిగిలిన 10 నెలల్లో 104 పెళ్లి ముహూర్తులు ఉండడం విశేషం. గడిచిన మూడేళ్లతో పోల్చితే ఈ ఏడాది పెళ్లి ముహూర్తాలు అధికంగా ఉన్నాయి. ఏడాదంతా భాజాభంత్రీల మోత మోగనునున్నాయి. పెళ్లిళ్లతోపాటు గృహప్రవేశాలు తదితర శుభకార్యలకూ మూహూర్తులు ఉన్నాయి.

25 నుంచి ముహూర్తాలు ప్రారంభం

ఈనెల 25 తేదీ నుంచి పెళ్లిళ్ల ముహూర్తాలు ప్రారంభమావుతున్నాయి. ఈనెలలో 4, ఫిబ్రవరి 12, మార్చి 13, మే 16, జూన్ 7, ఆగస్టు 8, సెప్టెంబర్ 6, అక్టోబర్ 10, నవంబరు 14, డిసెంబర్‌లో 14 ముహూర్తాలు ఉన్నాయి. ఏప్రిల్, జూలై నెలల్లో ముహూర్తాలు లేవు.

జోరుగా వ్యాపారాలు

జిల్లాలోని కల్యాణ మండపాలు, పంక్షన్ హాల్స్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. వీటిని పెళ్లిళ్లకు నెల నుంచి రెండు నెలల బుక్ చేసుకుంటున్నారు. దీంతో వ్యాపారం జోరుగా సాగుతోంది. భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నర్సాపురం పట్టణాల్లోని సంపన్నులు తమ ఇంట పెళ్లిళ్లకు ఖరీదైన పంక్షన్ హాల్స్‌ను బుక్ చేసుకుంటున్నారు. దుస్తులు, బంగారం, కిరణా వ్యాపారాలకు మూడు పువ్వులు, ఆరుకాయలు అన్నట్లుగా వ్యాపారం సాగుతోంది. లైటింగ్, డైకరేషన్, షామియన, టైలర్స్, వాయిద్యా కళాకారులు, బ్రహ్మణులు, రజకులు, నాయీబ్రహ్మణులు, వంట మేస్త్రీలు, పువ్వులు, పెయింటర్స్, ఫొటోగ్రాఫర్స్, ట్రావెల్స్ తదితరులు అందరికీ మంచి ఉపాధి లభించనుంది.

పుణ్య క్షేత్రాల్లో ముందస్తు రిజర్వేషన్లు

జిల్లాలోని పలు పుణ్య క్షేత్రాల్లో వివాహాల నిర్వహణకు ముందుగా ఆలయ ప్రదేశాలను రిజర్వేషన్ చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ద్వారాకతిరుమల, పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, పాలకొల్లు పంచారామక్షేత్రాలు, భీమవరం, కాళ్లకూరు, తణుకు వెంకటేశ్వరస్వామి దేవస్థానాలు, భీమవరం భీమేశ్వర స్వామి, నర్సాపురం, ఆచంట, తాడేపల్లిగూడెం,యలమంచిలి, పెనుగొండ తదితర ప్రాంతాల్లో ప్రముఖ దేవస్థానాల్లో పెళ్లిళ్లు ఎక్కువగా నిర్వహిస్తుంటారు.

కొల్లేరులో ప్రజా చైతన్యం

- కట్టుబాట్లకు చెల్లుచీటి.. పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు
- పెద్దల ముసుగులో పెత్తందారీ వ్యవస్థకు చరమగీతం
- మార్పుదిశగా కొల్లేరు లంక గ్రామాల ప్రజల అడుగులు

కొల్లేరు లంక గ్రామాల్లో బంటా పెద్దలు చెప్పిందే వేదం. వీరిచ్చే తీర్పును మీరితే గ్రామ బహిష్కరణే. బాధితుల పక్షాన న్యాయం కొల్లేరు అలల్లో కలిసిపోయేది. ప్రభుత్వానికి సమాంతర పాలన లంక గ్రామాల్లో దర్శనమిచ్చేది. ఇటువంటి గడ్డు పరిస్థితుల్లో నేడు కొల్లేరు గ్రామాల ప్రజల్లో మార్పు కనిపిస్తోంది. ప్రజల్లో చైతన్యం పెరిగి పెద్దల పెత్తనాన్ని ఎదిరించి పోలీస్‌స్టేషన్ గుమ్మాలను తొక్కుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొల్లేరు ప్రజలకు అండగా మారాయి.



కొల్లేరు సరస్సులో దోనెలలో సాంప్రదాయ వేట సాగిస్తున్న కొల్లేరు ప్రజలు

కైకలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో 9 మండలాల్లో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. జీవో 120 ప్రకారం 77వేల 138 ఎకరాలను కొల్లేరు అభయారణ్యంగా ప్రకటించారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా కొల్లేరు పరివాహక ప్రాంతం ఏలూరు జిల్లా పరిధిలోకి చేరింది. మొత్తం 9 మండలాల్లో 122 బెడ్, బెల్టు గ్రామాలు కొల్లేరు పరివాహక ప్రాంతాల్లో ఉన్నాయి. ఇక్కడ జనాభా 3.15 లక్షలు. ప్రధాన వృత్తి చేపల పెంపకం. మొత్తం 80 వేల కుటుంబాలకు చెందిన దాదాపు లక్షా 85 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడి ప్రజలు నేడు స్వతంత్రంగా ఆలోచిస్తున్నారు.

బంటా పెద్దల పెత్తనం..

యుద్ధాల కారణంగా ఒడిశా తీరం నుంచి వడ్డెర కులానికి చెందిన కొన్ని కుటుంబాలు పూర్వం కొల్లేరు ప్రాంతానికి చేరాయి. చేపల వేట విషయంలో గొడవలు రావడంతో గ్రామ పెద్దల వ్యవస్థ ఇక్కడ పురుడుపోసుకుంది. గ్రామంలో 100 మందిని కలిపి బంటా అంటారు. బంటాకు ఒక పెద్ద ఉంటాడు. గ్రామంలో ఎన్ని బంటాలు ఉంటే అంతమంది పెద్దలు ఉంటారు. వీరందరికీ గ్రామ పెద్ద ఒడ్డీ నాయకుడిగా ఉంటాడు. దాదాపు 11 మంది పెద్దలు ఉంటారు. ఏడాదికి వీరు మారతారు. సర్పంచ్ ఉన్నప్పటికీ బంటా పెద్దలు చెప్పిందే చెల్లుబాటవుతుంది.

వింత ఆచారాలు..

కొల్లేరు గ్రామాల్లో ఆచార వ్యవహారాలు అశ్చర్యాన్ని గొలుపుతాయి. వివాహాల విషయానికి వస్తే పెళ్లికుతూరికి ముందుగా కొంత నగదు పెళ్లికొడుకు ఇవ్వాలి. నిశ్చతార్థాన్ని ఇక్కడ 'చాపవేయడం' అంటారు. వివాహ సమయంలో ఇంటి ముందు గుంటను తీసి, అందులో నీరు పోసి దోనెల బొమ్మలను ఉంచుతారు. భార్యభర్తలు ప్రమాణం చేయాలి. వీరు విడిపోతే దానిని పెద్దల సమక్షంలో 'విడుదల' పేరుతో పంచాయతీ పెడతారు. సంసార జీవనం, సంతానాన్ని బట్టి ఇద్దరికీ తప్పులు వేస్తారు. కొన్ని ఆచారాలు మరుగున పడినా పెద్దల పంచాయతీ మాత్రం అలానే కొనసాగుతోంది.

ఆహ్వానించదగ్గ పరిణామం

కొల్లేరు గ్రామాల్లో గతంలో ఎటువంటి తప్పు జరిగినా నిజం చెప్పడానికి ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. అటువంటిది ఆయా గ్రామాల నుంచి ఫోన్లు వస్తున్నాయి. బాధితులు ధైర్యంగా ఫిర్యాదులు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలతో కొల్లేరు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కొల్లేరు గ్రామాల్లో మార్పు ఆహ్వానించదగిన పరిణామం.

– ఎస్.రామకృష్ణ, మండవల్లి ఎస్సై

మార్పు కనిపిస్తోంది

కొల్లేరు గ్రామాల్లో యువత విద్యావంతులు కావడం, అవగాహన పెరగడంతో గ్రామ కమిటీల్లో వారికి స్థానం దక్కుతోంది. పెద్దలు తప్పు చేస్తే వారిని ప్రశ్నించే స్థాయికి ఎదిగారు. కొల్లేరులో పూర్వపు ఆచారాల్లో ఇప్పుడు మార్పు కనిపిస్తోంది. పూర్వం గ్రామంలోనే రచ్చబండలో తీర్పులు ఇచ్చేవారు. ఇప్పుడు న్యాయం జరగకపోతే బాధితులు పోలీసుస్టేషన్లను ఆశ్రయిస్తున్నారు.

– ఘంటసాల వెంకటేశ్వరరావు, కొవ్వాడలంక

న్యాయం కోసం పోలీస్‌స్టేషన్లకు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. దీంతో కొల్లేరు గ్రామాలు స్వచ్ఛందంగా వైఎస్సార్ సంపూర్ణ గ్రామాలుగా ప్రకటించుకుంటున్నాయి. దీనికి తోడు ఇటీవల కొల్లేరు గ్రామాల నుంచి పోలీసుస్టేషన్లకు ఫిర్యాదులు పెద్ద ఎత్తున అందుతున్నాయి. మండవల్లి మండలం చింతపాడు, పెనుమాకలంక, నుచ్చుమిల్లి, కైకలూరు మండలం పెంచికలమర్రు, శృంగవరప్పాడు, నత్తగుల్లపాడు, గుమ్మళ్లపాడు వంటి కొల్లేరు గ్రామాల నుంచి పెద్దలను కాదని ప్రజలు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఎస్సైలు రామకృష్ణ, చల్లా కృష్ణ పెద్దలకు పలు కేసులలో కౌన్సెలింగ్ అందిస్తున్నారు. తప్పు చేసిన పెద్దలపై సైతం కేసులు నమోదు చేస్తున్నారు.

క్లుప్తంగా...

నేతాజీకి సీఎం వైఎస్ జగన్ నివాళి

సాక్షి, అమరావతి: నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘననివాళి అర్పించారు. 'స్వాతంత్య్రం కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి నా ఘననివాళి' అని సోమవారం సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

సీఐడీ చీఫ్‌గా సంజయ్

సాక్షి, అమరావతి: ఏపీ సీఐడీ చీఫ్‌గా ఎన్.సంజయ్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఏపీ స్టేట్ విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్‌గా కూడా సంజయ్ పూర్తి అదనపు బాధ్యతలను నిర్వహిస్తారు. ఏపీ సీఐడీ డీజీగా ఉన్న పీవీ సునీల్‌కుమార్‌ను ప్రభుత్వ సాధారణ పరిపాలన (జీఏడీ)కి రిపోర్టు చేయాలని బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు.

తమిళనాడు రెవెన్యూ మంత్రితో ఏపీ మంత్రుల చర్చలు



చెన్నైలో తమిళనాడు అధికారులతో ఏపీ అసైన్‌మెంట్ కమిటీ బృందం

సాక్షి, అమరావతి/చెన్నై/పిచ్చాటూరు(తిరుపతి జిల్లా): ఏపీలో అసైన్డ్ భూముల లబ్ధిదారులకు అమ్ముకునే హక్కు ఎలా ఇవ్వాలనే అంశంపై తమిళనాడు రెవెన్యూ అధికారులతో ఏపీ ప్రభుత్వ కమిటీ చర్చించింది. రెవెన్యూ శాఖ మంత్రి మంత్రి ధర్మాన ప్రసాదరావు అధ్యక్షతన ఏర్పాటైన రాష్ట్ర స్థాయి కమిటీ సోమవారం చెన్నై సచివాలయంలో తమిళనాడు రెవెన్యూ మంత్రి రామచంద్రన్‌తో కూడిన అధికార బృందంతో చర్చలు జరిపింది. భూములను అమ్ముకునే హక్కు కల్పిస్తూ తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఎలా అమలు చేస్తున్నారు?ఈ సందర్భంగా ఎదురయ్యే సవాళ్లపై చర్చించారు. మంత్రి ధర్మానతోపాటు మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరుముట్ల శ్రీనివాస్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భూపరిపాలన అదనపు ప్రిన్సిపల్ కమిషనర్ ఇంతియాజ్, సీసీఎల్ఏ సంయుక్త కార్యదర్శి గణేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కమిటీ మంగళవారం కర్నాటకలో పర్యటించనుంది.

వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శిగా గోపాలకృష్ణ ద్వివేది

- బుడితి రాజశేఖర్‌కు పంచాయతీరాజ్‌శాఖ బాధ్యతలు


సాక్షి, అమరావతి: వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ ద్వివేది నియమితులయ్యారు. వ్యవసాయంతోపాటు సహకార, పశుసంవర్ధకం, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్యశాఖల ముఖ్య కార్యదర్శి బాధ్యతలతోపాటు రైతుభరోసా కేంద్రాల ప్రత్యేక కమిషనర్ బాధ్యతలు ఆయనకు అప్పగించారు. వీటితోపాటు మైనింగ్‌శాఖ ముఖ్య కార్యదర్శిగాను ఆయన కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు వ్యవసాయ అనుబంధశాఖల ముఖ్య కార్యదర్శిగా ఉన్న వై.మధుసూదన్‌రెడ్డిని రిలీవ్ చేశారు. మరోవైపు ద్వివేది స్థానంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా.. సెలవుపై వెళ్లి తిరిగి వచ్చిన బుడితి రాజశేఖర్‌ను నియమించారు.

మళ్లీ మొదటికి తీసుకురావడానికే!

- తప్పని తేలితే జరిమానా తప్పదు
- 'తెలుగు గంగ' పరిహారంపై పిటిషనర్‌కు సుప్రీంకోర్టు హెచ్చరిక

సాక్షి, న్యూఢిల్లీ: 'పరిహారం అందలేదంటూ దాఖలైన పిటిషన్‌ను చూస్తుంటే.. మొత్తం వ్యవహారాన్ని మళ్లీ మొదటికి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లుంది. పిటిషన్ తప్పని తేలితే జరిమానా తప్పదు' అని తెలుగు గంగ ప్రాజెక్టు పరిహారం కేసులో పిటిషనర్‌ను సుప్రీంకోర్టు హెచ్చరించింది. గతంలో నెల్లూరు జిల్లాలో తెలుగు గంగ ప్రాజెక్టు నిర్మాణం నిమిత్తం భూ సేకరణలో భాగంగా ఒక్కో చెట్టుకు రూ.3 వేల పరిహారం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. ఆ ఆదేశాలు మేరకు తనకు పరిహారం అందలేదంటూ నెల్లూరు జిల్లాకు చెందిన వెంకటరెడ్డి అనే వ్యక్తి కోర్టు ధిక్కార పిటిషన్‌ను పునరుద్ధరించాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిని న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్‌కౌల్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకాలతో కూడిన ధర్మాసనం విచారించింది. 'పిటిషనర్ పరిహారం అందలేదంటూ కోర్టు ధిక్కార పిటిషన్‌ను దాఖలు చేశారు. కోర్టు ధిక్కార పిటిషన్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఈ పిటిషన్ స్వభావం ఏదో ఒకటి లేవనెత్తి వ్యవహారాన్ని మళ్లీ మొదటికి తీసుకొచ్చేలా ఉంది. ఒకవేళ పిటిషనర్‌కు మొత్తం అందినట్లయితే.. పిటిషనర్‌కు తగిన జరిమానా విధిస్తాం' అని ధర్మాసనం పిటిషనర్ తరఫు న్యాయవాదిని హెచ్చరించింది.

రాష్ట్రంలో జీతభత్యాల వ్యయం
భారీగా పెరుగుదల



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగుల వేతనాలు, జీతాల వ్యయం గత నాలుగేళ్లలో భారీగా పెరిగింది. ఎంతగా అంటే.. 67.26 శాతం మేర పెరిగింది. ఇదే సమయంలో మన పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో గడచిన నాలుగేళ్లలో ఈ వ్యయం కేవలం 39.34 శాతం మాత్రమే పెరిగింది. ఈ విషయాన్ని రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రాష్ట్రాల ఆర్థిక వ్యవహారాలు, బడ్జెట్‌లపై చేసిన అధ్యయన నివేదిక వెల్లడించింది. తెలంగాణతో పోలిస్తే ఏపీలో అధికంగా రూ.25,086.3 కోట్ల మేర వేతనాలు, జీతాల రూపంలో వ్యయం అవుతోందని నివేదిక పేర్కొంది. అంటే.. తెలంగాణ కన్నా ఆంధ్రప్రదేశ్‌లో జీతభత్యాల రూపంలో అధికంగా 84.5 శాతం వ్యయం అవుతోంది. అలాగే, రాష్ట్రంలో ఈ వ్యయం ఒక్క ఆర్థిక ఏడాదిలోనే ఏకంగా రూ.10 వేల కోట్లు పెరిగింది. చంద్రబాబు హయాం 2018–19లో వేతనాలు, జీతాల వ్యయం రూ.32,743.4 కోట్లు ఉండగా వైఎస్ జగన్ హయాంలో 2019–20లో రూ.42,673.8 కోట్లకు పెరిగింది. ఈ గణాంకాలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ బడ్జెట్ అకౌంట్లను అధ్యయనం చేసిన తరువాత ఆర్‌బీఐ పేర్కొంది. అలాగే, 2018–19లో వేతనాలు, జీతాల రూపంలో అకౌంట్స్ ప్రకారం రూ.32,743 కోట్లు వ్యయం కాగా.. 2022–23లో బడ్జెట్ అంచనాల ప్రకారం రూ, 54,768.4 కోట్లకు చేరుతుందని నివేదిక పేర్కొంది. అంటే నాలుగేళ్లలో రూ.22,025 కోట్ల మేర జీతభత్యాల వ్యయం పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది.

కొత్త ఉద్యోగాలు, చిరుద్యోగుల వేతనాలు పెంపుతోనే..

ఇక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులు, పెన్షనర్లకు 27 శాతం మధ్యంతర భృతి మంజూరు చేసిన విషయం తెలిసిందే. అలాగే, వివిధ రంగాల్లోని 3.01 లక్షల మంది చిరుద్యోగుల వేతనాలనూ భారీగా పెంచారు. దీంతోపాటు 11వ వేతన సవరణ కమిషన్ సిఫార్సుల అమలు, వైద్య ఆరోగ్యశాఖతో పాటు వివిధ శాఖల్లో వేల సంఖ్యలో కొత్తగా ఉద్యోగాలు భర్తీ.. అలాగే, గ్రామ, వార్డు సచివాలయాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించడంతో రాష్ట్రంలో జీతభత్యాల వ్యయం భారీగా పెరిగినట్లు ఆర్‌బీఐ తన నివేదికలో స్పష్టంచేసింది.

మిలమిల మెరవాలి

▶ మొదటి పేజీ తరువాయి

ఆధునిక అప్‌గ్రేడెడ్ టెక్నాలజీని వినియోగించేందుకు ముఖ్యమంత్రి జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎంతో వ్యయం చేసి రహదారులను బాగు చేస్తున్నా కొందరు కడుపు మంటతో నెగెటివ్ ప్రచారం చేస్తున్నారని, దానికి మందు లేదని సీఎం వ్యాఖ్యానించారు. రహదారులను బాగు చేసిన తరువాత నాడు–నేడు ద్వారా ఫొటోలతో ప్రజల ముందు పెట్టాలని సూచించారు. అన్ని శాఖలు చేస్తున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచాలని నిర్దేశించారు. రహదారులు – భవనాలు, పంచాయతీరాజ్, పురపాలక, గిరిజన సంక్షేమ శాఖలపై సీఎం జగన్ సోమవారం క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

జూన్, జూలై కల్లా అప్‌గ్రేడెడ్ రోడ్లు

ఉభయ గోదావరితో పాటు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో నేల స్వభావం రీత్యా రోడ్లు త్వరగా పాడైపోతున్నాయని, భారీ వాహనాల రాకపోకలతో కుంగిపోతున్నాయని సమీక్షలో అధికారులు తెలిపారు. ఇలాంటి చోట్ల అప్‌గ్రేడెడ్ టెక్నాలజీని వినియోగించాలని అధికారులు ప్రతిపాదించగా ముఖ్యమంత్రి జగన్ అక్కడికక్కడే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఖర్చు ఎక్కువైనా నాణ్యతను దృష్టిలో ఉంచుకుని మొదటి దశలో వెయ్యి కిలోమీటర్ల మేర కొత్త టెక్నాలజీతో రహదారులను చేపట్టాలని ఆదేశించారు. వచ్చే జూన్, జూలై కల్లా ఈ పద్ధతిలో నిర్దేశించుకున్న మేరకు రోడ్లు నిర్మించాలని స్పష్టం చేశారు. అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిలను కూడా పూర్తి చేయాలన్నారు. కడప – బెంగళూరు రైల్వే లైనుపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. విశాఖ నుంచి భోగాపురానికి వెళ్లే రోడ్డు నిర్మాణంపైనా దృష్టి సారించాలన్నారు.

కడుపు మంటకు.. వాస్తవాలే విరుగుడు

రహదారులను బాగు చేసిన తర్వాత ఎలా ఉన్నాయో వెల్లడించేలా నాడు – నేడు ద్వారా ఆ చిత్రాలను ప్రజల ఎదుట ప్రదర్శించాలని అధికార యంత్రాంగాన్ని సీఎం జగన్ ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో నాడు– నేడు ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఆయా శాఖల వెబ్‌సైట్లలో ప్రజలకు తెలిసేలా ప్రదర్శించాలని సూచించారు. కొన్ని మీడియా సంస్థలు దురుద్దేశంతో నెగెటివ్ ప్రచారం చేస్తున్నాయని, ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నా విష ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. వాటి కడుపు మంటకు మందులేదని, అందుకే మనం చేస్తున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచాలని దిశా నిర్దేశం చేశారు.

పట్టణాలు, నగరాల్లో 60 రోజుల్లోగా..

రహదారుల మరమ్మతులు నాణ్యతతో జరగాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పట్టణాలు, నగరాల్లో ఎక్కడైనా ఫలానా చోట రోడ్డుకు మరమ్మతులు చేయాలని పౌరులు ఫిర్యాదు చేసిన 60 రోజుల్లోగా బాగు చేయాలని, ఈ గడువును తప్పనిసరిగా పాటించాలని సీఎం స్పష్టం చేశారు. యాప్ పనితీరు, ఫిర్యాదుల పరిష్కారంపై నిరంతరం సమీక్ష, పర్యవేక్షణ ఉండాలన్నారు. నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినప్పుడు అవే సమస్యలు పునరావృతం కావని పేర్కొన్నారు. ఇకపై రోడ్ల నిర్వహణలో గణనీయమైన మార్పులు రావాలని స్పష్టం చేశారు. దీర్ఘకాలం నిలిచే సాంకేతిక పరిజ్ఞానాన్ని రోడ్డు మరమ్మతులకు వినియోగించుకోవాలని ఆదేశించారు.



ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'ఏపీ సీఎం ఎంఎస్ యాప్' ఆవిష్కరణ

పట్టణాలు, నగరాల్లో ఎప్పటికప్పుడు రోడ్ల మరమ్మతులు చేపట్టేందుకు రూపొందించిన ఏపీ సీఎం ఎంఎస్ యాప్‌ను సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. యాప్ ద్వారా స్థానిక ప్రజా ప్రతినిధులు, పౌరులు ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. యాప్ ద్వారా ఫొటోలను అప్‌లోడ్ చేయవచ్చు. జియో కోఆర్డినేట్స్‌తో పాటు ఫిర్యాదు నమోదవుతుంది. దీనిపై కమాండ్ కంట్రోల్ రూం కూడా ఏర్పాటైంది. ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని వెంటనే చర్యలు తీసుకుంటారు. సమీక్షలో ఉపముఖ్యమంత్రులు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్న దొర, ఆర్ అండ్ బీ మంత్రి దాడిశెట్టి రామలింగేశ్వరరావు(రాజా), పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఆర్థికశాఖ కార్యదర్శి సత్యనారాయణ, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, రవాణా శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడు రోడ్లు ఇలా

ఆర్ అండ్ బీలో...

- గత సర్కారు 2014 నుంచి 2019 వరకు 6,670 కిలోమీటర్ల రహదారుల రెన్యువల్ పనులను రూ.2,772 కోట్లతో చేపట్టింది. సగటున ఏటా 1,334 కిలోమీటర్ల పనులకు రూ.554 కోట్లు ఖర్చు చేసింది.
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019 నుంచి ఇప్పటి వరకు రూ.3,461 కోట్ల విలువైన 7,273 కిలోమీటర్ల మేర రెన్యువల్ పనులు చేసింది. ఏడాదికి సగటున 1,818 కిలో మీటర్ల రహదారుల రెన్యువల్ పనులను రూ.866 కోట్లతో పూర్తి చేసింది.

పంచాయతీరాజ్ శాఖలో..

- మూడున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 6,302 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం కోసం రూ.3,631 కోట్లు ఖర్చు చేసింది. మరోవైపు రూ.1,241 కోట్లతో 4,193 కిలోమీటర్ల పొడవైన సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టింది.
- కొత్తగా రూ.3,769 కోట్లతో 6,735 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.
- 5,793 కిలోమీటర్ల మేర దెబ్బతిన్న బీటీ రోడ్లను రూ.1,326 కోట్లతో మరమ్మతులు చేపట్టింది. రానున్న ఏడాదిన్నర కాలంలో వీటిని పూర్తి చేయడమే లక్ష్యంగా సన్నద్ధమైంది.
- నవరత్నాల పథకంలో భాగంగా ప్రజల చెంత మరింత మెరుగైన సేవలందించేందుకు గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్స్, బీఎంసీయూలు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 11,709 భవనాల నిర్మాణం కోసం ఇప్పటివరకు రూ.4,248 కోట్లు ఖర్చు చేసింది.
- మరో రూ.3,360 కోట్లతో నిర్మాణంలో ఉన్న 17,736 గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీల భవనాల నిర్మాణం త్వరలోనే పూర్తి కానుంది.

చీఫ్ జస్టిస్ స్థానాన్ని కించపరిచారు!

▶ మొదటి పేజీ తరువాయి

ఈ వ్యవహారాన్ని తేలుస్తామని సీజే ధర్మాసనం తేల్చి చెప్పింది. వెకేషన్ కోర్టులో ఏం జరిగిందో తనకు ప్రతిదీ తెలుసని సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. హైకోర్టు రిజిస్ట్రీ తనకు ఎప్పటికప్పుడు ప్రతి విషయాన్ని నివేదించిందన్నారు. తనకు ఏమీ తెలియదనుకుంటే అది పెద్ద పొరపాటే అవుతుందని స్పష్టం చేశారు. ప్రధాన న్యాయమూర్తికి మాత్రమే సొంతమైన అధికారాల విషయంలో తాను నిక్కచ్చిగా వ్యవహరించి తీరుతానన్నారు. ఇదే సమయంలో జీవో 1పై వెకేషన్ బెంచ్ ముందు పిల్ దాఖలు చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీరును సైతం సీజే ధర్మాసనం తప్పుబట్టింది. ఏమంత అత్యవసరం ఉందని హడావుడిగా పిల్ దాఖలు చేశారని రామకృష్ణను నిలదీసింది. మీరేమైనా ధర్నా చేశారా? రాస్తారోకో చేశారా? సమావేశాలు పెట్టారా? ఏం చేస్తే మీకు ఇబ్బంది కలిగింది? అని ధర్మాసనం ప్రశ్నించింది. తక్షణ ఇబ్బంది లేనప్పుడు ఏం మునిగిపోయిందని సెలవుల్లో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారని ప్రశ్నించింది. మధ్యంతర ఉత్తర్వులు పొందిన తరువాత ఏమైనా కార్యక్రమాలు చేపట్టారా? అంటే అదీ లేదని, ఇలాంటి పిటిషన్ వేసి తీవ్ర గందరగోళ పరిస్థితి సృష్టించారని రామకృష్ణతో పాటు ఆయన తరఫు న్యాయవాది ఎన్.అశ్వనీ కుమార్‌ను ఉద్దేశించి ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టు నుంచి ఉత్తర్వులు పొందేందుకు ఇలాంటి పరిస్థితిని సృష్టించారని, దీనికి సమాధానం చెప్పి తీరాలంది. మీ చర్యలు ప్రధాన న్యాయమూర్తికి బాధ కలిగించాయంది. ఇలాంటి చర్యలు వ్యవస్థకు ఎంత మాత్రం మంచివి కాదంది. జీవో 1పై రామకృష్ణ దాఖలు చేసిన పిల్‌లో ఇరుపక్షాల వాదనలు ముగియడంతో పాటు ఇదే అంశంపై బీజేపీ, తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల నేతలు వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై మంగళవారం విచారణ జరుపుతామని ధర్మాసనం ప్రకటించింది.

సెలవుల్లో వ్యూహాత్మకంగా పిల్..

రోడ్లు, రోడ్ మార్జిన్‌లలో బహిరంగ సభల ఏర్పాటును నియంత్రిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2న జారీ చేసిన జీవో 1ని సవాల్ చేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సంక్రాంతి సెలవుల్లో అత్యవర కేసులను మాత్రమే విచారించే హైకోర్టు వెకేషన్ బెంచ్ ముందు వ్యూహాత్మకంగా పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తులు జస్టిస్ దేవానంద్, జస్టిస్ కృపాసాగర్ ధర్మాసనం జీవో 1 అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. రామకృష్ణ వ్యాజ్యంపై విచారణ జరపాలని సీజే ధర్మాసనానికి స్పష్టం చేసిన సంగతి విదితమే. సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజుల ధర్మాసనం సోమవారం ఈ వ్యాజ్యంపై విచారణ జరిపింది.

ఆ విచక్షణాధికారం వెకేషన్ కోర్టుకుంది...

పిటిషనర్ రామకృష్ణ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్ వాదనలు వినిపిస్తూ వెకేషన్ కోర్టులో ఎలాంటి కేసులను విచారించాలన్న అంశంపై హైకోర్టు రిజిస్ట్రీ నోటిఫికేషన్‌ను చదివి వినిపించారు ఈ నోటిఫికేషన్ ప్రకారం పరిపాలన, విధానపరమైన నిర్ణయాలపై వెకేషన్ కోర్టు విచారణ జరపరాదన్నారు. అయితే ప్రభుత్వ చర్యలు పౌరుల ప్రాథమిక హక్కులను హరించే విధంగా ఉన్నాయని కోర్టు భావించినప్పుడు విచారణ జరిపే విచక్షణాధికారం వెకేషన్ కోర్టుకు ఉందన్నారు. ప్రస్తుత వ్యాజ్యాన్ని కూడా వెకేషన్ కోర్టు అదే తరహాలో భావించి విచారణ జరిపిందని చెప్పారు. ఫలానా తరహా వ్యాజ్యాలను మాత్రమే విచారించాలని నోటిఫికేషన్‌లో ఉందని, అదే సమయంలో ఫలానా తరహా వ్యాజ్యాలను విచారించకూడదని ఎక్కడా లేదన్నారు. ఈ సమయంలో సీజే స్పందిస్తూ.. సెలవుల్లో ప్రతి కేసునూ ముఖ్యమైనదిగానే భావించి వెకేషన్ కోర్టులు విచారణ జరుపుతూపోతే ఇక వ్యవస్థ ఏం కావాలని ప్రశ్నించారు. ఈ వ్యవహారం మీరు చెబుతున్నంత సింపుల్ విషయం కాదని స్పష్టం చేశారు. ప్రధాన న్యాయమూర్తికి మాత్రమే సొంతమైన హక్కులు ఏమిటో తనకు బాగా తెలుసని, వాటి విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించి తీరుతానని, ఇందులో ఎలాంటి సందేహానికి తావు లేదని తేల్చి చెప్పారు.

ప్రజలను కలుసుకునే హక్కు పార్టీలకు ఉంది..

అనంతరం రాజు రామచంద్రన్ వాదనలను కొనసాగిస్తూ జీవో 1లోని అంశాలను చదివి వినిపించారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై బహిరంగ సభలను నిషేధించారని పేర్కొన్నారు. సాధారణంగా పాదయాత్రలన్నీ జాతీయ రహదారుల వెంబడే సాగుతాయన్నారు. మునిసిపల్, పంచాయతీ రోడ్లు ఇరుకుగా ఉంటాయని, అక్కడ బహిరంగ సభలకు అనుమతినిస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని చెబుతున్నారన్నారు. అరుదైన, అసాధారణ పరిస్థితుల్లో మాత్రం అనుమతిస్తామని చెబుతున్నారని, అయితే ఆ పరిస్థితులు ఏమిటో నిర్దిష్టంగా చెప్పడం లేదన్నారు. అధికార పార్టీ సభలు నిర్వహించుకునేందుకు ఈ అరుదైన, అసాధారణ పరిస్థితులను కారణంగా చూపి పోలీసులు అనుమతులిస్తారని, ప్రతిపక్షాల విషయంలో భిన్న వైఖరిని అవలంబిస్తారన్నారు. ప్రజలను కలుసుకునే హక్కు రాజకీయ పార్టీలకు ఉందని, దీన్ని జీవో 1 హరిస్తోందన్నారు. రాజకీయ యాత్రలు భావ ప్రకటన స్వేచ్ఛలో భాగమన్నారు. సభలు, యాత్రలు ఎక్కడ ఎలా నిర్వహించాలన్నది ఆయా పార్టీలు నిర్ణయిస్తాయని, షరతులతో అనుమతులివ్వడం ఇప్పటివరకు జరుగుతూ వచ్చిందన్నారు.

మా అభ్యంతరాలను సైతం వెకేషన్ బెంచ్ వినలేదు..

రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ వెకేషన్ కోర్టులో ఏం జరిగిందో ధర్మాసనానికి వివరించారు. పిల్‌ను విచారించే విషయంలో తన అభ్యంతరాన్ని వినేందుకు సైతం వెకేషన్ బెంచ్ నిరాకరించిందన్నారు. సాధారణంగా హౌస్‌మోషన్, లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్లు దాఖలు చేసేటప్పుడు కారణాలను స్పష్టంగా వివరిస్తారని, ప్రస్తుత వ్యాజ్యంలో మాత్రం అలాంటిదేం లేదన్నారు. ఈ వ్యాజ్యాన్ని విచారించే రోస్టర్ లేదని చెప్పినా వెకేషన్ బెంచ్ వినిపించుకోలేదన్నారు. సీజే నిర్ణయించిన రోస్టర్‌కు భిన్నంగా వెకేషన్ బెంచ్ మరో రోస్టర్‌ను నిర్ణయించిందన్నారు. వెకేషన్ కోర్టులో సాధారణంగా అత్యవసర కేసులను సీజే అనుమతి తీసుకున్నాకే విచారిస్తారని, ఇది సంప్రదాయంగా వస్తోందన్నారు. పిటిషనర్ బెంచ్ హంటింగ్‌కు పాల్పడ్డారన్నారు.

రోడ్‌షోలపై ఎలాంటి నిషేధం లేదు..

రోడ్ షోలు, ఊరేగింపులను జీవో 1 నిషేధించడం లేదని ఏజీ పేర్కొన్నారు. కేవలం రోడ్లపై జరిగే సభలకు మాత్రమే ఆ జీవో వర్తిస్తుందని తెలిపారు. చంద్రబాబు కందుకూరు రోడ్‌పై సభ కారణంగా పలువురు మరణించగా మరి కొందరు గాయపడ్డారన్నారు. ఇలాంటి ఘటనలను నివారించేందుకు చట్ట నిబంధనలను అనుసరించి పోలీసులకు తగిన మార్గనిర్దేశం చేస్తూ జీవో 1 జారీ అయిందన్నారు. నిర్దిష్ట ప్రదేశం లేదా ప్రాంతంలో సభ నిర్వహించుకునేందుకు అనువైన మైదానంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాలేవీ ఆచరణ సాధ్యం కాని పరిస్థితులుంటే అలాంటి సమయంలో అసాధారణ పరిస్థితుల కింద అనుతులు ఇస్తామన్నారు. ఊహల ఆధారంగా రామకృష్ణ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారన్నారు. కందుకూరుతో పాటు గుంటూరులో సైతం తొక్కిసలాట జరిగిందని, ఈ రెండు ఘటనలపై విచారణ కమిషన్‌ను నియమించినట్లు శ్రీరామ్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. రోడ్ షోలు, ఊరేగింపులపై ఎలాంటి నిషేధం లేదని పునరుద్ఘాటించారు. ఈ సమయంలో సీజే జోక్యం చేసుకుంటూ.. రోడ్‌షోలు, ఊరేగింపులపై నిషేధం లేదన్న వాదనను రికార్డ్ చేయమంటారా? అని ప్రశ్నించగా నిస్సందేహంగా రికార్డ్ చేయవచ్చని ఏజీ నివేదించారు. ఈ విషయాన్ని తమ కౌంటర్‌లో సైతం స్పష్టం చేశామన్నారు. ఏజీ వాదనలు ముగియడంతో రాజు రామచంద్రన్ జోక్యం చేసుకుంటూ జీవో 1 విషయంలో మధ్యంతర ఉత్తర్వుల కోసం అభ్యర్థించారు. ఈ వ్యవహారంలో వాదనలు ఇంకా పూర్తి కాలేదని, మధ్యంతర ఉత్తర్వులు సాధ్యం కాదని ధర్మాసనం తేల్చి చెప్పింది. జీవో 1పై బీజేపీ నేత కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేత కొల్లు రవీంద్ర, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుల వ్యాజ్యాలపై మంగళవారం విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

గడప వద్దకే రేషన్ అభినందనీయం

- కేంద్ర ప్రజా పంపిణీ శాఖ డైరెక్టర్ ఖల్సా

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరు బాగుందని, పారదర్శకంగా సకాలంలో నాణ్యమైన బియ్యాన్ని మొబైల్ వాహనాల ద్వారా లబ్ధిదారుల గడప వద్దకే తీసుకువెళ్లి పంపిణీ చేయడం అభినందనీయమని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ శాఖ డైరెక్టర్ కేఎంఎస్ ఖల్సా ప్రశంసించారు. ఆయన సోమవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని విద్యాధరపురం చెరువు సెంటర్, గొల్లపూడి, గుంటుపల్లి ప్రాంతాల్లో రేషన్ దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖల్సా మాట్లాడుతూ రాష్ట్రంలో 29,794 రేషన్ దుకాణాలు, 9,630 రేషన్ మొబైల్ వాహనాల ద్వారా 1,46,14,015 మంది కార్డుదారులకు 16,04,553.66 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రతి నెలా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో పారదర్శకంగా లబ్ధిదారుల గడప వద్దకే రేషన్ బియ్యాన్ని అందించడం గొప్ప విషయమన్నారు. నాణ్యమైన బియ్యాన్ని ప్రతి నెలా మొదటి వారంలోనే 70 నుంచి 80 శాతం మంది లబ్ధిదారులు పొందుతున్నారని చెప్పారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం నాణ్యత బాగుందని, గడప వద్దకే వచ్చి పంపిణీ చేయడం వల్ల తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పట్టణ ప్రాంత ప్రజలు సంతృప్తిని వ్యక్తంచేస్తున్నట్లు ఖల్సా తెలిపారు. రేషన్ దుకాణాల్లో బియ్యం, పంచదారతోపాటు గోధుమలు, కందిపప్పు, చింతపండు, వంట నూనెలు సరఫరా చేయాలని కార్డుదారులు కోరారని, ఈ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి నిత్యావసర సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ ఉన్నారు.



విద్యాధరపురంలోని రేషన్‌షాపులో బియ్యాన్ని పరిశీలిస్తున్న కేఎంఎస్ ఖల్సా, కోమలి పద్మ

టెక్ మహీంద్రా హృదయంలో ఏపీకి ప్రత్యేక స్థానం

- టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో సీపీ గుర్నానీ

సాక్షి, అమరావతి: టెక్ మహీంద్రా హృదయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానముంటుందని ఆ సంస్థ ఎండీ, సీఈవో సీపీ గుర్నానీ పేర్కొన్నారు. ఐటీ ఎగుమతుల్లో టెక్ మహీంద్రకు మొదటి ర్యాంకు రావడం.. ఏపీ ప్రజల సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనమంటూ ఆయన ట్వీట్ చేశారు. విశాఖలో జరిగిన 'ఇన్ఫినిటీ వైజాగ్' సదస్సు సందర్భంగా రాష్ట్ర ఐటీ రంగంలో ప్రతిభ చూపిన కంపెనీలకు అవార్డులు ప్రకటించారు. వ్యాపారం రూ.50 కోట్ల పైబడిన కంపెనీల విభాగంలో టెక్ మహీంద్రా మొదటి ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. దీనిపై ఎస్టీపీఐ డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్.. టెక్ మహీంద్రాకు శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. ఏపీలో మొదటి స్థానం సాధించడమే కాకుండా అంతర్జాతీయంగా ఐటీ ఎగుమతుల్లో భారత్‌ను అగ్రస్థానంలో నిలపడంలో టెక్ మహీంద్రా కీలకపాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. దీనిపై గుర్నానీ స్పందిస్తూ.. అరవింద్‌కు ధన్యవాదాలు తెలిపారు. టెక్ మహీంద్రా హృదయంలో ఏపీకి ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానముంటుందని ట్వీట్ చేసి.. కేంద్ర ఐటీ మంత్రులు అశ్విని వైష్ణవ్, రాజీవ్ చంద్రశేఖరన్, ఐటీ శాఖ కార్యదర్శి అఖిలేష్‌శర్మలను ట్యాగ్ చేశారు.



విదేశాలకు వలసల్లో మనమే టాప్

విద్య, ఉపాధి కోసం పుట్టిన దేశాన్ని వీడుతున్న వైనం...

సాక్షి, అమరావతి: మెరుగైన జీవనం కోసం వలస వెళ్లడం మానవ చరిత్రలో సహజ ప్రక్రియ. ఆధునికకాలంలో విదేశాలకు వలస వెళ్లడం మరింత పెరుగుతోంది. విదేశాలకు వలసబాటపడుతున్న వారిలో ప్రపంచంలోనే భారతీయులు మొదటి స్థానంలో ఉన్నారు. విద్య, ఉపాధి అవకాశాల కోసం అత్యధికంగా భారతీయులు విదేశాలకు వెళుతున్నారని ఐక్య రాజ్యసమితి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ సోషల్ అఫైర్స్(యూఎన్‌డీఈఎస్ఏ) 'ఇంటర్నేషనల్ మైగ్రేషన్' పేరిట ఇటీవల విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. భారత్‌లో జన్మించి 2020 నాటికి విదేశాల్లో స్థిరపడినవారు 1.80కోట్లమంది ఉన్నారని ఆ నివేదిక తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా విదేశాలకు వలసల వివరాలను వెల్లడించిన ఈ నివేదికలో భారతీయులకు సంబంధించి పలు ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి.

2020నాటికి 1.80కోట్లమంది వలస...

జన్మించిన దేశాన్ని విడిచిపెట్టి విదేశాల్లో ఉన్నవారిలో ప్రపంచంలోనే భారతీయులు మొదటిస్థానంలో ఉన్నారు. ఈ విధంగా 2020నాటికి 1.80కోట్లమంది భారతీయులు విదేశాల్లో స్థిరపడ్డారు. కరోనా వ్యాప్తి ఉన్నప్పటికీ 2020లో 7.20లక్షలమంది, 2021లో 8.30లక్షలమంది భారతీయులు విదేశాలకు వలస వెళ్లారు. 2020లో జూలై నాటికే 13లక్షలమంది విదేశాలకు వలస వెళ్లడం గమనార్హం. విదేశాలకు వలస వెళుతున్నవారిలో భారతీయుల తర్వాత మెక్సికన్లు (1.10కోట్ల మంది), రష్యన్లు(1.10కోట్లమంది), చైనీయులు (కోటిమంది), సిరియన్లు (80లక్షల మంది) వరుస స్థానాల్లో ఉన్నారు.

యూఏఈ, అమెరికా, సౌదీ వైపే మొగ్గు..

భారతీయులు అత్యధికంగా వలస వెళుతున్న దేశాల్లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) మొదటిస్థానంలో ఉంది. 2020నాటికి యూఏఈలో 35లక్షలమంది భారతీయులు ఉన్నారు. రెండో స్థానంలో ఉన్న అమెరికాలో 27లక్షలమంది, మూడో స్థానంలో నిలిచిన సౌదీ అరేబియాలో 25లక్షల మంది ఉన్నారు. ఆ తర్వాత స్థానాల్లో ఆస్ట్రేలియా, కెనడా, కువైట్, ఒమన్ దేశాలు ఉన్నాయి. వలస వెళుతున్న భారతీయుల్లో 15శాతం మంది గమ్యస్థానం ఇమిగ్రేషన్ క్లియరెన్స్ రిక్వైర్డ్ (ఈసీఆర్) దేశాలే. అన్‌స్కిల్డ్ కార్మికులు ఎక్కువగా ఉపాధి కోసం ఈ 18 ఈసీఆర్ దేశాలకు వెళుతున్నారు. ఆ జాబితాలో బహ్రెయిన్, ఖతర్, ఒమన్, ఇండొనేషియా, సౌదీ అరేబియా, ఇరాక్, సుడాన్, జోర్డాన్, దక్షిణ సుడాన్, కువైట్, సిరియా, లెబనాన్, థాయిలాండ్, లిబియా, యూఏఈ, మలేషియా, యెమెన్, అఫ్గానిస్తాన్ ఉన్నాయి.

విద్యార్థులూ ఎక్కువే...

ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య కూడా భారీగానే ఉంది. కరోనా వ్యాప్తికి ముందు 2019లో 5.9లక్షలమంది విద్యార్థులు విదేశాలకు వెళ్లారు. కరోనా ప్రభావంతో 2020లో 2.6లక్షలమంది మాత్రమే విదేశాలకు వెళ్లగా... 2021లో 4.4లక్షలమంది విదేశాల్లోని విద్యాసంస్థల్లో చేరారు. 2022లో విద్యాభ్యాసం కోసం విదేశాలకు వెళుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య పెరిగింది. 2022 జూన్ నాటికే 2.50లక్షలమంది విదేశాలకు వెళ్లారు. ఉన్నత విద్య కోసం భారతీయ విద్యార్థులు వెళుతున్న దేశాల్లో కెనడా, అమెరికా ఆస్ట్రేలియా, యిదేశాల్లో శాశ్వతంగా స్థిరపడేందుకు భారతీయులు గణనీయంగా మన దేశ పౌరసత్వాన్ని వదులుకుంటున్నారు.



క్లుప్తంగా...

'సబ్‌ప్లాన్‌' కొనసాగిస్తున్న సీఎంకు కృతజ్ఞతలు

భారత ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం

సాక్షి, అమరావతి: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం కొనసాగింపునకు ఆర్డినెన్స్ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అఖిల భారత ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణనాయక్, వి.ఎం.రవిశంకర్ సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సమగ్ర అభివృద్ధి కోసం 2013లో అప్పటి ప్రభుత్వం చేసిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం గడువు సోమవారం (ఈ నెల 23)తో ముగుస్తుండడంతో చట్టం కాలపరిమితిని పెంచుతూ ఆర్డినెన్స్ జారీచేయడం హర్షణీయమని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కొనసాగింపుపై హర్షం

ఏయూలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఏయూక్యాంపస్ : రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను పొడిగిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం పట్ల ఏయూ ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఏయూలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ గతంలో సబ్‌ప్లాన్‌ను వైఎస్సార్ అమలు చేశారని, తర్వాతి కాలంలో వచ్చిన నేతలు దీనిని నీరుగార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్‌ప్లాన్ గడువును పొడిగిస్తూ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఆచార్యుల సంఘం అధ్యక్షుడు ఆచార్య పి.అర్జున్, డాక్టర్ పి.ప్రేమానందం, జి.శాంతారావు, ఎం.ప్రసాద్, ఎం.సురేష్, సుధీర్ పాల్, ఎం.కళ్యాణ్, ఆనంద్, అనిల్, నరేష్, ఆశాకిరణ్, అబ్రహం, ఉద్యోగులు ఇసుకపల్లి వెంకటేశ్వర రావు, జంగా త్రిమూర్తులు, సుబ్రహ్మణ్యం, కిరణ్, నాని, రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ఆర్డినెన్స్ హర్షణీయం

- 848వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ : ఎస్సీ, ఎస్టీలకు ఆర్థిక పరిపుష్టిని పెంచి వారికి అండగా నిలిచేందుకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను పదేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నేతలు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 848వ రోజు కొనసాగుతున్న రిలే దీక్షల్లో సోమవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను చంద్రబాబు పక్కదారి పట్టించి పేదలకు అందకుండా చేశాడని మండిపడ్డారు. చంద్రబాబుకు ఓట్లేసి 14 ఏళ్లు సీఎంను చేస్తే.. బహుజనులకు ఏం న్యాయం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. కులోన్మాదంతో ఊరేగుతున్న ఓ సామాజికవర్గం రాష్ట్రంలో బహుజనులను కాదని ఏం సాధిస్తుందో తేల్చుకోవాలని సవాల్ విసిరారు. తామంతా ఏకమై తమ హక్కులకు అడ్డుతగులుతున్న వారికి డిపాజిట్లు రాకుండా గల్లంతు చేస్తామని హెచ్చరించారు. అమరావతి పేరుతో రైతులను నిలువునా ముంచి బాబు చేసింది గ్రాఫిక్స్ మాయాజాలం, రియల్ ఎస్టేట్ వ్యాపారం తప్ప వారి ప్రయోజనాలు కాపాడింది ఎక్కడ.. అని ప్రశ్నించారు. ఎల్లో మీడియాలో మినహా అమరావతి ఉద్యమం ఎక్కడా కనిపించడం లేదని, లేని ఉద్యమానికి బాకాలు ఊదుతున్న ఎల్లో మీడియా రాతలను చూసి ఈ ప్రాంత ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను మరో పదేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ పలువురు నేతలు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, నాగ, దేశీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి కోనసీమ 'ప్రభ'

గణతంత్ర వేడుకల్లో రాష్ట్ర శకటంపై కొలువుదీరనున్న జగ్గన్నతోట ఏకాదశ రుద్రులు

- పాల్గొననున్న కోనసీమ గరగ బృందం
- రాష్ట్ర ప్రభుత్వానికి కోనసీమ వాసుల కృతజ్ఞతలు

కృష్ణా, గోదావరి (కేజీ) బేసిన్ ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన 'డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ' తన సంస్కృతి సంప్రదాయాలతో మరోసారి జాతీయస్థాయి ఖ్యాతినార్జించనుంది. అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే తీర్థానికి వచ్చే ఏకాదశ రుద్రుల ప్రభల నమూనా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో రాష్ట్ర శకటంపై కొలువుదీరనుంది.

-సాక్షి అమలాపురం



రాష్ట్ర శకటం ముందు గరగ నృత్యకారుల ప్రదర్శన

తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమైన సంక్రాంతి పండుగ కనుమ రోజు జరిగే జగ్గన్నతోట తీర్థానికి 11 గ్రామాలకు చెందిన ప్రభలు వస్తాయి. ప్రభ మీదనే పరమేశ్వరుని ఉత్సవ విగ్రహాలు ఉంచి ఊరేగింపుగా తీర్థాలకు తీసుకువస్తారు. దీనికి 450 ఏళ్ల చరిత్ర ఉంది. ప్రభలపై పరమేశ్వరుని ప్రతిరూపాలు ఇక్కడకు వచ్చి లోక కళ్యాణార్థం చర్చలు జరుపుతారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

అరుదైన గుర్తింపు

గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివ కేశవ యూత్ సభ్యులు ఈ తీర్థ విశేషాలను దేశ ప్రధాని నరేంద్ర మోదీకి వివరిస్తూ 2020లో మెయిల్ చేశారు. మోదీ తీర్థం ప్రాశస్త్యాన్ని అభినందించారు. ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు వెళ్లే రాష్ట్ర ప్రభుత్వ శకటంపై జగ్గన్నతోట తీర్థానికి వచ్చే ఏకాదశ రుద్రులను ప్రదర్శనకు ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించినట్టయ్యింది. ప్రభుత్వ నిర్ణయానికి కోనసీమ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోనసీమలోని పంట కాలువలు, వరి చేలు, కొబ్బరి తోటలు, రహదారుల మీదుగా ఊరేగే ప్రభలు ఈ ఏడాది ఢిల్లీలోని గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో రాష్ట్ర శకటంపై ఊరేగనున్నాయి.

ముచ్చట గొల్పుతున్న ఏకాదశ రుద్రులు

పరేడ్ శకటంపై ఉంచే ప్రభలను తాటి శూలం, టేకు చెక్క, మర్రి ఊడలు, వెదురు బొంగులతో సంప్రదాయ బద్ధంగా తయారు చేశారు. రంగు రంగుల నూలుదారాలు (కంకర్లు), కొత్త వస్త్రాలు, నెమలి పింఛాలతో అలంకరించారు. శకటానికి మూడు వైపులా మూడు చొప్పున తొమ్మిది చిన్న ప్రభలు, శకటం మధ్యలో రెండు పెద్ద ప్రభలు నిర్మించారు. కొబ్బరి చెట్లు, మేళతాళాలు, గరగ నృత్యకారులు, వేదపండితులు, పల్లకీ, దానిని మోస్తున్న కార్మికుల బొమ్మలు, తీర్థానికి గూడెడ్ల బండ్ల మీద వచ్చే వారి నమూనాలతో శకటాన్ని తీర్చిదిద్దారు. వరి కుచ్చులు, గుమ్మడి కాయలు, ఇతర కూరగాయలతో అలంకరించారు.

గరగ ప్రదర్శనకు అవకాశం

పరేడ్‌లో ప్రదర్శనకు అంబాజీపేట మండలం ముక్కామలకు చెందిన పసుపులేటి నాగబాబు గరగ బృందం ఎంపికైంది. ఈ బృందంలో సుమారు 24 మంది ఉన్నారు. గతంలో నాగపూర్ కల్చరల్ సెంటర్ ద్వారా ఈ బృందం 15 సార్లు పరేడ్‌లో పాల్గొంది. అయితే ఈసారి ప్రభల తీర్థం శకటం ప్రదర్శన సందర్భంగా ఈ బృందానికి నేరుగా పాల్గొనే అవకాశం లభించింది.



ప్రభల తీర్థం థీమ్‌తో రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన రిపబ్లిక్ దే శకటం

మన ప్రాంతానికి దక్కిన గుర్తింపు



ప్రభల తీర్థం అంటే మన సంప్రదాయం. రిపబ్లిక్ డే పరేడ్‌లో ఏకదశ రుద్రుల కొలువు దీరడం అంటే అది మన తీర్థానికి, మన ప్రాంతానికి దక్కిన గుర్తింపు. ఆ తీర్థంలో మాది ముఖ్యపాత్ర కావడం మా పూర్వ జన్మసుకృతం. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– పూజ్యం శ్రీనివాస్, అర్చకుడు

స్వతంత్రంగా తొలిసారి



గతంలో పలుమార్లు రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్నాం. రాష్ట్రపతులు శంకర్ దయాళ్ శర్మ, వెంకటరామన్, అబ్దుల్ కలాం, ప్రతిభాపాటిల్, ప్రధానులు రాజీవ్‌గాంధీ, పి.వి. నరసింహారావు, మన్మోహన్ సింగ్ ముందు మా ప్రదర్శన జరిగింది. కోనసీమ ప్రభలు పరేడ్‌కు వెళుతున్నందున స్వతంత్రంగా తొలిసారి మా బృందం ప్రదర్శనకు సిద్ధమైంది.

– పసుపులేటి నాగబాబు, గరగ బృందం గురువు

సబ్ ప్లాన్‌కు మించి దళితుల సంక్షేమానికి ఖర్చు

- జనాభా దామాషాకు మించి నిధుల వ్యయం
- ఎస్సీ సబ్ ప్లాన్‌పై 'ఈనాడు' చెత్త రాతలు
- ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్



సాక్షి అమరావతి: తమ సంక్షేమానికి, అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని దళితులంతా మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారని ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ సబ్ ప్లాన్‌కు మించి సీఎం వైఎస్ జగన్ దళితుల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నారని కొనియాడారు. ప్రతి పథకంలోనూ ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి.. వారి జనాభా దామాషాకు మించి ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తోందని గుర్తు చేశారు. వాస్తవానికి.. కేంద్రం చట్టం కారణంగా నీతిఆయోగ్ వచ్చాక బడ్జెట్‌లో ప్లాన్, సబ్ ప్లాన్ అనే పదాలు లేవన్నారు. కాంపొనెంట్‌గానే దళితులకు నిధులు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు హయాంలో దళితుల సంక్షేమానికి ఎటువంటి ప్రణాళికా లేదని గుర్తు చేశారు. అయినా రామోజీరావు 'ఈనాడు'లో ఏనాడూ చంద్రబాబుకు వ్యతిరేకంగా ఒక్క ముక్క కూడా రాయలేదని మండిపడ్డారు. ఇప్పుడేమో 'సబ్ ప్లాన్ చట్టం పేరుకే..' అంటూ బొజ్జ రాక్షసుడు రామోజీ చెత్త రాతలు రాస్తున్నాడని ధ్వజమెత్తారు.

తప్పుడు రాతలు రాయడానికి ఎంత ధైర్యం?

దళితుల సంక్షేమం గురించి ఏనాడూ కనీసం అధ్యయనం కూడా రామోజీ చేయలేదన్నారు. ఏ ప్రభుత్వ హయాంలో దళితులు అభివృద్ధి చెందారో, ఎప్పుడు వారికి సంక్షేమ పథకాలు సక్రమంగా అందాయో రాయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు మంచి చేస్తున్న ప్రభుత్వంపై చెత్త రాతలు రాస్తున్నారని నిప్పులు చెరిగారు. ఈనాడు పత్రికను చెత్తలో పడేయాలని కోరారు. ఇవే తప్పుడు రాతలు మళ్లీ రాస్తే ఆ పత్రికను తగులబెడతామని హెచ్చరించారు. కాటికి కాళ్లు చాపే వయసులో కూడా హైదరాబాద్‌లోని ఫిల్మ్ సిటీలో కూర్చుని తప్పుడు రాతలు రాయడానికి ఎంత ధైర్యమని ప్రశ్నించారు. ఏపీలోని గ్రామాలకు వచ్చి చూస్తే రామోజీకి అభివృద్ధి ఏమిటో తెలుస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను మరో పదేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ ఇచ్చినందుకు దళితులంతా ఆనందంగా ఉన్నారన్నారు. ఈనాడు రామోజీ మాత్రం ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత బాంధవుడు, మంచి మనసున్న వ్యక్తి కనుకే సీఎం జగన్ ఇంత గొప్ప సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నారని తెలిపారు. ఇదేదీ ఈ పచ్చ పత్రికకు కనిపించట్లేదని దుయ్యబట్టారు.

మూడున్నరేళ్లలోనే రూ.48,899.66 కోట్లు

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2014 –15 నుంచి 2018 –19 వరకు దళితులకు రూ.33,625 కోట్లు ఖర్చు చేస్తే.. సీఎం జగన్ కేవలం మూడున్నరేళ్లలోనే రూ.48,899.66 కోట్లు ఖర్చు చేశారన్నారు. కేంద్రం సైతం ఎస్సీల సంక్షేమం విషయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఎంతగానో ప్రశంసించిందని గుర్తు చేశారు. ఎస్సీ ఉప ప్రణాళిక కింద దేశంలో మిగతా అన్ని రాష్ట్రాల్లో ఎంత ఖర్చు చేశారో.. ఒక్క మన రాష్ట్రంలోనే అంత ఖర్చు చేశారన్నారు. నేడు 29,10,944 ఎస్సీ కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో బాగుపడ్డాయని చెప్పారు. ఎప్పుడూ టీడీపీ సామాజికవర్గాన్ని పొగుడుతూ రాయడం, ఆ పార్టీ అధికారంలో లేకపోతే.. అధికారంలో ఉన్న పార్టీపైన విమర్శలు చేయడం రామోజీకి అలవాటుగా మారిందని దుయ్యబట్టారు.

ఐకమత్యంతోనే దేశం పురోగమిస్తుంది

- క్యూబా సంఘీభావ సభలో చే గువేరా కుమార్తె అలైదా గువేరా
- సంఘీభావం అనేది ఇవ్వడమనే అందమైన భావన
- మాటల్లోనే కాదు.. చేతల్లోనూ దేశభక్తి ఉండాలి
- విప్లవం గురించి మాట్లాడటం కాదు.. దాన్ని పాటించాలి



చే గువేరా కుమార్తె, మనవరాలికి స్వాగతం పలుకుతున్న వామపక్ష నేతలు

సాక్షి, అమరావతి/విమానాశ్రయం (గన్నవరం) : నేను అని సరిపెట్టుకోవడం కంటే మనం అని ఐకమత్యంతో సాగితేనే ఏ దేశమైనా పురోగమిస్తుందని లాటిన్ అమెరికా విప్లవ నాయకుడు చే గువేరా కుమార్తె అలైదా గువేరా పిలుపునిచ్చారు. నేను అనే పదాన్ని మర్చిపోయి మేము అన్న పదాన్ని వాడటం మొదలు పెట్టాలని, దీనివల్ల ప్రజల మధ్య దూరం తగ్గిపోయి గౌరవం పెరుగుతుందని వివరించారు. సోమవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య భవన్‌లో జరిగిన క్యూబా సంఘీభావ సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంఘీభావం అనేది ఒకరి నుండి తీసుకోవడం కాదని, ఇవ్వడమనే అందమైన భావన అని అన్నారు. ఇటీవల జరుగుతున్న యుద్ధాల వల్ల లక్షలాది మంది జీవితాలను కోల్పోతున్నారని తెలిపారు. ప్రజారోగ్యం, విద్యా హక్కు, సమానత్వం కోసం నిరంతరం పోరాటం చెయ్యాలన్నారు. అనేక చోట్ల చిన్న వాళ్లను చిన్న చూపు చూస్తున్నారని, ఆ తారతమ్యాలను విడనాడాలని చెప్పారు. పాలకులు ప్రజలు చెప్పేది వినాలని తెలిపారు. ప్రతి మనిషీ ప్రతి ఒక్కరికీ ఏదో ఒకటి నేర్పించగలరని, రంగు, జెండర్ తేడాలు ఉండకూడదని తెలిపారు. మత విశ్వాసాలను బట్టి ప్రజలను చూడకూడదన్నారు. భారత దేశంలో ప్రజల నుండి ఎంతో ప్రేమ లభించిందని, ఇక్కడ తన పట్ల చూపిస్తున్న ప్రేమాప్యాయతలు, గౌరవం తన తండ్రి వల్ల వచ్చాయని తెలిపారు. తండ్రి ఫొటోలు, మాటలను టీ షర్టులు, జెండాల్లో కాకుండా ఆయన ఆశయాలు, ఆలోచనా విధానాలను పాటించాలని సూచించారు. 'నేను చనిపోతే ఎవరూ ఏడవవద్దు. నేను చేసిన కార్యక్రమాలు మీరూ చేయండి, అప్పుడు నేను ఎప్పుడూ జీవిస్తూనే ఉంటాను' అని చే గువేరా చెప్పేవారని, అందువల్లే ఆయన ప్రజల్లో నిలిచిపోయారని తెలిపారు. మాటల్లోనే కాదు.. చేతల్లో కూడా దేశభక్తి ఉండాలన్నారు. విప్లవం గురించి మాట్లాడడం కాదని, దాన్ని పాటించాలని చెప్పారు. విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అలైదా గువేరాను, ఆమె కుమార్తె ఎస్తిఫినా గువేరాను సత్కరించారు. క్యూబాకు సంఘీభావం తెలుపుతున్నట్లు సమావేశంలో పాల్గొన్న వక్తలు చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతంరెడ్డి, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పలువురు వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు. సోమవారం విజయవాడకు వచ్చిన డాక్టర్ అలైదా గువేరా, ప్రొఫెసర్ ఎస్తిఫినా గువేరాకు గన్నవరం విమానాశ్రయంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర నాయకురాలు అక్కినేని వనజ, ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు, ఇతర వామపక్ష నేతలు స్వాగతం పలికారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్

సాక్షి, అమరావతి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), తదితర జాతీయ విద్యా సంస్థల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్–2023 తొలివిడత పరీక్షలు నేటి (మంగళవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1 వరకు రోజూ రెండు సెషన్లలో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. ఇప్పటికే అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసింది. మొదటి సెషన్ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు ఉంటాయి. ఉదయం సెషన్‌కు సంబంధించి 7 గంటల నుంచి 8.30 గంటల వరకు అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. అలాగే మధ్యాహ్నం సెషన్‌కు సంబంధించి 1 గంట నుంచి 2.30 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లోకి చేరుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత వచ్చే వారికి ప్రవేశం ఉండదు. అభ్యర్థులు తమతో పాటు అడ్మిట్ కార్డును, ఫొటో ఐడీ కార్డును కూడా తీసుకువెళ్లాలి. ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్ పరీక్ష ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా 9 లక్షల మందికి పైగా జేఈఈ మెయిన్ రాయనున్నారు. మన రాష్ట్రం నుంచి ఈ పరీక్షకు దాదాపు 70వేల మంది వరకు హాజరయ్యే అవకాశాలున్నాయి. ఇందుకోసం రాష్ట్రంలో 27 పట్టణాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

సబ్సిడీపై గోధుమపిండి పంపిణీ

- వచ్చే నెల నుంచి ఉత్తరాంధ్ర మున్సిపాల్టీల్లో సరఫరా
- కార్డుదారుడికి కిలో రూ.16 చొప్పున గరిష్టంగా రెండుకిలోలు
- దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా పంపిణీకి చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా గోధుమపిండి సరఫరా చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి నుంచి ఉత్తరాంధ్రలోని 16 మున్సిపాల్టీల పరిధిలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని పేర్కొన్నారు. తద్వారా 6.94 లక్షలమందికిపైగా కార్డుదారులకు లబ్ధిచేకూరుతుందని తెలిపారు. కిలో రూ.16 చొప్పున కార్డుదారుడికి గరిష్టంగా రెండుకిలోలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. దశలవారీగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గోధుమపిండి పంపిణీకి చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే సార్టెక్స్ బియ్యం ఉచితంగా ఇస్తున్న ప్రభుత్వం సబ్సిడీపై కందిపప్పు, పంచదారతో పాటు గోధుమపిండి కూడా ఇవ్వనుంది.

పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్న మున్సిపాలిటీలు, కార్డుల సంఖ్య

జిల్లా	మున్సిపాల్టీలు	కార్డుల సంఖ్య
విజయనగరం	విజయనగరం, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం	91,788
మన్యం	పార్వతీపురం, పాలకొండ, సాలూరు	33,385
అనకాపల్లి	అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి	52,870
విశాఖపట్నం	భీమునిపట్నం, జీవీఎంసీ సర్కిల్ 1 నుంచి 3 వరక	4,52,298
శ్రీకాకుళం	ఆముదాలవలస, ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం	64,415

కంప్యూటర్ సైన్స్, జెనిటిక్స్ శాస్త్రాల సమ్మేళనంతో బీటెక్ కోర్సు

హ్యూమన్ జెనిటిక్స్ సదస్సులో ఏయూ వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: లైఫ్ సైన్సెస్ సజీవమని, నిత్యనూతనమని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. బేసిక్ సైన్సెస్‌లో పరిశోధనలు మరింత విస్తృతం కావాలని చెప్పారు. వచ్చే సంవత్సరం నుంచి కంప్యూటర్ సైన్స్, జెనిటిక్స్ శాస్త్రాల సమ్మేళనంతో బీటెక్ కోర్సును నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం ఏయూ హ్యూమన్ జెనిటిక్స్ విభాగం గోల్డెన్ జూబ్లీ సంవత్సరాన్ని పురస్కరించుకుని, ఇండియన్ సొసైటీ ఆఫ్ హ్యూమన్ జెనిటిక్స్(ఐఎస్‌హెచ్‌జీ) 47వ వార్షికోత్సవ సమ్మేళనం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. 'న్యూ జెనిటిక్స్ అండ్ ఇట్స్ కంట్రిబ్యూషన్ టు హ్యూమన్ హెల్త్ అండ్ వెల్త్' అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నత విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ఏయూలో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్న విధానం వివరించారు. న్యూ జెనిటిక్స్ అనేక వ్యాధులకు పరిష్కారాలను చూపుతోందన్నారు. సదస్సు చైర్మన్ జి.పద్దయ్య, ఇండియన్ సొసైటీ ఆఫ్ హ్యూమన్ జెనిటిక్స్ అధ్యక్షుడు డాక్టర్ మోనిక్ బెనర్జీ, కన్వీనర్ డాక్టర్ సుబ్రత చక్రవర్తి, వ్యవస్థాపక సభ్యులు కె.సి.మల్హోత్రా, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, సదస్సు కన్వీనర్ ఆచార్య జి.సుధాకర్, అమెరికాకు చెందిన జాన్ బ్లాస్ జారో, డాక్టర్ పి.పి.రెడ్డి, జేఎన్‌యూ పూర్వ వీసీ డాక్టర్ రమేష్ బమిజాయ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను వీసీ ప్రసాద రెడ్డి ఆవిష్కరించారు.

మీ సంఘం గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదు?

- రోసా నిబంధనలకు విరుద్ధంగా ఎందుకు వ్యవహరించారు?
- వారం రోజుల్లో వివరణ ఇవ్వండి
- ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి సీఎస్ నోటీసు

సాక్షి, అమరావతి: నిబంధనలు ఉల్లంఘించి మీడియాకు ఎక్కిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి నోటీసు ఇచ్చారు. ఆర్‌వోఎస్‌ఏ (రికగ్నిషన్ ఆఫ్ ది సర్వీస్ అసోసియేషన్ రూల్స్)కు విరుద్ధంగా వ్యవహరించిన కారణంగా సంఘం గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో తెలపాలని నోటీసులో కోరారు. ఈ నిబంధనల ప్రకారమే ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే గుర్తింపు ఇచ్చింది. సాధారణంగా గుర్తింపు ఇచ్చేటప్పుడు ఆర్‌వోఎస్‌ఏ (రోసా) నిబంధనలను పాటించాలనే షరతు ఉంటుంది. కానీ ఇటీవల పలు అంశాలపై కాంపిటెంట్ అథారిటీని కాదని మీడియాతో ఎందుకు మాట్లాడారో తెలపాలని రోసా రూల్ 3(2) ప్రకారం నోటీసు జారీ చేశారు. నిబంధనలు పాటించలేదు కాబట్టి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. నోటీసును సంఘం ప్రతినిధులకు సోమవారం అందించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ ఇటీవల మితిమీరి ప్రవర్తించారని ఏపీ ఎన్జీవో సహా పలు ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. వెంటనే ఆ సంఘం గుర్తింపు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరాయి. ఇంకా పలు సంఘాలు సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాయి. మరోవైపు ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు చెల్లింపులపై ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చేసిన ఆరోపణలు, ఎల్లో మీడియాలో దుష్ప్రచారంపై ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ ఇప్పటికే వివరణ కూడా ఇచ్చారు. దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా ఎందుకు వ్యవహరించారో తెలపాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి ప్రభుత్వం నోటీసు జారీ చేసింది.

పెరిగిన విండ్ 'పవర్'

- 9.8 శాతం వాటాతో దేశంలోనే 6వ స్థానంలో ఏపీ
- జాతీయ స్థాయి పెరుగుదల కంటే ఏపీలో 1.8 శాతం ఎక్కువ

సాక్షి, అమరావతి: పవన విద్యుత్ ఉత్పత్తి రంగంలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతోంది. గతేడాది చివరి మూడు నెలల్లో దేశవ్యాప్తంగా 8 శాతం పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెరిగితే.. ఏపీలో 9.8 శాతం పెరిగిందని వార్షిక పవన విద్యుత్ నివేదిక వెల్లడించింది. తద్వారా దేశంలోనే 6వ స్థానంలో నిలిచిందని పేర్కొంది. గతేడాది చివరి మూడు నెలల్లో దేశవ్యాప్తంగా 229 గిగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పడగా.. ఏపీలో 40.9 మెగావాట్ల కొత్త ప్రాజెక్టులు వెలిశాయి.

అనుకూలిస్తున్న వాతావరణం..

పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, వినియోగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షిస్తూ దావోస్ వేదికగా రూ.1.25 లక్షల కోట్ల విలువైన నాలుగు ఒప్పందాలు కుదుర్చుకున్న ఏపీ.. పంప్డ్ స్టోరేజ్, సౌర, పవన విద్యుత్ రంగాల్లో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇటీవల రాష్ట్రంలో.. ప్రపంచంలోనే అతిపెద్ద 5,230 మెగావాట్ల ఏకీకృత పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి శంకుస్థాపన కూడా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలకు వాతావరణ మార్పులు కూడా అనుకూలంగా మారాయి. వాతావరణ మార్పుల వల్ల ఉత్తరాది రాష్ట్రాల్లో గాలి వేగం తగ్గి, దక్షిణాది రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఏపీలో పెరిగే అవకాశం ఉందని కేంద్ర ఎర్త్ సైన్సెస్ శాఖ పరిధిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీయరాలజీకి చెందిన పరిశోధకులు తమ అధ్యయనంలో వెల్లడించారు. వాతావరణ మార్పులు జల, పవన, సౌర విద్యుత్ ఉత్పత్తిపై భవిష్యత్‌లో ప్రభావం చూపించే అవకాశముందన్నారు. ఏపీలో పవన విద్యుత్‌కు అనుకూల పరిస్థితులున్నట్లు పేర్కొన్నారు.

మరింత పెరుగుతుంది..

పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా 10,785.51 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం మన రాష్ట్రానికి ఉంది. ఈ మొత్తంలో పవన విద్యుత్ స్థాపిత సామర్థ్యం 4,096.65 మెగావాట్లు. ప్రస్తుతం రోజుకు 15 మిలియన్ యూనిట్ల నుంచి 20 మిలియన్ యూనిట్ల మధ్య పవన విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. భవిష్యత్‌లో ఇది మరింత పెరుగుతుంది.

– కె.విజయానంద్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

ఎంత పనిచేసింది ప్రేమ!

- ఉత్తరప్రదేశ్ యువకుడితో పాక్ యువతి ప్రేమ
- ఖాట్మండులో పెళ్లి చేసుకుని బెంగళూరులో కాపురం
- అరెస్టు చేసిన బెళ్లందూరు పోలీసులు



పోలీసులకు పట్టుబడిన ఇక్రాజీవని, ములాయంసింగ్

బనశంకరి: ప్రేమికుడి కోసం దేశం వదిలివచ్చిన ఓ యువతి అతడిని వివాహం చేసుకుని బెంగళూరులో కాపురం పెట్టింది. దేశంలోకి అక్రమంగా ప్రవేశించిందని ఆమెను నిఘా వర్గాల సమాచారంతో స్థానిక పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... పాకిస్తాన్‌కు చెందిన యువతి ఇక్రాజీవని (19)కి ఉత్తరప్రదేశ్‌కు చెందిన ములాయం సింగ్‌తో మొబైల్‌లో లూడో గేమ్ ఆడుతున్న సమయంలో పరిచయం ఏర్పడింది. అదికాస్త ప్రేమగా మారింది. గతేడాది నవంబర్‌లో ఇక్రాజీవని పాకిస్తాన్ నుంచి నేపాల్ రాజధాని ఖాట్మండుకు చేరుకుంది. అక్కడే ములాయం సింగ్‌ను కలిసి ఇద్దరూ హిందూ సంప్రదాయంలో పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత బిహార్‌లో కొన్ని నెలలు ఉన్నారు. గతేడాది చివరిలో బెంగళూరుకు వచ్చారు. సర్జాపుర రోడ్డు జున్నసంద్రలో కాపురం పెట్టారు. ములాయం సింగ్ బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బెంగళూరు వచ్చాక ఇక్రాజీవని రాధా యాదవ్‌గా పేరు మార్చి ఆధార్ కార్డు తీసుకుంది. అయితే ఇటీవల ఇక్రాజీవని పాకిస్తాన్‌లోని తల్లిని ఫోన్లో సంప్రదించడానికి ప్రయత్నించింది. గమనించిన కేంద్ర నిఘా వర్గాలు రాష్ట్ర పోలీసులకు ఆమె వివరాలను పంపించారు. భార్యభర్తలను అరెస్టు చేసిన స్థానిక పోలీసులు ఇక్రాజీవనిని మహిళా పునరావాస కేంద్రానికి తరలించారు. వీరికి అద్దెకు ఇల్లు ఇచ్చిన యజమాని గోవింద రెడ్డిపై కూడా పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఇద్దరు చిన్నారులకు బాలశక్తి పురస్కారాలు

- పీఎం రాష్ట్రీయ బాల పురస్కారాలు అందించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- క్రీడల విభాగంలో ఏపీకి చెందిన చెస్ క్రీడాకారిణి కోలగట్ల అలాన మీనాక్షి
- కళ సంస్కృతి విభాగంలో తెలంగాణకు చెందిన నాట్యకళాకారిణి ఎం.గౌరవిరెడ్డి
- నేడు అవార్డు గ్రహీతలతో మాట్లాడనున్న ప్రధాని మోదీ



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి పురస్కారం అందుకుంటున్న కోలగట్ల అలాన మీనాక్షి

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు చిన్నారులు 2023 సంవత్సరానికిగానూ ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలశక్తి పురస్కారాలను అందుకున్నారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆరు విభాగాల్లో 11 మంది చిన్నారులకు బాలశక్తి పురస్కారాలు అందజేశారు. కళ, సంస్కృతి విభాగంలో నలుగురు, శౌర్యం విభాగంలో ఒకరు, నూతన ఆవిష్కరణలలో ఇద్దరు, సామాజికసేవలో ఒకరు, క్రీడా విభాగంలో ముగ్గురు మొత్తంగా 11 మంది చిన్నారులకు పురస్కారాలను అందించారు.

– క్రీడా విభాగంలో విశాఖపట్నానికి చెందిన 11 ఏళ్ల అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి, గతేడాది మే–అక్టోబర్ మధ్య అండర్–11 బాలికల కేటగిరీలో ప్రపంచ నెంబర్–1 గా నిలిచిన కోలగట్ల అలాన మీనాక్షి, కళ సంస్కృతి విభాగంలో అతి పిన్న వయస్కురాలిగా యునెస్కోలోని ఇంటర్నేషనల్ డ్యాన్స్ కౌన్సిల్‌లో నామినేట్ అయిన తెలంగాణకు చెందిన నాట్యకళాకారిణి ఎం.గౌరవి రెడ్డి ఈ బాలశక్తి పురస్కారాలు స్వీకరించారు. అవార్డు గ్రహీతలకు పతకం, రూ.లక్ష నగదు బహుమతి, ధ్రువపత్రం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందించారు. కాగా మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు పురస్కారాల గ్రహీతలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంభాషించనున్నారు.



ఆలోచించగా ఆలోచించగా ఒక ప్లేస్‌లో అందవికారమనేది వుండదేమో. అంతా అందమైనదనే తోస్తుందేమో. లోకమంతా అనేక విధమైన అందాలుగానే కనబడుతుందేమో అనుకుంటాను.

– చలం

సాక్షి

మంగళవారం, జనవరి, 24

మాటల వెనుక మూటలున్నాయ్‌!

ఏం కొనాలి? ఎక్కడ తినాలి? ఎందులో డబ్బులు పెట్టాలి? పెరిగిన సోషల్‌ మీడియా పుణ్యమా అని కంపెనీల నుంచి కాసుల కోసమో, కానుకల కోసమో ఇవన్నీ చెబుతున్న అపర డిజిటల్‌ ఆర్థిక మేధావులకు ఇక కళ్ళెం పడనుంది. సామాన్యుల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్న సోషల్‌ మీడియా ప్రజాభిప్రాయ పరికల్పకులకు సర్కార్‌ మార్గదర్శకాలు ప్రకటించింది. అమాయకులను తప్పుదోవ పట్టిస్తున్న వాణిజ్య ప్రకటనలకు అడ్డుకట్ట వేయడానికీ, సోషల్‌ మీడియా ప్రభావిత మార్కెట్‌ విస్తరిస్తున్న వేళ వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికీ ఇది మరో ముందడుగు.

సోషల్‌ మీడియా ప్రభావశీలురలో ఎక్కువ మంది ఆన్‌లైన్‌లో తమకున్న అనుచరగణమే పెట్టుబడిగా, సంస్థల నుంచి భారీ రుసుము తీసుకుంటూ, అడ్డమైనవాటినీ కొనుక్కోమని సిఫార్సులు చేస్తున్నారు. రోజువారీ వినియోగ వస్తువుల నుంచి క్రిప్టోకరెన్సీలు, నాన్‌–ఫంగిబుల్‌ టోకెన్లు, క్రిప్టో డిపాజిట్ల దాకా అన్నిటికీ ఈ జాడ్యం సోకింది. వారికి పోయేదేమీ లేదు కానీ, వారి మాట నమ్మి డబ్బులు పెట్టిన అమాయకులకే నష్టం. అందుకే, ఎలాంటి కానుకలు, హోటల్‌ బసలు, ఈక్విటీలు, రాయితీలు, అవార్డులందుకొని ఈ ఉత్పత్తులు, సేవలు, పథకాలను సిఫార్సు చేస్తున్నదీ ఈ మిడిమేలపు మేధావులు వెల్లడించాలని సర్కారు షరతు పెట్టింది. ఈ చర్య సహేతుకం, స్వాగతనీయం.

ఇవాళ ప్రపంచమంతా స్థానిక నుంచి బహుళజాతి సంస్థల వరకు అన్నీ తమ బ్రాండ్లు, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు సోషల్‌ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను చురుకుగా వాడడం తాజా ధోరణి. సదరు వ్యక్తుల అడ్డగోలు సమర్థనలు, మరీ ముఖ్యంగా ఆర్థిక ఉత్పత్తులు, మదుపులకు సంబంధించినవి బాగా పెరిగాయి. వీటికి సర్కార్‌ పగ్గాలు వేయనున్నట్టు గత సెప్టెంబర్‌ నుంచి వార్తలొస్తూనే ఉన్నాయి. ఈ జనవరి 20న అవి నిజమయ్యాయి. సోషల్‌ మీడియాలో వివిధ ఉత్పత్తుల్ని సమర్థిస్తూ ప్రకటనలిస్తున్నప్పుడు ప్రముఖులు, ప్రభావశీలురు, వర్చ్యువల్‌ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు (అవతార్‌ లాంటి కంప్యూటర్‌ పాత్రలు) ఎలాంటి విధివిధానాల్ని పాటించాలనేది సర్కార్‌ తేల్చేసింది.

నిరుడు రూ. 1275 కోట్లున్న సోషల్‌ మీడియా ప్రభావశీలుర విపణి ఏటా 20 శాతం వంతున పెరగనుంది. 2025 నాటికి అది రూ. 2800 కోట్లకు ఎగబాకుతుందని తాజా అంచనా. అందుకే, సోషల్‌ మీడియాను సందుగా చేసుకొన్న నవతరం ప్రసిద్ధులు బాధ్యతాయుతంగా ప్రవర్తించడానికి మార్గదర్శకాలు పెట్టడం మంచి పని. ఈ పండితమ్మన్యులు సదరు ఉత్పత్తుల్ని వాడకుండానే, స్వీయ లబ్ధికై వాటిని ప్రోత్సహిస్తున్నారని తెలుసుకోక సామాన్యులు ఉచ్చులో పడిపోవడం సహజం. ఇప్పుడు సదరు బ్రాండ్లతో తమకున్న బంధాన్ని ఇన్‌ఫ్లుయెన్సర్లు సామాన్య భాషలో, ఫోటోలతో సహా ఎలా బయటపెట్టాలో నిర్దేశించారు. అవి జనం దృష్టిని తప్పించుకోలేవన్నది లాభం. ఈ సరికొత్త పారదర్శకతతో, తుది కొనుగోలు నిర్ణయం వినియోగదారుల విచక్షణకు వదిలేసినట్టవుతుంది.

స్వీయ నియంత్రణ సంస్థ అయిన అడ్వర్టైజింగ్‌ స్టాండర్డ్స్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా 2021లోనే పెయిడ్‌ ప్రమోషన్‌ను స్పష్టంగా పేర్కొనాలంది. కానీ, ఆ సంస్థ వద్దకు వస్తున్న ఉల్లంఘనల్లో మూడో వంతు ఈ ఇన్‌ఫ్లుయెన్సర్లవే. సోషల్‌ మీడియాతో ఎవరైనా రాత్రికి రాత్రి ఫేమసవుతున్న వేళ పెరుగుతున్న తప్పుడు ప్రకటనలపై కొరడా తీస్తూ, వినియోగదారుల వ్యవహారాల విభాగం పక్షాన ఈ తాజా నిబంధనలు వచ్చాయి. వీటిని ఉల్లంఘిస్తే, వినియోగదారుల పరిరక్షణ చట్టం– 2019 కింద జరిమానా తప్పదు. అది కాక ఉత్పత్తిదారులు, ప్రకటనకర్తలు, సమర్థకులకు రూ. 10 లక్షల దాకా కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ జుల్మానా వేస్తుంది. మళ్ళీ తప్పు చేస్తే, 50 లక్షలు. తప్పుదోవ పట్టిస్తూ ఒక ఉత్పత్తిని సమర్థిస్తే, ఏడాది పాటు ఆ వ్యక్తిపై నిషేధం. మరోసారి గీత దాటితే, ఆ వేటును మూడేళ్ళు పొడిగించవచ్చు.

యూ ట్యూబ్‌, ఫేస్‌బుక్‌, ట్విట్టర్‌, ఇన్‌స్టాలలో కంటికి నదురుగా కనిపిస్తూ, మాటలతో బుట్టలో వేసే ప్రభావశీలురకు చేతిలో పైసలు, సమాజంలో ప్రాచుర్యం, సక్సెస్‌లకు కొదవ ఉండదు. కానీ, ఫలానా ఉత్పత్తిని సమర్థించడానికీ, సిఫార్సు చేయడానికీ వారికి ఉన్న అర్హత, అపరిమిత జ్ఞానం ఏమిటంటే ప్రశ్నార్థకమే. ఒకప్పుడు ప్రభావశీలురంటే– అనుభవం గడించి, ఆలోచనల్ని ఆచరణలో పెట్టిన మేధావులు, సామాజిక కార్యకర్తలు, పరిణామ చోదకులు. వారి మాటకెంతో విలువ. కానీ, ఇప్పుడు సోషల్‌ మీడియాలో లైకులు, షేర్లు చేసే అనుచరులు కనీసం లక్ష మంది ఉన్న కాలేజీ కుర్రకారు, చదువులో డింకీ కొట్టినవాళ్ళూ ఇన్‌ఫ్లుయెన్సర్లే. పుస్తకాలు, సిన్మాలు, ఉత్పత్తుల రివ్యూల నుంచి ఆర్థికసలహాల దాకా ఎవరైనా, ఏదైనా చెప్పచ్చు. లేని మేధావితనం చూపచ్చు. అదే పెద్ద చిక్కు.

చేతిలో స్మార్ట్‌ఫోన్లు, చేతి నిండా ఇంటర్నెట్‌తో డబ్బులెలా మదుపు చేయాలన్న ఆర్థిక పరిజ్ఞానం కోసం సాధారణంగా యువతరం సోషల్‌ మీడియా వేదికలను ఆశ్రయిస్తోంది. మదుపరుల్లో చైతన్యం పెంచే అధికారిక సెమినార్లు, వ్యాసాల కన్నా ఆకర్షణీయంగా ఈ వేదికలు సమాచారాన్ని అందించడమే అందుకు ప్రధాన కారణం. 25 లక్షల మంది కంటెంట్‌ క్రియేటర్లున్న మార్కెట్‌లో నూటికి 60 సంస్థలు దీన్ని ఆసరాగా చేసుకొని ఎదుగుతున్నాయట. అందుకే, జనం తేలిగ్గా మోసపోకుండా ఉండాలంటే, ఇన్‌ఫ్లుయెన్సర్లకు మార్గదర్శకాలిస్తే చాలదు. మదుపరుల్ని ఆర్థిక విద్యావంతుల్ని చేసి, పరిజ్ఞానంతో పాటు చైతన్యం పెంచే ప్రణాళికలను చేపట్టాలి. ప్రముఖులెవరో చెప్పారు కదా అని అడ్డమైన మాటల్నీ అతిగా నమ్మితే అసలుకే మోసమని అందరూ గ్రహించాలి. ఎందుకంటే, ఒక ప్రకటనలో ఓ పెద్దమనిషి నిత్యం చెబుతున్నట్టు డబ్బులు ఎవరికీ ఊరికే రావు!

దూత లేని దౌత్యమా?

విశ్లేషణ



శశి థరూర్‌

రెండేళ్ల క్రితం జో బైడెన్‌ అమెరికా అధ్యక్షుడిగా అధికారం స్వీకరించినప్పటి నుంచీ న్యూఢిల్లీలో అమెరికా రాయబారి లేకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. అమెరికా – భారత్‌ భాగస్వామ్యం తమ అత్యంత ముఖ్యమైన సంబంధాల్లో ఒకటని బైడెన్‌ అన్నారు. భారత్‌లో శాశ్వత రాయబారి లేకపోవడానికి సెనేట్‌ నిర్ధారణ ప్రక్రియే కారణమంటూ శ్వేత సౌధ అధికారులు భుజాలు ఎగరేస్తారు. కానీ అమెరికా బహిరంగంగా పేర్కొంటున్నట్లుగా భారత్‌ తనకు అంత విలువైన దేశమే అయినట్లయితే, భారత రాయబారిగా తన నామినీ ఎరిక్‌ గార్‌సెటీని నిర్ధారింప జేసుకోవడంలో అధ్యక్ష పాలనా యంత్రాంగం మరింత శక్తిని ఎందుకు ప్రదర్శించడం లేదనే ప్రశ్న ఇప్పటికీ మిగిలే ఉంది.

భారత్‌లో అమెరికా రాయబారిగా లాస్‌ ఏంజెల్స్‌ మాజీ మేయర్‌ ఎరిక్‌ గార్‌సెటీని తిరిగి నామినేట్‌ చేయడానికి జో బైడెన్‌ యంత్రాంగం తీసుకున్న తాజా నిర్ణయం ఇరుదేశాల ద్వైపాక్షిక బాంధవ్యపు విచిత్ర పరిస్థితిని ఎత్తి చూపింది. రెండేళ్ల క్రితం బైడెన్‌ అధికారం స్వీకరించినప్పటి నుంచీ న్యూఢిల్లీలో అమెరికా రాయబారి లేరు. ఇండో–పసిఫిక్‌లో చైనాకు శక్తిమంతమైన ప్రతిజోడిగా భారత్‌ మీద అమెరికా ప్రత్యేకమైన శ్రద్ధ పెడుతున్న సమయంలో ఇలా జరగడం గమనార్హం. క్వాడ్‌ సభ్యులైన ఆస్ట్రేలియా, జపాన్‌, అమెరికాతో కలిసి పనిచేస్తున్న భారత్‌ ఈ ప్రాంతంలో అధికార సమతౌల్యాన్ని కొనసాగించడానికి కీలకంగా ఉంటోంది. ఇజ్రాయెల్‌, యునైటెడ్‌ అరబ్‌ ఎమిరేట్స్‌, అమెరికాతో ఉన్న ఐ2యూ2 భాగస్వామ్య కూటమి సభ్యురాలిగా కూడా భారత్‌ మొత్తం మధ్యప్రాచ్యంలో చైనా ప్రభావాన్ని నిలువరించడంలో కీలక పాత్రను కలిగి ఉంటోంది.

వ్యూహాత్మకంగా ఇంత ప్రాధాన్యం కలిగినది అయినప్పటికీ, శ్వేత సౌధం రెండేళ్లుగా భారత్‌లో అమెరికా రాయబారి పదవిని ఖాళీగా ఎందుకు ఉంచినట్లు? అయితే, భారత్‌కు దీంతో ఏమాత్రం సంబంధం లేదు. 2021 జూలైలో గార్‌సెటీ అమెరికా ప్రభుత్వ నూతన యంత్రాంగంలోకి నామినేట్‌ అయ్యారు. కానీ సెనేట్‌లో తన నియామక నిర్ధారణ సమస్యల్లో చిక్కుకుంది. మేయర్‌గా గార్‌సెటీ తన సహాయకుల్లో ఒకరిపై వచ్చిన లైంగిక వేధింపు ఫిర్యాదులను పట్టించుకోలేదన్న ఆరోపణలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో గార్‌సెటీ నియామకాన్ని సమర్థిస్తూ ఓటు వేయాలని పార్టీ ఇచ్చిన పిలుపును వ్యతిరేకిస్తూ కొంతమంది డెమోక్రాట్లు తమ ప్రత్యర్థులైన రిపబ్లికన్లతో చేతులు కలిపారు. ఏప్రిల్‌ నెలలో అంటే నామినేషన్‌ను ప్రకటించిన తొమ్మిది నెలల తర్వాత, గార్‌సెటీని రాయబారిగా నిర్ధారించేందుకు తగిన ఓట్లు తన వద్ద ఉండకపోవచ్చని సెనేట్‌ మెజారిటీ లీడర్‌ చక్‌ షుమెర్‌ అంగీకరించారు. దీంతో భారత్‌లో అమెరికా రాయబారి పదవి అనిశ్చితిలో ఉండిపోయింది.

దీనిపట్ల ప్రారంభంలో ఎలా స్పందించాలో తెలియని భారతీయ అధికారులు తర్వాత చీకాకుపడ్డారు. గత 20 నెలల కాలంలో పలువురు అమెరికన్‌ దౌత్యవేత్తలు తాత్కాలిక బాధ్యతలు స్వీకరించారు. కానీ తమ విజయానికి అతి ముఖ్యమైన స్థానిక సంబంధాలను నెలకొల్పుకోవడానికి ముందే వారంతా బదిలీ అవుతూ వచ్చారు. ఇటీవల, రాయబార పదవికి కెరీర్‌ డిప్లొమాట్‌ అయిన ఎలిజిబెత్‌ జోన్స్‌ పేరు ప్రకటించారు. కానీ ఆమె నియామకం కూడా తాత్కాలికమే. పూర్తి కాలం రాయబారిని నిర్ధారించగానే ఆమె వైదొలుగుతారని భావిస్తున్నారు.

భారత్‌లో అమెరికా రాయబారి లేకపోవడమన్నది భారత్‌తో పొత్తును విస్తృతపర్చుకోవడంలో అమెరికా నిబద్ధత పైనే ప్రశ్నలు



లేవనెత్తింది. అమెరికా–భారత్‌ భాగస్వామ్యం తమ అత్యంత ముఖ్యమైన సంబంధాల్లో ఒకటని అమెరికా అధ్యక్షుడు అన్నారు. భారత్‌ తమకు ఒక విస్మరించలేని భాగస్వామి అని కూడా ఆయన కొనియాడారు. కానీ న్యూఢిల్లీలో అమెరికా రాయబారిని నియమించడంలో బైడెన్‌ ప్రభుత్వ అసమర్థత కొందరు భారతీయులను ఆశ్చర్యంలో ముంచెత్తింది. లండన్‌, ప్యారిస్‌ నగరాల్లో కూడా ఇంత సుదీర్ఘ కాలంపాటు ఈ పదవిని అమెరికా ఖాళీగా ఉంచగలిగేదా అనేది వారి ఆశ్చర్యానికి కారణం.

ఇదే సమయంలో అమెరికా, భారత్‌ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఇంత కీలకంగా ఇదివరకెన్నడూ లేదని చెప్పాలి. చైనాతో పెరుగుతున్న తమ శత్రుత్వం నేపథ్యంలో అమెరికా పక్షాన నిలబడాలంటూ సంవత్సరాలుగా తెస్తున్న ఒత్తిడులను భారత్‌ ప్రతిఘటిస్తూ వచ్చింది. కానీ హిమాలయాల్లో భారత్‌ భూభాగంలోకి చైనా ఇటీవలి ఆక్రమణలు చైనా విస్తరణవాదాన్ని భారత్‌ సవాలు చేసేలా చేశాయి. ఈ ఉమ్మడి అవసరానికి తోడుగా, భద్రత, సాంకేతికత, పర్యావరణ మార్పు అంశాల్లో అమెరికా సాయం భారత్‌ కోరుతోంది.

భారత్‌ ఒక ముఖ్యమైన ఆర్థిక భాగస్వామి కూడా. అలాగే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించినంతవరకూ భారత ఉపఖండానికి అమెరికా అతిపెద్ద వనరుగా ఉంటోంది. 2021లో వీటి విలువ 45 బిలియన్‌ డాలర్లు. అంతర్జాతీయ సరఫరా చెయిన్లపై చైనా ఆధిపత్యాన్ని నిలువరించేలా అమెరికన్‌ అధికారులు తమ ఉత్పాదక స్థావరాలను నెలకొల్పేలా అమెరికన్‌ కంపెనీలను ప్రోత్సహిస్తూ వచ్చారు. ఈ క్రమంలో వారు అమెరికా పాలనా యంత్రాంగానికి చెందిన ‘ప్రధానమైన మిత్రుల’ ఎజెండాలో భారత్‌ను కేంద్ర స్థానంలో నిలిపారు. ఉదాహరణకు ఆపిల్‌ కంపెనీ 2025 సంవత్సరానికల్లా తన మొత్తం ఐఫోన్‌లలో దాదాపుగా 25 శాతాన్ని భారత్‌లోనే ఉత్పత్తి చేయనుందని భావిస్తున్నారు. అదే విధంగా, భారతీయ ఔషధ కంపెనీలు అమెరికా సాధారణ జనరిక్‌ మందుల ప్రధాన సరఫరాదారుగా చైనాను తోసిరాజనగలుగుతాయి.

అయితే గార్‌సెటీ నియామకాన్ని నిర్ధారించడంలో అమెరికా వైఫల్యం ఇరుదేశాల మధ్య పరస్పర ప్రయోజనకరమైన బాంధవ్యాన్ని వమ్ము చేసింది. ఆ నిర్ధారణలోని ఘర్షణను అలా ఉంచినట్లయితే, భారత్‌లో రాయబారి పదవికి గార్‌సెటీ ఒక మంచి ఎంపిక అని చెప్పాలి. ఆయనది చిన్న వయసే (51 ఏళ్లు). చురుకైనవాడు. బైడెన్‌తో ఆయనకు ఉన్న సన్నిహిత సంబంధం వల్ల, అధ్యక్షుడితో నేరుగా సంప్రదించే స్థానంలో ఉన్నారు.

అధ్యక్షుడి చెవిలో నేరుగా ఊదగలిగే శక్తి ఉన్న అమెరికన్‌ రాయబారిని కలిగి ఉండటం అనేది ఆతిథ్య దేశానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. న్యూఢిల్లీలోని అమెరికా రాయబారి నివాసాన్ని రూజ్‌వెల్ట్‌ హౌస్‌ అని పిలుస్తారు. చైనా, భారత యుద్ధ కాలం సహా తాను కోరుకున్నప్పుడల్లా అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ బ్యూరోక్రసీని దాటి తన సన్నిహిత మిత్రుడు, అధ్యక్షుడు అయిన జాన్‌ ఎఫ్‌. కెన్నెడీని నేరుగా కలవగలిగే స్థాయి ఉన్న జాన్‌ కెన్నెత్‌ గాల్‌బ్రెయిత్‌ వంటి ప్రముఖ ఆర్థికవేత్త ఈ రూజ్‌వెల్ట్‌ హౌస్‌లో నివసించారు. భవిష్యత్తులో అమెరికా సెనేటర్‌ కానున్న డేనియల్‌ ప్యాట్రిక్‌ మొయినిహాన్‌ కూడా ఈ పదవిని అలంకరించారు.

భారత్‌లో శాశ్వత రాయబారి లేకపోవడానికి సెనేట్‌ నిర్ధారణ ప్రక్రియే కారణమంటూ శ్వేత సౌధ అధికారులు భుజాలు ఎగరేస్తూ ప్రైవేటుగా నిందిస్తుంటారు. కానీ అమెరికా బహిరంగంగా పేర్కొంటున్నట్లుగా భారత్‌ తనకు అంత విలువైన దేశమే అయినట్లయితే, తన నామినీని నిర్ధారింప జేసుకోవడంలో అధ్యక్ష పాలనా యంత్రాంగం మరింత శక్తిని ఎందుకు ప్రదర్శించడం లేదనే ప్రశ్న ఇప్పటికీ మిగిలే ఉంది. 2000 సంవత్సరంలో నాటి అమెరికా అధ్యక్షుడు బిల్‌ క్లింటన్‌ చారిత్రాత్మక భారత్‌ సందర్శన నుంచి, రిపబ్లికన్‌, డెమోక్రాటిక్‌ పాలనా యంత్రాంగాలు అమెరికా భౌగోళిక వ్యూహంలో భారత్‌ను అత్యంత ప్రధాన భాగస్వామిగా ఎంచుతూ వచ్చాయి.

డిసెంబర్‌ నెలలో జీ20 కూటమి అధ్యక్ష బాధ్యతను స్వీకరించిన భారత్‌ నిజంగానే అమెరికా గ్లోబల్‌ విజన్‌లో గణనీయంగా ఇమిడిపోతుందనడంలో సందేహమే లేదు. పైగా, పర్యావరణ మార్పు, ఇస్లామిక్‌ ఉగ్రవాదం వంటి ఉమ్మడి అంశాల్లో సహకారం వల్ల ఇరుదేశాలు ఎంతో ప్రయోజనం పొందగలవు.

ఆసియాలో అమెరికా అత్యంత కీలక భాగస్వామితో వ్యవహరించడానికి తగిన వ్యక్తిగత సంబంధాలను పెంచి పోషించగల రాయబారిని నిర్ధారించే విషయంలో తన రాజకీయ మూలధనాన్ని వెచ్చించడం శ్వేతసౌధానికి తప్పనిసరి అవసరం. ఈ కోణంలో బైడెన్‌ యంత్రాంగం కలిసి పనిచేసి, ఏమాత్రం జాగు చేయకుండా గార్‌సెటీని న్యూఢిల్లీ విమానం ఎక్కించాలి.

వ్యాసకర్త కాంగ్రెస్‌ సీనియర్‌ నేత, ఎంపీ

(‘ప్రాజెక్ట్‌ సిండికేట్‌’ సౌజన్యంతో)

సోషల్‌ మీడియా

సోషల్‌ నెట్‌ వర్కింగ్‌ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్‌, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

అదే కారణం



బీబీసీ డాక్యుమెంటరీకి ప్రభుత్వం ఎందుకు భయపడుతోందో అర్థం కాదు. కొంతమంది ముసలి వాళ్లతో కలిసి చూశా. అందరూ చూస్తున్నంతసేపూ ఆవలిస్తూనే ఉన్నారు. గుజరాత్‌లో ఏం జరిగిందో అందరికీ తెలుసు. అయినా సరే మోదీకి మద్దతు దొరుకుతోందని వాపోకండి. అసలు దానివల్లే దొరుకుతోంది.

– ఓంకార్‌ ఖాండేకర్‌, ఫీచర్‌ రైటర్‌

మంచి నిర్ణయం



అండమాన్‌ నికోబార్‌ దీవుల్లోని 21 దీవులకు పరమ్‌ వీర్‌ చక్ర అవార్డు అందుకున్నవారి పేర్లను పెట్టాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్ణయం నేతాజీ సుభాష్‌ చంద్రబోస్‌కు తగిన నివాళి. ఇది మాతృభూమి సంరక్షణ కోసం అత్యున్నత త్యాగాలు చేసినవారిని గౌరవించే నిర్ణయం.

– తుహిన్‌ ఎ.సిన్హా, రచయిత

అసందర్భ ప్రశ్నలు



అదే జనాలు అవే పనులు చేస్తూ సెల్ఫ్‌ గోల్‌ చేసుకుంటున్నారు. ఒకవైపేమో గౌరవనీయ ప్రధాని పరమ్‌ వీర్‌ చక్రతో అలంకరించినవారి పేర్లను 21 దీవులకు పెడితే– మరోవైపేమో ‘శౌర్య దినోత్సవ’ వేళ సర్జికల్‌ స్ట్రయిక్స్‌ను ప్రశ్నిస్తున్నారు. అదే జనాలు, ప్రతిసారి ఆ పార్టీని (కాంగ్రెస్‌) నాశనం చేస్తున్నారు.

– తెహసీన్‌ పూనావాలా, వెంచర్‌ క్యాపిటలిస్ట్‌

ఇది కాదు స్వేచ్ఛ



స్వీడన్‌లోని ఒక యాక్టివిస్టు ‘రెయిన్‌బో’ పతాకాన్నో, ఇజ్రాయిల్‌ పతాకాన్నో కాల్చితే అనుమతిస్తారా? అలాంటప్పుడు ఖురాన్‌ దహనాన్ని ఎందుకు సమర్థించుకుంటున్నారు? ఇది భావ స్వేచ్ఛ కాదు.

– రాబర్ట్‌ కార్టర్‌, జర్నలిస్ట్‌

పుట్టుకతోనే నేను!



ప్రత్యేకంగా నన్ను మహిళగా గుర్తించడం కాదు. నేను మహిళనే. నా పుట్టుకను ఒక ఎంపికగా కుదించవద్దు.

– నయోమీ సీబిట్‌, యాక్టివిస్ట్‌

సాక్షి ఎడిటోరియల్‌ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్‌: editpage@sakshi.com

హేతువాదమే మౌఢ్యానికి విరుగుడు



ఏబీకే ప్రసాద్‌
సీనియర్‌ సంపాదకులు

“వైజ్ఞానిక పునాదుల పైన, శాస్త్రీయ పరిజ్ఞానం పైన మాత్రమే మానవుల సుఖసంతోషాలు ఆధారపడి ఉంటాయి.”


– స్వతంత్ర భారత తొలి ఉప రాష్ట్రపతిగా సర్వేపల్లి రాధాకృష్ణ

కొన్ని శతాబ్దాల క్రితం వేమన, బద్దెన ఏ నీతులు శతక వాఙ్మయం ద్వారా బోధించారో వాటికి కాలం గడిచిన కొలదీ విలువ పెరుగుతూనే ఉంది. మూఢ విశ్వాసాల నుంచి ప్రజా బాహుళ్యానికి కొంత విమోచన వచ్చినా– పాలక శక్తుల ప్రాపకంతో సమాజంలో పెరుగుతూ వచ్చిన కుల, మత శక్తుల నుంచి విమోచన ఇంకా ప్రజలకు దూరంగానే ఉంది.

ఎనిమిది దశాబ్దాలుగా తెలుగు ప్రజల్ని హేతువాదం ద్వారా నిరంతరం చైతన్యంతో రగిలించిన భారత హేతువాద సంఘాధ్యక్షుడు, ‘హేతువాది’ పత్రిక ప్రధాన సంపాదకులు, దార్శనికుడు రావి పూడి వెంకటాద్రి తన 101వ సంవత్సరంలో పరమపదించారు. నిష్కల్మష హృదయంతో జీవితం సహేతుక పద్ధతిలో గడిపితే వ్యక్తి మనస్సు ముదిమిని జయిస్తుందని తన జీవితం ద్వారా నిరూపించారు వెంకటాద్రి. సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాలు, భారతీయ తత్వ దర్శనాలు, సత్యాన్వేషణ, ఆస్తికత్వం, నాస్తికత్వం, హేతుత్వం, మత తత్వం – ఆయన అన్వేషణా రంగాలు. హేతువాదాన్నీ, మానవతా వాదాన్నీ వ్యాపింపజేయడానికి వేలకొలదీ పేజీల ద్వారా వందలాది సంపుటాల ద్వారా అనంతమైన కృషి సల్పిన విస్పష్ట తొలి తెలుగు హేతువాది ఆయన.

మహాకవి గురజాడ అప్పారావు 110 సంవత్సరాల నాడే – దేశవ్యాపితంగా ఖ్యాతి గడించిన బౌద్ధ ధర్మాన్ని కుల, మత స్వార్థపర వర్గాలు భారత సరిహద్దుల నుంచి ఎలా తరిమికొట్టాయో చెప్పారు. దేశంలోని బౌద్ధ ధర్మ, హేతువాద పీఠాల్ని బలవంతంగా కూల్చి, వాటి స్థానే హేతువాద విరుద్ధ క్షేత్రాలకు పాలకులు ప్రాణ ప్రతిష్ఠ చేయడం జరిగింది. ‘క్రీ.శ. రెండు, మూడు శతాబ్దాల నాటికే’ కుల, మత వ్యవస్థకు పునాదులు గట్టిపరచుకొనే శక్తులకూ, బౌద్ధానికీ మధ్య జరిగిన సంఘర్షణకు ఆంధ్రలోని శ్రీ పర్వతమే కేంద్రం; బౌద్ధేతర శక్తులు బౌద్ధ భిక్షువులను వారి ఆరామాల నుండి బలవంతంగా బహిష్కరించి, నాగార్జున కొండ వద్ద ఉన్న బౌద్ధారామాలను, విహారాలను ఎలా స్వాధీనం చేసుకున్నారో రావిపూడి వెంకటాద్రి నిరూపణలతో రుజువు చేశారు. క్రీస్తుపూర్వం శుంగుల కాలం నుంచి క్రీ.శ. ఏడవ శతాబ్దం దాకా బౌద్ధాన్నీ, దాని హేతువాద దృక్పథాన్నీ నాశనం చేయడం కోసం రాజకీయ ఆధిపత్యం చలాయించిన

రెండో మాట



శక్తుల దుర్మార్గాన్ని చారిత్రకాధారాలతో రావిపూడి నిరూపించారు. చైనా యాత్రికు లైన– క్రీ.శ. 4వ శతాబ్దంలో మన దేశాన్ని సందర్శించిన ఫాహియాన్‌ గానీ, 7వ శతాబ్దం నాటి హ్యుయాన్‌ త్సాంగ్‌ గానీ బౌద్ధుల మీద జరిగిన అనేక దాడుల వివరాలను ఎలా పేర్కొన్నారో వివరించారు.

హేతువు మీద ఆధారపడి వర్ధిల్లిన లోకాయత, చార్వాక, బౌద్ధాది దర్శనాల్లోని హేతుబద్ధ భారతీయ తత్వాన్ని పతనం చేసిన తరు వాతనే భావవాదం, ఛాందసవాదానికి కొమ్ములు మొలవడం ప్రారంభించాయని రావిపూడి ఉదాహరించారు.

సుప్రసిద్ధ చరిత్రకారుడు లక్ష్మీనరసు తన ‘బౌద్ధం అంటే ఏమిటి?’ గ్రంథంలో బౌద్ధ ధర్మసారం వివరించారు. ఆ సారాంశాన్ని ఆయన బుద్ధుని మాటల్లోనే చెప్పారు: ‘‘నేను బోధించే ధర్మం అందరి పట్ల సమాన ఆదరణ కల్గిన ధర్మం. దీన్ని మన, తన భేదం లేకుండా అందరికీ బోధించండి. ఇది మంచివారిని, చెడ్డవారిని, సంపన్నులను, పేదలను ఒకే విధంగా విముక్తి చేస్తుంది. దీని నుంచి ఎవరికీ ఎలాంటి మినహాయింపూ లేదు. కరుణామయులైనవారు తమను మాత్రమేగాక, ఇతరులనూ విముక్తి చేయాలని కోరుకుంటారు. ఎందరినో విముక్తి చేసినా, చెయ్యవలసింది మరెంతో ఉంటుంది. ఇది నిరంతరం కొనసాగవలసిన ప్రక్రియ. ఈ ధర్మం ప్రపంచమంతా వ్యాపించి దుఃఖసాగరంలో మునిగిన అందరినీ రక్షించాలి.’’

ప్రాచీన కాలంలోనే విజ్ఞాన కాంతుల్ని వెదజల్లుతూ, సంఘంలోని అజ్ఞానాంధకారాలను బట్టబయలు చేయడానికి బయల్దేరిన భావ విప్లవోద్యమం వెయ్యేళ్లకుపైగా వర్ధిల్లి జన్మించిన భారతదేశంలోనే అడుగంటిపోవడం ఎంతటి విషాదకర పరిణామమో అంటారు రావిపూడి వెంకటాద్రి. ఇక కాలక్రమంలో బౌద్ధంలో చొరబడిన విగ్రహారాధన, పునర్జన్మ, కర్మ సిద్ధాంతాల వంటి మత వాసనలు కూడా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ అంబేడ్కర్‌ బౌద్ధాన్ని స్వీకరించడంతో తొలగిపోయి హేతువాద, మానవతావాదాలపై ఆధారపడిన సిసలైన బౌద్ధం వర్ధిల్లాలని రావిపూడి ఆశించారు. అందుకే ఒక సందర్భంలో ఇలా స్పష్టీకరించారు: ‘‘ఒక మతం వేరొక మతాన్ని ద్వేషిస్తుంది. కానీ హేతువాదం మతాలన్నింటినీ సమంగా నిరాకరిస్తుంది. అసహనాన్నీ, ద్వేషాన్నీ ప్రదర్శించదు. అసహనం, ద్వేషాల వల్ల మత విశ్వాసాలు మారవని హేతువాదులకు తెలుసు. మత మౌఢ్యం మారాలంటే మానసిక పరివర్తన రావాలనీ, అది చాలా నిదానమైన క్రమమనీ హేతువాదులకు తెలుసు. ఆంక్షల వల్ల, నిర్బంధాల వల్ల, నిరంకుశ నిషేధాల వల్ల మత తత్వం అణగిపోదనీ హేతువాదులకు తెలుసు. కనుకనే మనుషుల్లో ఉన్న వివేచనా జ్ఞానాన్ని పని చేయించడం ద్వారా మాత్రమే ఏ విధమైన మౌఢ్యాన్ని అయినా రూపుమాపవచ్చుననీ హేతువాదుల నిశ్చితాభిప్రాయం’’.

అంతేకాదు– ‘‘జాతి, మత, కుల, వర్గ ప్రాతిపదికల మీద మనం ఆధారపడితే – విజ్ఞానం, తత్వం, స్వేచ్ఛ, సమత, న్యాయం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికలుగా నిర్ణయించవలసిన మానవతావాద నీతి దుర్లభమవుతుంది. మానవులంతా ఒకటే అనుకున్నప్పుడు, మానవుల మధ్య విభిన్నమయిన నీతులు ఉండటానికి వీల్లేదు... అంతేగాదు, నేటి జాతులన్నీ రక్త సాంకర్యం పొందినవే. సిద్ధాంత సాంకర్యం పొందినవే. వర్గాలన్నీ ఆర్థిక స్థాయీ సాంకర్యం పొంది ఉన్నవే. అందువల్ల భిన్న జాతి, మత వర్గాల మధ్య స్పష్టమైన విభజన రేఖ గీయడం సాధ్యం కాదు. అందువల్ల జాతి, మత వర్గాల పేర్లతో మనుషుల్ని విభజించడం హేతు విరుద్ధం. అలాంటి హేతు విరుద్ధమైన విభజనను సృష్టించినవారు ఆయా కాలాల్లో పాలక వర్గాలుగా (శాసకులుగా) పెంపొందిన బాపతే. వారు చిరంతన సత్యాలుగా పేర్కొన్న సిద్ధాంతాలన్నీ మానవుణ్ణి పెంపుడు జంతువుగా, సిద్ధాంతదాసుడిగా, డూడూ బసవన్నగా తయారు చేయడానికే దారి తీశాయి. కానీ, మనిషి పెంపుడు జంతువు కావడానికి స్వభావతః ఇష్ట పడడు కనుకనే ఎప్పటికప్పుడు వ్యవస్థీకృత సిద్ధాంతాల మీద తిరుగు బాటు చేస్తూ వచ్చాడు. అదే– భావ విప్లవమంటే’’ అన్నది రావిపూడి మాట!

అందుకే కారల్‌ మార్క్స్‌ మహనీయుడు ‘మతం మత్తుమందు’ అని ఏనాడో నిర్వచించి పాఠం చెప్పవలసి వచ్చింది. ‘విజ్ఞానాభివృద్ధితో పాటు పరిణామం చెందే ఆలోచనా వైఖరిగానే హేతువాదం వన్నె తేలుతుందనీ, ఆలోచనలోనూ, ఆచరణలోనూ హేతువాదం ఒక ఉద్యమమ’నీ వేయి విధాల నిరూపిస్తూ వచ్చాడు రావిపూడి వెంకటాద్రి! కనుకనే ఓ కవి కుమారుడన్నట్టు–

‘‘కలవరపడి వెనుదిరిగితే కాలం ఎగబడుతుంది
కదనుతొక్కి చెలరేగితే కాలం భయపడుతుంది
కర్మయోగి ఎన్నడూ కాలాధీనుడు కాదు –
కనురెప్పలు మూతపడితే కాలం జోకొడుతుంది
కంఠమెత్తి తిరగబడితే కాలం జేకొడుతుంది!’’

ఆఖరి శ్వాసలో కూడా స్థూలంగా అదే రావిపూడి తీర్మానం కూడా!

abkprasad2006@yahoo.co.in

ఈ వివక్ష తగునా?

జాతీయ బాలికా దినోత్సవం ఏటా జనవరి 24న జరుపుకుంటున్నాం. దీని ప్రధాన ఉద్దేశాలు...బాలికలు ఎదుర్కొంటున్న అసమానతలు, అత్యాచారాలపై అవగాహన కల్పించడం,; విద్య, ఆరోగ్యం, పోషణ ప్రాముఖ్యతను తెలియజేయడం. ఇందుకోసం కోసం ఐక్యరాజ్యసమితి బాలికా దినోత్సవం జరపాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది. ఈ పిలుపునందుకుని భారత్‌ 2008 నుండీ మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖవారి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

భారత రాజ్యాంగం ఆడ, మగ ఇద్దరికీ సమాన హక్కులు కల్పించింది. కానీ లింగవివక్షతో గర్భంలో ఉండగానే స్కానింగ్‌లతో లింగ నిర్ధారణ పరీక్షలు చేయించి ఆడపిల్ల అని తేలగానే ఇప్పటికీ గర్భస్రావం చేయిస్తున్నారు. మన సాంకేతిక పరిజ్ఞాన పురోభివృద్ధిని ఆడ శిశువుల అంతానికి ఉపయోగించడం దారుణం. 2011 జనాభా లెక్కల ప్రకారం వెయ్యి మంది మగ పిల్లలకు 946 మంది ఆడ పిల్లలు ఉన్నారు. దీంతో దేశంలో ఇప్పుడు మగ పిల్లలకు వివాహాలు చేయడానికి ఆడపిల్లలు దొరకని దుఃస్థితి వచ్చింది. భారత ప్రభుత్వం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధ చట్టం, బాల్యవివాహముల నిరోధక చట్టం వంటివి ఎన్ని ఉన్నా బాలికల పట్ల జరిగే అన్యాయం జరుగుతూనే ఉంది. 2015లో ‘బేటీ బచావో, బేటీ పఢావో’, ‘షాదీ ముబారక్‌’ వంటి పథకాలు బాల్య వివాహాలను కొంతవరకు తగ్గించాయి.

స్త్రీ విద్యావంతురాలు అయితే ఆ కుటుంబం అంతా విద్యా వంతులు అవుతారని భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్‌ నెహ్రూ అన్నారు. ఆనాటి నుండి నేటి వరకూ బాలికల విద్య నిర్లక్ష్యానికి గురి అవుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం సుమారు 82 శాతం మగవారు, 65 శాతం బాలికలు అక్షరా స్యులుగా ఉన్నారు. మిగతా 35 శాతం బాలికలు బడికి దూరంగానే ఉన్నారు. 2009 విద్యాహక్కు చట్టం ఫలితంగా కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో వెనుకబడిన తరగతుల బాలికలు చదువుకోవడానికి మంచి అవకాశం వచ్చింది. అయినప్పటికీ పల్లెటూర్లలో బాలికల అక్షరాస్యత తక్కువగానే ఉంది. ఏ లక్ష్యా లపై అవగాహన కల్పించడానికి బాలికా దినోత్సవాన్ని జరుపు తున్నామో... వాటిని సాకారం చేయడంలో సమాజంలోని అన్ని వర్గాలకూ బాధ్యత ఉంది.

– సయ్యద్‌ షఫీ, హనుమకొండ

(నేడు జాతీయ బాలికా దినోత్సవం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం,, తిథి: శు.తదియ రా.8.29 వరకు, తదుపరి చవితి, నక్షత్రం: శతభిషం రా.3.21 వరకు, తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: ఉ.11.31 నుండి 1.03 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.50 నుండి 9.34 వరకు, తదుపరి రా.10.54 నుండి 11.45 వరకు, అమృతఘడియలు: రా.8.34 నుండి 10.03 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.47.

లోకేశ్ పాదయాత్రకు ఆంక్షలు లేవు

- అనుమతి ఇవ్వలేదంటూ దుష్ప్రచారం తగదు
- చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి


ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: ఈనెల 27వ తేదీ నుంచి నారా లోకేశ్ చేపట్టనున్న పాదయాత్రకు పోలీసుశాఖ ఎలాంటి ఆంక్షలు విధించలేదని చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అందరికీ వర్తించినట్లే లోకేశ్‌కు సైతం జాతీయ రహదారి, రాష్ట్ర రహదారి నిబంధనలు వర్తిస్తాయని చెప్పారు. పోలీసుశాఖ అనుమతి ఇవ్వలేదంటూ కొందరు దుష్ప్రచారం చేయడం మంచిదికాదన్నారు. ఆయన సోమవారం చిత్తూరులో మీడియాతో మాట్లాడారు. కుప్పం నుంచి మొదలయ్యే పాదయాత్రపై ఇప్పటికే ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాని, మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు తనతో మాట్లాడుతున్నారని చెప్పారు. రూట్ మ్యాప్, కాన్వాయ్‌కు ఎన్ని వాహనాలు కావాలి, సాధారణ నిబంధనలు ఏం ఉన్నాయి.. అనేవాటిపై టీడీపీ నేతలతో మాట్లాడుతున్నామని తెలిపారు. జాతీయ రహదారులపై గుంపులుగా ఒక్కచోటికి చేరకూడదని, బహిరంగసభలు పెట్టుకోకూడదని చెప్పామన్నారు. రెచ్చగొట్టే ప్రసంగాలు, సున్నితమైన ప్రాంతాల్లో విద్వేషాలు చేయడం, బ్యానర్లు చించడం వంటి పనులు చేయవద్దని ఇప్పటికే టీడీపీ నేతలకు స్పష్టంగా చెప్పామని తెలిపారు. పాదయాత్రకు పోలీసుశాఖ ఆంక్షలు విధించలేదని, అనుమతి ఇవ్వబోమని ఎక్కడా చెప్పలేదని ఎస్పీ పేర్కొన్నారు.

27 నుంచి శారదా పీఠం వార్షికోత్సవాలు

- ఐదు రోజులపాటు నిర్వహణ
- సీఎంతో పాటు పలు రాష్ట్రాల గవర్నర్ల రాక
- శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి వెల్లడి



సింహాచలం: విశాఖ శ్రీ శారదా పీఠం వార్షికోత్సవాలు ఈనెల 27 నుంచి 31 వరకు.. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతాయని ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి తెలిపారు. ఈనెల 28న నిర్వహించే రాజశ్యామల అమ్మవారి యాగంలో సీఎం వైఎస్ జగన్ పాల్గొంటారని చెప్పారు. అలాగే పలు రాష్ట్రాల గవర్నర్లు కూడా వార్షికోత్సవాల్లో పాల్గొంటారని వివరించారు. శారదా పీఠంలో సోమవారం స్వాత్మానందేంద్ర సరస్వతి మీడియాతో మాట్లాడారు. వార్షికోత్సవాలకు ఈనెల 27వ తేదీ ఉదయం అంకురార్పణ చేస్తామని తెలిపారు. సచ్చిదానంద విద్వత్ సభ పేరుతో నిర్వహించే కార్యక్రమాల్లో ఉత్తమ పాండిత్యం ప్రదర్శించిన పండితులకు స్వర్ణ కంకణధారణ చేస్తామన్నారు. తెలుగు రాష్ట్రాలు సస్యశ్యామలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ చతుర్వేద హవనం నిర్వహిస్తామని చెప్పారు. లక్ష మూల మంత్రాలతో శత సహస్ర రాజశ్యామల యాగాన్ని ఐదు రోజులపాటు నిర్వహిస్తామని.. సర్వజనుల హితాన్ని కాంక్షిస్తూ విశేష హోమాలు చేస్తామని తెలిపారు. 28వ తేదీన అరుణ పారాయణం, సూర్య నమస్కారాలు నిర్వహిస్తామన్నారు. 30వ తేదీ సాయంత్రం సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆరాధిస్తూ రథోత్సవం, రాత్రి వల్లీ కల్యాణం నిర్వహిస్తామని చెప్పారు. వార్షికోత్సవాల్లో ఆగమ సదస్సులు కూడా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. రాజశ్యామల అమ్మవారి శత సహస్ర యాగంలో పాల్గొనేందుకు అనేకమంది రాజకీయ, వ్యాపార ప్రముఖులు తరలిరానున్నట్లు స్వాత్మానందేంద్ర సరస్వతి తెలిపారు. ఈనెల 28న సీఎం జగన్, పంజాబ్ గవర్నర్ భన్వర్‌లాల్ పురోహిత్, తమిళనాడు గవర్నర్ రవి శారదాపీఠానికి వస్తారని చెప్పారు. 30వ తేదీన ఏపీ, తెలంగాణ, హరియాణా గవర్నర్లు విశ్వభూషణ్ హరిచందన్, తమిళిసై, బండారు దత్తాత్రేయ వార్షికోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు.


తమిళనాడు మహిళకు అంతర్జాతీయ అవార్డు



కొరుక్కుపేట: తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన డాక్టర్ ఫ్లోరెన్స్ హెలెన్ నళిని అత్యంత ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ వరల్డ్ పీపుల్ ఛాయిస్ విన్నర్స్ అవార్డు–2022ను దక్కించుకున్నారు. అమెరికాలో జరిగిన మహిళల అందాల పోటీల్లో ఈ అరుదైన అవార్డును ఆమె గెలుచుకున్నారు. ఈ వివరాలను సోమవారం స్థానికంగా నళిని ప్రకటించారు. కోయంబత్తూరులో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన నళిని సైకాలజీ, ఎడ్యుకేషన్, లాంగ్వేజీ ట్రైనింగ్, బిహేవియరల్ ట్రైనింగ్, యోగ, పబ్లిక్ స్పీకింగ్ తదితర రంగాల్లో నిష్ణాతులయ్యారు. రచయిత్రిగా, సామాజిక సేవకురాలిగా అందరి మన్ననలు పొందారు. గత సంవత్సరం ముంబైలో ది ఇంటర్నేషనల్ గ్లామర్ ప్రాజెక్ట్ ఇండో–యూఎస్ కూటమి ఆధ్వర్యంలో జరిగిన అందాల పోటీల్లో 3,000 మంది పాల్గొనగా, 52 మంది ఎంపికయ్యారు. ఇందులో ఫైనల్‌లో తమిళనాడు నుంచి ఎంపికైన ఏకైక పోటీదారుగా డాక్టర్ ఫ్లోరెన్స్ నళిని నిలిచారు. ఇద్దరు పిల్లల తల్లిగా ఉన్న నళిని ఆత్మవిశ్వాసంతో అందాల పోటీల్లో పాల్గొని అవార్డును సొంతం చేసుకున్నారు. ఇంటర్నేషనల్ వరల్డ్ పీపుల్ ఛాయిస్ విజేత–2022 అవార్డును దక్కించుకున్న డాక్టర్ ఫ్లోరెన్స్ నళినిని పలువురు ప్రముఖులు అభినందించారు.

ఆలయ ఉత్సవాల్లో అపశ్రుతి

- కుప్పకూలిన క్రేన్..నలుగురు మృతి
- మరో 9 మందికి తీవ్ర గాయాలు


కుప్పకూలిన క్రేన్

అరక్కోణం(తమిళనాడు): తమిళనాడులో మాండియమ్మన్ ఆలయ ఉత్సవాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. క్రేన్ కూలడంతో నలుగురు చనిపోగా మరో 9 మంది గాయపడ్డారు. రాణిపేట జిల్లా నెమిలిలోని కలివీడు గ్రామంలో ఆదివారం రాత్రి 8.15 గంటలకు ద్రౌపతి అమ్మన్ ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా క్రేన్‌పై దేవతా విగ్రహాలను ఊరేగించారు. భక్తులు అందించే పూలమాలలను అమ్మవారికి అలంకరించేందుకు 25 అడుగుల ఎత్తైన క్రేన్‌పై ముగ్గురు వ్యక్తులు నిలబడ్డారు. బరువు ఎక్కువవడటంతో క్రేన్ బోల్తా పడింది. దీంతో దానిపై ఉన్న ముగ్గురితోపాటు మరో వ్యక్తి చనిపోయారు. ఘటన కారణంగా జరిగిన తొక్కిసలాటలో బాలిక సహా 9 మందికి గాయపడ్డారు.

తెలంగాణ

మళ్లీ రాజ్‌భవన్‌లోనే గణతంత్ర వేడుక

- తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం
- వరుసగా రెండో ఏడాదీ రాజ్‌భవన్‌కే గణతంత్ర దిన వేడుకలు పరిమితం

సాక్షి, హైదరాబాద్: దేశ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న రాష్ట్ర స్థాయిలో అధికారికంగా నిర్వహించాల్సి ఉన్న వేడుకలను ఈ ఏడాది సైతం రాజ్‌భవన్‌కు పరిమితం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆదివారం రాత్రి రాజ్‌భవన్‌కు సమాచారాన్ని అందించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి, గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించడం ఆనవాయితీగా వస్తోంది. గణతంత్ర దినోత్సవాన్ని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించడం సాంప్రదాయంగా వస్తుండగా, తెలంగాణ వచ్చిన తర్వాత కొన్నాళ్లకు వేదికను నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌కు మార్చారు. కాగా, తొలిసారిగా రాష్ట్ర స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలను గతేడాది రాజ్‌భవన్‌లో నిర్వహించారు. కోవిడ్–19 మహమ్మారి మూడో వేవ్ ప్రభావం ఉండడంతో వేడుకలను తక్కువ మంది అతిథుల సమక్షంలో రాజ్‌భవన్‌లో నిర్వహించాలని అప్పట్లో రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ప్రసంగం లేకుండానే సాదాసీదాగా ఉత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రసంగ పాఠాన్ని పంపకపోయినా, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాత్రం ఓ అడుగు ముందుకేసి రాజ్‌భవన్ వేదికగా ప్రసంగించారు. కేవలం తనను అవమానించడానికే రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవాల ప్రాధాన్యతను తగ్గించిందని అప్పట్లో విమర్శించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ తమిళిసై మధ్య నెలకొన్న తీవ్ర విబేధాల నేపథ్యంలో వరుసగా రెండో ఏడాది కూడా గణతంత్ర దిన వేడుకలు రాజ్‌భవన్‌లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంచలనంగా మారింది. ప్రస్తుతానికి కోవిడ్–19 ప్రభావం లేకున్నా వేడుకలను రాజ్‌భవన్‌కు పరిమితం చేయడం గమనార్హం.

బుడితి కంచు... విశ్వమంతా మోగెను!

కుగ్రామానికి ప్రపంచస్థాయి గుర్తింపు

- తెలుగు రాష్ట్రాల్లోని దేవాలయాల్లో ఇక్కడి విగ్రహాలే ప్రతిష్టాపన
- వందేళ్లకు పైగా నియమనిష్టలతో తయారీ
- పాఠ్యపుస్తకంలో సైతం 'బుడితి' కంచు, ఇత్తడిపై ప్రస్తావన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : అక్కడ ఏ ఇంటి ముందుకువెళ్లినా టంగ్.. టంగుమంటూ వచ్చే శబ్దాలు వినిపిస్తాయి. ఇత్తడి, కంచు, రాగి లోహాలతో చేసిన చూడచక్కని విగ్రహాలు కనిపిస్తాయి. ఇతర ప్రాంతాలకు భిన్నంగా అందంగా, అలవోకగా విగ్రహాలు, పాత్రలు తయారు చేసే గ్రామస్తుల నైపుణ్యం మంత్రముగ్ధులను చేస్తుంది. ఇలాంటి విశిష్టతలెన్నో శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం బుడితి గ్రామం సొంతం. ఈ గ్రామస్తుల పనితనం, నాణ్యత కారణంగా 'బుడితి కంచు, ఇత్తడి పరిశ్రమ' ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది.

దేశ, విదేశాలకు దేవతామూర్తులు...


బుడితి గ్రామంలో కంచు, ఇత్తడి పరిశ్రమకు 100 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. గ్రామంలోని 30 శాతం కుటుంబాలు ఇదే వృత్తిలో కొనసాగుతున్నాయి. దేశంలో ఎక్కడ దేవాలయాలు నిర్మించినా బుడితి గ్రామానికి వచ్చి విగ్రహాలు, పూజకు అవసరమైన వస్తువులు తయారు చేయించుకుని తీసుకువెళతారు. నియమనిష్టలతో ఇక్కడి కార్మికులు తయారుచేసిన దేవతామూర్తులే దాదాపు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా అన్ని ఆలయాల్లోనూ ప్రతిష్టించారు. విదేశాల నుంచి కూడా వచ్చి తమకు కావాల్సిన విగ్రహాలు, వస్తువులు తయారు చేయించుకుని తీసుకువెళుతున్నారు. కొందరు ఆన్‌లైన్ ద్వారా కూడా వస్తువులు ఆర్డర్ ఇస్తున్నారు. సినీ పరిశ్రమలో వినియోగిస్తున్న చాలా వస్తువులు ఇక్కడ తయారుచేసినవే. ప్రముఖుల నుంచి సామాన్యుల వరకు ఇళ్లలో పూజలు, అలంకరణ, సారెల కోసం అవసరమైన విగ్రహాలు, వస్తువులను ఇక్కడ తయారు చేస్తున్నారు. వివిధ కంచు, ఇత్తడి, రాగి, వెండి వస్తువుల తయారీకి కార్మికులు సుమారు 1,200 రకాల వస్తువులు వినియోగిస్తారు. ఇక్కడ తయారైన వస్తువులు లేపాక్షి వారు కొనుగోలు చేసి వాటిని పలు ప్రాంతాల్లో ప్రదర్శనలకు తీసుకువెళతారు.

రాష్ట్ర సచివాలయంలో బుడితి వస్తువులు

బుడితిలో తయారైన వస్తువులు రెండు తెలుగు రాష్ట్రాల సచివాలయాలు, రాజ్‌భవన్‌లో కూడా ఉన్నాయి. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన రోజున 108 కలశాలను గ్రామానికి చెందిన కింతాడ అప్పారావు, వారి కుమారుడు బుజ్జి తయారు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న నవరత్నాలు పథకానికి సంబంధించిన లోగోలను, ఫ్లవర్‌వాజ్‌లు తయారుచేసి అమరావతిలోని సచివాలయానికి పంపించారు.

పాఠ్యపుస్తకంలో స్థానిక మహిళ ఘనత

బుడితి గ్రామానికి చెందిన అద్దాల సూర్యకళ గురించి ఏడో తరగతి సాంఘికశాస్త్రం పాఠ్యపుస్తకంలో ప్రస్తావించారు. కంచు, ఇత్తడి పరిశ్రమలో ఆమె ఏ విధంగా రాణిస్తున్నారు... నాబార్డు ద్వారా సహాయం పొంది వ్యాపారంలో ఎంత వరకు లబ్ధిపొందుతున్నారు... తదితర వివరాలను పాఠ్యపుస్తకంలో పొందుపరిచారు.


నాగాభరణంతో ఉన్న శివుని విగ్రహం

కలెక్టర్ సహకారంతో బెల్జియం..



బుడితిలో తయారైన వస్తువులను 1978–80 సంవత్సరంలో అప్పటి కలెక్టర్ జె.హరినారాయణ సహకారంతో బెల్జియం దేశానికి పంపించాం. ఇక్కడి వస్తువులను అప్పట్లో హైదరాబాద్ సచివాలయం, ఇప్పటి అమరావతిలోని సచివాలయాలకు కలెక్టర్లు పంపించారు.

– కింతాడ అప్పారావు, ఇత్తడి వస్తువుల తయారీదారుడు, బుడితి

కుటీర పరిశ్రమగా...



మా తాత, ముత్తాల నుంచి ఈ పనిపై ఆధారపడి జీవిస్తున్నాం. ఈ వృత్తినే చిన్న కుటీర పరిశ్రమగా చేసుకుని నలుగురు కార్మికులతో కలసి పనిచేస్తున్నాం. ఈ వృత్తిని స్వీకరించేందుకు ప్రస్తుత యువతరం ముందుకు రావడం లేదు. మా తదనంతరం ఈ పని చేసేవారు ఉంటారనే నమ్మకం లేకుండాపోతోంది.

– పాటోజు శ్రీనివాసరావు, కార్మికుడు బుడితి


నవరత్నాలతో ఉన్న ఫ్లవర్‌వాజ్


దేవాలయాలలో వాడే మకరతోరణం


ఒడిశాలోని జైపూర్‌లో శివాలయం కోసం తయారు చేసిన శివపార్వతుల విగ్రహాలు


ఇంట్లో వాడే గృహోపకరణాలు

మళ్లీ మన్యం గజగజ


పాడేరు – చింతలవీధి రోడ్డులో ఉదయం 9 గంటలకు పొగమంచు


పాడేరు పాత బస్టాండ్‌లో చలిమంట కాగుతున్న చిరువ్యాపారులు

ఒక్కసారిగా తగ్గిన రాత్రి ఉష్ణోగ్రతలు

- అరకులోయలో 6.5, చింతపల్లిలో 7 డిగ్రీలు నమోదు
- మినుములూరులో 9 డిగ్రీలు...

సాక్షి, పాడేరు (అల్లూరిసీతారామరాజు): ఏజెన్సీ ఏరియాలో మళ్లీ చలి తీవ్రత పెరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలుచోట్ల ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. చలిగాలులు తీవ్రంగా వీస్తున్నాయి. మన్యం ప్రాంతంలో సోమవారం వేకువజాము నుంచి చలి అధికంగా ఉంది. చిన్నారులు, వృద్ధులతోపాటు కూలిపనులకు వెళ్లే గిరిజనులు చలితో తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఆంధ్రా ఊటీగా పేరొందిన అరకులోయ, 'ఆంధ్రా కాశ్మీరు' చింతపల్లి ప్రాంతాల్లో నాలుగు రోజుల నుంచి రాత్రి ఉష్ణోగ్రతలు 10 నుంచి 15 డిగ్రీల వరకు నమోదయ్యాయి. అరకులోయలోని కేంద్ర కాఫీ బోర్డు కార్యాలయంలో ఆదివారం 14.3 డిగ్రీలు నమోదు కాగా, సోమవారం అనూహ్యంగా 6.5 డిగ్రీలు నమోదైంది. పొగమంచు తీవ్రత లేనప్పటికీ, అరకులోయ ప్రాంతంలో చలిగాలులు విజృంభించాయి. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆదివారం 15.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, సోమవారం 7 డిగ్రీలకు పడిపోయింది. చింతపల్లి, లంబసింగి, తాజంగి ప్రాంతాల్లోని పర్యాటకులు, స్థానికులు చలికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో ఆదివారం 10 డిగ్రీలు, సోమవారం 9 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పాడేరు ప్రాంతంలో పొగమంచు దట్టంగా కురిసింది. ఉదయం 10గంటల వరకు మంచుతెరలు వీడలేదు.

శ్రీవాణి ట్రస్టు నిధులతో 2,068 ఆలయాల నిర్మాణం

- ఇప్పటివరకు అందిన విరాళాలు రూ.650 కోట్లు
- నిధులు దుర్వినియోగమయ్యే అవకాశమే లేదు
- సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారాన్ని భక్తులు నమ్మొద్దు
- టీటీడీ ఈవో ధర్మారెడ్డి


మాట్లాడుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుమల : శ్రీవాణి ట్రస్టు నిధులతో రాష్ట్రంలోని 26 జిల్లాలతో పాటు తెలంగాణ, పాండిచ్చేరి, కర్ణాటక రాష్ట్రాలతో కలిపి మొత్తం 2,068 ఆలయాల నిర్మాణం జరుగుతోందని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం ఈవో మీడియాతో మాట్లాడారు. శ్రీవేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్టు(శ్రీవాణి)ను 2019లో ఏర్పాటుచేసినట్టు చెప్పారు. లక్ష లోపు విరాళం అందించే దాతలకూ ప్రయోజనాలు వర్తింపజేయాలనే ఉద్దేశంతో శ్రీవాణి ట్రస్టుకు రూ.10 వేలు విరాళం అందించే దాతలకు ఒక బ్రేక్ దర్శన టికెట్ జారీచేస్తున్నట్టు తెలిపారు. శ్రీవాణి ట్రస్టుకు ఇప్పటివరకు దాతల నుంచి రూ.650 కోట్ల విరాళాలు సమకూరాయని, ట్రస్టు నిధులతో పురాతన ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణం, ఆలయాల ధూపదీప నైవేద్యాలకు ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. శ్రీవాణి ట్రస్టుకు సంబంధించి 50 శాతం నిధులను టీటీడీ జనరల్ అకౌంట్‌కు బదిలీ చేస్తున్నారని, ఆదాయం కోసమే శ్రీవాణి దర్శన టికెట్లు ఇస్తున్నారని, నిధులు దుర్వినియోగం అవుతున్నాయని సామాజిక మాధ్యమాల్లో అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, ఇలాంటి దుష్ప్రచారాన్ని భక్తులు నమ్మొద్దని టీటీడీ ఈవో ధర్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. శ్రీవాణి ట్రస్టుకు ప్రత్యేకంగా బ్యాంకు అకౌంట్ ఉందని, అందులోనే విరాళాలు జమవుతాయని, టీటీడీ నుంచి సొమ్ము ప్రభుత్వానికి అందే ప్రసక్తే లేదన్నారు.

నావల్ యాంటీ డ్రోన్ సిస్టమ్ ఏర్పాటుకు యోచన

చిన్నపాటి మైక్రో డ్రోన్‌లను కూడా తక్షణమే గుర్తించి వాటిని పనిచేయకుండా నిలిపివేసే నేవల్ యాంటీ డ్రోన్ సిస్టమ్(ఎన్ఏడీఎస్)ను తిరుమలలో ఏర్పాటుచేసేందుకు యోచిస్తున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. యాంటీ డ్రోన్ సిస్టమ్ కొనుగోలుపై భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్)తో చర్చలు కొనసాగుతున్నాయన్నారు. దేశవ్యాప్తంగా టీటీడీకి ఉన్న 396 కల్యాణ మండపాల్లో భక్తుల కోరిక మేరకు 12 మండపాలను రూ.2.8 కోట్లతో పునరుద్ధరించి, ఏసీ, ఫర్నిచర్ వసతులు కల్పించి.. తదనుగుణంగా అద్దె పెంచామని ఈవో వివరించారు. మిగిలిన 384 కల్యాణ మండపాల అద్దె పెంచలేదన్నారు. టీటీడీ చరిత్రలో మొదటిసారిగా, సుమారు 7,126 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మొత్తం 960 ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేస్తామన్నారు. 2019లో రూ.13,025 కోట్లుగా ఉన్న టీటీడీ బ్యాంకు డిపాజిట్లు ఇప్పుడు రూ.15,938 కోట్లు అని, బంగారం డిపాజిట్లు 7,339 కిలోల నుంచి 10,258 కిలోలకు పెరిగాయని వెల్లడించారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

- విద్యార్థులతో ముఖాముఖిలో కేంద్ర మంత్రి దేవు సిన్హ్ చౌహాన్



కర్నూలు కల్చరల్: యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు హక్కును వినియోగించుకోవాలని కేంద్ర టెలికమ్యూనికేషన్స్, ఐటీ శాఖ మంత్రి దేవు సిన్హ్ చౌహాన్ సూచించారు. మంచి నాయకులను ఎన్నుకుంటేనే మంచి ప్రభుత్వం వస్తుందని అన్నారు. ప్రవాసీ పార్లమెంటరీ యోజన కార్యక్రమంలో పాల్గొనేందుకు కర్నూలు వచ్చిన ఆయన సోమవారం జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ శక్తివంతమైన నాయకులుగా యువత ఎదగాలన్నారు. మంచి నాయకత్వం ఉంటేనే ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్యమని పేర్కొన్నారు. స్టార్టప్‌లలో మన దేశం ప్రపంచంలో మూడో స్థానంలో ఉందన్నారు. పొరుగున ఉన్న పాకిస్తాన్, శ్రీలంక దేశాలు తీవ్ర ఆర్థిక మాంద్యంలో కూరుకుపోయాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరి 13న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది. 13న కన్నప్ప ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయి. 14న స్వామివారి ధ్వజారోహణం, 18న మహాశివరాత్రి, 19న ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 20న స్వామి,అమ్మవార్ల కల్యాణోత్సవం, 22న కైలాసగిరి ప్రదక్షిణ, 23న ధ్వజావరోహణం, 24న పల్లకీసేవ, 26న శాంతి అభిషేకంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా రాధికారెడ్డి



సాక్షి,అమరావతి/లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫారిన్ డెప్యూటేషన్‌పై మూడేళ్లపాటు రిజిస్ట్రార్‌గా ఆమె కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సైకియాట్రిగా ప్రొఫెసర్ హోదాలో ఉన్న రాధికారెడ్డి ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

14 మంది అధికారులపై అయ్యన్న కేసు

నర్సీపట్నం: గత ఏడాది జూన్ 19వ తేదీ తెల్లవారుజామున రెవెన్యూ, పోలీసు అధికారులు తమ ఇంటి గోడను కూల్చివేశారంటూ మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడి తనయుడు రాజేష్ సోమవారం నర్సీపట్నం అదనపు సివిల్ జడ్జి, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో కేసు వేశారు. అప్పటి ఆర్డీవో గోవిందరావు, ఏఎస్పీ విజయ మణికంఠ చందోలు, తహసీల్దార్ కె.జయతోపాటు మొత్తం 14 మందిపై కేసు వేశారు. కేసు వేసేందుకు కుమారుడితో అయ్యన్నపాత్రుడు కోర్టుకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. ఎంపీ విజయసాయిరెడ్డి ఆదేశాలతో అధికారులు ఈ చర్యలకు పాల్పడినట్టు ఆరోపించారు.

సినీ నటుడు సుధీర్‌వర్మ ఆత్మహత్య

- వ్యక్తిగత కారణాలతో హైదరాబాద్‌లో విషం తాగిన హీరో
- 21వ తేదీన విశాఖలో ఎల్‌జీ ఆస్పత్రిలో చేరిక
- చికిత్స పొందుతూ మృతి
- గుట్టుచప్పుడు కాకుండా దహన సంస్కారాలు
- 2013లో 'సెకండ్ హ్యాండ్' సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ
- రాఘవేంద్రరావు సమర్పణలో 'కుందనపు బొమ్మ' చిత్రంలో నటించిన సుధీర్‌వర్మ



దొండపర్తి (విశాఖ దక్షిణ): వర్ధమాన తెలుగు సినీ నటుడు కలిదిండి సుధీర్‌వర్మ (34) బలవన్మరణానికి పాల్పడ్డారు. హైదరాబాద్‌లో విషం తాగిన ఆయన అక్కడ ఉస్మానియా ఆస్పత్రిలో చేరారు. ఆ తరువాత ఎవరికీ చెప్పకుండా ఈ నెల 21వ తేదీన విశాఖపట్నం వచ్చి ఇక్కడి ఎల్‌జీ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందాడు. కాగా, గుట్టుచప్పుడు కాకుండా సుధీర్‌వర్మ దహన సంస్కారాలు పూర్తి చేయడం అనుమానాలకు తావిస్తోంది. 2013లో 'సెకండ్ హ్యాండ్' సినిమాతో సుధీర్‌వర్మ టాలీవుడ్‌లోకి హీరోగా ఎంట్రీ ఇచ్చారు. 2016లో దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు సమర్పణలో రిలీజైన కుందనపు బొమ్మ సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. మెగాస్టార్ చిరంజీవి కుమార్తె సుస్మిత నిర్మించిన 'షూటౌట్ ఎట్ ఆలేరు' వెబ్ సిరీస్‌లోనూ నటించారు.

ఆరోగ్య సమస్యలే కారణమా!

సుధీర్‌వర్మ కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. ఈ కారణంగానే గత వారంలో హైదరాబాద్‌లో విషం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆరోగ్యం క్షీణించడంతో తన బంధువుకు ఫోన్‌చేసిన సుధీర్ ఆరోగ్య సమస్యల కారణంగా మానసిక పరిస్థితి బాగోలేకపోవడంతో పురుగు మందు తాగినట్టు చెప్పగా.. అతడు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించాడు. కాగా, సుధీర్‌వర్మను ఆస్పత్రిలో ఎవరికీ చెప్పకుండా, డిశ్చార్జ్ తీసుకోకుండా ఈ నెల 21న విశాఖ తీసుకువచ్చి మహారాణిపేట ప్రాంతంలోని ఎల్‌జీ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు చికిత్స అందించి, సుధీర్ ఆత్మహత్య యత్నం చేసిన విషయాన్ని మహారాణిపేట పోలీసులకు తెలియజేశారు. దీంతో పోలీసులు ఆస్పత్రికి వెళ్లి సుధీర్ నుంచి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో సుధీర్ తాను ఓ వాటర్‌ప్లాంట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నట్టు పోలీసులకు చెప్పాడు. సుధీర్‌వర్మ చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున 4.18 గంటలకు చనిపోయినట్టు ఆస్పత్రి వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయమై ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా.. పోస్టుమార్టం చేయకుండానే వారు దహన సంస్కారాలు పూర్తి చేశారు.

ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: గుంటూరులో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పి.చెన్నకేశవులు సోమవారం రాత్రి సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత వద్ద అదనపు డ్రైవర్‌గా పనిచేస్తున్న చెన్నకేశవులు సోమవారం రాత్రి బ్రాడీపేట 6/12లోని ఎమ్మెల్యే సిబ్బంది రెస్ట్ రూమ్ చేరుకున్నారు. అదే సమయంలో ఎమ్మెల్యే పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ ఐ.వి.రామయ్య తన సర్వీస్ రివాల్వర్‌ను గదిలో ఉంచి స్నానానికి వెళ్లారు. ఆ సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని చెన్నకేశవులు ప్రాణాలు తీసుకున్నారు. ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వేగంగా దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. చెన్నకేశవులు ఆర్థిక సమస్యలతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు.

తెలంగాణ

5న నాందేడ్‌లో బీఆర్ఎస్ సభ

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో భారత్ రాష్ట్ర సమితి విస్తరణ, జాతీయ రాజకీయాల దృష్టిని మరింతగా ఆకర్షించడం లక్ష్యంగా మహారాష్ట్రలోని నాందేడ్‌లో బీఆర్ఎస్ బహిరంగ సభను నిర్వహించాలని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ తొలి సభ విజయవంతమైందని.. ఈ ఊపులోనే మరో సభతో పార్టీలో ఉత్సాహం నెలకొంటుందని భావిస్తున్నారు. నాందేడ్ సభకు అవసరమైన ఏర్పాట్లపై మహారాష్ట్రకు చెందిన కొందరు నేతలతో ప్రగతిభవన్‌లో మూడు రోజులుగా కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. నాందేడ్‌లో బీఆర్ఎస్ బహిరంగ సభను ఈ నెల 29వ తేదీనే నిర్వహించాలని తొలుత భావించారు. కానీ అక్కడ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఫిబ్రవరి 5వ తేదీని ముహూర్తంగా ఎంచుకున్నారు. రాష్ట్రంలో ఫిబ్రవరి 3న బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయి. అయితే సమావేశాలకు 4, 5 తేదీల్లో విరామం ఇవ్వనుండటంతో 5వ తేదీ నాందేడ్ సభకు అనుకూలంగా ఉంటుందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. నాందేడ్ సభ వేదికగా మహారాష్ట్రకు చెందిన ముఖ్యనేతలు బీఆర్ఎస్‌లో చేరనున్నారని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఖమ్మం సభకు సీఎం కేసీఆర్‌తో పాటు ముగ్గురు సీఎంలు, ఓ మాజీ సీఎం హాజరైన తరహాలోనే నాందేడ్ సభకు కూడా వివిధ పార్టీల ముఖ్య నేతలు హాజరయ్యే అవకాశం ఉందని అంటున్నాయి.

కామినేని పుష్ప మృతి

దోమకొండ: కామారెడ్డి జిల్లాలోని దోమకొండ గడికోట వారసులైన దివంగత రిటైర్డు ఐఏఎస్ అధికారి కామినేని ఉమాపతిరావ్ సతీమణి పుష్ప (71) సోమవారం హైదరాబాద్‌లోని స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందారు. మాసబ్‌ట్యాంకులోని ఇంట్లో ఆమె మృతిచెందినట్లు కుటుంబసభ్యుల ద్వారా తెలిసింది. ఆమె మృతదేహానికి జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలను నిర్వహించినట్లు వారు తెలిపారు.

క్లుప్తంగా

దక్షిణాదికి మరో మూడు వందే భారత్ రైళ్లు

న్యూఢిల్లీ: దక్షిణాది రాష్ట్రాల్లో త్వరలోనే మరో మూడు వందే భారత్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయని రైల్వే శాఖ సోమవారం తెలిపింది. ప్రస్తుతానికై తే, కాచిగూడ- బెంగళూరు, సికింద్రాబాద్- తిరుపతి, సికింద్రాబాద్-పుణె మార్గాల్లో సర్వీసులు నడిపేందుకు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. చెన్నై-బెంగళూరు, సికింద్రాబాద్-విశాఖ మార్గాల్లో వందే భారత్ రైళ్లు మొదలవడం తెలిసిందే.

కొత్త బెంచ్‌కు హిజాబ్ కేసు

న్యూఢిల్లీ: కర్నాటకలో పాఠశాలు, కళాశాలల్లో హిజాబ్ ధారణపై గత అక్టోబర్‌లో సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ఇద్దరు జడ్జీలు భిన్న తీర్పులిచ్చిన నేపథ్యంలో స్పష్టత కోసం కర్నాటక ముస్లిం విద్యార్థినులు మళ్లీ కోర్టును ఆశ్రయించారు. విచారణ కోసం త్వరలో మరో బెంచి ఏర్పాటుచేస్తామని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం సోమవారం తెలిపింది.

ఢిల్లీలో ఆయుధ రాకెట్ భగ్నం

న్యూఢిల్లీ: గణతంత్ర వేడుకల నేపథ్యంలో ఢిల్లీలో కలకలం రేగింది. ఆయుధ సిండికేట్‌కు చెందిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి 34 పిస్టళ్లు స్వాధీనం చేసుకున్నారు. గోగీ గ్యాంగ్‌కు ఇచ్చేందుకు యూపీ నుంచి ఆయుధాలు తెస్తున్నారనే సమాచారంతో పోలీసులు సోదాలుచేసి వీరిని అరెస్ట్‌చేశారు. వీరి సమాచారం మేరకు యూపీలోని షామలీ జిల్లా కంధ్లా గ్రామంలో చెరకుతోటలో నిర్వహిస్తున్న ఆయుధ తయారీ కేంద్రాన్ని గుర్తించారు.

రాజ్యాంగమే సర్వోన్నతం

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లోకూర్

సాక్షి, న్యూఢిల్లీ: న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు, పార్లమెంట్ కంటే రాజ్యాంగమే సర్వోన్నతమైనదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకూర్ అన్నారు. ఓ లీగల్ వెబ్‌సైట్ ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. ''పార్లమెంటు చట్టాలు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నాయా, ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నాయా అనే తనిఖీ బాధ్యతను రాజ్యాంగం న్యాయ వ్యవస్థకు అప్పగించింది. జాతీయ న్యాయ నియామకాల కమిషన్ వల్ల న్యాయవ్యవస్థకు స్వతంత్రత పోతుందనే భావనతో దాన్ని రాజ్యాంగ విరుద్ధంగా సుప్రీంకోర్టు ప్రకటించారని భావించరాదు'' అని చెప్పారు. నిర్దిష్ట చట్టం, లేదా రాజ్యాంగ సవరణ రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘిస్తున్నాయా, లేదా అనేది న్యాయ వ్యవస్థ నిర్ణయించాలని జస్టిస్ లోకూర్ అభిప్రాయపడ్డారు. వ్యవస్థలన్నింటిలోనూ పార్లమెంటే అత్యున్నతమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఇటీవల పేర్కొన్న నేపథ్యంలో జస్టిస్ లోకూర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఆ లాటిన్ అమెరికా దేశాల్లో... లావొక్కింతయు లేదు!

ఆందోళనలతో అట్టుడుకుతున్న బ్రెజిల్, పెరు



ఇది పెరు రాజధాని లిమాలో ఓ నిరసనకారుడి శవయాత్ర. '(అధ్యక్షురాలు) దినా నన్ను తూటాలతో బలి తీసుకుంది' అని మృతుడు చెబుతున్నట్టుగా శవపేటికపై రాసి ఆందోళనకారులు నగరమంతా ప్రదర్శనగా తీసుకెళ్లారు

దక్షిణ అమెరికాలో ముఖ్య దేశాలైన బ్రెజిల్, పెరు ఆందోళనలతో అట్టుడుకుతున్నాయి. బ్రెజిల్లో మాజీ అధ్యక్షుడే తన మద్దతుదారులను రెచ్చగొడుతూ దేశాన్ని రావణకాష్టం చేస్తుండగా, పెరులో పదవీచ్యుతుడైన అధ్యక్షునికి మద్దతుగా ప్రజలే దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో రోడ్లెక్కుతున్నారు! బ్రెజిల్లో నిరసనకారులు అధ్యక్ష భవనంతో పాటు ఏకంగా పార్లమెంటు, సుప్రీంకోర్టు వంటి రాజ్యాంగ సంస్థల భవనాలపైనే దాడికి దిగి విధ్వంసం సృష్టించారు. పెరులోనూ జనం రాజధానితో పాటు దేశమంతటా భారీగా ఆందోళనలకు దిగుతూ అట్టుడికిస్తున్నారు. వీటికి సమీప భవిష్యత్తులో కూడా తెర పడే సూచనలు కన్పించడం లేదు! - సాక్షి, నేషనల్ డెస్క్

బ్రెజిల్ బేజారు

బోల్సొనారో అనుయాయుల అరాచకం
కొత్త అధ్యక్షుడు డ సిల్వా ఆపసోపాలు

దక్షిణ అమెరికాలో కొంతకాలంగా 'గులాబి గాలి' వీస్తోంది. చాలా దేశాల్లో ప్రధానంగా వామపక్ష భావజాలమున్న పార్టీలే అధికారంలోకి వస్తున్నాయి. ఈ ఖండంలోని అతి పెద్ద దేశమైన బ్రెజిల్లోనూ అదే జరిగింది. గత అక్టోబర్లో జరిగిన ఎన్నికల్లో రైట్ వింగ్ నాయకుడైన జెయిర్ బోల్సొనారో వెంట్రుకవాసి తేడాలో ఓటమి చవిచూశారు. 51 శాతం ఓట్లతో వామపక్ష నేత లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా నెగ్గారు. కానీ ఈ ఫలితాలను ఒప్పుకుని గద్దె దిగేందుకు బోల్సొనారో ససేమిరా అన్నారు. తనకు వ్యతిరేకంగా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, వాటికి సుప్రీంకోర్టు మద్దతూ ఉందని ఆరోపణలు గుప్పించారు. ఈవీఎంలపైనా అనుమానాలు వ్యక్తం చేశారు. తర్వాతి పరిణామాల్లో అజ్ఞాతంలోకి వెళ్లిన ఆయన, అవినీతి ఆరోపణలపై విచారణను తప్పించుకునేందుకు అంతిమంగా అమెరికాలో తేలారు! కానీ, ''అధికారం మీ చేతుల్లోనే ఉంది. సైన్యం ఇప్పటికీ నా మాటే వింటుంది. దొంగల పాలనను కూలదోయండి'' అంటూ అక్కడినుంచే తన మద్దతుదారులను రెచ్చగొడుతూ వస్తున్నారు. ఫలితంగా కొంతకాలంగా బ్రెజిల్ అల్లర్లు, ఆందోళనలు, గొడవలతో అట్టుడుకుతోంది.

పార్లమెంటుపై దాడులు

ముఖ్యంగా జనవరి 8న కరడుగట్టిన బోల్సొనారో మద్దతుదారులు ఉన్నట్టుండి వేల సంఖ్యలో అధ్యక్ష భవనం, పార్లమెంటు, సుప్రీంకోర్టు భవనాల్లోకి చొరబడి విధ్వంసం సృష్టించారు. సైన్యం తిరగబడి ఎన్నికల ఫలితాలను రద్దు చేసి బోల్సొనారోను తిరిగి అధ్యక్షున్ని చేయాలనే డిమాండ్‌తో అరాచకానికి దిగారు. ఆ సమయంలో భద్రతా దళాలు చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయాయి. పైగా ఆందోళనలు జరుగుతుండగానే పలువురు నేతలు, అధికారులు నవ్వుతూ ఫొటోలు తీసుకుంటూ కన్పించారు! నిజానికి అప్పటికి పది వారాలుగా నిరసనకారులు ఏకంగా ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ ముందే టెంట్లు వేసుకుని మరీ ఆందోళనలు చేస్తున్నా వాటిని ఆదిలోనే తుంచేసేందుకు డ సిల్వా పెద్దగా ప్రయత్నాలు చేయలేదు. తిరుగులేని ప్రజాదరణ లులా డ సిల్వా సొంతమైనా కీలక సైన్యం మద్దతు ఆయనకు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమన్న వ్యాఖ్యలు వినిపించాయి. దాంతో పరిస్థితిని ఏదోలా అదుపులోకి తెచ్చేందుకు డ సిల్వా కిందామీదా పడుతున్నారు.



అధ్యక్షుడు డ సిల్వా



బోల్సొనారో

- మాజీ న్యాయ మంత్రి ఆండెర్సన్ టోరెస్‌తో పాటు పలువురు బోల్సొనారో సన్నిహితులను అరెస్టు చేశారు.
- సైన్యం తిరుగుబాటుకు ప్రయత్నిస్తోందన్న వార్త నేపథ్యంలో జనవరి 8 ఆందోళనలకు బాధ్యున్ని చేస్తూ ఆర్మీ చీఫ్‌ను తాజాగా తొలగించారు.
- అల్లర్ల వెనక బోల్సొనారో హస్తంపై విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు ప్రకటించింది.

ఏం జరగనుంది...

పరిస్థితులను చూస్తుంటే దేశంలో అల్లర్లకు ఇప్పట్లో అడ్డుకట్ట పడే సూచనలు కన్పించడం లేదు. అవినీతి ఆరోపణలపై ఇటీవలే ఏడాదిన్నర పాటు ఊచలు లెక్కించిన డ సిల్వాకు దేశాన్ని పాలించే అర్హత లేదంటూ బోల్సొనారో మద్దతుదారులు ఇప్పటికీ దేశవ్యాప్తంగా చెలరేగిపోతూనే ఉన్నారు. సైన్యం పూర్తి మద్దతు లేకపోతే వాటికి డ సిల్వా ఏ మేరకు అడ్డుకట్ట వేయగలరన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే పలుమార్లు సైనిక కుట్రలను, నియంతల పాలనలను చవిచూసిన బ్రెజిల్లో మరోసారి అలాంటి పరిస్థితులు తలెత్తుతాయో, ప్రశాంత పరిస్థితులు నెలకొంటాయో వేచి చూడాల్సిందే.

పెరు.. పేదల తిరుగుబాటు

అధ్యక్షురాలు బొలార్టేపై వెల్లువెత్తిన వ్యతిరేకత
మాజీ అధ్యక్షుడు కాస్టిలోకు మద్దతుగా ఆందోళనలు

ఆమె పేరు మార్గరిటా కొండొరీ. పెరులో ఆండీస్ పర్వత శ్రేణుల్లోని అత్యంత వెనకబడ్డ పునో ప్రావిన్స్‌లో స్థానిక అయ్మారా తెగకు చెందిన వృద్ధురాలు. వయోభారాన్ని కూడా లెక్క చేయకుండా రెండు రోజుల పాటు అత్యంత కఠినమైన బస్సు ప్రయాణం చేసి మరీ రాజధాని లిమా చేరుకుంది. ''మేమంతా పేదరికంలో మగ్గుతున్నాం. మాపై ఉగ్రవాద ముద్ర వేసినా పర్లేదు. బొలార్టే రాజీనామా చేసేదాకా రాజధాని నుంచి కదిలే ప్రసక్తే లేదు'' అంటూ సహచర ఆందోళనకారులతో కలిసి పెద్దపెట్టున నినదిస్తోంది. పెరులో దాదాపు ఆరు వారాలుగా ఇదే పరిస్థితి! స్థానిక తెగలకు చెందిన వామపక్ష ఫైర్ బ్రాండ్ నాయకుడు కాస్టిలోను అధ్యక్ష పదవి నుంచి కూలదోసి జైలుపాలు చేసి ఉపాధ్యక్షురాలు దినా బొలార్టే గత డిసెంబర్ 7న అధికారాన్ని చేజిక్కించుకున్నారు. అప్పటినుంచీ ఆమెకు వ్యతిరేకంగా మొదలైన ప్రజాందోళనలు నానాటికీ తీవ్ర రూపు దాలుస్తున్నాయి. దేశమంతటికీ వ్యాపించడమే గాక హింసాత్మకంగా మారుతున్నాయి. మార్గరిటా మాదిరిగా అత్యంత మారుమూల ప్రాంతాల నుంచి కూడా జనం అత్యంత వ్యయ ప్రయాసలకోర్చి మరీ లిమాకు ప్రవాహంలా వచ్చి పడుతున్నారు. బొలార్టే తప్పుకుని ఎన్నికలు ప్రకటించే దాకా దాకా ఇంచు కూడా కదిలేది లేదని భీష్మిస్తున్నారు. భద్రతా దళాలపైకి రాళ్లు రువ్వుతూ ఢీ అంటే ఢీ అంటున్నారు.

ఏమిటి సమస్య?

ప్రపంచంలో రెండో అతి పెద్ద రాగి ఉత్పత్తిదారు అయిన పెరులో 1990 నుంచి దశాబ్దకాలపు నియంతృత్వ పాలన అనంతరం 2000లో ప్రజాస్వామ్య పవనాలు వీచాయి. 2001 నుంచి 2014 దాకా జోరుగా సాగిన ఖనిజ నిల్వల ఎగుమతితో జీడీపీ రెట్టింపు వృద్ధి రేటుతో దూసుకుపోయింది. కార్మికుల వేతనాలూ ఇతోధికంగా పెరిగాయి. కానీ గ్రామీణ ప్రాంతాలు మాత్రం బాగా నిర్లక్ష్యానికి గురవుతూ వచ్చాయి. సంపదంతా ప్రధానంగా నగర ప్రాంతాల్లో కేంద్రీకృతమైంది. మరోవైపు అవినీతి, అవ్యవస్థ నానాటికీ పెచ్చరిల్లాయి. స్థానిక ప్రభుత్వ పెద్దలు బడ్జెట్ కేటాయింపులను ఇష్టారాజ్యంగా భోంచేయడం ప్రారంభించారు. దాంతో కొన్నేళ్లుగా దేశంలో రాజకీయ అస్థిరత రాజ్యమేలుతోంది. గత రెండేళ్లలోనే ఏకంగా ఐదుగురు అధ్యక్షులు మారారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలో లెఫ్టిస్టు అయిన కాస్టిలోపైనా పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. విచారణల దాకా వెళ్లడమే గాక రెండుసార్లు అభిశంసన ప్రయయత్నాలూ జరిగాయి. గత డిసెంబర్లో మరోసారి అభిశంసనకు రంగం సిద్ధమవడంతో కాంగ్రెస్‌ను రద్దు చేసి డిక్రీ ద్వారా పాలించేందుకు కాస్టిలో విఫలయత్నం చేశారు. అదే అభియోగంపై చివరికి ఆయన్ను పదవి నుంచి దింపి ఖైదు చేసి బొలార్టే పదవిలోకి వచ్చారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో, ముఖ్యంగా పేదల్లో కాస్టిలోకు విపరీతమైన ఆదరణ ఉండటంతో ఈ పరిణామాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు మిన్నంటాయి. ఆందోళనలకు ఇప్పటిదాకా దేశవ్యాప్తంగా 50 మందికి పైగా బలయ్యారు.

అల్లకల్లోలం

- ఆందోళనల దెబ్బకు దేశంలో అవ్యవస్థ రాజ్యమేలుతోంది. ఇప్పటికే ఎమర్జెన్సీ విధించారు. రోడ్డు, రైలు, విమాన తదితర రవాణా సేవలన్నీ స్తంభించాయి.
- మైనింగ్ తదితర కార్యకలాపాలకూ తీవ్ర విఘాతం కలిగింది.
- అపారమైన ఖనిజ నిల్వలున్నా పేదరికంలో మగ్గుతున్న దక్షిణ ప్రాంతాల్లో నిరసనలు బాగా జరుగుతున్నాయి.
- వీటిపై బొలార్టే బలప్రయోగానికి దిగుతున్నారు. అవసరమైతే ఉక్కుపాదం మోపుతామని ప్రకటిస్తున్నారు. ఇది మరింత అస్థిరతకు, సామాజిక విభజనకు దారి తీస్తుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



అధ్యక్షురాలు దినా బొలార్టే

- చట్టసభ అయిన కాంగ్రెస్ సభ్యులపై జనంలో విపరీతమైన వ్యతిరేకత నెలకొని ఉంది. ఇది ఏకంగా 88 శాతాన్ని చేరినట్టు ఇటీవలి అభిప్రాయ సేకరణలో తేలింది!
- ఇక అధ్యక్షురాలు బొలార్టేను 71 శాతం మంది ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.
- అయితే అధ్యక్షునిగా ఉండగా కాస్టిలోపైనా ఇదే స్థాయిలో వ్యతిరేకత వ్యక్తం కావడం

ఇప్పుడేం జరగనుంది?

విశేషం!

- 2026లో జరగాల్సిన ఎన్నిలను 2024 ఏప్రిల్లోనే జరిపేందుకు కాస్టిలో ప్రయత్నించారు. ఈ ప్రతిపాదనపై త్వరలో మరోసారి ఓటింగ్ జరగనుంది.
- కానీ రెండేళ్ల ముందుగా పదవులు వదులుకునేందుకు కాంగ్రెస్ సభ్యుల్లో అత్యధికులు సిద్ధంగా లేరు.
- 1993లో నియంత అల్బెర్టో ఫుజిమోరీ హయాంలో రాసిన రాజ్యాంగం అధ్యక్షునికి అపరిమితమైన అధికారాలు కట్టబెట్టింది. అధ్యక్షునిపై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా కాంగ్రెస్‌లో మెజారిటీ సభ్యులు ఓటేసినా అధ్యక్షుడు దాన్ని తోసిపుచ్చవచ్చు!
- దాంతో బొలార్టే తప్పుకోవడంతో పాటు



మాజీ అధ్యక్షుడు కాస్టిలో

ఏకంగా రద్దు చేసి నూతన రాజ్యాంగాన్ని రచించుకోవాలంటూ డిమాండ్లు ఊపందుకున్నాయి!

- ఫిబ్రవరిలో మరోసారి దేశవ్యాప్త సమ్మెకు పలు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి.
- ఈ పరిస్థితుల్లో పెరులో సంక్షోభానికి, రాజకీయ అస్థిరతకు సమీప భవిష్యత్తులో తెర పడే సూచనలు కన్పించడం లేదు.



నేవీ అమ్ములపొదిలోకి వాగీర్

ముంబై: అత్యాధునిక ఆయుధ వ్యవస్థ, వేగంగా దూసుకెళ్లే సామర్థ్యం, గుట్టుగా మోహరించే దమ్ము ఉన్న నూతన జలాంతర్గామి ఐఎన్ఎస్ వాగీర్ లాంఛనంగా భారత నావికాదళంలో చేరింది. సోమవారం ముంబైలోని నావల్ డాక్‌యార్డ్ ఇందుకు వేదికై ంది. కల్వరీ శ్రేణి జలాంతర్గాముల్లో చివరిది, ఐదవది అయిన వాగీర్‌ను నావికా దళ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ లాంఛనంగా భారత నేవీలోకి ప్రవేశపెట్టారు. 'వాగీర్ రాకతో సముద్రజలాల్లో శత్రువుల బారి నుంచి దేశ ప్రయోజనాలను మరింతగా సంరక్షించవచ్చు. ఇంటెలిజెన్స్, నిఘా, మొహరింపు విభాగాల్లో నేవీ సామర్థ్యాన్ని వగర్ పరిపుష్టంచేస్తుంది' అని ఈ సందర్భంగా భారత నేవీ ప్రకటించింది. ఎలాంటి జంకు లేకుండా దాడి చేసే ఇసుక షార్క్ చేప(వాగీర్) పేరును దీనికి పెట్టారు. 24 నెలల వ్యవధిలో నేవీ చేరిన మూడో సబ్‌మరైన్ ఇది. మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ సంస్థ దీనిని తయారుచేసింది. ఫ్రాన్స్ నుంచి బదిలీచేసిన సాంకేతికతను ఇందులో వినియోగించారు. 11 నెలలపాటు సముద్రంలో పలు రకాల ప్రయోగ పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాక సోమవారం నేవీలోకి తీసుకున్నారు.

జలాంతర్గామి విశేషాలు

- ప్రపంచంలోనే అత్యుత్తమ సెన్సార్‌లను దీనిలో అమర్చారు.
- వైర్ ఆధారిత టోర్పెడోలున్నాయి.
- దీని ద్వారా సముద్ర అంతర్భాగం నుంచి క్షిపణులను సముద్రజలాల మీది లక్ష్యాలపైకి ప్రయోగించవచ్చు
- స్పెషల్ ఆపరేషన్స్‌లో మెరైన్ కమెండోలను శత్రు స్థావరాలలోకి చడీచప్పుడుకాకుండా తరలించగలదు.
- శక్తివంత డీజిల్ ఇంజిన్‌తో పనిచేస్తుంది.
- శత్రు టోర్పెడోలను ఏమార్చే నూతన స్వీయ రక్షణ వ్యవస్థతో దీనిని బలోపేతం చేశారు

మహా యోధుడు బోస్

126వ జయంతి సందర్భంగా ప్రధాని ఘన నివాళులు
- స్మారక నమూనా ఆవిష్కరణ
- అండమాన్‌లో 21 దీవులకు 'పరమ వీరచక్ర'ల పేర్లు

పోర్ట్‌బ్లెయిర్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ మహా యోధుడని, ఆయన స్మారకం ప్రజల్లో దేశభక్తిని పెంపొందిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నేతాజీ 126వ జయంతిని పురస్కరించుకొని సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ప్రతిపాదిత నేతాజీ స్మారకం నమూనాను వర్చువల్‌గా ఆవిష్కరించారు. ఈ స్మారకాన్ని కేంద్ర పాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ దీవుల్లోని రాస్ ఐలాండ్‌లో ఏర్పాటు చేయనున్నారు. నేతాజీ జయంతి సందర్భంగా అండమాన్‌లోని 21 దీవులకు పరమ వీరచక్ర పురస్కార గ్రహీతల పేర్లను పెట్టారు. సుభాష్‌చంద్రబోస్ 1943లో తొలిసారిగా అండమాన్ గడ్డపైనే జాతీయ జెండాను ఎగురవేశారని మోదీ గుర్తుచేశారు. అండమాన్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం రావడం గర్వకారణంగా భావిస్తున్నానని చెప్పారు. దీవులకు వీర సైనికుల పేర్లు పెట్టామని, ఈ దీవులు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినందిస్తాయని తెలిపారు. మేజర్ సోమనాథ్ శర్మ, లెఫ్టినెంట్ కల్నల్(అనంతరం మేజర్) ధన్‌సింగ్ థాపా, సుబేదార్ జోగీందర్ సింగ్, మేజర్ షైతాన్ సింగ్, కంపెనీ క్వార్టర్ మాస్టర్ హవల్దార్ అబ్దుల్ హమీద్, సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ క్షేత్రపాల్, ఫ్లైట్ ఆఫీసర్ నిర్మల్జిత్ సింగ్ షెకాన్ తదితర వీర జవాన్ల పేర్లను అండమాన్ దీవులకు పెట్టినట్లు వెల్లడించారు. ఈ దీవులు బానిసత్వానికి గుర్తులుగా ఉండేవని, దాన్ని మార్చేందుకే జవాన్ల పేరిట నామకరణం చేసినట్లు వివరించారు.



పార్లమెంట్‌లో నేతాజీకి నివాళులర్పించాక మోదీ, ఖర్గే సరదా సంభాషణ

నేతాజీ పత్రాలను బహిర్గతం చేశాం

స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ పాత్రను తగ్గించి చూపేందుకు ప్రయత్నాలు జరిగాయని మోదీ ఆరోపించారు. ''కానీ ఈ రోజు ఢిల్లీ నుంచి అండమాన్ దాకా ఈ రోజు దేశం మొత్తం ఆ మహావీరుడికి ఘనంగా నివాళులర్పిస్తోంది. పరాక్రమ్ దివస్ నిర్వహించుకుంటోంది. నేతాజీ చరిత్రను, వారసత్వాన్ని పరిరక్షించుకొంటున్నాం. ఆయనకు సంబంధించిన పత్రాలను మా ప్రభుత్వం బయట పెట్టింది'' అన్నారు. కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడారు. 21 దీవులకు పరమవీర చక్ర అవార్డు గ్రహీతల పేర్లు పెట్టడం హర్షణీయమన్నారు. అండమాన్‌లోని ప్రఖ్యాత సెల్యూలార్ జైల్ తీర్థయాత్ర క్షేత్రం కంటే ఎంతమాత్రం తక్కువ కాదని వ్యాఖ్యానించారు. రాస్ ఐలాండ్‌లో నేతాజీ స్మారకంలో మ్యూజియం, కేబుల్ కార్ రోప్‌వే, లేజర్-సౌండ్ షో, చిల్డ్రన్స్ అమ్యూజ్‌మెంట్ పార్కు, రెస్టో లాంజ్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. బ్రిటిష్ వలస పాలనపై వీరోచితంగా పోరాడిన గొప్ప నాయకుడిగా నేతాజీ ఎప్పటికీ గుర్తుండిపోతారంటూ మోదీ ట్వీట్ చేశారు.

మహనీయుల చరిత్రలు చదవండి

న్యూఢిల్లీ: చరిత్రకెక్కిన మహనీయుల జీవిత చరిత్రలను విస్తృతంగా చదవాలని యువతీ యువకులకు మోదీ సూచించారు. ''సవాళ్లను వారెలా ఎదుర్కొన్నారో తెలుసుకోవాలి. వారి జీవితాల నుంచి ఎంతో నేర్చుకోవాలి'' అన్నారు. నేతాజీ జయంతి సందర్భంగా 80 మంది యువతీ యువకులతో ఆయన తన నివాసంలో సంభాషించారు.

పవర్ గ్రిడ్ వైఫల్యంతో పాక్‌లో చీకట్లు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో సోమవారం చీకట్లు అలుముకున్నాయి. నేషనల్ పవర్ గ్రిడ్ వైఫల్యంతో రాజధాని ఇస్లామాబాద్, ఆర్థిక నాడి కరాచీ సహా దేశంలోని చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత అక్టోబర్‌లోనూ విద్యుత్ పంపిణీ వ్యవస్థలో లోపాలతో ఇలాగే 12 గంటలు కరెంటు బందైంది.

అమెరికా కాల్పుల అనుమానితుని ఆత్మహత్య

మాంటెరీ: లాస్‌ఏంజెలెస్‌లో చైనా న్యూ ఇయర్ వేడుకల కాల్పుల ఘటనలో అనుమానితుడు తుపాకీతో కాల్చుకుని చనిపోయాడు. అతన్ని ఆసియా సంతతికి చెందిన హు కాన్ ట్రాన్ (72)గా గుర్తించారు. కాల్పులకు ఇతడొక్కడే కారణమని భావిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

ఆర్ఎస్ఎస్, నేతాజీ లక్ష్యం ఒక్కటే: భగవత్

కోల్‌కతా: భారత్‌ను సమున్నత దేశంగా తీర్చిదిద్దడమే ఆర్ఎస్ఎస్, నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ల లక్ష్యమని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ చెప్పారు. పరిస్థితులు, దారులు వేరైనా ఇద్దరి లక్ష్యమూ ఒక్కటేనన్నారు. సోమవారం నేతాజీ 126వ జయంతి సందర్భంగా కోల్‌కతాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం కోసం నేతాజీ ఎన్నో త్యాగాలు చేశారన్నారు. ఆయన ఆశయాలను, బోధనలను ఆచరించి భారత్‌ను విశ్వగురువుగా మార్చాలని పిలుపునిచ్చారు.

సర్జికల్ స్ట్రయిక్స్‌కు ఆధారాలేవి: దిగ్విజయ్

జమ్మూ/న్యూఢిల్లీ: పాక్ భూభాగంలో సర్జికల్ స్ట్రయిక్స్‌కు మోదీ సర్కారు ఏ ఆధారమూ కూడా చూపలేకపోయిందని కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ అన్నారు. అబద్ధాల సాయంతో పాలన సాగిస్తోందని విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. రాహుల్ భారత్ జోడో అంటూ యాత్ర చేస్తుంటే కాంగ్రెస్ నేతలు 'భారత్ తోడో' అంటున్నారని పేర్కొంది.

కొలువుపోయి కొత్త కష్టాలు!

- అమెరికాలో వేలాది భారత టెకీల పరిస్థితి అగమ్యగోచరం
- 60 రోజుల్లోపు కొత్త కొలువు వెతుక్కోకుంటే స్వదేశానికే!

వాషింగ్టన్: అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి దెబ్బకు దిగ్గజ టెక్ సంస్థలు భారీగా తీసివేతలకు దిగడంతో భారత టెకీల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గత నవంబర్ నుంచి ఏకంగా 2 లక్షల మంది ఐటీ ఉద్యోగులను తొలగించినట్లు 'ది వాషింగ్టన్ పోస్ట్' పేర్కొంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, అమెజాన్ సహా ఐటీ, సోషల్ మీడియా, ఆర్థిక సేవల సంస్థలు ఉద్యోగులను భారీగా తీసేస్తున్నాయి. వీరిలో 30 నుంచి 40 శాతం భారత టెకీలేనని పరిశ్రమల వర్గాలు వెల్లడించాయి. వీరంతా హెచ్-1బీ, ఎల్1 వీసాల మీద అమెరికాలో పని చేస్తున్నావారే. 60 రోజుల్లోపు మరో ఉద్యోగం వెతుక్కోకుంటే వీరిని స్వదేశానికి పంపించేస్తారు. లేదంటే హెచ్-1బీ, ఎల్1 నుంచి వేరే కేటగిరీకి మార్చుకోక తప్పని పరిస్థితి! ''మూణ్నెల్ల కింద అమెరికా వచ్చా. మార్చి 20న తప్పుకోవాలని చెప్పేశారు. నేను సింగిల్ పేరెంట్‌ను. నా పరిస్థితేమిటి?'' అంటూ అమెజాన్ ఉద్యోగి ఒకామె వాపోయారు. వీరికి మరింత గడువివ్వాలని సిలికాన్ వ్యాలీ కమ్యూనిటీ లీడర్ భుతోరియా అన్నారు.

పరస్పర సాయం...

ఉన్నపళాన ఉద్యోగం కోల్పోయిన వారికి సాయపడేందుకు గ్లోబల్ ఇండియన్ టెక్నాలజీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అండ్ ఫౌండేషన్ ఫర్ ఇండియా, ఇండియన్ డయాస్పొరా స్టడీస్ (జీఐటీపీఆర్ఓ) ముందుకొచ్చింది. వారికి, సంస్థలకు అనుసంధానకర్తగా ఉంటోంది. ఉద్యోగ ఖాళీల ప్రకటనలను షేర్ చేసుకుంటున్న వాట్సాప్ గ్రూప్‌లో వందలాది భారత టెకీలు సభ్యులుగా ఉన్నారు. తొలి అమెరికాకు వచ్చిన వారి వీసా స్టేటస్ మార్చేందుకు సాయపడుతూ కొందరు వాట్సాప్ గ్రూప్‌లను నిర్వహిస్తున్నారు. మరోవైపు పులి మీద పుట్రలా తమ ఉద్యోగుల గ్రీన్‌కార్డు ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా నిలిపేస్తున్నట్లు గూగుల్ ప్రకటించింది. ఇతర కంపెనీలూ ఇదే బాట పట్టేలా కన్పిస్తున్నాయి. ఈ టెకీలను మోదీ సర్కార్ తక్షణం ఆదుకోవాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. దీనిపై సమీక్ష నిర్వహించాలంటూ సోమవారం హిందీలో ట్వీట్‌చేశారు.

సరైన అమ్మాయి దొరికితే పెళ్లి చేసుకుంటా

తెలంగాణ వంటలకు ఘాటెక్కువ • ప్రధానినైతే విద్యా సంస్కరణలు • యూట్యూబ్ ఇంటర్వ్యూలో రాహుల్

న్యూఢిల్లీ: పెళ్లికి తాను వ్యతిరేకం కాదని, సరైన అమ్మాయి దొరికితే కచ్చితంగా చేసుకుంటానని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా ఇటీవల రాజస్తాన్‌లో 'కర్లీ టేల్స్' యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తన వ్యక్తిగత విషయాలను పంచుకున్నారు. రాత్రిపూట తన కంటైనర్ బయట భోం చేస్తూ సరదాగా సంభాషించారు. తన తల్లిదండ్రులు సోనియా, రాజీవ్ గాంధీ పరస్పరం ప్రేమించుకొని చక్కగా పెళ్లి చేసుకున్నారని గుర్తుచేశారు. ''వారికి ఒకరిపై ఒకరికి అంతులేని ప్రేమ ఉండేది. నేనూ వారిలాగే పెళ్లి చేసుకోవాలని భావిస్తున్నా. సరైన అమ్మాయి ఎదురైతే సంతోషిస్తా. తెలివైన చక్కటి అమ్మాయిని కోరుకుంటున్నా. నేను భోజన ప్రియున్ని కాను. ఆకలైనప్పుడు అందుబాటులో ఉన్నది తినేస్తా. బఠాణీలు, పనసకాయ అస్సలు ఇష్టముండవు. తెలంగాణ వంటలు కాస్త ఘాటుగా ఉంటాయి. నాకు ఎక్కువ కారం ఇష్టముండదు. జోడో యాత్రలో ఎక్కువ సంఖ్యలో వంటకాలు దొరకడం లేదు. ఇంట్లో మధ్యాహ్నం పూట దేశీయ, రాత్రి విదేశీ వంటకాలు తింటా. మిఠాయిలకు దూరంగా ఉంటా. మాంసాహార వంటలిష్టం. చికెన్, మటన్, సీఫుడ్ తీసుకుంటా. చికెన్ టిక్కా, సీఖ్ కబాబ్‌లు, ఆమ్లెట్లు అభిమాన వంటకాలు. ఉదయం కప్పు కాఫీ తాగుతా. ఢిల్లీలో మోతీ మహల్, సాగర్, స్వాగత్, శరవణ భవన్‌కు ఎక్కువగా వెళ్తుంటా'' అని చెప్పారు.

తొలి జీతం 2,500–3,000 పౌండ్లు

తమది అలహాబాద్‌లో స్థిరపడ్డ కాశ్మీరీ పండిట్ కుటుంబమని రాహుల్ గుర్తు చేశారు. ''మా తాత ఫిరోజ్ గాంధీ పార్సీ మతస్థుడు. అందుకే నేను పూర్తిస్థాయిలో 'మిక్స్‌డ్'! నాన్నమ్మ ఇందిరా గాంధీ హత్య తర్వాత నేను ఇంట్లోనే చదువుకోవాల్సి వచ్చింది. తర్వాత హార్వర్డ్‌లో అంతర్జాతీయ సంబంధాలు, రాజకీయాలు చదివా. కేంబ్రిడ్జి నుంచి డెవలప్‌మెంట్ ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశా. పాతికేళ్ల వయసులో లండన్‌లో ఓ కార్పొరేట్ కంపెనీలో తొలి ఉద్యోగం చేశా. మొదటి జీతంగా 2,500-3,000 పౌండ్ల చెక్కు అందుకున్నా. నేను ప్రధాని అయితే విద్యా వ్యవస్థను మారుస్తా. మధ్య తరహా వ్యాపారాలకు సాయమందిస్తా. రైతులు, నిరుద్యోగ యువతను ఆదుకుంటా. విద్వేషం, హింసలపై పోరాడాలన్న ఆలోచనే జోడో యాత్రకు పురిగొల్పింది'' అన్నారు.

కశ్మీరీ పండిట్లకు ఎల్జీ సారీ చెప్పాలి

జమ్మూ: న్యాయ సాధనకు పోరాడుతున్న కశ్మీరీ పండిట్లనుద్దేశించి అనుచితంగా మాట్లాడిన జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) మనోజ్ సిన్హా వారికి క్షమాపణ చెప్పాలని జమ్మూలో జోడో యాత్ర సందర్భంగా రాహుల్ డిమాండ్ చేశారు. ''దానం కోసం ప్రాధేయపడాల్సిన అగత్యం లేదు. మీ కోసమే ప్రధాని ప్యాకేజీ ప్రకటించారు' అంటూ ఎల్జీ మాట్లాడటం దారుణం. పండిట్లు హక్కుల కోసం పోరాడుతున్నారు'' అంటూ మండిపడ్డారు. పండిట్ల ప్రతినిధుల బృందం ఆయన్ను కలిసి ఈ విషయమై వినతిపత్రం సమర్పించింది.



సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం, 24, జనవరి, 2023

తిమ్మక్క ఇంట పెళ్లిబాజా

బనశంకరి: ప్రభుత్వ పర్యావరణ రాయబారి, వృక్ష మాత పద్మశ్రీ సాలుమరద తిమ్మక్క పెంపుడు కుమారుడు ఉమేశ్ వివాహం సోమవారం బేలూరులో కళ్యాణ మంటపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మక్క కోడలు కీర్తి కి మొక్కలు అందించి మీరు కూడా మొక్కలు నాటి పెంచి పరిసరాలను సంరక్షించాలని తెలిపారు.



నవ దంపతులకు మొక్కలు అందిస్తున్న తిమ్మక్క

న్యూస్‌రీల్

భర్త ఆలస్యంగా వచ్చాడని.. భార్య ఆత్మహత్య!



దివ్య (ఫైల్)

యశవంతపుర: పక్కింట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లి ఆలస్యంగా వచ్చిన భర్తతో గొడవపడిన భార్య అలిగి ఆత్మహత్య చేసుకున్న ఘటన దక్షిణ కన్నడ జిల్లా సూరత్కల్‌లో జరిగింది. బాళ గ్రామం ఒట్టికాయారుకు చెందిన హరీశ్, దివ్య (24) ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆదివారం పక్కింట్లో శుభకార్యం జరిగితే హరీశ్ ఒక్కడే వెళ్లాడు. ఇంటికి ఆలస్యంగా రావడంతో ఆక్రోశం వ్యక్తం చేసిన దివ్య సాయంత్రం నాలుగు గంటల సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. దివ్య సూరత్కల్‌లోని ఒక మందుల షాపులో పని చేసేది. అన్యోన్యంగా కాపురం సాగుతుండగా, కూతురు ఇలా చేయడంపై అనుమానంతో ఆమె తల్లి గిరిజా పూజారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు భర్త హరీశ్‌ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రోడ్లపై డేంజరస్ వీలింగ్



వీలింగ్ చేస్తున్న యువకులు

యశవంతపుర: హైవేలపై యువకులు వీలింగ్ చేస్తూ వాహనదారులను భయాందోళనకు గురిచేస్తున్నారు. తాజాగా రేసింగ్ విన్యాసాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. బెంగళూరుకు సమీపంలోని నెలమంగళ తాలూకా బూదిహాళ్ నుంచి దాబస్‌పేట వరకు ఎన్‌హెచ్–48లో యువకులు బైకులపై రేసింగ్‌లు చేస్తుండటంతో రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. బైక్‌లు నడిపే వయసు కూడా లేని కుర్రవాళ్లు బైక్‌ల్లో వీలింగ్ చేస్తూ వణుకు పుట్టిస్తున్నారు. వీరి వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

డ్రగ్‌పెడ్లర్ల ఇళ్లపై దాడులు



మైసూరు: మైసూరు నగరంలో నివాసం ఉంటూ డ్రగ్స్ దందా చేస్తున్న వారి ఇళ్లపై సోమవారం తెల్లవారుజామున పోలీసులు దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. నగర సీపీ రమేశ్ నేతృత్వంలో డీసీపీ ముత్తురాజు ఆధ్వర్యంలో వంద మందికిపైగా పోలీసులు 40 బృందాలుగా విడిపోయి ఏకకాలంలో దాడులు చేశారు. దాడుల్లో అరకిలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులు వారిని తీవ్రంగా హెచ్చరించారు.

కాంగ్రెస్‌కు ఆ నైతికత లేదు

శివాజీనగర: అవినీతి గురించి మాట్లాడే నైతికత కాంగ్రెస్‌కు లేదని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి కే.సుధాకర్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం మంత్రి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అశ్వత్థ నారాయణ తన డైరీలో కాంగ్రెస్‌కు వెయికోట్లు కానుకగా ఇచ్చామని రాసుకున్నారని, ఇది అవినీతి కాదా? అని మంత్రి ధ్వజమెత్తారు.

మహోద్యమం అవయవదానం



అన్నదానం, విద్యాదానం చేస్తారు కొందరు. మరికొందరు డబ్బు, బంగారం దానం చేయవచ్చు. కానీ శరీరంలో భాగమైన అవయవాలను ఇచ్చి ప్రాణాలను దానం చేయడమనే మహోత్కృష్ట కార్యానికి పూనుకొనేవారు చాలా అరుదుగా ఉంటారు. ఆపద సమయంలో అంత విషాదంలో ఉన్నప్పటికీ బాధితుల తల్లిదండ్రులు అవయవదానానికి అంగీకరించి గొప్పతనం చాటుకుంటున్నారు. ఫలితంగా చీకట్లో మగ్గుతున్న రోగులకు కొత్త జీవితం లభిస్తోంది.



అవగాహన పెంచే జాగృతి ర్యాలీలు

- రాష్ట్రంలో విస్తృతంగా ప్రాణదాన యజ్ఞం
- బ్రెయిన్‌డెడ్ బాధితుల కుటుంబాల ఔదార్యం
- 2007 నుంచి 755 మంది అవయవదానం

బనశంకరి: రాష్ట్రంలో అవయవ దానం గణనీయంగా పెరిగింది. దేశంలోనే ద్వితీయ స్థానంలో ఉంది. రోడ్డు ప్రమాదాలతో పాటు వివిధ సందర్భాల్లో తీవ్రంగా గాయపడి బ్రెయిన్‌డెడ్ అయిన వారిలో గత ఏడాది 151 మంది నుంచి కుటుంబ సభ్యుల అనుమతితో అవయవాలను సేకరించారు. 769 అవయవాలను సేకరించి వాటి కోసం ఎదురుచూస్తున్న రోగులకు అమర్చడం ద్వారా దాతల జీవితాలకు సార్థకత ఏర్పడింది.

కరోనా ఆటంకం నుంచి విముక్తి

- ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న రాష్ట్ర అవయవాల సేకరణ సంస్థ సూటో.. అవయవాల వైఫల్యంతో బాధపడుతున్నవారికి ఈ విషయంలో అండగా ఉంటుంది.
- ఈ సంస్థ గణాంకాల ప్రకారం 2019లో 105 మంది నుంచి 296 అవయవాలతో పాటు 197 వివిధ శరీర భాగాలను సేకరించారు.
- ఇంతలో కోవిడ్ మహమ్మారి వల్ల అవయవ దానానికి ఆటంకం తలెత్తింది. 2020లో 35 మందికి తగ్గిపోయింది.
- 2022 మార్చి నుంచి కోవిడ్ బెడద తగ్గడంతో మళ్లీ ఈ మహా యజ్ఞం ఊపందుకుంది. ఆ ఏడాది జనవరి నెలలో 7 మంది దాతల నుంచి 21 అవయవాలు, 12 వివిధ శరీర భాగాలు, అక్టోబరు నెలలో 20 దాతల నుంచి 57 అవయవాలు, 53 శరీర భాగాలను సేకరణ జరిగింది.
- 2007 నుంచి 2022 సంవత్సరాల మధ్య మొత్తం 755 మంది అవయవ దానం చేశారు. 2,035 అవయవాలు, 1,552 శరీర భాగాలను సేకరించారు.

ఎవరు చేయవచ్చు?

బ్రెయిన్‌డెడ్ కాబడిన ఎలాంటి వ్యక్తి అయినా అవయవాలను దానం చేయవచ్చు. గుండె, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కళ్లు, శ్వాసనాళాలు, చర్మం, కళ్లతో పాటు కీళ్లు, ఎముకలు, పుర్రె భాగాలు అనేకం సేకరించవచ్చని నిపుణులు తెలిపారు. గత 16 ఏళ్లలో 1,129 మూత్రపిండాలు, 1,184 నేత్రాలను సేకరించి రోగగ్రస్తులకు అమర్చారు.

ఐదేళ్లలో జరిగిన అవయవ దానం

ఏడాది	దాతలు	అవయవాలు	శరీర భాగాలు
2018	89	257	183
2019	105	296	197
2020	35	95	68
2021	70	187	90
2022	151	403	348

పునీత్, సంచారి విజయ్ ఆదర్శం



తీవ్ర ప్రమాదాలకు గురికావడం, ఆకస్మాత్తుగా గుండెపోటుకు, పక్షవాతానికి గురై బ్రెయిన్‌డెడ్ అయినవారి నుంచి అవయవాలను సేకరించవచ్చు. మరణించినవారి నుంచి కళ్లను మాత్రమే సేకరిస్తారు. దివంగత కన్నడ నటులు పునీత్‌రాజ్ కుమార్, సంచారి విజయ్ అవయవదానం చేసి ఆదర్శప్రాయులుగా నిలిచారు. ప్రస్తుతం మరణానంతరం అవయవదానానికి నమోదుచేసుకున్న వారిసంఖ్య 34 వేలకు చేరింది. వీరిలో 90 శాతం మంది యువత ఉండడం విశేషం. అవయవ దానం పట్ల ప్రజల్లో అవగాహన వస్తోందని, దీంతో అవయవ దానం పెరుగుతోందని జయదేవ ఆస్పత్రి వైద్య నిపుణుడు డాక్టర్ సీఎన్. మంజునాథ్ తెలిపారు.

మెట్రో బారికేడ్ పడి కారు ధ్వంసం



యశవంతపుర: మెట్రో రైలు ప్రాజెక్టు పనుల్లో తరచూ ప్రమాదాలు బెంగళూరు ప్రజలను భయపెడుతున్నాయి. అమాయకులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత డిసెంబర్ మూడో వారం నుంచి ఆదివారం వరకు మూడు ప్రమాదాలు జరిగాయి. జనవరి 10న నాగవార వద్ద మెట్రో పిల్లర్ పడి తల్లీకొడుకు చనిపోయారు. 12న బ్రిగేడ్ రోడ్డులో మెట్రో సొరంగం పనులు జరుగుతుండగా పైన రోడ్డు కుంగిపోయి బైకుపై వెళ్లతున్న ఇద్దరు గాయపడ్డారు. మళ్లీ ఆదివారం సాయంత్రం వైట్‌ఫీల్డ్ వద్ద కారు మీద మెట్రో బారికేడ్ పడి ముందు భాగం నుజ్జయింది. దొడ్డనెక్కుంది జంక్షన్ వద్ద జరిగిన ఈ సంఘటనలో అదృష్టవశాత్తు ఎవరూ గాయపడలేదు. వాహన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేస్తాననడంతో మెట్రో అధికారులు అతనికి నష్ట పరిహారం చెల్లిస్తామని నచ్చజెప్పారు.

అధికారుల నిర్లిప్తతే అని విమర్శలు

ప్రమాదాలతో తనకు సంబంధం లేదని బీఎంఆర్‌సీఎల్ చేతులు దులుపుకొంటోందనే విమర్శలు గట్టిగా వినపడుతున్నాయి. కాంట్రాక్ట్ తీసుకున్నవారు, ఇంజనీర్లు నిర్లిప్తంగా ఉండడం వల్లే చిన్నా పెద్దా ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆరోపణలున్నాయి. నాగవార ప్రమాదం తరువాత సీఎం కూడా బీఎంఆర్‌సీఎల్ అధికారులతో చర్చించి మందలించినట్లు తెలిసింది.

నారీశక్తి శకటం



రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీలో జరిగే వేడుకల్లో రాష్ట్రం నుంచి నారీ శక్తి పేరుతో శకటం పాల్గొననుంది. సాధనలో భాగంగా సోమవారం శకటాన్ని ఢిల్లీలో రాజ్‌పథ్‌లో ప్రదర్శనలో పాల్గొంది. తమ సేవ ద్వారా ఆదర్శ మహిళలైన సూలగిత్తి నరసమ్మ, తుళసీగౌడ, సాలుమరద తిమ్మక్కల నిలువెత్తు రూపాలు, పచ్చని చెట్లతో కూడిన శకటం ఆకర్షణగా నిలిచింది.

బనశంకరి:

కాంగ్రెస్ ధర్నా హాస్యాస్పదం – సీఎం బొమ్మై

శివాజీనగర: అవినీతిలో గంగోత్రి అయిన కాంగ్రెస్ అవినీతి గురించి ధర్నా చేపట్టడం, మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై ఎద్దేవా చేశారు. సోమవారం నేతాజీ జయంతి సందర్భంగా విధానసౌధ ఆవరణంలో ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ... మెట్రో రైల్ పథకం వల్ల స్థలాంతరమైన స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్ర బోస్ విగ్రహాన్ని మళ్లీ విధానసౌధ ముందు భాగంలోకి పునఃస్థాపనకు ఆదేశాలిస్తానని తెలిపారు. అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఓ భాగమైందని, వారి ఆకులో రంధ్రం పడింది. దానిని చూసుకోవాలని ధ్వజమెత్తారు. వారి అవినీతి ఎక్కడ బయటపడుతుందనో లోకాయుక్త సంస్థనే మూసివేసిన పుణ్యాత్ములని దుయ్యబట్టారు. ప్రభుత్వ అవినీతిపై ఆధారాలుంటే లోకాయుక్తకు ఇవ్వాలన్నారు.

దళిత సంఘాల ఆందోళన



తుమకూరు: తుమకూరు నగరంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని, బాబు జగ్జీవన్‌రాం భవనాన్ని నిర్మించాలని, దళితుల పైన, మైనారిటీలపైన జరుగుతున్న దాడులకు అడ్డుకట్ట వేయాలని పలు దళిత సంఘాల కార్యకర్తలు ధర్నా చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్దకు భారీ ర్యాలీగా వచ్చిన కార్యకర్తలు బైఠాయించి నినాదాలు చేశారు. తమ డిమాండ్లపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

సమ్మెకు సిద్ధమైన ఆర్టీసీ ఉద్యోగులు

- స్తంభించనున్న రవాణా వ్యవస్థ ?

శివాజీనగర: రవాణా ఉద్యోగులు మంగళవారం నుంచి సమ్మెకు సిద్ధమయ్యారు. డిమాండ్లకు కనుచూపు మేరలో పరిష్కారం లభించకపోవడంతో ఆందోళన బాట పట్టనున్నారు. బెంగళూరు మహానగర రవాణా సంస్థ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, వాయువ్య బెంగళూరు రవాణా కార్పొరేషన్ సిబ్బంది స్వాతంత్ర ఉద్యానవనంలో ధర్నా చేపట్టనున్నారు. ప్రతి నాలుగేళ్లకొకసారి వేతనాలు పెంచాలని, అయితే ఆరేళ్లు గడచినా వేతనాలు పెంపు ప్రస్తావనే లేదు. నిబంధనల మేరకు 2020 మార్చిలోనే వేతన పరిష్కారం కావాల్సింది. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించలేదు. దీంతో ఆందోళనకు సిద్ధమయ్యాయని రాష్ట్ర రవాణా ఉద్యోగుల నాయకుడు అనంత సుబ్బారావు తెలిపారు. జీతం పెంపు, సస్పెండైన ఉద్యోగులను పునర్నియామకం తదితర డిమాండ్లపై ధర్నా చేయనున్నారు. ధర్నాకు అఖిల కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగుల మండళి, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగుల సంఘం, ఇతర సంఘాలు మద్దతు పలికాయి. బస్సుల సంచారానికి మాత్రం ఇబ్బంది కలగదని సమాఖ్యలు స్పష్టం చేశాయి. హామీ తప్ప పరిష్కారం లభించలేదని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

విధులకు రాకుంటే చర్యలు

శివాజీనగర: వేతన సమస్యతో పాటు వివిధ డిమాండ్ల పరిష్కారం కోరుతూ ధర్నాకు సిద్ధమైన రవాణా ఉద్యోగులకు కార్పొరేషన్ ఉన్నతాధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. ధర్నాలో పాల్గొన కూడదని బీఎంటీసీ, కేఎస్ఆర్టీసీ వాయువ్య, ఈశాన్య కార్పొరేషన్‌ల సిబ్బందికి హెచ్చరించినట్లు తెలిసింది. మంగళవారం వారపు సెలవు మినహాయించి అనవసరంగా సెలవు పెట్టడానికి వీలు లేదు. విధులకు గైర్హాజరైతే జీతం కట్ చేయడంతో పాటు చర్యలు తీసుకుంటారు. అందరూ ఉద్యోగులు విధులు తప్పకుండా హాజరు కావాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. రవాణా స్తంభిస్తే వేల మంది ప్రయాణికులు ఇబ్బందులు పడతారని, ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ప్రతి ఒక్కరూ విధులకు హాజరు కావాలని ఆదేశించారు.

హత్య కేసులో ఇద్దరు అరెస్టు

విజయపుర(బెంగళూరు): జనవరి 2వ తేదీన గుర్తు తెలియని వ్యక్తిని హత్య చేసిన కేసులో విజయపుర పట్టణ పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. ఏపీలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం తాలూకాలోని కంబదూరు మండలం రాళ్ళపల్లి గ్రామానికి చెందిన కూలి కార్మికుడు ఎరుకల వెంకటప్ప (37) ఇక్కడ కూలిపనులు చేసుకునేవాడు. పాతకక్షలతో నాగేష్, సోమశేఖర్ అనే ఇద్దరు అతన్ని హత్య చేసి గుర్తుపట్టరాదని తలపై రాళ్లతో కొట్టి ఛిద్రం చేశారు. చేతి వేళ్లను కత్తిరించి దూరంగా పడేశారు. పోలీసులు దర్యాప్తుచేసి నిందితులను అరెస్టు చేశారు.

బీజేపీది అవినీతి సర్కారు

యశవంతపుర: రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలుతోందని మాజీ సీఎం, ప్రతిపక్ష నాయకుడు సిద్దరామయ్య ధ్వజమెత్తారు. సోమవారం మంగళూరు మంగళా క్రీడామైదానంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ప్రజాధ్వని కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత కాంట్రాక్టర్ల నుంచి 40 శాతం కమీషన్ తీసుకుంటోందని, ఈ నేపథ్యంలో ఓ కాంట్రాక్టర్ ఆత్మహత్య కూడా చేసుకున్నాడని సిద్దరామయ్య దుయ్యబట్టారు.



టీచర్ హోదా కల్పించాలని పలు డిమాండ్లతో బెంగళూరులో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన

విద్యాసంస్థలకు ఆ పన్ను రాయితీలు ఉన్నాయి: హైకోర్టు

యశవంతపుర: విద్యాసంస్థల ఆవరణలో ఉన్న హోటళ్లు, వసతి గృహాలు, బ్యాంకులకు పన్నులు విధించడం సరికాదని రాష్ట్ర హైకోర్టు అభిప్రాయపడింది. రాయచూరుకు చెందిన ఒక ప్రముఖ విద్యాసంస్థ నడుపుతున్న కాలేజీ ప్రాంగణంలోని హోటల్, హాస్టల్, పెట్రోల్ బంక్ కట్టడాలకు నగరసభ అధికారులు పన్నులు చెల్లించాలంటూ డిమాండ్ నోటీసులు పంపారు. దీనిపై విద్యాసంస్థ హైకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ నెల 15న పిటిషన్‌ను విచారించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరజ్ గోవిందరాజ్ ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. విద్యాసంస్థ నిర్వహిస్తున్న స్థలంలో ఆస్తి పన్ను విధించే అధికారం నగరసభకు లేదని తీర్పులో పేర్కొన్నారు. విద్యాసంస్థలకు ఆస్తి పన్నులో మినహాయింపు ఉన్నందున ఆవరణలో ఇలాంటి సౌకర్యాలు కల్పించడం సంస్థ హక్కుగా పేర్కొన్నారు. మున్సిపల్ చట్టాల ప్రకారం విద్యాసంస్థలు రాయితీలు పొందవచ్చని తెలిపారు.

పర్సెంటేజీల ప్రభుత్వమిది

- కాంగ్రెస్ నిరసనలు

శివాజీనగర: రాష్ట్ర బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ సోమవారం బెంగళూరులో నిరసన ప్రదర్శనలను నిర్వహించింది. అవినీతి బీజేపీని తొలగించి బెంగళూరును కాపాడాలని నినాదాలు చేస్తూ నగరంలో 300కు పైగా చోట్లకు పైగా ధర్నాలు నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వ 40 శాతం కమీషన్లు వసూలు చేస్తోంది. అవినీతి ఆరోపణలకు జవాబివ్వడం లేదు అని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ అన్నారు. ఇన్‌చార్జి రణదీప్ సింగ్ సుర్జేవాలా, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఎంజీ రోడ్డు ట్రినిటీ సర్కిల్‌లో ధర్నాలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇళ్లకు ఉచితంగా 200 యూనిట్‌ల విద్యుత్, ఇంటి యజమానికి రూ.2 వేలు అందిస్తామని గృహలక్ష్మీ పథకం ప్లకార్డులను ప్రదర్శించారు.





గాలిపటమా పద పద

బెళగావిలో అంతర్జాతీయ గాలిపటాల ఉత్సవం ఆబాలగోపాలాన్నీ అలరించింది. అనేక ఆకారాల్లోని గాలిపటాలు ఆకాశంలో రెపరెపలాడుతుంటే సందర్శకులు కేరింతలు కొట్టారు. దేశ విదేశాల నుంచి పోటీదారులు వచ్చి గాలిపటాలను ఎగురవేశారు



క్లుప్తంగా

26న అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

గంగావతి: నగరంలోని కోర్టు ఎదురుగా అంబేడ్కర్ విగ్రహాన్ని గణరాజ్యోత్సవం రోజున ప్రారంభించాలని మాదిగ దండోరా అధ్యక్షులు హుసేనప్ప స్వామి మాదిగ ఆధ్వర్యంలో ఐబీ ఎదురుగా ధర్నా చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి ప్లాస్టిక్ పరదా కప్పి ఉంచడం ఆయన్ను అవమానించినట్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నాస్థలి వద్దకు ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి విచ్చేసి ఈ నెల 26న అంబేడ్కర్ విగ్రహానికి పూజలు నెరవేర్చి ప్రారంభిస్తామని తెలిపారు. ఈసందర్భంగా మాదిగ దండోరా తాలూకా అధ్యక్షులు గుండప్ప నిలోగల్, గౌరవ అధ్యక్షులు విరుపణ్ణ, పదాధికారులు దుర్గప్ప, వసంతబావి, ముత్తణ్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాణికేశ్వరి పాదుకల ప్రతిష్ట


పాదుకలకు పూజ చేసిన దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో యానాగుంది మాతా మాణికేశ్వరి పాదుకల ప్రతిష్టాపనను ఘనంగా నిర్వహించారు. సోమవారం యానాగుంది మాతా మాణికేశ్వరి ఆశ్రమం నుంచి శివయ్య స్వామి ఆధ్వర్యంలో బయలుదేరిన పాదుకలకు చంద్రబండ రోడ్డులోని ఆశ్రమంలో ప్రత్యేక పూజలు జరిపి ప్రతిష్టాపించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యుడు జగదీష్, శివకుమార్, గౌరీష్, మారెప్పలున్నారు.

చివరి భూములకు నీరివ్వండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బసనగౌడ

రాయచూరు రూరల్: జిల్లాలో తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు నీటిని అందించాలని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ అధికారులకు సూచించారు. సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రైతులు రెండో పంటగా వేసుకున్న వరి, మిరప, పత్తి తదితరాలకు నీరందించేలా కాలువలో గేజ్ నిర్వహించాలన్నారు.

కాంగ్రెస్ నిరసనలు



బొమ్మనహళ్లి: బీజేపీ సర్కారుకు వ్యతిరేకంగా బొమ్మనహళ్లి, హెచ్ఎస్ఆర్ లేఔట్ ప్రాంతాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ నిరసనలు నిర్వహించింది. అవినీతి, పర్సంటేజీల సర్కారు అంటూ పలు కూడళ్లలో మౌన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు టి.వాసుదేవరెడ్డి, ఎస్.రవీంద్ర రెడ్డి, అశ్వథ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల్లో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. అగర, ఇబ్బలూరు, హెచ్ఎస్ఆర్‌లేఔట్, సెంట్రల్ సిల్క్ బోర్డు, బొమ్మనహళ్లి సర్కిల్ తదితర ప్రాంతాల్లో నిరసనలు జరిగాయి.

కారు బోల్తా: బాలుడు మృతి

- మరో ఐదుగురికి తీవ్రగాయాలు


బోల్తా పడి ధ్వంసమైన కారు ఇదే

హొసపేటె: అతి వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని బోల్తా కొట్టడంతో అందులో ఉన్న బాలుడు స్థలంలోనే మృతి చెందగా, మరో ఐదుగురికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం జరిగింది. దావణగెరెకు చెందిన వెంకటేష్ తన స్నేహితులు, ఇద్దరు కుమారులతో పాటు నలుగురు స్నేహితులతో కలిసి కారులో ముందరగి వెళుతున్నారు. మార్గమధ్యంలో హరపనహళ్లి- హరిహర రోడ్డులో కారు అదుపు తప్పి బోల్తా పడి ధ్వంసమైంది. ప్రమాదంలో వెంకటేష్ కుమారుడు జనిత్(5) తలకు తీవ్రగాయాలై స్థలంలోనే మృతి చెందాడు. మిగతా స్నేహితులతో కలిసి మరో కుమారుడికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. వారు హరపనహళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు వెడల్పు పనులు ముగిసేదెన్నడో?

- వాహనాల రద్దీతో తరచూ రోడ్డు ప్రమాదాలు
- గాల్లో కలిసిపోతున్న అమాయకుల ప్రాణాలు


అనంతపురం రోడ్డును వెడల్పు చేసే పనులు చేపట్టిన దృశ్యం

బళ్లారి అర్బన్: నగరంలోని ప్రధాన అనంతపురం రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టి మూడు నెలలు అయినా ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ రోడ్డులో రద్దీకి మోక్షం ఎప్పుడోనని నగర వాసులు ఎదురు చూస్తున్నారు. రాయల్ సర్కిల్ నుంచి ఇందిరా సర్కిల్ మీదుగా అనంతపురం రోడ్డు బైపాస్ వరకు రోడ్డుకు ఇరువైపులా తవ్వకాలు చేపట్టి మూడు నెలలు అయింది. ఓపెన్ డ్రైనేజీ కాలువల పనులు పూర్తి అయిన చోట కూడా రోడ్డు పనులు పూర్తి కాక, పనులను నిలిపివేయడంతో ప్రయాణికులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు దుమ్ము, ధూళితో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఈ రోడ్డులో ఇంకా ఎంత మంది ప్రాణాలను బలిగొనేందుకు పనులు నిర్లక్ష్యంగా సాగుతున్నాయని ఆరోపిస్తున్నారు.

పగటివేళలో యథేచ్ఛగా భారీ వాహనాల రాకపోకలు

ఈ రోడ్డు పనులు చేపట్టినా భారీ వాహనాలు, లారీలు పగటి వేళలో ఇష్టానుసారంగా తిరగడంతోనే ఇటీవల ఓ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. మరో వైపు గాంధీనగర్‌లో కూడా ప్రధాన రోడ్డును కూడా తవ్వేసి వదిలేయడంతో దుమ్ము, ధూళి వల్ల ఆ ప్రాంత వాసులు కూడా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అనంతపురం రోడ్డులో ఇరువైపులా తోపుడుబండ్లపై వ్యాపారం చేసుకుంటున్న ఫుట్‌పాత్ వ్యాపారులు కూడా దుమ్ము, ధూళితో వ్యాపారాలు సన్నగిల్లి ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయించకుండా వదిలి వేయడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. తక్షణమే ఈ రోడ్డు వెడల్పు పనులను త్వరగా పూర్తి చేయించాలని నగర వాసులు డిమాండ్ చేస్తున్నారు.

వేడుకగా అంబిగర చౌడయ్య జయంతి



చౌడయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే తదితరుల పుష్పాంజలి, ఊరేగింపులో కలశాలతో పాల్గొన్న మహిళలు

సాక్షి బళ్లారి: నగరంలో సోమవారం నిజశరణ అంబిగర చౌడయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. సిటీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి చౌడయ్య చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. ఊరేగింపులో నగరంలోని కనకదుర్గమ్మ ఆలయం నుంచి అంబిగర చౌడయ్య చిత్రపటాన్ని రాయల్ సర్కిల్, బీడీఏఏ ఫుట్‌బాల్ మైదానం, రాజ్‌కుమార్ రోడ్డు తదితర ప్రధాన వీధుల గుండా మహిళలు పూర్ణకుంభ కలశాలు, ప్రధానంగా డోలు, డప్పుల వాయిద్యాలతో చూపరులను ఆకట్టుకునేలా కళా బృందాలు, పాలికె కమిషనర్ రుద్రేష్, కార్పొరేటర్ మోత్కర్ శ్రీనివాస్, సమాజ ప్రముఖులు పాల్గొన్నారు.

ఆంగ్లేయులకు ఎదురొడ్డి పోరాడిన వీరుడు నేతాజీ


నేతాజీ చిత్రపటానికి పుష్పాంజలి దృశ్యం

బళ్లారిఅర్బన్: బ్రిటిష్ వారి దౌర్జన్యానికి ఎదురొడ్డి పోరాడిన వీరుడు సుభాష్ చంద్రబోస్ అని ఏఐడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షురాలు జి.సౌమ్య పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సిటీ కళాశాలలో ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో నిర్వహించిన నేతాజీ 126వ జయంతిలో ఆమె మాట్లాడారు. బ్రిటిష్ వారి పునాదులను పెకలించిన మహనీయుడికి భారతీయులు ఇచ్చిన బిరుదు నేతాజీ అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జబీనా, ఏఐడీఎస్ఓ పదాధికారులు శాంతి, సత్యవతి, మెర్సి, హులిగన్న పాల్గొన్నారు.

నేతాజీ జయంతి

రాయచూరు రూరల్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ 125వ జయంతిని ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని పరిశ్రమల కేంద్రం శిల్పా బయో సైన్స్ కంపెనీలో సోమవారం నేతాజీ చిత్ర పటానికి ఏఐడీఎస్ఓ సంచాలకులు వీరేష్ పూలమాల వేసి మాట్లాడుతూ నేతాజీ దేశానికి చేసిన సేవలు అనన్యమన్నారు. కార్యక్రమంలో సలీం, రాఘవేంద్ర, బసవరాజ్, గంగప్ప, మహేష్‌లున్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించండి

- సిద్ధరామయ్య


పాల్గొన్న సిద్ధరామయ్య, డీకేశి, సుర్జేవాలా

కోలారు : వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ని అధికారంలోకి తేవాలని మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ మైదానంలో ప్రజాధ్వని యాత్రలో భాగంగా నిర్వహించిన కాంగ్రెస్ ప్రచార యాత్రలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తోందన్నారు. దీంతో బీజేపీ భయపడి నరేంద్ర మోదిని వారానికోసారి రప్పిస్తోందన్నారు. మళ్లీ ఆయనే అధికారం ఇప్పిస్తారనే భ్రమలో ఉన్నారన్నారు. మోదీ, అమిత్‌షా వంద సార్లు వచ్చినా కాంగ్రెస్ గెలుపును అడ్డుకోలేరన్నారు. బీజేపీ కంటే అవినీతి సర్కారు గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ మాట్లాడుతూ తాము ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా నెరవేరుస్తాం, తమకు అధికారం ఇవ్వాలని కోరారు. పార్టీ నాయకుల్లో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు. అందరం కలిసికట్టుగా పని చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు సుర్జేవాలా, ఎమ్మెల్యేలు ఎస్ఎన్ నారాయణస్వామి, కె వై నంజేగౌడ, రమేష్‌కుమార్, శ్రీనివాసగౌడ, మాజీ ఎంపీ కెహెచ్ మునియప్ప తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ప్రతిమ ఆవిష్కరణకు తీర్మానం


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు

గంగావతి: జగ్జీవన్‌రామ్ సర్కిల్‌లో ఫిబ్రవరి 15న ఆయన విగ్రహాన్ని ప్రతిష్టింపజేయాలని టీపీ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్(బాబూజీ) దేశ ఉపప్రధాని పదవిని అలంకరించి దళిత, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆంగ్లేయులపై పోరాడిన దళిత నేత, మహనీయుడని కొనియాడారు. ఆయన జ్ఞాపకార్థం విగ్రహాన్ని ఆవిష్కరింపజేస్తామన్నారు. తహసీల్దార్ యూ.నాగరాజ్, టీపీ ఈఓ, దళిత సంఘాల నేతలు, నాయక్ సమాజ ప్రముఖులు పాల్గొన్నారు.

మార్కండేయ జయంతి

రాయచూరు రూరల్ : నగరంలోని మార్కండేయ ఆలయంలో సోమవారం మార్కండేయ జయంతిని నిర్వహించారు. కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్య జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడుతూ మార్కండేయ తత్వాలను వివరించారు. ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, రవి, వెంకటేష్, సభ్యులు శశిరాజ్, నరసింహులు, శాంతప్ప, గౌరీష్‌లున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వృత్తి విద్యపై అవగాహన అవసరం

రాయచూరు రూరల్ : విద్యార్థులు వృత్తి విద్యపై అవగాహన పెంచుకోవాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ అన్నారు. ఆదివారం వ్యవసాయ వర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి యుగంలో పోటీకి తగ్గట్లుగా విద్యార్థులు కష్టపడి చదివి వృత్తివిద్యతో పాటు స్వయం ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శశిధర్, ఎస్పీ నిఖిల్, అధికారులు రాజేంద్ర, అపర్ణ, ఏసీ రజనీకాంత్, శశికాంత్, రామిరెడ్డి, మెహబూబ్ జిలానీలున్నారు.

అవినీతిపై సీబీఐ విచారణకు డిమాండ్


మాట్లాడుతున్న కరియణ్ణ సంగటి

గంగావతి రూరల్: తాలూకాలోని ముక్కుంపితో పాటు అనేక గ్రామాల్లో చెరువులు నింపే ప్రాజెక్టులో అవినీతి తాండవిస్తోందని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నాయకుడు కరియణ్ణ సంగటి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం పాత్రికేయులతో మాట్లాడారు. ఈ ప్రాజెక్టులో రూ.117 కోట్లు మంజూరు కాగా ఇప్పటికే దాదాపు రూ.50 కోట్ల మేర బిల్లులు స్వాహా చేశారన్నారు. ప్రస్తుతం జరిగిన పనుల్లో ఎలాంటి నాణ్యత లేకుండా పనులు నిర్వహించడాన్ని తప్పుబట్టారు. దీనిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని ఒత్తిడి చేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీ సభ్యులు అమరేశ హొసమని ఇరకల్‌గడా పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక


ఎమ్మెల్యే తనయుడి సమక్షంలో బీజేపీలో చేరిన గుడదూరు గ్రామస్తులు

గంగావతి: కారటగిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం కనకగిరి తాలూకా గుడదూరు గ్రామస్తులు ఎమ్మెల్యే తనయుడు మౌనేష్ దఢేసూగూరు సమక్షంలో బీజేపీలో చేరారు. కాంగ్రెస్‌ని వీడి బీజేపీలోకి చేరిన వారికి కాషాయ కండువాలను కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బసవరాజ్ దఢేసూగూరు చేసిన అభివృద్ధి పనులను మెచ్చి బీజేపీలో చేరామన్నారు. ఈసందర్భంగా పార్టీ కార్యకర్తలు తిమ్మణ్ణ, లక్ష్మణ, రుద్రప్ప, దేవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సాధన అమోఘం

- 57 సెకన్లలో 999 మంది పిరామిక్స్ క్యూబ్ సెట్టింగ్
- వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో శ్రీవిద్యానికేతన్‌కు స్థానం


రికార్డ్ సర్టిఫికెట్లతో వ్యవస్థాపకులు సూరిబాబు, ఉపాధ్యాయులు తదితరులు

గంగావతి రూరల్: తాలూకాలోని శ్రీవిద్యానికేతన్ పబ్లిక్ పాఠశాలకు చెందిన 999 మంది విద్యార్థులు 57 సెకన్ల వ్యవధిలో పిరామిక్స్ క్యూబ్ సెట్టింగ్ చేసి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు సంపాదించారు. సాధించిన ఘనతకు కారకులైన చీఫ్ కో-ఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ పరిశీలనలో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని క్యూబ్ సెట్టింగ్ చేసి అంతర్జాతీయ రికార్డు సాధించారు. ప్రశంసా పతకంతో పాటు సర్టిఫికెట్‌ను స్వీకరించి సంస్థ వ్యవస్థాపకులు నెక్కంటి సూరిబాబు విద్యార్థుల ప్రతిభపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంస్థ పాలన డైరెక్టర్ హెచ్.కె.చంద్రమోహన్, విద్యా డైరెక్టర్ శ్రీనివాస్ చౌదరి, సంయోజకులు విజయభాస్కర్, పాఠశాల, కాలేజీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

నగరసభ ఎదుట ధర్నా


ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

హొసపేటె: స్థానిక 6వ వార్డు రాణిపేటలో ప్రజలు తాగే మంచినీటి కొళాయిలో నీరు కలుషితమై ఇటీవల ఓ మహిళ మృతి చెందగా, మరో 60 మంది వరకు ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. కొళాయిల్లో సరఫరా అవుతున్న మంచినీటి కలుషితానికి నగరసభ యంత్రాంగం నిర్లక్ష్యమే కారణమని, వెంటనే కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని డిమాండ్ చేస్తూ జిల్లా గ్రామీణ యువ కాంగ్రెస్ సమితి ఆధ్వర్యంలో సోమవారం నగరసభ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నేత హిట్నాల్ రాజశేఖర్ మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరు చోట్ల సీపీఎం పోటీ


మాట్లాడుతున్న సుందరేషన్

కేజీఎఫ్ : వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని ఆరు నియోజకవర్గాల్లో సీపీఎం అభ్యర్థులు పోటీ చేస్తారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాతీ సుందరేషన్ తెలిపారు. సోమవారం నగరంలోని రాబర్ట్‌సన్ పేటలో జిల్లా పదాధికారుల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేజీఎఫ్, మూడిగెరె, ఆళంద, జేవర్గి, కూడ్లిగి, శిరా నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపుతున్నట్లు తెలిపారు. కేజీఎఫ్ నుంచి పార్టీ జిల్లా కార్యదర్శి జ్యోతిబసు పోటీ చేస్తారన్నారు. రాష్ట్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే పార్టీ ప్రధాన ఉద్దేశమన్నారు. ఇందుకోసం మిగిలిన నియోజకవర్గాల్లో లౌకిక పార్టీలకు తమ పార్టీ మద్దతు తెలుపుతుందన్నారు. పదాధికారులు శివకుమార్, రంజిత్, మురళి, మణివణ్ణన్ పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

రేపే ఆధునిక ఆస్పత్రి ప్రారంభం


ఆధునీకరించిన ఆస్పత్రి (ఇన్‌సెట్‌లో) ఎమ్మెల్యే రూపా శశిధర్

కేజీఎఫ్ : నగరంలో రూ.8 కోట్ల వ్యయంతో ఆధునీకరించిన ప్రభుత్వ ఆస్పత్రి అత్యవసర విభాగం, ఇన్ పేషెంట్ విభాగాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సుధాకర్ ఈనెల 25న ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. సోమవారం నూతన ఆస్పత్రిని పరిశీలించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. గత సంకీర్ణ ప్రభుత్వ హయాంలో ఆరోగ్య శాఖా మంత్రి శివానంద పాటిల్ రూ.8 కోట్ల నిధులను ఆస్పత్రి ఆధునీకరణ కోసం కేటాయించారన్నారు. కేజీఎఫ్‌లో బంగారు గనులను మూసి వేసిన అనంతరం బీజీఎంఎల్ ఆస్పత్రిని కూడా మూసివేశారన్నారు. ఈ నేపథ్యంలో నగరంలో కార్మికులకు అత్యాధునిక ఆస్పత్రి అవసరం ఏర్పడడంతో ప్రభుత్వానికి ప్రతిపాదించామన్నారు. సకాలంలో ఆస్పత్రి ఆధునీకరణ పూర్తయిందన్నారు. ప్రారంభోత్సవం రోజున ఆస్పత్రిలో క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖా మంత్రికి విన్నవిస్తామని ఆమె అన్నారు.

ఓంకారాశ్రమంలో గురువందనం


గురువందనలో పాల్గొన్న మహాస్వాములు

కోలారు : కోలారు-బంగారుపేట రహదారిలోని ఓంకారాశ్రమంలో గురుపూజకు అనుకూలమయ్యేలా యాజ్ఞవల్క్య, మహా రుషి శంకర భగవత్పాదులు, శృంగేరి శారదా పీఠాధిపతి సురేశ్వరాచార్యుల భవ్య ఆలయాల నిర్మాణానికి హరిహరపుర ఆది శంకరాచార్య, శారదా లక్ష్మీ నరసింహ పీఠాధిపతి స్వయం ప్రకాష సచ్చిదానంద సరస్వతి మహా స్వాములు సోమవారం స్థలాన్ని పరిశీలించారు. రాష్ట్ర శుక్ల యజుర్వేద మహామండల అధ్యక్షుడు సుధాకర్‌బాబు నేతృత్వంలో ఓంకారాశ్రమంలోని నంజుండేశ్వర ఆలయం పక్కన వీటి నిర్మాణానికి అంగీకరించారు. ఈ సందర్భంగా గురువందనలో అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ ఉపాధ్యక్షుడు డి వి రాజేంద్ర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర భట్, అమరనాథ్, జిల్లా యాజ్ఞవల్క్య సేవా ట్రస్టు అధ్యక్షుడు అశ్వర్థ నారాయణ, 70 మందికి పైగా శుక్ల యజుర్వేద ప్రజలు పాల్గొన్నారు.

పౌర కార్మికులను గౌరవించాలి

కేజీఎఫ్ : నిత్యం నగరాన్ని స్వచ్ఛంగా ఉంచుతున్న పౌర కార్మికులను గౌరవించాలని నగరసభ అధ్యక్షుడు వళ్లల్ మునిస్వామి తెలిపారు. సోమవారం నగరసభ సభాంగణంలో నిర్వహించిన తాలూకా నూతన రాష్ట్ర పౌర సేవా కార్మికుల సంఘాన్ని ప్రారంభించి మాట్లాడారు. పౌర కార్మికులకు ఇప్పటికే రాజేష్ క్యాంప్ వద్ద 70 ఇళ్లను నిర్మించామన్నారు. ఇళ్లను లాటరీ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఈనెల 26న గణతంత్ర వేడుకలో పాల్గొనేందుకు నగరసభ పౌర కార్మికులు వెళుతున్నారని, ఇప్పటికే వారం రోజులుగా పరేడ్‌లో ప్రాక్టీస్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం న్యాయ సలహాదారు వెంకటేశప్ప, కమిషనర్ అంబికా, నారాయణస్వామి, వెంకటేష్, మునివెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్‌ని గెలిపిస్తే రుణమాఫీ

కేజీఎఫ్ : జేడీఎస్‌ని గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన 24 గంటల్లోగా స్త్రీశక్తి సంఘాల రుణాలను మాఫీ చేస్తామని, వీధి వ్యాపారులకు వడ్డీ లేని రుణాలు అందిస్తామని కేజీఎఫ్ జేడీఎస్ అభ్యర్థి రమేష్‌బాబు తెలిపారు. సోమవారం నగరంలోని గనుల ప్రాంతంలోని ఫ్రాంక్ అండ్ కో కాలనీలో మహిళలతో సంవాద కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుమారస్వామి సీఎం అయితే స్త్రీ శక్తి సంఘాల రుణాలు పూర్తిగా మాఫీ చేస్తారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రతి గ్రామానికి, ప్రతి వార్డుకు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. గతంలో కుమారస్వామి సీఎంగా ఉన్నప్పుడు రైతుల రూ.25 కోట్ల రుణాలను మాఫీ చేశారు. ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా జేడీఎస్‌కు అనుకూల పవనాలు వీస్తున్నందున సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వస్తుందన్నారు. తాలూకా అధ్యక్షుడు పి దయానంద్, దావిద్, డేవిడ్, అమూల్‌దాస్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


ట్రోఫీని అందిస్తున్న స్వామీజీ తదితరులు

రాయచూరు రూరల్ : క్రీడాకారులు క్రీడల్లో గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించాలని కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు అభిప్రాయపడ్డారు. ఆదివారం రాత్రి మహాత్మగాంధీ క్రీడా మైదానంలో జిల్లా వాలీబాల్ ముగింపు క్రీడల్లో ఆయన మాట్లాడారు. మానసికంగా, శారీరకంగా ఎదుగుదలకు క్రీడలు దోహదపడతాయన్నారు. విజేతలకు స్వామీజీ ట్రోఫీని అందించారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబూరావు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.శంకరప్ప, సతీష్, మలేశప్పలున్నారు.

ఏపీఎంసీలో వ్యాపారుల ఘర్షణ

హుబ్లీ: హుబ్లీలోని ఏపీఎంసీ మార్కెట్‌లో స్వల్ప కారణానికి పలువురు వ్యాపారులు ఘర్షణకు దిగి పరస్పరం మారణాయుధాలతో దాడులకు పాల్పడ్డారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. ఇక్కడి స్థానికులు ఇరువర్గాల మధ్య ఘర్షణను శాంతింపజేశారు. సమాచారం అందుకున్న నవనగర్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. దాడికి గురైన వారిని కిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. ఘటనపై నవనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

'గాలి' అజ్మీర్ దర్గా సందర్శన


చాదర్‌తో అజ్మీర్ దర్గా సందర్శనకు వెళుతున్న గాలి జనార్దనరెడ్డి దంపతులు తదితరులు

సాక్షి,బళ్లారి: మాజీ మంత్రి, కేఆర్‌పీపీ సంస్థాపకులు గాలి జనార్దనరెడ్డి రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాను సందర్శించారు. ఆయన ఆదివారం బెంగళూరు నుంచి జైపూర్‌కు విమానంలో వెళ్లి అక్కడ నుంచి సోమవారం అజ్మీర్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట సతీమణి లక్ష్మీ అరుణ, గంగావతి, బళ్లారి జిల్లాకు చెందిన ముస్లిం ప్రముఖులు కూడా అజ్మీర్ దర్గాను సందర్శించారు. దర్గాలో గాలి జనార్దనరెడ్డి కుటుంబ సభ్యులకు ముస్లిం మత పెద్దలు ఘన స్వాగతం పలికి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు అవకాశం కల్పించారు. ఈసందర్భంగా మెహఫూజ్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రత పాటించాలని సూచన

కంప్లి: వీధి వ్యాపారులు శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ ముఖ్యాధికారి డాక్టర్ శివలింగప్ప తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ సభాంగణంలో ఏర్పాటు చేసిన టౌన్ టెండర్ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని 470 మంది రిజిస్టర్డ్ వీధి వ్యాపారులకు వివిధ శాఖల సమన్వయంతో అనేక పథకాలు అందిస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని అవసరమైన సౌకర్యాలు పొందాలన్నారు. తగిన సమయంలో రుణాలు తిరిగి చెల్లించాలన్నారు. టెండర్ కమిటీ సభ్యులు రుణాలు పొందిన వీధి వ్యాపారులకు జాగృతి కల్పించాలన్నారు. సమావేశంలో సభ్యులు వనిత, సాకమ్మ, భవాని, ఖాశింవలీ, సిద్ధయ్య, కనక, డీ.నాగరాజ్, అక్తర్ అలీ, సంయోజకురాలు ఏ.వసంతమ్మ, సంపన్మూల ప్రముఖులు రేణుక, రోజమ్మ పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ



కోలారు : జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా మాలూరుకు చెందిన లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు. గత జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరడంతో ఖాళీగా ఉన్న అధ్యక్షస్థానానికి తాత్కాలికంగా వీఆర్ సుదర్శన్‌ను అధ్యక్షుడిగా నియమించారు. అయితే జిల్లా పార్టీలో గ్రూపు రాజకీయాలతో విసిగిన సుదర్శన్ అధ్యక్ష స్థానానికి రాజీనామా చేశారు. గత కొంత కాలంగా ఖాళీగా ఉన్న అధ్యక్ష స్థానానికి ఎన్నికలు దగ్గర పడుతుండడంతో లక్ష్మీనారాయణను నియమిస్తూ కేపీసీసీ ఆదేశాలు జారీ చేసింది. పార్టీలో అందరిని కలుపుకుపోయి సంఘటితం చేస్తానని, అందరి సహకారం అవసరమని అన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు


హతుడు సందీశ్(ఫైల్)

మాలూరు : చిన్న కారణానికి ఓ వ్యక్తిని హత్య చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు... హొసకోటె తాలూకా దొడ్డనల్లూరహళ్లికి చెందిన వి.సందీశ్(53) అనే కాంట్రాక్టర్ తన వద్ద పని చేస్తున్న వారికి జీతాలు ఇచ్చి వస్తానని ఈనెల 20వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ నేపథ్యంలో తన తండ్రి కనిపించడం లేదని ఆయన కుమారుడు నందగుడి పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 21న ఫిర్యాదు చేశాడు. సందీశ్ ఆచూకీ కోసం గాలించిన పోలీసులు అతని మొబైల్ నెట్‌వర్క్ ఆధారంగా సమాచారం సేకరించారు. తాలూకాలోని భైరనహళ్లికి చెందిన ప్రకాష్ అనే వ్యక్తిపై అనుమానంతో అతనిని అదుపులోకి తీసుకుని లోతుగా విచారించగా హత్య విషయం వెలుగు చూసింది. సందీశ్‌ను హత్య చేసి భూరనహళ్లి వద్ద పూడ్చి పెట్టినట్లు ప్రకాష్ తెలిపాడు. పోలీసులు, తహసీల్దార్‌తో కలిసి వెళ్లి పూడ్చిపెట్టిన చోట నుంచి మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితుడు ప్రకాష్‌ను జుడిషియల్ కస్టడీకి పంపారు. కాగా హత్యకు కారణాలు తెలియరాలేదు. మాలూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

నేతాజీ ఆదర్శాలను పాటించాలి



నేతాజీ చిత్రపటానికి నివాళి

మైసూరు: స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాశ్ చంద్రబోస్ ఆదర్శాలను ప్రతి ఒక్కరు పాటించాలని నగర మేయర్ శివకుమార్ అన్నారు. సోమవారం మైసూరు నగరంలోని ఫీల్డ్ మార్షల్ కారియప్ప సర్కిల్ వద్ద నేతాజీ జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.

అలరించిన కోలాటం



బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి హెచ్ఎస్ఆర్ లేఔట్ శ్రీ శిరిడి సాయిబాబా దేవాలయం ఆవరణంలో ఉన్న అటల్ బిహారి వాజ్‌పేయి క్రీడా మైదానంలో ఆదివారం రాత్రి దిగ్విజయ కళా కోలాటం బృందం, హెచ్ఎస్ఆర్ లేఔట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుగమ సంగీత కార్యక్రమంతో పాటు కోలాటం, గజ్జెల పూజ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మాతృశ్రీ యతీశ్వరి రామ ప్రియాంబ (శారద ఆశ్రమం) చందాపుర వారి ఆధ్వర్యంలో నిర్వహించిన గజ్జెల పూజ, కోలాటం ఆటలు ఆకట్టుకున్నాయి. కోలాటం గురువు నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో మహిళలు వివిధ రకాల పాటలకు కోలాటం ఆడుతూ అలరించారు. వేడుకలను బొమ్మనహళ్లి ఎమ్మెల్యే సతీష్ రెడ్డి ప్రారంభించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు మృతి

మైసూరు: కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో రైతు మృతి చెందిన సంఘటన మైసూరు జిల్లాలోని హెచ్.డి.కోటెలోని హెమ్మరహళ్లి ప్రభుత్వ పాఠశాల రోడ్డులో జరిగింది. హెచ్.డి.కోటె తాలూకాలోని హంపాపుర గ్రామానికి చెందిన రమేష్ (38) పొలంలో పనులను చూసుకుని, మధ్యలో కిరాణా షాపులో సరుకులను తీసుకుని ఇంటికి వెళ్తున్నాడు. హెచ్.డి.కోటె నుంచి వచ్చిన కేఎస్ ఆర్టీసి బస్సు అతన్ని ఢీకొనడంతో తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలో మృతి చెందాడు. బస్సు డ్రైవర్ నేరుగా హెచ్.డి. కోటె పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈద్గా మైదానంలో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు



ఈద్గా మైదానంలో పోలీసు ఉన్నతాధికారులు

బనశంకరి: చామరాజపేటే ఈద్గా మైదానంలో ఈసారి గణతంత్ర వేడుకలు నిర్వహించడానికి బెంగళూరు నగర జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు కలెక్టర్ దయానంద్ రెవెన్యూశాఖ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. దీంతో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై పోలీస్‌శాఖతో పాటు ఇతర స్థానిక సంస్థలతో జిల్లా యంత్రాంగం సమావేశం నిర్వహించింది. గణతంత్ర రోజున ధ్వజారోహణంతో పాటు పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టభద్రత కల్పించనున్నారు. ప్రజాప్రతినిధులను సైతం ఆహ్వానిస్తారు. ఈద్గా మైదానంలో గణతంత్ర వేడుకలను నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నట్లు చామరాజపేటే నాగరిక ఒక్కూట తెలిపింది.

పగటి పూటే బడ్జెట్ ప్రవేశపెడతాం

బనశంకరి: ఈసారి బీబీఎంపీ బడ్జెట్‌ను పగటిపూట ప్రవేశపెడతామని పాలికె కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. సోమవారం బీబీఎంపీ కార్యాలయంలో బడ్జెట్‌పై ప్రజాభిప్రాయ నివేదిక సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది అర్ధరాత్రి 11.30 సమయంలో బీబీఎంపీ బడ్జెట్‌ను పాలికె వెబ్‌సైట్‌లో ప్రకటించే నూతన పద్ధతికి నాంది పలికామని, ఈ ఏడాది ఎలాంటి కారణమైనా పగటి సమయంలోనే బడ్జెట్ ప్రవేశపెడతామని తెలిపారు. 2023–24 బడ్జెట్‌పై ఇప్పటికే ముందస్తు సమావేశాలు నిర్వహించామని, ఫిబ్రవరి 15 అనంతరం ప్రభుత్వానికి బడ్జెట్ ప్రతులు అందజేస్తామని తెలిపారు.

బుల్లితెర నిర్మాత మృతి

యశవంతపుర: కన్నడ బుల్లితెర నటుడు, దర్శకుడు రవికిరణ్ సోదరుడు భాస్కర్ ఆదివారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఆయన కన్నడలో సుకన్యా సీరియల్‌లో నటించారు. రవికిరణ్ దర్శకత్వం వహించిన అనేక సీరియళ్లకు నిర్మాతగా వ్యవహరించారు. కర్ణాటక టెలివిజన్ క్లబ్‌కు డైరెక్టర్‌గా కూడా వ్యవహరించారు.

కట్టెల కోసం వెళ్తే కబళించిన పులి

- మైసూరు జిల్లా అడవుల్లో యువకుడు హతం
- అటవీ సిబ్బంది క్వార్టర్స్ వద్దే ఘోరం



మంజు (ఫైల్)

మైసూరు: మైసూరు జిల్లాలో ఇప్పటికే చిరుత పులులు అనేకమందిని పొట్టనపెట్టుకుంటూ ఉంటే, మరోవైపు పెద్ద పులులు కూడా జనం మీద పడుతున్నాయి. ఓ పులి యువకున్ని చంపిన సంఘటన మైసూరు జిల్లాలో హెచ్‌డీ కోటె పరిధిలో డీబీ కుప్ప వద్ద నాగరహోళె అడవుల్లోని బళ్లె ప్రాంతంలో ఆదివారం జరిగింది. మరణించిన యువకుడు మంజు (18). వివరాలు... అటవీ శాఖకు చెందిన వసతి గృహాల వెనుక భాగంలో ఉన్న అడవిలో మంజు స్నేహితులతో కలిసి కట్టెల కోసం వెళ్లాడు. అటువైపు వచ్చిన పులి మంజు పైన దాడి చేసింది. తల వెనుకాల భాగంలో కొరికి, పంజాలతో చీల్చడంతో తీవ్రగాయాలై ప్రాణాలు వదిలాడు. అతని వెంట వచ్చిన మరికొంత మంది యువకులు అక్కడినుంచి పరుగులు పెట్టారు. అంతకుముందు మంజు అరుపులకు సమీపంలోని అటవీ సిబ్బంది వచ్చారు. వారిని చూసిన పులి మంజును వదిలి వెళ్ళిపోయింది. అటవీ సిబ్బంది వెంటనే మంజు మృతదేహాన్ని అక్కడి నుంచి ఆస్పత్రికి తరలించారు. అంతరసంత పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

స్థానికుల ధర్నా..

క్వార్టర్స్ వెనుకలే పులి తిరుగుతున్నా అటవీ సిబ్బంది పట్టించుకోలేదని, అందుకే యువకుడు బలయ్యాడని స్థానిక ప్రజలు అటవీ అధికారుల పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. మైసూరు–చామరాజనగర రహదారిపై రాస్తారోకో చేయడంతో వాహనాలకు ఆటంకం ఏర్పడింది. దీంతో పోలీసు, అటవీ ఉన్నతాధికారులు చేరుకుని రూ. 15 లక్షల పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు.

ఆకట్టుకున్న చదువుల పండుగ

బొమ్మనహళ్లి: బెంగళూరు దక్షిణ హొంగసంద్ర క్లస్టర్ పరిధిలో ఉన్న బొమ్మనహళ్లి కోడిచిక్కనహళ్లి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం కలిక హబ్బ (చదువుల పండగ) వేడుకలను విద్యార్థులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ వేడుకలను ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ సతీష్ రెడ్డి ప్రారంభించారు. అంతకు ముందు విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన వస్తు ప్రదర్శన ఆకట్టుకుంది. ఎమ్మెల్యే సతీశ్ రెడ్డి సైతం చిన్నారులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చదువుల పండుగ ర్యాలీలో ఎమ్మెల్యే

దళిత నాయకుడికి కత్తిపోట్లు

తుమకూరు: చిన్న గొడవ హత్యాయత్నానికి దారితీసింది. ఈ ఘటన తుమకూరు జిల్లా కోలాల సమీపంలోని సింగరేహళ్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు... స్థానికంగా ఉంటున్న రాకేశ్ అనే యువకుడు ఆదివారం రాత్రి బహిర్భూమి కోసం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్దకు వెళ్లాడు. అనంతరం తీసుకువచ్చిన నీటి బాటిల్‌ను పాఠశాలలోకి విసిరివేశాడు. అక్కడే ఉన్న దళిత నాయకుడు రామస్వామి నిలదీశాడు. ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో తన వద్ద ఉన్న చాకుతో రాకేశ్, రామస్వామి గొంతుపై పొడిచాడు. వెంటనే స్థానికులు అడ్డుకుని క్షతగాత్రుణ్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహిళలకు చేయూత ఇవ్వాలి

గౌరిబిదనూరు: మహిళలు అన్ని రంగాలలో రాణించడానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ చేయూత ఇవ్వాలని ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాదేశిక డైరెక్టర్ శీనప్ప ఎం. తెలిపారు. నగరంలో హెచ్ ఎన్ కళాభవనంలో జరిగిన మహిళా విచార గోష్టిని ప్రారంభించి మాట్లాడారు. విశ్రాంత ప్రిన్సిపాల్ డా నాగరత్నమ్మ మాట్లాడుతూ... మహిళలపై జరుగుతున్న దాడులను నివారించడానికి జ్ఞాన వికాస కేంద్రాలు దోహదపడుతుందన్నారు. పోలీస్ సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ... మహిళల సమస్యలపై తక్షణం స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు ప్రాదేశిక డైరెక్టర్ శీనప్ప అద్దేకొప్ప గ్రామంలో ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ వాత్సల్య పథకం కింద నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ మోహన్, ప్రభానారాయణగౌడ, కమిషనర్ గీతా, ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగరాజ నాయ్క తదితరులు పాల్గొన్నారు.



చర్చా గోష్టిని ప్రారంభిస్తున్న శీనప్ప తదితరులు

మలెనాడులో మాదే అధిక్యం

యశవంతపుర: తీర, మలెనాడు ప్రాంతంలో కాంగ్రెస్ పని అయిపోయింది. 33 స్థానాల్లో 28 స్థానాలను బీజేపీ గెలుచుకొంటుందని మంత్రి అశ్వత్థనారాయణ విశ్వాసం వ్యక్తం చేశారు. బెళగావి తాలూకా సాంబ్రా విమానశ్రయానికి రూ. 2500 కోట్లను తమ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కాంగ్రెస్ ఏమి చేసినా తీర, మలెనాడు ప్రాంతాలలో గెలవటం కాంగ్రెస్‌కు సాధ్యంకాదన్నారు. జెండా పట్టుకోవటానికి కార్యకర్తలు కూడా లేరన్నారు. కాంగ్రెస్ ధ్వని వినటానికి ఎవరు లేరన్నారు.

ప్రముఖమైన భాషల్లో కన్నడ ఒకటి

మైసూరు: ప్రపంచంలో దాదాపు 9 వేలకు పైగా భాషలు ఉన్నాయని, ఇందులో సగానికిపైగా భాషలు పూర్తిగా నశించిపోయాయని చామరాజ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎల్.నాగేంద్ర తెలిపారు. సోమవారం మైసూరు నగరంలోని కళామందిరంలో ఉన్న చిన్నరంగ మందిరంలో 'మూల సంస్కృతి, కన్నడ సంస్కృతి' అనే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ... ప్రపంచంలోని 30 ప్రముఖ భాషల్లో కన్నడ ఒకటని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కళల పోషణ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

హోసూరు వార్తలు..

9వ రోజుకు కళా ప్రదర్శనలు

హోసూరు: తమిళనాడు ప్రభుత్వం ఏడాది సాధనలపై ప్రజా సంబంధ శాఖ ద్వారా నిర్వహిస్తున్న కళా ప్రదర్శన కార్యక్రమం ఆదివారం రాత్రి 9వ రోజుకు చేరుకొంది. అందులో భాగంగా జిల్లా కేంద్రం క్రిష్ణగిరి ప్రభుత్వ బాలికల ఉన్నతోన్నత పాఠశాలలో పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరింపజేశాయి. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏడాది సాధనలపై ప్రజల్లో చైతన్యం కల్పించారు. సంక్షేమ ఫలాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వెల్లువెత్తిన ఫిర్యాదులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు వినతిపత్రాలను అందజేశారు. కలెక్టర్ జయచంద్రభానురెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తాగునీరు, రోడ్ల వసతి, ఇళ్ల పట్టాలు, వృద్ధాప్య పెన్షన్, విద్యుత్ కనెక్షన్, ఉచిత కుట్టు యంత్రాలు కోరుతూ 228 ఫిర్యాదులను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో రాజేశ్వరి, అధికారులు భాగ్యలక్ష్మి, అయ్యప్పన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శివబాలయోగి జయంతి

బనశంకరి: శ్రీ శివబాలయోగి మహరాజ్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహిస్తామని శ్రీ శివబాలయోగి మహరాజ్ ట్రస్ట్ కార్యాధ్యక్షుడు డీ.రాంబాబు తెలిపారు. జేపీనగర మూడోపేజ్‌లోని ఆశ్రమంలో మహరాజ్ 88వ జయంతి సందర్భంగా మంగళవారం 9 గంటల నుంచి 12 గంటల వరకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తారు. 12 గంటలకు పూర్ణాహుతి, 12.30 కుంభాభిషేకం, మధ్యాహ్నం 1.30 భక్తులకు ప్రసాదం వినియోగం, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు ధ్యానం, 6.30 నుంచి 8 గంటల వరకు భజన, సాయంత్రం 7 గంటలకు కల్యాణోత్సవం నిర్వహిస్తామని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని రాంబాబు విజ్ఞప్తి చేశారు.



శివబాలయోగి మహరాజ్ (ఫైల్)

కుంభకోణాలపై పునఃవిచారణ చేపట్టండి

బనశంకరి: మాజీ సీఎం, విపక్షనేత సిద్దరామయ్య అధికార అవధిలో చోటుచేసుకున్న తీవ్రమైన 14 కుంభకోణాలపై పునః విచారణ చేపట్టడంతో పాటు తక్షణం సీఐడీ దర్యాప్తునకు ఆదేశించాలని బెంగళూరు దక్షిణ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎన్ఆర్.రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బీబీఎంపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... 2013 నుంచి 18 వరకు సిద్దరామయ్య ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆ సమయంలో 121 భారీ కుంభకోణాలకు సంబంధించి పూర్తి ఆధారాల సమేతంగా లోకాయుక్తలో ఫిర్యాదులు చేశామన్నారు. అయినా కూడా ఒత్తిళ్లకు తొలొగ్గి 14 కేసుల్లో విముక్తి కల్పించారు. అందులో సిద్దరామయ్య మాత్రమే కాకుండా అప్పట్లో మంత్రి వర్గంలో ఉన్న కేజే.జార్జ్, కృష్ణబైరేగౌడ, యూటీ.ఖాదర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు కేసుల్లో లోకాయుక్త, ఏసీబీలోని కొందరు అధికారులు, ఫిర్యాదుదారులనుంచి ఎలాంటి వాంగ్మూలం తీసుకోకుండా ఒకేసారి కేసులను విముక్తి కల్పించారని రమేశ్ ఆరోపించారు.



ఆధారాలు చూపుతున్న ఎన్ఆర్.రమేశ్

స్వచ్ఛతపై పాదయాత్ర

యశవంతపుర: స్వచ్ఛతను కాపాడాలని కోరుతూ కారవారకు చెందిన పహరె వేదిక ఆదివారం కారవార నగరం నుంచి 18 కిలోమీటర్లు దూరంలోని గోవా సరిహద్దు వరకు పాదయాత్ర నిర్వహించారు. వారానికి ఒకరోజు స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేదిక సరిహద్దు వరకు పాదయాత్ర ద్వారా స్వచ్ఛతపై అభియాన్ నిర్వహించారు. కారవార సుభాష్ సర్కిల్‌లోని బోస్ విగ్రహానికి నివాళులర్పించి పాదయాత్రను ప్రారంభించింది.

● ఉరకలెత్తే ఉత్సాహం



కోస్తా తీరంలో కంబళ పోటీలు జోరుగా సాగుతున్నాయి. మంగళూరు శివార్లలోని కూలూరులో నిర్వహించిన కంబళలో బురదమడిలో దున్నపోతులతో దూసుకుపోతున్న ఓ పోటీదారు. పెద్దసంఖ్యలో యజమానులు తమ దున్నలతో పాల్గొన్నారు



మహాయోగి వేమన జయంతి ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా సాగుతున్నాయి. బాగల్‌కోటె సమీపంలో బనకట్టిలో ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులు ఎద్దులబండ్ల పరుగుపందేలను నిర్వహించారు. తమ బండిని ఉరికిస్తున్న పోటీదారులు

బడికి తాళం, బయటే చదువులు

కృష్ణరాజపురం: నగరంలోని కృష్ణరాజపురం నియోజకవర్గం పరిధిలో ఉన్న మహాదేవపురలోని ప్రభుత్వ పాఠశాలకు గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు వేశారు. దీంతో విద్యార్థులు బయట కూర్చొని చదువుకుంటున్నారు. దుండగులు పాఠశాల గేటుతో పాటు తరగతి గదులకు మొత్తం తాళాలు బిగించారు. దాంతో సోమవారం పొద్దున పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఏమి చేయాలో తెలియక బయట కూర్చున్నారు. బీఈఓ రామ్మూర్తి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంత్రి బైరతి బసవరాజు సొంత నియోజకవర్గంలోని మహాదేవపురలో ఈ సంఘటన జరిగింది.



ఆవరణలో కూర్చున్న విద్యార్థులు

మళ్లీ అధికారంలోకి వస్తాం

బనశంకరి: రాష్ట్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని ఎమ్మెల్యే విశ్వనాథ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం వివిధ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తమ పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధిని చూసి కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు బీజేపీలో చేరారని ఎమ్మెల్యే తెలిపారు. బీజేపీలోకి చేరిన వారిలో నరసింహమూర్తి (ఎస్‌టీడీ), అప్పణ్ణగౌడ, శ్రీనివాసమూర్తి, ఆర్‌డీ.రాజణ్ణ, సాదేనహళ్లి ప్రకాష్, గిరీశ్‌తో పాటు రాజానుకుంటే, బ్యాలకెరె, సాదేనహళ్లి, రామగొండనహళ్లికి చెందిన 500 మందికి పైగా కాంగ్రెస్, జేడీఎస్ నేతలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా యలహంక నియోజకవర్గ అధ్యక్షుడు హనుమయ్య, ఎం క్రిష్ణమూర్తి, ఎం.సతీశ్, బీజేపీ నేతలు చొక్కనహళ్లి వెంకటేశ్, కడతనమలె సతీశ్, దిబ్బూరుజయణ్ణ, అప్పయణ్ణ, ప్రశాంత్‌రెడ్డి, వై.రామిరెడ్డి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే విశ్వనాథ్

బీజేపీ బీ టీమ్‌పై బహిరంగ చర్చకు సిద్ధం

- మాజీ సీఎం కుమారస్వామి

శివాజీనగర: బీజేపీలో బీ టీమ్.. ఏ పార్టీ అనే బహిరంగ చర్చకు తాను సిద్ధమని మాజీ ముఖ్యమంత్రి హెచ్.డీ.కుమారస్వామి కాంగ్రెస్ నాయకులకు సవాల్ చేశారు. ఈ మేరకు ట్వీట్ చేసిన ఆయన, విధానసౌధలోనే చర్చ జరగాలని, సమయం, తేదీ మీరైనా నిర్ణయించండి లేదా తాను నిర్ణయిస్తానని, సమాధానం కోసం నిరీక్షిస్తున్నానని రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రణదీప్ సింగ్ సుర్జేవాలాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రావటానికి ప్రధాన కారకులు తమ శాసనసభ పార్టీ నాయకులే. ఆపరేషన్ కమలమంటూ పేరు పెట్టినది ఆయనే. బీ టీమ్ బాగోతానికి ఇంతటితో స్వస్తి పలికితే మంచిది. లేకపోతే ముందు జరగబోయే పరిణామాలకు తమరే బాధ్యులు. రాష్ట్రంలో లౌకికవాద శక్తులు బలహీనమైతే ఆ పాపానికి మీరే బాధ్యులని తెలిపారు.

డిమాండ్ల పరిష్కారానికి అంగన్‌వాడీల పట్టు

శివాజీనగర: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సేవలను పర్మినెంట్ చేయటంతో పాటు ఇతర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు మరోసారి పోరాటాన్ని ఆరంభించారు. సోమవారం నగరంలోని ఫ్రీడం పార్క్ మైదానం చేరుకున్న రాష్ట్ర అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం (సీఐటీయు) నేతృత్వంలో తమ డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం ఆపమని హెచ్చరించారు. రాష్ట్ర నలమూలల నుంచి 10 వేల మందికిపైగా అంగన్‌వాడీ కార్యకర్తలు విచ్చేశారు. అంగనవాడీ కార్యకర్తలకు రూ. 31 వేల జీతం, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఉన్నత స్థాయికి పెంచాలని, గ్రాచ్యుటీ సొమ్ము, పింఛన్, ఈఎస్ఐ జారీ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి సునంద మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలను బంద్ చేసి ధర్నా చేస్తున్నామని తెలిపారు. డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన విరమించమని హెచ్చరించారు.

సప్లమ్మ పశువుల జాతర ప్రారంభం

హోసూరు: హోసూరు తాలూకా చెన్నసంద్రం పంచాయతీ కెలవరపల్లి రిజర్వాయర్ సమీపంలోని తిమ్మసంద్రం వద్ద వెలసిన సప్లమ్మ పశువుల జాతర మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు గజేంద్రమూర్తి అధ్యక్షతన ఉపాధ్యక్షులు త్యాగరాజన్, సభ్యులు రాజారెడ్డి, క్రిష్ణప్ప, కెంపణ్ణ, మహేశ్, బాలక్రిష్ణప్ప, శ్రీనప్ప, పుట్టప్ప, కౌన్సిలర్ రాధాగజేంద్రన్‌ల నేతృత్వంలో ఉదయం ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి కార్యక్రమాలను ప్రారంభించారు. వారం రోజుల పాటు జరిగే జాతరలో పాల్గొనే ఉత్తమ పశువులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు కమిటీ తెలిపింది. సోమవారం జాతరకు వచ్చిన పశువుల్లో రెండు ఎద్దులు రూ. 1.60 లక్షల వరకు ధర పలికింది. 29వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సిడి ఉత్సవం, రాత్రి 8 గంటలకు కురుక్షేత్రం పౌరాణిక నాటకం, పల్లకీ ఉత్సవాలు, 31వ తేదీ కుచ్చుల పండుగను జరుపుతున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.



జాతరలో పశువులు

వివాహిత ఆత్మహత్య

కెలమంగలం: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...డెంకణీకోట సమీపంలోని నెల్లుకుంది గ్రామానికి చెందిన కార్మికుడు శివకుమార్ (42). ఇతని భార్య రాణి (34). వీరికి అజయ్‌నాథ్ (13), ప్రియాంక (10) పిల్లలున్నారు. శివకుమార్ మద్యం తాగి వచ్చి నిత్యం భార్యతో గొడవపడేవాడు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్యతో గొడవకు దిగాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన రాణి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుపక్కల వారు చేరుకొని రాణిని డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఘనంగా నేతాజీ జయంతి

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని బైరమంగలంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ సేవా సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్‌లో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

చెరువులో యువతి శవం

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి జిల్లా ఆంధ్ర సరిహద్దు వేపనపల్లి సమీపంలో గుర్తు తెలియని యువతి శవాన్ని గుడిపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 25 ఏళ్ల యువతిని హత్య చేసిగోనెసంచిలో చుట్టి పడేసినట్లు తెలిసింది. శవాన్ని కుప్పం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి హంతకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

నేత్రపర్వంగా శ్రీనివాస కల్యాణం



బనశంకరి: శ్రీనివాస కళ్యాణోత్సవం అశేషభక్తజన వాహిని మధ్య కన్నులపండువగా జరిగింది. సోమవారం రాత్రి బ్యాటరాయనపుర ఏపీఎంసీ మైదానంలో కేసరి ఫౌండేషన్ అధ్యక్షుడు, బీజేపీ నేత తమ్మేశ్‌గౌడ శ్రీనివాసకల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తుమకూరు సిద్ధగంగా మఠ సిద్ధలింగస్వామి, స్ఫటికపుర వచనానందస్వామీజీ, మాజీ సీఎం బీఎస్. యడియూరప్ప తదితరులు హాజరయ్యారు. యడియూరప్ప మాట్లాడుతూ శ్రీనివాస కల్యాణోత్సవం చూస్తే తిరుమల వెంకటరమణస్వామి దర్శనం చేసుకున్నంత ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా భక్తులకు టీటీడీ క్యాలెండర్, లడ్డు ప్రసాదం అందజేశారు. ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ పాల్గొన్నారు. భక్తి గాన కచేరీ భక్తులను ఓలలాడించింది.

ఫ్లవర్‌షోకు జనసాగరం

బనశంకరి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా లాల్‌బాగ్ గ్లాజ్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన 213వ ఫలపుష్ప ప్రదర్శనకు సందర్శకులు పోటెత్తుతున్నారు. ఆదివారం ఫ్లవర్‌షోకు 35 వేల మందికి పైగా వీక్షించారు. సెలవు రోజు కావడంతో నగరవాసులు కుటుంబ సమేతంగా ఫ్లవర్‌షోకు విచ్చేసి ఉద్యానవనంలో పుష్ప సోయగాలను వీక్షించారు.





శ్రీకాకుళం జిల్లా బూరిగాంలో వంట చేస్తున్న మహిళకు సహాయం చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కర్నూలు జిల్లా ఆస్పరిలో ఇస్త్రీ షాపు నిర్వాహకురాలికి సహకరిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి గుమ్మనూరు జయరాం

గడప గడపకు మన ప్రభుత్వం



ఒంగోలు 33వ డివిజన్ జెడ్పీ కాలనీలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



విశాఖ జిల్లా గాజువాక అఫిషియల్ కాలనీలో ప్రభుత్వ పథకాల గురించి లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

క్లుప్తంగా...

విశాఖ వేదికగా బయో ఫార్మా డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీకి రూపకల్పన

నాగపూర్‌లో జరిగిన ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో తీర్మానం

సాక్షి, అమరావతి: సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా చౌకగా, అత్యంత సురక్షితమైన ఔషధాలను ఉత్పత్తి చేయవచ్చని ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ ప్రకటించింది. ఫార్మా రంగంలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ పెద్ద ఎత్తున జరగాల్సిన అవసరం ఉందని పేర్కొంది. విశాఖ వేదికగా ఫిబ్రవరి 16, 17 తేదీల్లో జరగనున్న గ్లోబల్ టెక్ సమ్మిట్–2023కు సంబంధించి మహారాష్ట్రలోని నాగపూర్‌లో సోమవారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మా రంగానికి చెందిన 50 మందికి పైగా విధాన నిర్ణేతలతో సమావేశం నిర్వహించారు. విశాఖ గ్లోబల్ టెక్ సమ్మిట్ వేదికగా బయోఫార్మా డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీకి రూపకల్పన చేయాలని సమావేశం తీర్మానించినట్టు గ్లోబల్ టెక్ సమ్మిట్ నిర్వాహకుడు, పల్సస్ గ్రూపు సీఈవో శ్రీనుబాబు తెలిపారు. అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ డొమినిక్ జోర్డాన్ పాల్గొన్నారు.

టార్గెట్ గోవా లక్ష్యంతో పనిచేయాలి : శాప్ ఎండీ




సాక్షి, అమరావతి: 'టార్గెట్ గోవా' లక్ష్యంగా 37వ జాతీయ పోటీలకు క్రీడాకారులను సన్నద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ ప్రభాకరరెడ్డి అన్నారు. వివిధ క్రీడా సంఘాలు, ఒలింపిక్ సంఘం ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎండీ మాట్లాడుతూ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించడంతో పాటు క్రీడాభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఇప్పటికే ఖేలో ఇండియా పోటీలకు వెళ్లే రాష్ట్ర బృందానికి ప్రత్యేక శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. కొన్ని సంఘాలు తమ గుర్తింపును పునరుద్ధరించుకునేందుకు అవసరమైన పత్రాలను వారంలోగా అందించాలని సూచించారు. క్రీడా సంఘాల ముసుగులో గుర్తింపులేని వ్యక్తులు శాప్‌పై బురదజల్లితే సహించేది లేదని హెచ్చరించారు.

ఏపీ శ్యాక్స్ పీడీగా నివాస్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ శ్యాక్స్) పీడీగా పూర్తి అదనపు బాధ్యతలను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్‌కు ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పీడీగా పనిచేస్తున్న ఐఏఎస్ అధికారి జీఎస్ నవీన్‌కుమార్ డిప్యూటేషన్ కాలపరిమితి ముగియడంతో సొంత క్యాడర్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి తిరిగి వెళ్లిపోయారు. ఈ క్రమంలో శ్యాక్స్ పీడీ బాధ్యతలను నివాస్‌కు ప్రభుత్వం అప్పగించింది. ప్రత్యేక కార్యదర్శి హోదాలో క్యాన్సర్ కేర్, ఏబీడీఎం సహా పలు కార్యక్రమాల బాధ్యతలను నవీన్‌కుమార్ నిర్వహించారు. అదే విధంగా కోవిడ్–19 మేనేజ్‌మెంట్ కార్యదర్శిగా వ్యవహరించారు. ఈ క్రమంలో తదుపరి ఉత్తర్వులు వెలువరించే వరకూ ప్రత్యేక కార్యదర్శి, కోవిడ్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి బాధ్యతలను వైద్యశాఖలోనే అంతర్గత సర్దుబాటు చేసుకోవాలని ఆ శాఖ ముఖ్య కార్యదర్శికి సీఎస్ సూచించారు.

దత్తపుత్రుడుకి బాబు ప్రాధాన్యత.. భయంతో లోకేశ్ పాదయాత్ర

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం



సాక్షి, అమరావతి: తగిన అనుమతులతో రాష్ట్రంలో ఎవరు పాదయాత్ర చేసినా ఎవరికీ అభ్యంతరం ఉండదని, ప్రభుత్వం అడ్డుకోదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం స్పష్టంచేశారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌కు ప్రాధాన్యత ఇవ్వడాన్ని లోకేశ్ తట్టుకోలేకపోతున్నారని, పార్టీ పగ్గాలు పవన్‌కు అప్పగిస్తాడేమోనన్న భయంతో తిరుగుబాటు యాత్ర చేస్తున్నాడన్నారు. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ పాదయాత్ర చేపట్టినప్పుడు బాబు ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించిందో గుర్తులేదా అని ప్రశ్నించారు. రూట్ మ్యాప్‌తో వాళ్లడిగిన వివరాలన్నీ ఇస్తే తప్ప అనుమతి ఇవ్వలేదన్నారు. ఏం జరిగినా తమదే బాధ్యత అని రాసిచ్చామని తెలిపారు.

ఈ మూడున్నరేళ్లలోనే ఎంతో లాభం

ఎస్సీ, ఎస్టీలకు నిజమైన 'ఉపకారం' ఈ కాలంలోనే..

- మీ బాబుకు మించి సీఎం జగన్ మేలుచేశారు
- 2014–19 మధ్య ఎస్సీలకు రూ.33,625 కోట్లు, ఎస్టీలకు 12,487 కోట్లు మాత్రమే ఖర్చు
- అదే ఈ మూడున్నరేళ్లలో ఎస్సీలకు రూ.48,899 కోట్లు, ఎస్టీలకు రూ.15,589.38 కోట్లు ఖర్చు
- 2017–18 నుంచి ఉప ప్రణాళికను ఎస్సీ, ఎస్టీ కాంపొనెంట్‌గా మార్చిన కేంద్రం
- ఇవన్నీ దాచి.. ఎప్పటిలాగే వాస్తవాలు వక్రీకరించి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌పైనా రామోజీ రోత రాతలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధిపరంగా నిజంగా మేలు చేసిందెవరు? అని ఆ వర్గాల వారిని ఎవరైనా ప్రశ్నిస్తే.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తక్కున సమాధానం వస్తుంది. ఎందుకంటే ఎస్సీ, ఎస్టీలకు చంద్రబాబు హయాంలో ఐదేళ్లలో జరగని మేలు జగన్ నేతృత్వంలో మూడున్నరేళ్లలో అంతకుమించి జరిగిందన్నది జగమెరిగిన సత్యం. అప్పట్లో బాబు కేటాయించిన నిధులు.. నేడు సీఎం జగన్ ఖర్చుచేస్తున్న మొత్తం గణాంకాలను గమనిస్తే గతానికన్నా ఎంతో మేలు జరిగిందన్నది స్పష్టంగా అర్థమవుతుంది. కానీ, ఇవేమి పరిగణలోకి తీసుకోని ఈనాడు విషపత్రిక ఎప్పటిలాగే వాస్తవాలను వక్రీకరించింది. ఈసారి ఎస్సీ, ఎస్టీ కాంపోనెంట్ (సబ్‌ప్లాన్)పై తన కడుపుమంటను ప్రదర్శించింది. సబ్‌ప్లాన్‌ను మరో పదేళ్ల పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్‌పై ఆ వర్గాలకు చెందిన నేతలు, ప్రజాసంఘాలు హర్షం వ్యక్తంచేస్తుంటే రామోజీ మాత్రం ఎప్పటిలాగే తన అక్కసును వెళ్లగక్కారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా 'పేరుకే చట్టం.. ఎన్నేళ్లున్నా ఏం లాభం?' అంటూ ఈనాడు మరో అభూతకల్పనను వండివార్చింది. వాస్తవానికి.. 2017–18 నుంచి కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం కారణంగా బడ్జెట్లో ప్రణాళిక, ఉపప్రణాళిక అన్న పదాలేలేవు. సబ్‌ప్లాన్‌ను కాంపొనెంట్‌గా కేంద్ర ప్రభుత్వం మార్చింది. దీంతో ఎస్సీ కాంపొనెంట్, ఎస్టీ కాంపొనెంట్‌గా కేటాయింపులు జరుగుతున్నాయి. అలాగే, ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, వారి కార్యక్రమాల్లో ఎస్సీ, ఎస్టీల జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయిస్తోంది.

బాబు చేస్తే ఒప్పు.. జగన్ చేస్తే తప్పు

రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో ఏ రకంగా చూసినా ఎస్సీ, ఎస్టీలు గత మూడున్నరేళ్లుగా అత్యధిక లబ్ధి పొందారనేది సుస్పష్టం. అర్హతే ప్రామాణికంగా అత్యంత పారదర్శకంగా పథకాలను అమలుచేస్తోంది. వివిధ సామాజిక పెన్షన్ల కోసం ఎస్సీ, ఎస్టీలకు చేస్తున్న ఖర్చును ఉప ప్రణాళికలో చూపించడాన్ని తప్పు అంటూ 'ఈనాడు' గుండెలు బాదుకుంది. కానీ, నిజమేమిటంటే.. 2019 జూన్‌కు ముందున్న టీడీపీ ప్రభుత్వం కూడా సామాజిక పెన్షన్లు, దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్లు, మధ్యాహ్న భోజనం కోసం చేసిన ఖర్చులన్నింటినీ ఎస్సీ, ఎస్టీల ఉపప్రణాళికలో ఒక భాగంగానే చూపించిన విషయాన్ని పాపం వృద్ధ రామోజీకి గుర్తున్నట్లులేదు. అంతేకాదు.. మా ఇంటిమహాలక్ష్మి, పిల్లలకు–తల్లులకు ఇచ్చే పౌష్టికాహారం, అన్న అమృతహస్తం, చంద్రన్న పెళ్లికానుక, ఎన్టీఆర్ సుజలస్రవంతి, డ్వాక్రా మహిళలకు ఇచ్చే శానిటరీ నాప్కిన్స్, చంద్రన్న రైతు క్షేత్రాలు, పొలంబడి, జవహర్ నాలెడ్జ్ సెంటర్ మెంటార్లకు ఇచ్చే గౌరవ వేతనాలు సైతం గత ప్రభుత్వం సబ్‌ప్లాన్‌లో భాగంగానే చూపిన విషయం మర్చిపోతే ఎలా రామోజీ.. అప్పుడు ఒప్పు.. ఇప్పుడు తప్పు అంటే ఎలా?

ఎస్సీలకు లబ్ధిలో మనమే నెంబర్-1

- ఎస్సీ కాంపొనెంట్ అమలులో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది.
- దేశంలోని 20 రాష్ట్రాల్లో ఎస్సీ కాంపొనెంట్ ద్వారా మొత్తం 37.64 లక్షల మందికి మేలు జరిగితే అందులో ఒక్క ఏపీలోనే 35.92లక్షల మందికి లబ్ధిచేకూరింది.
- అలాగే, ఎస్సీ కాంపొనెంట్ ద్వారా కొత్తగా దేశంలో 12.41 లక్షల స్వయం సంఘాలు ఏర్పాటుచేస్తే ఒక్క ఏపీలోనే ఏకంగా 8.54 లక్షల సంఘాలు ఏర్పాటయ్యాయి.
- ఇది మనం చెబుతున్నది కాదు.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నివేదిక స్పష్టంచేసింది రామోజీ..

మూడున్నరేళ్లలోనే ఐదేళ్లకు మించిన మేలు

ఇక రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కాంపొనెంట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చును గమనిస్తే చంద్రబాబు హయాంలో ఐదేళ్లలో కేటాయించిన నిధులకు మించి ఈ మూడున్నరేళ్లలోనే జరిగిందన్నది గణాంకాలే చెబుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం వీరికోసం చేసిన ఖర్చు గతంలో ఏ ప్రభుత్వం కూడా చేయలేదు. గత ప్రభుత్వం 2014–15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018–19 వరకు ఎస్సీ ఉపప్రణాళిక కోసం రూ.33,625.49 కోట్లు కేటాయిస్తే... ప్రస్తుత ప్రభుత్వం 2019–20 నుంచి 2022 డిసెంబర్ వరకు మూడున్నరేళ్లలో రికార్డు స్థాయిలో రూ.48,899.66 కోట్లు ఖర్చుచేసింది. అంటే.. టీడీపీ కేటాయించిన మొత్తానికంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మూడున్నరేళ్లలోనే ఏకంగా రూ.15,274.17 కోట్లు అదనంగా కేటాయించింది. ఇక ఎస్టీల కోసం చేసిన ఖర్చుచూస్తే.. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.12,487.48కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం మూడున్నరేళ్లలో రూ.15,589.38 కోట్లు వెచ్చించింది. ఇవేమి పరిశీలించకుండానే రామోజీ మనసు 20 శాతం నిధులు కోత అంటూ తెగ బాధపడిపోయింది.

టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా నిధుల ఖర్చు ఇలా.. (రూ.కోట్లలో)

ఏడాది	ఎస్సీ	ఎస్టీ
2014-15	2,602.73	1,331.89
2015-16	5,181.73	1,928.97
2016-17	7,310.30	2,332.58
2017-18	9,627.29	3,356.10
2018-19	8,903.44	3,537.94
మొత్తం :	33,625.49	12,487.48

వైఎస్సార్‌సీపీ హయాంలో నిధుల ఖర్చు ఇలా.. (రూ.కోట్లలో)

ఏడాది	ఎస్సీ	ఎస్టీ
2019-20	11,205.40	3,281.46
2020-21	13,672.78	4,731.91
2021-22	13,227.37	4,125.41
2022-23	10,794.11	3,450.60
మొత్తం :	48,899.66	15,589.38

గిరి బిడ్డలపైనా ప్రత్యేక శ్రద్ధ..

మరోవైపు.. ఎస్టీ సబ్‌ప్లాన్‌ను కూడా వైఎస్సార్‌సీపీ సర్కారు పటిష్టంగా అమలుచేస్తూ గిరిజనులపైనా ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోంది.

- రాష్ట్రంలోని జిల్లాల పునర్విభజనలో గిరిజనులకు రెండు జిల్లాలు కేటాయించి అల్లూరి సీతారామరాజు (ఏఎస్ఆర్), పార్వతీపురం మన్యం జిల్లాలను ఏర్పాటుచేసింది.
- ఆర్వోఎఫ్ఆర్ చట్టం ప్రకారం మొత్తం 4.49 లక్షల ఎకరాల భూమిని 2.22 లక్షల మంది ఎస్టీ రైతులకు అందించింది.
- దీంతోపాటు 39,272 ఎకరాల డీకేటీ భూమిని 26,287 మంది ఎస్టీ పేద రైతులకు పంపిణీ చేశారు.
- అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి కనీసం రెండెకరాల భూమి ఉండేలా చూడాలని భావించిన సీఎం జగన్ ఆ దిశగా విప్లవాత్మక చర్యలు చేపట్టారు.
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఒక్కటిగా ఉంటే ఇబ్బందని భావించి షెడ్యూల్డ్ తెగల కోసం ప్రత్యేక రాష్ట్ర కమిషన్‌ను ఏర్పాటుచేసింది.
- ఏఎస్ఆర్ జిల్లా పాడేరులో గిరిజన వైద్య కళాశాలను రూ.500 కోట్లతో మంజూరు చేసి సీఎం ఇప్పటికే శంకుస్థాపన చేశారు.
- పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం వద్ద రూ.153.85 కోట్లతో గిరిజన ఇంజినీరింగ్ కళాశాలకూ శంకుస్థాపన చేశారు.

మెడికల్ కాలేజీ నిర్మాణంతో మెరుగైన సేవలు

మంత్రి విడదల రజిని

పిడుగురాళ్లరూరల్: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి వైద్య, ఆరోగ్య శాఖలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నారని, అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా 17 మెడికల్ కాలేజీలు అందుబాటులోకి తీసుకుని రానున్నారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. మెడికల్ కాలేజీల కోసం ప్రభుత్వం రూ.8,500 కోట్లు ఖర్చు పెడుతుందని తెలిపారు. పల్నాడు జిల్లా కామేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ పనులను మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో సీఎం వైఎస్ జగన్ రూ.500 కోట్లతో వైద్య కళాశాల, హాస్పటల్ నిర్మించటం గొప్ప విషయమన్నారు. మెడికల్ కాలేజీ వల్ల ఆ ప్రాంతం అభివృద్ధి చెందటమే కాకుండా మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ డి.మురళీధర్‌రెడ్డి, మెగా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



మెడికల్ కాలేజీ పనులు పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మే 15 నుంచి ఏపీ ఈఏపీసెట్

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నత విద్యామండలి ఖరారు చేసింది. ఈసెట్, పీజీఈసెట్, ఐసెట్, లాసెట్, ఎడ్‌సెట్, పీజీసెట్, ఆర్‌సెట్లను గతంలో కన్నా ముందుగా నిర్వహించి.. త్వరగా ప్రవేశాలు పూర్తి చేసేలా షెడ్యూళ్లను రూపొందించింది.

గాడిన పడనున్న విద్యా సంవత్సరం..

గతంలో కరోనాతో ప్రవేశపరీక్షల నిర్వహణ ఆలస్యం కావడంతో విద్యాసంవత్సరం గాడితప్పింది. ఈ పరిస్థితి మన రాష్ట్రంలోనే కాకుండా దేశమంతా నెలకొంది. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యామండలి 2023–24 విద్యాసంవత్సరానికి ప్రవేశ పరీక్షలను గతంతో పోలిస్తే చాలా ముందుగానే పూర్తి చేసేలా వివిధ సెట్ల షెడ్యూళ్లను రూపొందించింది. ఫలితంగా ఈసారి విద్యా సంవత్సరం గాడిలో పడటానికి ఆస్కారమేర్పడింది. ఈసారి ఈఏపీసెట్ పరీక్షలను గతేడాది కంటే రెండు నెలలు ముందుగా అంటే మే 15 నుంచే ప్రారంభించనుండడం విశేషం. దీనివల్ల జూన్ ఆఖరుకల్లా అడ్మిషన్లతో సహా మొత్తం ప్రక్రియ పూర్తవుతుంది. దీంతో జూలై నుంచే తరగతులు ప్రారంభించవచ్చని ఉన్నత విద్యామండలి వర్గాలు పేర్కొన్నాయి.



ఇతర సెట్ల తేదీలు ఇలా..

ప్రవేశ పరీక్ష	ఏ కోర్సుల్లో ప్రవేశానికి?	పరీక్ష తేదీ
ఈసెట్	ఇంజనీరింగ్ సెకండియర్	మే 5
లాసెట్	బీఎల్, ఎంఎల్	మే 20
ఎడ్‌సెట్	బీఈడీ	మే 20
ఐసెట్	ఎంబీఏ, ఎంసీఏ	మే 25, 26
పీజీఈసెట్	ఎంటెక్, ఎంఫార్మసీ	మే 28 - 30
పీజీసెట్	అన్ని వర్సిటీల్లో పీజీ	జూన్ 6 -10
ఆర్‌సెట్	పీహెచ్‌డీ	జూన్ 12 - 14

పాపం గజరాజులు!

గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా వివిధ ప్రమాదాల్లో 494 ఏనుగుల మృతి

- విద్యుత్ షాక్‌కు గురై అత్యధికంగా 340 గజరాజుల మృత్యువాత
- రైలు ప్రమాదాల్లో 80 ఏనుగుల మృతి
- వేటాడి 41 ఏనుగులను హతమార్చారు
- విష ప్రయోగం ద్వారా మరో 25 చంపేశారు
- అత్యధికంగా అసోంలో 121 ఏనుగుల మృతి
- కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో గజరాజుల అసహజ మరణాలు ఇటీవలకాలంలో పెరిగిపోతున్నాయి. రైలు ప్రమాదాలు, విద్యుత్ షాక్, వేటాడటం, విషప్రయోగం వంటి కారణాలతో దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో 494 ఏనుగులు మృత్యువాతపడినట్లు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. విద్యుదాఘాతం కారణంగా 2017–18 నుంచి 2021–22 వరకు అత్యధికంగా 340 ఏనుగులు మృతిచెందినట్లు తెలిపింది. ఆ తర్వాత రైలు ప్రమాదాలబారిన పడి ఐదేళ్లలో 80 గజరాజులు మృతిచెందాయి. వేటాడి 41, విషప్రయోగం ద్వారా 25 ఏనుగులను చంపినట్లు వివరించింది. ఐదేళ్లలో అత్యధికంగా అసోంలో 121 ఏనుగులు వివిధ కారణాలతో మృత్యువాతపడ్డాయి. అతితక్కువగా ఉత్తరప్రదేశ్‌లో ఎనిమిది ఏనుగులు విద్యుత్‌షాక్‌తో మరణించాయి. ఏనుగుల దంతాల కోసం విషప్రయోగాలు చేస్తుండటం శోచనీయం. వివిధ ప్రాంతాల్లో గత ఐదేళ్లలో విషప్రయోగం ద్వారా 25 ఏనుగులను చంపేశారు. కేవలం అసోంలోనే విషప్రయోగం చేసి ఏకంగా 21 ఏనుగులను హతమార్చారు.



విద్యుత్ షాక్ వల్లే ఎక్కువ..

- ప్రధానంగా విద్యుదాఘాతం వల్లే ఎక్కువగా ఏనుగులు మరణిస్తున్నాయి.
- అటవీ ప్రాంతానికి సమీపంలోని పొలాల్లోకి ఏనుగులు రాకుండా రైతులు విద్యుత్ కంచెలను ఏర్పాటుచేస్తున్నారు. దీంతో ఆహారం, నీటి కోసం అడవి నుంచి బయటకు వస్తున్న ఏనుగులు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందుతున్నాయి. ఐదేళ్లలో విద్యుత్ షాక్‌కు గురై 340 ఏనుగులు మరణించాయి.
- విద్యుత్ షాక్ నుంచి ఏనుగులు, ఇతర వన్యప్రాణులను రక్షించేందుకు అక్రమంగా వేసిన విద్యుత్ కంచెలను తొలగించాలని అన్ని రాష్ట్రాల విద్యుత్ సంస్థలు, విద్యుత్ ట్రాన్స్‌మిషన్ ఏజెన్సీలకు ఆదేశాలు జారీచేసినట్లు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ తెలిపింది.
- భూమిపైన విద్యుత్ లైన్లు లేకుండా చర్యలు తీసుకోవాలని, అండర్ గ్రౌండ్ లేదా, స్తంభాలపై మాత్రమే విద్యుత్ లైన్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు సూచించినట్లు వెల్లడించింది.

రైలు ప్రమాదాల కారణంగా...

- రైళ్లు ఢీకొని కూడా ఎక్కువగానే ఏనుగులు మృతి చెందుతున్నాయి. రైలు ప్రమాదాలబారిన పడి ఐదేళ్లలో 80 గజరాజులు మరణించాయి.

ఏనుగుల సంరక్షణకు ఆర్థిక, సాంకేతిక సాయం

ప్రాజెక్ట్ ఎలిఫెంట్ కేంద్ర ప్రాయోజిత పథకం ద్వారా ఏనుగుల పరిరక్షణ, వాటి ఆవాసాల్లో ఏర్పాట్లకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని రాష్ట్రాలకు అందిస్తున్నట్లు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మనుషులు–ఏనుగుల మధ్య సంఘర్షణను నివారించడానికి ఇప్పటి వరకు 14 రాష్ట్రాల్లో 32 ఎలిఫెంట్ రిజర్వ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. జాతీయ రహదారులపై ఎకో బ్రిడ్జ్‌ల ఏర్పాటు ద్వారా వన్యప్రాణులు సురక్షితంగా రహదారులు దాటేలా కసరత్తు జరుగుతోందని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రపంచ బ్యాంకు సహాయం చేయనుందని పేర్కొంది.

- రైలు ప్రమాదాల వల్ల ఏనుగుల మరణాల నివారణకు రైల్వే బోర్డు, పర్యావరణ–అటవీ మంత్రిత్వ శాఖతో శాశ్వత సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు.
- రైలు పైలెట్‌లకు పట్టాల చుట్టూ ఎక్కువ దూరం స్పష్టంగా కనిపించేలా ట్రాక్ వెంబడి చెట్లను తొలగించాలని, ఏనుగుల ఉనికి గురించి పైలెట్‌లను హెచ్చరించడానికి తగిన పాయింట్ల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటుచేయాలని, రైల్వే ట్రాక్‌ల ఎలివేటెడ్ విభాగాలను ఆధునికీకరించాలని, ఏనుగుల సురక్షిత మార్గం కోసం అండర్ పాస్, ఓవర్ పాస్‌లను నిర్మించాలని నిర్ణయించారు.
- ఏనుగుల ఉనికి ఉన్న ప్రాంతాల్లోని రైల్వే ట్రాక్‌లపై అటవీ శాఖ ఫ్రంట్‌లైన్ సిబ్బంది, వన్యప్రాణుల పరిశీలకులు నిరంతరం పెట్రోలింగ్ చేయడం వంటి చర్యలను తీసుకుంటున్నారు.

ముస్లింల సంక్షేమం సీఎం జగన్‌కే సాధ్యం

రాష్ట్రంలో ముస్లింలకు రక్షణగా ఉన్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- బాబు హయాంలో ముస్లింలకు అరకొర లబ్ధి : డిప్యూటీ సీఎం అంజాద్ బాషా

సాక్షి,అమరావతి: రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల సంక్షేమం సీఎం వైఎస్ జగన్ ఒక్కరికే సాధ్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ముస్లిం మైనారిటీల సంక్షేమం చూడటంతోపాటు వారికి అన్ని విధాలా భరోసా ఇచ్చే పార్టీ వైఎస్సార్‌సీపీ అని అన్నారు. ముస్లింల సంక్షేమం, వారి అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముస్లిం ముఖ్య నాయకులు పాల్గొన్న ఈ సమావేశంలో సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల అభివృద్ధికి వైఎస్సార్ అనేక చర్యలు తీసుకున్నారని, అదే బాటలో సీఎం వైఎస్ జగన్ కూడా వారి రాజకీయ, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదం చేసే అనేక పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ముస్లింలు కూడా జగన్‌పై, వైఎస్సార్‌సీపీపై ఎనలేని ఆప్యాయత, ప్రేమ కనబరుస్తున్నారని అన్నారు.

త్వరలో విజయవాడలో 'జయహో ముస్లిం సభ': అంజాద్ బాషా

చంద్రబాబు హయాంలో ముస్లింలకు అరకొరగానే లబ్ధి చేకూర్చారని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా ముస్లిం మైనారిటీల అభివృద్ధికి రూ.20 వేల కోట్లు సీఎం జగన్ ప్రభుత్వం కేటాయించిందని, ఆ మొత్తాలను నేరుగా వారి ఖాతాల్లోనే వేస్తోందని తెలిపారు. రాజకీయంగానూ అనేక మందికి సీఎం జగన్ పెద్ద పదవులిచ్చారని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించారని చెప్పారు. త్వరలో విజయవాడలో రాష్ట్ర స్థాయి 'జయహో ముస్లిం' సభ నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా, ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, ఎమ్మెల్సీలు ఇక్బాల్, ఇషాక్ బాషా, రుహుల్లా, లేళ్ల అప్పిరెడ్డి, మైనారిటీ విభాగం సలహాదారులు ఎస్ఎం జియావుద్దీన్, హబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి

జీవో 759పై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

కౌంటర్ల దాఖలుకు ఆదేశం

సాక్షి, అమరావతి: అనకాపల్లి జిల్లా రాజుపాలెం గ్రామం పరిధిలోని 1.75 ఎకరాల భూమిని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నిర్మాణానికి లీజుకిస్తూ గత ఏడాది జారీ చేసిన జీవో759 ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వానికి, వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణలో వాదనలు విన్న తరువాత మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తామని తెలిపింది. విచారణను ధర్మాసనం నాలుగు వారాలకు వాయిదా వేసింది.



అమ్మకు ఆరోగ్యం బాగోలేకపోతే..
కూతురు అమ్మకు అమ్మ అవుతుంది.
నాన్న మనసుకు కష్టం కలిగితే..
కూతురు చేయి ఓదార్పు అవుతుంది.
ఈ పదేళ్లలో ప్రభుత్వాలు, ప్రజలలోనూ
బాలికలకు సంబంధించిన సమస్యలపై శ్రద్ధ పెరిగింది.
ప్రపంచ వేదికపై బాలికలు తమ గళాన్ని వినిపించడానికి
మరిన్ని అవకాశాలు పెరిగాయి.
అయినప్పటికీ, బాలికల హక్కులపై
అవగాహన పరిమితంగానే ఉంది.
బాలికలు తమ సామర్థ్యాన్ని నెరవేర్చుకోవడానికి
సమాజంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నారు
వారి అడుగులకు మరింత ఊతాన్ని ఇవ్వాల్సిన తరుణమిది.
'నేషనల్ గర్ల్ చైల్డ్ డే' సందర్భంగా
ఈ విషయంపై దృష్టి సారిద్దాం..

నేషనల్ గర్ల్ చైల్డ్ డే

ఒక్క చిరునవ్వు... కోటి కాంతులు

'కూతుళ్ళే మన భవిష్యత్తు' అనే మాటని మన ప్రధాని నరేంద్రమోదీ వివిధ సందర్భాలలో చెప్పడం పదే పదే విన్నాం. వివిధ రంగాలలో మహిళల విజయాలను గుర్తిస్తున్నాం. ఆడపిల్లల సాధికారతకు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాం. అయినా 'ఆమె' పురోగతికి కుటుంబం, సమాజం చేయాల్సిన కృషి ఎంతో ఉంది.

కుటుంబంలో స్కీమ్స్

ఒకప్పుడు కూతురు ఇంటి గుండె మీద కుంపటి. ఇప్పుడు కుటుంబ సమస్యలను ఓ దరిచేర్చగల చుక్కాని. అందుకే పుట్టేది ఆడపిల్లైనా, మగపిల్లవాడైనా 'సరే' అనే దిశకు కుటుంబం చేరుకుందనే చెప్పాలి. కానీ, 'ఆమె' పెరుగుదలలో ఇంటి నుంచే ఎన్నో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. అందుకు తల్లితండ్రులే అమ్మాయిలను ప్రోత్సహించడానికి స్కీమ్స్ పెడుతుండాలి. ఆమె కలలకు, ఆశయాలకు మద్దతునివ్వాలి. ఎలాంటి సమస్య అయినా 'పరువు' అనే భయంతో కాకుండా బలమైన వెన్నుగా నిలవాలి.

డిజిటల్ జనరేషన్, అవర్ జనరేషన్

ఈ నినాదం ఇప్పుడు బాలికలకు అత్యవసరమైనది. డిజటల్ యుగంలో 'ఆమె'కు వాటి వినియోగంలోనూ పూర్తి అవగాహన అవసరం. ఇప్పటికే అబ్బాయిలతో పోల్చితే అమ్మాయిలు డిజిటల్ పరికరాల వాడకంలో వెనకంజలో ఉన్నట్టు ప్రపంచవ్యాప్త అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. డిజిటల్ మాధ్యమం ద్వారా అమ్మాయిలను ప్రభావంతంగా మార్చే మానవ ఆసక్తి కథనాలు, బ్లాగ్‌లు, వీడియోలు, రీసోర్సింగ్ చేసే స్ఫూర్తిదాయకమైన నెట్‌వర్క్‌లు, సంస్థల గురించి తెలుసుకునే అవకాశాలను కల్పించాలి.

చట్టం.. హక్కులు

సమాజంలో ధైర్యంగా, శక్తిమంతంగా ఎదిగేందుకు ఆమె చుట్టూ ఉన్న రక్షణ, న్యాయ వ్యవస్థల గురించి తెలియజేయాల్సిన అవసరం ఉంది. ఇందుకు కుటుంబంతోపాటు ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైనది.

నాయకత్వాన్ని పెంచుదాం

అవగాహన 'ఆమె'కు అవకాశాలను విస్తృతం చేస్తుంది. నాయకత్వాన్ని ఎంచుకునేలా ఎదగాలంటే ..

- మన ప్రాంతంలోని అమ్మాయిలను వెనక్కి నెట్టివేసే అంశాల గురించి అవగాహన పెంపొందించడంలో, వాటిని పరిష్కరించడంలో ముందుండాలి.
- బాలికలకు అందాల్సిన సేవలను మరింతగా బలోపేతం చేయాలి. ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా వారి నాయకత్వం, చర్యలు, ప్రభావాన్ని సమష్టిగా విస్తరింపజేయాలి.
- ప్రపంచవ్యాప్తంగా బాలికలు లింగ అసమానత, వివక్షకు గురవుతున్నారనేది వాస్తవం. ఇవి బాలికలను ప్రతిచోటా వెనకడుగు వేయిస్తున్నాయి. అందుకే లైంగిక వేధింపులు, హింస, అసమానతలు, హక్కుల గురించి అవగాహన కల్పించడంలో వెనకంజ వేయకూడదు.
- విద్య, ఆరోగ్యం, పోషకాహార ప్రాముఖ్యతలను తెలియజేయడమే కాదు వాటిని అందించడంలోనూ ముందంజలో ఉండాలి.
- అమ్మాయిలు తమలోని ప్రతిభను కనబరచడమే కాకుండా పూర్తి స్వేచ్ఛతో జీవించే అవకాశాన్ని కల్పించాలి.
- చాలా ప్రాంతాలలో అమ్మాయిలను త్వరగా పెళ్లి చేసుకోమని బలవంతం చేయడం లేదు. అయినా, ఎలాంటి హింస జరిగినా ఆడపిల్లలకు తమ గొంతు వినిపించే హక్కు ఉంది. ఈ విషయాన్ని వారికి తప్పక తెలియజేయాలి.
- రోల్ మోడల్స్‌గా ఉన్నవారిని బాలికలకు పరిచయం చేయిస్తూ ఉండాలి. బాలికా నాయకత్వం పట్ల ప్రజలలో అవగాహనను పెంచాలి.
- అలజడులు, వలసలు, ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో సామాజిక సహాయ సేవలను పొందుతున్నప్పుడు బాలికలు అనుభవించే అసమానతలను పరిష్కరించడానికి అధికారులు, విధాన నిర్ణేతలు మరింతగా దృష్టి సారించాలి.

ఒక ఆడపిల్ల తన స్వచ్ఛమైన చిరునవ్వుతో ఇంటిని ప్రకాశవంతం చేస్తుంది. జీవితాన్ని ఎలా గడపాలో నేర్పేది ఆమె. కుటుంబంలో ప్రతి ఒక్కరినీ ప్రేమలో పడేలా చేసే స్వచ్ఛమైన ఆత్మ. కాబట్టి ప్రతి ఇంటినీ తన నిస్వార్థ ప్రేమతో, ప్రకాశంతమైన కాంతితో నింపే ఆమె భవిష్యత్తును ఉజ్వలం చేద్దాం. సమాజంలో సమానమైన అవకాశాలను కల్పించడానికి ప్రయత్నిద్దాం.

ఇందిరాగాంధీ 1966 జనవరి 24న దేశానికి మొదటి మహిళా ప్రధానమంత్రి అయ్యారు.అందుకే ప్రభుత్వం ఈ రోజుని జాతీయ బాలికా దినోత్సవాన్ని జరుపుకోవడానికి ప్రత్యేకంగా ఎంచుకుంది. భారత ప్రభుత్వం 2008లో ఆడపిల్ల పట్ల సమాజంలో చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం జనవరి 24ని జాతీయ బాలికా దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించింది.

బాల్య ముద్రలు

ఆ నీలి రంగు గౌను

బాల్యం మళ్లీ దొరకని
సీతాకోకచిలుక.
బాల్యం మనిషికి
తన అమలిన రూపాన్ని చూపే అద్దం.
బాల్యాన్ని తలుచుకోని వారు ఉండరు.
బాల్యం ఏర్పరిచే గాఢమైన ముద్రలే
మనిషి భవిష్యత్తు ప్రయాణాన్ని
ప్రభావితం చేస్తాయి.
'నా గురించి నేను
రాసుకోవాలనుకున్నప్పుడు
ఎన్ని సినిమాలు చేశాను,
ఎవరితో సినిమాలు చేశాను
రాయాలనిపించ లేదు.
నా బాల్యం గురించే రాసుకోవాలనిపించింది'
అంది నటి దీప్తి నావల్.
'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆమె
తన పుస్తకం 'ఏ కంట్రీ కాల్డ్ చైల్డ్‌హుడ్'
గురించి మాట్లాడింది.
బాల్య జ్ఞాపకాలు పంచుకుంది.



'నాకు ఊహ తెలిశాక వచ్చే మొదటి జ్ఞాపకం... ఒక రోజు సాయంత్రం మా ఇంట్లో అమ్మ లేదు. జేజిని అడిగితే ఉత్తుత్తికే సినిమాకెళ్లిందిలే అంది. అమృత్‌సర్‌లో మా ఇల్లు హాల్ బజార్‌లో ఉండేది. సినిమా హాలు మా ఇంటి దగ్గరే. నేను ఇంట్లో నుంచి బయటకు గెంతి అమ్మ దగ్గరకు వెళతాను అని సినిమా హాలు వైపు పరిగెత్తాను. నాకు బాగా గుర్తు. అప్పుడు గాలి దుమారం రేగింది. వీధిలో చెత్త పైకి రేగింది. షాపులు దుమ్ముతో నిండిపోయాయి. నేను మాత్రం హాలు వైపు పరిగెడుతూనే ఉన్నాను. నా వెనుక మా జేజి. ఆ గాలిలో అర్థమయ్యీ కాక ఎటు వెళ్లేదాన్నోగాని మా జేజి గబుక్కున నన్ను జవురుకొని ఇంటికి తీసుకెళ్లింది. తీసుకెళ్లాక ఆమె అన్న మాట- మంచి ఇంటి ఆడపిల్లలు సినిమా కు వెళ్లకూడదమ్మా అని. ఏ ముహూర్తాన ఆమె ఆ మాట అన్నదో (నవ్వు). నా జీవితం మొత్తం సినిమాల్లోనే గడిచింది'....

●●●

'సినిమాల్లో నేను ఎన్నో కాస్ట్యూమ్స్ తొడుక్కుని ఉంటాను. రోజువారీ జీవితంలో ఫ్యాషన్లు ఫాలో అయి ఉంటాను. కాని నాకు ఇష్టమైన బట్టలు అంటే చిన్నప్పుడు నేను తొడుక్కున్న నీలి రంగు గౌనే. ఆ కథ నాకు చాలా ఇష్టం.

అప్పుడు నాకు పదేళ్లు ఉంటాయి. మా ఇంటికి ఏదో మేగజీను వచ్చేది. అందులో ఒక అడ్వర్టయిజ్‌మెంట్‌లో ఇద్దరు పాపలు ఒకే లాంటి నీలి రంగు గౌన్‌లలో నిలబడి ఉంటారు. మా అమ్మ ఆ ఫొటో చూసి' పండక్కు ఇలాంటి గౌన్లు వేయాలి మీకు' అంది నాతో మా అక్కతో. దీపావళి పండగ దగ్గర్లో ఉంది. దీపావళికి కొత్త బట్టలు తొడుక్కుని టపాకాయలు కాల్చడం ఆనవాయితీ. మా అమ్మ ఇంట్లో ఒక తెల్ల గుడ్డ ఉంటే మమ్మల్ని తీసుకుని అద్దకం దుకాణానికి తీసుకు వెళ్లింది. మేగజీన్‌లోని ఫొటో చూపించి ఆ బట్టకు అదే రంగు నీలం వేయమని చెప్పింది. అతడు తలాడించాడు. మామూలు నీలం కాదు ఇది... పర్షియన్ నీలం... అలాగే ఉండాలి అంది మా అమ్మ. అతను మళ్లీ సరే అన్నాడు. మొత్తం మీద నీలంగుడ్డ మా ఇల్లు చేరింది. ఇక గౌనుగా మారాలి.

మా అమ్మకు బట్టలు కుట్టడం ఆసక్తే అయినా పండగ బట్టలు కాబట్టి మా వీధిలో ఉండే శిక్కు దర్జీకి ఇచ్చింది. ఆయన అప్పటికే కుప్పలు తెప్పలుగా పండగ గుడ్డలు కుట్టే పనిలో ఉన్నాను. పండక్కు ఇస్తానని మాట ఇచ్చాడు. మా ఇంటి నుంచి ఆ దర్జీ షాపు కనిపిస్తుంది. నేను మా అక్క రోజూ షాపు వైపు చూసేవాళ్లం. షాపు దాకా వెళ్లి మా గుడ్డ కదిలిందో లేదో చూసేవాళ్లం.

పండగ వచ్చింది. సాయంత్రమైపోయింది. అందరూ టపాకాయలు కాల్చడం మొదలెట్టారు. మేమిద్దరం మాకు చేరని నీలి రంగు గౌన్లను తలచుకుని మొహం మాడ్చుకుని కూచున్నాం. టపాకాయలు కాల్చలేదు. ఏడూ ఎనిమిది అయిపోయింది. మా బజార్‌లో షాపులన్నీ మూత పడిపోయాయి. దర్జీ షాపు లైటు ఒక్కటే వెలుగుతూ ఉంది. ఆ తర్వాత భోజనాలు చేశాం. వీధిలో టపాకాయల మోత ఆగిపోయింది. మేము పైజామాల్లోకి మారి నిద్రపోబోతున్నాం. అప్పుడు మా ఇంటి గేటు తట్టిన చప్పుడు అయ్యింది. నేను పరిగెత్తాను ఎవరొచ్చారో అర్థమయ్యి. ఆలస్యానికి మన్నింపు కోరుతున్న ముఖంతో రెండు నీలం రంగు గౌన్లు పట్టుకుని దర్జీ.

ఓ.. మేము వెంటనే ఆ గౌన్లు తొడుక్కుని అప్పుడు పండగ మొదలెట్టాం. టపాకాయలు కాల్చి వీధి వీధంతా నిద్ర లేపాం. పదే పదే నేను ఇష్టంగా తలచుకునే జ్ఞాపకం ఇది.

●●●

మా అమ్మ అప్పుడప్పుడు పొరుగునే ఉన్న పేదపిల్లల బడికి వెళ్లి పాలు పంచి వచ్చేది. ఒకరోజు అమ్మతో పాటు నేనూ వెళ్లాను. చాలా మంది చిన్న పిల్లలు అమ్మ దగ్గరకు వచ్చి ఆమె పంచుతున్న పాలు తీసుకుని తాగి సంబర పడ్డారు. మేము తిరిగి వస్తుంటే ఒక పిల్లాడు పరిగెత్తుకుంటూ గిన్నె పట్టుకుని వచ్చాడు. 'అయ్యో... నాన్నా పాలు అయిపోయాయి. ఇంత ఆలస్యం ఏంటి?' అంటే వాడు నిరాశ నిండిన ముఖంతో 'మా ఇంట్లో గిన్నె లేదు. అమ్మ వేరే ఇంటి నుంచి తెచ్చి ఇచ్చింది' అన్నాడు.

మన దేశ పేదరికం గురించి నా మనసు మీద శాశ్వత ముద్ర వేసిన సంఘటన అది.

●●●

నాకు పద్నాలుగేళ్లు ఉండగా నా స్నేహితురాలికి మానసిక ఆరోగ్యం దెబ్బ తింది. ఆ రోజుల్లో పిచ్చి పట్టడం అంటే వారిని బహిష్కరించడమే. ఆ అమ్మాయికి అలా కావడంతో నేను చాలా డిస్టర్బ్ అయ్యాను. ప్రతి వీధిలో చాలామంది ఆడవాళ్లు అలాంటి స్థితిలో కనిపించేవారు. మేము జట్కాలో స్కూలుకు వెళుతుంటే ఒకామె మా వెనుకే పరిగెత్తేది. నాకు చాలా బాధ కలిగేది. వారికి ఏదైనా చేద్దామనే నేను అమెరికాలో సైకాలజీ చదివాను. ఇప్పటికీ నేను మానసిక ఆరోగ్యం సరిగా లేని స్త్రీల గురించి ఆలోచిస్తాను. వారికి నేటికీ సరైన వైద్యం అందడం లేదు. నేను నా కవిత్వ పుస్తకంలో ఎన్నో కవితలు మానసిక ఆరోగ్యాన్ని కోల్పోయిన స్త్రీల గురించి రాశాను. రాస్తాను.

దీప్తి నావెల్ జీవితంలోని ఇలాంటి అనేక అంశాలు 'ఏ కంట్రీ కాల్డ్ చైల్డ్‌హుడ్'లో ఉన్నాయి.


– జైపూర్ నుంచి సాక్షి ప్రతినిధి

అమృత్ పత్తి అదుర్స్!



ఎకరానికి 20 క్వింటాళ్ల పత్తి దిగుబడి సాధించిన ఆదిలాబాద్ జిల్లా రైతు

మహారాష్ట్రకు చెందిన రైతు శాస్త్రవేత్త అమృత్‌రావు దేశ్‌ముఖ్ రూపొందించిన పద్ధతి ఇది



మొదటి రెండు వరుసల మధ్య 4 అడుగులు, తర్వాత రెండు వరుసల మధ్య 6 అడుగుల దూరం చొప్పున పాటించి సాగు చేసిన పత్తి చేను



పత్తి తొలి దశలో మొక్కకు ఎక్కువగా వచ్చిన కొమ్మలు.. కాయలను చూపుతున్న రైతు విజయ్ (ఫైల్)

పత్తి దిగుబడుల పరంగా ఎకరానికి 20 క్వింటాళ్లు సాధించిన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం కొల్హారికి చెందిన యువ రైతు ఫడ్ విజయ్ ఆదర్శంగా నిలుస్తున్నారు. రెట్టింపు దిగుబడి సాధించిన విషయం ఆ నోటా ఈ నోటా తెలుసుకొని పరిసర గ్రామాల రైతులు ఆసక్తిగా పొలాన్ని చూసి వెళ్తున్నారు. సాధారణ సాగులో కొంత మందికి 6 నుంచి 8 క్వింటాళ్లు, మరికొంత మందికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అయితే, ఈ రైతు ఏకంగా రెట్టింపు కంటే అధిక దిగుబడి సాధించడమే రైతులను ఆకర్షిస్తోంది.

ఫడ్ విజయ్‌కు మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా అంబోడ గ్రామంలో చుట్టాలు ఉన్నారు. ఒకసారి ఆ గ్రామానికి వెళ్లినప్పుడు అక్కడ అమృత్ ప్యాటర్న్‌లో సాగు చేయడాన్ని గమనించాడు. దిగుబడి అధికంగా వస్తుందని ఆ రైతులు చెప్పడంతో ఆ వైపు మొగ్గు చూపాడు.

అమృత్ పద్ధతి అంటే..?

యవత్‌మాల్ జిల్లా మహాగావ్ తాలూకా అంభోద గ్రామానికి చెందిన రైతు శాస్త్రవేత్త అమృత్‌రావు దేశ్‌ముఖ్ తన క్షేత్రంలో అనేక ఏళ్ల పాటు ప్రయోగాలు చేసి ఈ సాగు పద్ధతిని రూపొందించారు. అందువల్లనే అమృత్ ప్యాటర్న్ అని పేరు వచ్చింది. ఏకంగా 50 క్వింటాళ్ల వరకు ఎకరంలో పత్తి దిగుబడి సాధించిన ఘనత ఆయనిది.

ఆదిలాబాద్ జిల్లాలో సాధారణంగా పత్తి సాగులో రైతులు మొక్కల మధ్య కొంచెం అటూ ఇటుగా ఒక అడుగు, వరుసల మధ్య 3 నుంచి 4 అడుగులు లేదా 4 నుంచి 5 అడుగుల దూరం పాటిస్తారు. అమృత్ ప్యాటర్న్‌లో మొక్కల మధ్య దూరం కచ్చితంగా ఒక అడుగు ఉండే చూస్తారు. ఒక వరుస మధ్య 4 అడుగులు, ఆ పక్కన వరుస మధ్య దూరం 6 అడుగుల దూరం పాటిస్తారు. అంటే.. మొదటి రెండు వరుసల మధ్య దూరం నాలుగు అడుగులు.. రెండు, మూడు వరుసల మధ్య ఆరు అడుగుల దూరం అనుసరిస్తారు. ఇదే తీరులో చేనంతా పాటిస్తారు. ఇదే విధానాన్ని విజయ్ అవలంభించారు.



ఏడు అడుగులు పెరిగిన పత్తి చేనులో విజయ్

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

అమృత్ పద్ధతిని అవలంభించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధ్యమవుతుంది. ఎరువులు, పురుగుల మందులు ఎక్కువగా వాడే అవసరం పడదు. కలుపు తీయడంతో పాటు ఎరువులు, మందుల ఖర్చుల్లో చాలా ఆదా అవుతుంది. అధిక సాంద్రతతో పూత, కాత రావడం జరుగుతుంది.

– సాయిప్రణీత్
(96768 83233),
వ్యవసాయ విస్తరణాధికారి,
కొల్హారి గ్రామం



నెల తర్వాతే ఎరువులు..

పత్తి సాగులో మొదటి నెల రోజుల పాటు ఎలాంటి ఎరువులు, పురుగుమందులు వాడలేదు. ఇలా చేయటం వల్ల మొక్కకు కొమ్మలు ఎక్కువగా వస్తాయి. విత్తిన నెల తర్వాత ఎకరాకు ఒక బ్యాగు 10:26:26 వేశారు. ఆ తర్వాత నెలలోనూ అదే మోతాదులో అదే ఎరువుతో పాటు అతి తక్కువ ధరకు లభ్యమయ్యే పురుగుల మందు వాడినట్టు వివరించారు.

సాగు పద్ధతి మార్చుకొని అధిక దిగుబడి సాధించా...

రెండేళ్ల కింద పత్తి సాగులో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. మహారాష్ట్రలో కొంతమంది రైతులు అవలంభిస్తున్న అమృత్ ప్యాటర్న్‌లో గతేడాది పత్తి సాగు చేశాను. కొన్ని కాయలు కూడా కుళ్లిపోయాయి. అప్పుడు 9 నుంచి 11 క్వింటాళ్ల మధ్య దిగుబడి వచ్చింది. అమృత్ విధానాన్ని పూర్తిస్థాయిలో పాటించకపోవడంతో దిగుబడి అంతకు పరిమితమైంది. రెండో ఏడాది.. గడిచిన వానా కాలంలో ఈ విధానంలో అమృత్ ప్యాటర్న్‌లో అన్ని పద్ధతులను పూర్తిస్థాయిలో అవలంభించాను. ఎకరానికి 20 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది.

– ఫడ్ విజయ్ (77024 42958),
ఇన్నోవేటివ్ పత్తి రైతు, కొల్హారి గ్రామం,
గుడిహత్నూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా

మూడో నెల తర్వాత 5 కేజీల సల్ఫర్, ఆ తర్వాత 25 కేజీల మెగ్నీషియం నెలకు అందిస్తే సరిపోతుందని విజయ్ తెలిపారు. తద్వారా ప్రతి మొక్కకు వచ్చే కొమ్మలైనా ప్రధాన కొమ్మ, పిల్ల కొమ్మలు చాలా తక్కువ దూరంలో వస్తాయని తెలిపారు. పూత, కాత ఎక్కువగా రావడంతో పాటు రాలిపోకుండా ఉంటాయని విజయ్ వివరించారు.

సాళ్ల మధ్య ఎక్కువ దూరం పెట్టడం వల్ల గాలి, వెలుతురు బాగా తగిలి అధిక దిగుబడి వస్తోంది. చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని అనుభవపూర్వకంగా విజయ్ చెబుతున్నారు. ఎకరానికి రూ. 20 వేలు ఖర్చయ్యింది. 20 క్వింటాళ్ల పత్తి తీసిన తర్వాత మళ్లీ నీటి తడి ఇచ్చారు. ఫలితంగా మున్ముందు కూడా మరికొంత పత్తి దిగుబడి రావచ్చని విజయ్ ఆశిస్తున్నారు.

– గొడిసెల కృష్ణకాంత్ గౌడ్,
స్టాఫ్ రిపోర్టర్, సాక్షి, ఆదిలాబాద్.

సాగుబడి
శ్రావణ కార్తె
జనవరి 24 నుంచి

మొబైల్ ఈవీ కూరగాయల కూలర్!

- తెలంగాణ నాబార్డ్ తోడ్పాటుతో రూపొందించిన పుణే స్టార్టప్ రుకార్ట్
- రైతులు, ఎఫ్.పి.ఓ.ల ఆదాయం 150% పెరిగే అవకాశం



చిన్న, సన్నకారు కూరగాయలు, పండ్ల రైతుల ఆదాయం పెంపొందించే లక్ష్యంతో మహారాష్ట్ర పుణేకు చెందిన నలుగురు ఐఐటీయన్లు 'రుకార్ట్' పేరిట స్టార్టప్ సంస్థను స్థాపించి ఏ రకమైన విద్యుత్తూ అవసరం లేని కూరగాయలు, పండ్లను నిల్వ ఉండే కూలర్‌ను రెండేళ్ల క్రితమే రూపొందించారు. ఇప్పుడు విద్యుత్ బ్యాటరీతో నడిచే వ్యాన్‌కు సబ్జీ కూలర్‌ను నాబార్డ్ తోడ్పాటుతో అనుసంధానించారు.

సబ్జీ (కూరగాయల) కూలర్‌లో వంద కిలోల ఆకుకూరలు, పువ్వులు, కూరగాయలను 4 నుంచి 6 రోజులు తాజాదనం పోకుండా నిల్వ చేయవచ్చు. అందుకు ఈ సబ్జీ కూలర్‌కు కావాల్సింది రోజుకు 20 లీటర్ల నీరు మాత్రమే. ఎటువంటి విద్యుత్తూ అవసరం లేదు. పర్యావరణ అనుకూలమైన 'మెరుగైన ఆవిరి శీతలీకరణ' ఆధారిత ఆటోమైజ్డ్ కోల్డ్ స్టోరేజీని రుకార్ట్ సంస్థ అందిస్తోంది.

ప్రత్యేక మెటల్‌తో తయారు చేసిన సబ్జీ కూలర్ గోడలోకి నీరు పోయాలి. బయటి వాతావరణంలో వేడి వల్ల ఈ నీరు ఆవిరవుతూ లోపలి కూరగాయలకు చల్లదనాన్నిస్తుంది. ఇది ఉద్యాన ఉత్పత్తులను తాజాగా నిల్వ ఉంచడానికే కాదు.. అరటి, నిమ్మ, మామిడి, బొప్పాయి మొదలైన పండ్లను సహజంగా మగ్గబెట్టే గదిగా కూడా పనిచేస్తుందని తయారీదారులు చెబుతున్నారు.



సబ్జీ కూలర్ అరెకరం కూరగాయల లేదా పండ్ల తోట ఉన్న రైతుకు లేదా తన ఉత్పత్తులను నేరుగా అమ్ముకునే రైతుకు అనుకూలంగా ఉంటుంది. దీన్ని పొలం దగ్గర లేదా ఇంటి దగ్గర లేదా మార్కెట్‌లో ఆరుబయట, గోదాములలో సులువుగా ఏర్పాటు చేసుకోవచ్చు. 5 రాష్ట్రాల్లో రైతులు, బెంగళూరులోని సహజ సమృద్ధ ఆర్గానిక్ ప్రొడ్యూసర్స్ కంపెనీ, ఏలూరులోని హరిత మిత్ర వంటి ఎఫ్.పి.ఓ.లు, రిటైల్ అమ్మకందారులు ఇప్పటికి 425 సబ్జీ కూలర్లను ఉపయోగిస్తున్నారు.

మొబైల్ కూలర్‌తో మరింత ఆదాయం

తెలంగాణ నాబార్డు ఆర్థిక తోడ్పాటుతో రుకార్ట్ సంస్థ విద్యుత్ బ్యాటరీతో నడిచే మొబైల్ సబ్జీ కూలర్ వ్యాన్‌ను రూపొందించింది. సిద్దిపేట జిల్లా ములుగులోని రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్.పి.ఓ.)లో ఈ నెల 23న దీన్ని ఆవిష్కరించారు. తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అమ్ముకొనే రైతులు, ఎఫ్.పి.ఓ.ల ఆదాయాన్ని 150% పెంపొందిస్తుందని మొబైల్ ఎలక్ట్రిక్ సబ్జీకూలర్ వ్యాన్ దోహదపడుతుందని రుకార్ట్ వ్యవస్థాపకుల్లో ఒకరైన వికాస్ ఝూ తెలిపారు.

మొబైల్ సబ్జీ కూలర్ పూర్తి చార్జింగ్‌తో గంటకు 25 కి. మీ. వేగంతో వంద కి.మీ. నడుస్తుంది. 350 కిలోల వరకు బరువు మోస్తుంది. కూరగాయలు, పూలు, ఆకు కూరల రంగు, తాజాదనం, దృఢత్వాన్ని కాపాడుతుంది. వృథాను 15% అరికడుతుంది. దీనిపై పెట్టే పెట్టుబడిని 7 నెలల్లోనే తిరిగి రాబట్టుకోవచ్చని వికాస్ ఝూ వివరించారు. వివరాలకు.. 88790 49787, 88956 341918.

మార్చి నుంచి మెత్తళ్ల/పరిగెల సీడ్ సరఫరా



విటమిన్ 'ఎ' తదితర పోషకాలు పుష్కలంగా ఉండే చిరు చేపలు మెత్తళ్ల (పరిగెల) విత్తనోత్పత్తిలో శాస్త్రవేత్తలు సాధించిన విజయం గురించి ఈ నెల 10న 'సాక్షి సాగుబడి' కథనం ద్వారా తెలుసుకున్నాం కదా. మెత్తళ్ల సీడ్ మనకు ఎప్పటికి చేతికి అందుతుందీ అని పలువురు రైతులు ఆత్రతను వ్యక్తపరిచారు. ఈ నేపథ్యంలో సీడ్ ఉత్పత్తి చేసిన హేచరీని 'సాక్షి' ఫోన్ ద్వారా సంప్రదించింది. మార్చి నెల నుంచి సీడ్‌ను విక్రయిస్తామని ఒడిషాలోని బిశ్వాల్ ఆక్వా ఫామ్ అండ్ హేచరీ అధిపతి సౌరబ్ కుమార్ బిస్వాల్ 'సాక్షి'కి తెలిపారు. జగత్సింగ్‌పూర్ జిల్లా తులంగ గ్రామంలో ఈ హేచరీ ఉంది. భువనేశ్వర్ నగరానికి 100 కి.మీ. దూరంలో తారాదీప్ వెళ్లే మార్గంలో తులంగ ఉంటుంది. మెత్తళ్ల ఫిష్ స్పాన్ (50–60 గంటల వయసున్న పిల్లలు)ను మార్చి మొదటి వారం నుంచి రైతులకు విక్రయిస్తారు. లక్ష స్పాన్ ధర రూ. 1,500. ఫ్రై (10–15 రోజుల పిల్లలు)ని మార్చి 15 నుంచి సరఫరా చేస్తారు. వెయ్యి ఫ్రై ధర రూ. 200. ఆగస్టు–సెప్టెంబర్ వరకు మెత్తళ్ల సీడ్ ఉత్పత్తి, సరఫరా జరుగుతుంది. పాలిథిన్ బ్యాగ్‌లలో చేప పిల్లలను ఆక్సిజన్‌తో పాటు నింపి సిద్ధం చేసిన తర్వాత 30 గంటల్లోగా గమ్యం చేర్చాలని బిస్వాల్ తెలిపారు. రోజూ ఆంధ్రప్రదేశ్‌కు 10–15 ఇన్సులేటెడ్ వ్యాన్లు వెళ్తూ ఉంటాయని, వాటిలో మోల సీడ్‌ను తరలించవచ్చన్నారు. ఇతర వివరాలకు.. 93376 62527.

26 నుంచి సేంద్రియ సాగు, విలువ జోడింపుపై 3రోజుల శిక్షణ

సేంద్రియ సాగు విధానం, అందుకు అవసరమైన కషాయాలు, మిశ్రమాల తయారీతోపాటు రైతులు పండించిన పంటలకు విలువ జోడింపుపై ఈ నెల 26, 27, 28 తేదీలలో గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గర కొర్నెపాడు గ్రామంలోని రైతు శిక్షణా కేంద్రంలో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో 3 రోజుల రైతు శిక్షణా కార్యక్రమం జరగనుంది. ఉ. 10 నుంచి సా. 5 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన రైతులు 97053 83666, 95538 25532 ఫోన్ నెంబర్లలో తప్పక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. భోజనం, వసతి సదుపాయం ఉంది. ముందుగా రిజిస్టర్ చేసుకున్న 30 మంది ఏపీ రైతులకే ఈ అవకాశం.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



రంజీ ట్రోఫీ మ్యాచ్‌తో జడేజా పునరాగమనం

మోకాలి గాయం నుంచి కోలుకున్న భారత క్రికెట్ జట్టు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా పునరాగమనం చేయనున్నాడు. తమిళనాడు జట్టుతో నేడు చెన్నైలో మొదలయ్యే రంజీ ట్రోఫీ చివరి లీగ్ మ్యాచ్‌లో జడేజా సౌరాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. 34 ఏళ్ల జడేజా గత ఏడాది ఆగస్టు నుంచి ఆటకు దూరంగా ఉన్నాడు. సౌరాష్ట్ర జట్టుకు దాదాపుగా నాకౌట్ బెర్త్ ఖరారు కావడంతో చివరి మ్యాచ్ నుంచి రెగ్యులర్ కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్, సీనియర్ స్టార్ చతేశ్వర్ పుజారాలకు విశ్రాంతి ఇచ్చారు.

క్వార్టర్ ఫైనల్లో దక్షిణ కొరియా



ప్రపంచకప్ హాకీ టోర్నీలో దక్షిణ కొరియా జట్టు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. భువనేశ్వర్‌లో సోమవారం జరిగిన 'క్రాస్ ఓవర్' మ్యాచ్‌లో కొరియా 'షూటౌట్'లో 3-2తో 2016 రియో ఒలింపిక్స్ విజేత అర్జెంటీనా జట్టును ఓడించింది. నిర్ణీత సమయం ముగిశాక రెండు జట్లు 5-5తో సమంగా నిలిచాయి. మరో 'క్రాస్ ఓవర్' మ్యాచ్‌లో జర్మనీ 5-1తో ఫ్రాన్స్‌పై నెగ్గి క్వార్టర్ ఫైనల్ చేరింది.

క్లీన్ స్వీప్ లక్ష్యంగా...

- నేడు న్యూజిలాండ్‌తో భారత్ చివరి వన్డే
- పరువు కోసం కివీస్ పోరు
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి 'స్టార్ స్పోర్ట్స్-1'లో ప్రత్యక్ష ప్రసారం

ఇండోర్: ఇప్పటికే న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ వశమైంది. నంబర్‌వన్ స్థానం దక్కింది. ఇప్పుడు టీమిండియా క్లీన్ స్వీప్‌తో టాప్ ర్యాంక్‌ను పదిలపరుచుకునే పనిలో పడింది. మొదటి మ్యాచ్‌లో బ్యాట్‌తో, రెండో మ్యాచ్‌లో బౌలింగ్‌తో పర్యాటక జట్టును దెబ్బమీద దెబ్బ వేసిన భారత్ నేడు జరిగే చివరిదైన మూడో వన్డేలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టాలని పట్టుదలతో ఉంది. మరోవైపు కివీస్‌ను ఫలితాలే కాదు... బ్యాటింగ్ ఆర్డర్ కూడా పరేషాన్ చేస్తోంది. గత రెండు మ్యాచ్‌ల్లో టాప్-5 బ్యాటర్స్‌లో ఏ ఒక్కరు కూడా అర్ధసెంచరీ అయినా చేయలేకపోయారు. ఇది జట్టు మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. పరువు నిలబెట్టుకోవాలంటే ఇప్పుడు బ్యాటింగ్ గేర్ మార్చుకోవాల్సిందే. లేదంటే సిరీస్ చేజార్చుకున్న న్యూజిలాండ్ ఆఖరి పోరులోనూ ఓడితే ఈ ఏడాది వన్డే ప్రపంచకప్ వేదికపై ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది.

కోహ్లి స్కోరే బాకీ!

ఈ ఏడాది వరుసగా ఐదు వన్డేలు (లంకపై 3) గెలిచిన టీమిండియా వరల్డ్‌కప్ సన్నాహానికి ఘనమైన ఆరంభమే ఇచ్చింది. కాబట్టి భారత జట్టు ఏ బెంగా, ఒత్తిడి లేకుండా యథేచ్ఛగా చెలరేగడం ఖాయం. ఇక ఈ సిరీస్‌లో ఏమైనా మిగిలింది... చూడాల్సింది ఉందంటే అది కోహ్లి క్లాసిక్సే! శ్రీలంకపై తన శైలి శతకాలతో పాత కోహ్లిని తలపించిన అతను ఈ సిరీస్‌లో 8, 11 పరుగులే చేశాడు. అతని ఫామ్‌పై జట్టు మేనేజ్‌మెంట్‌లో ఏ ఒక్కరికీ అనుమానమే లేదు. కానీ తన మార్క్ బ్యాటింగ్ జోరు చూడాలని జట్టే కాదు... యావత్ భారత అభిమానులు బలంగా కోరుకుంటున్నారు.

పిచ్, వాతావరణం

ఫ్లాట్ పిచ్ ఇది. పైగా గ్రౌండ్ చిన్నది కావడంతో ప్రేక్షకులకు పరుగుల విందు గ్యారంటీ. టాస్ నెగ్గిన జట్టు బౌలింగ్ ఎంచుకుంటుంది. వాన లేదు. మంచు ప్రభావం బౌలర్లపై పడుతుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, ఇషాన్, సూర్యకుమార్, పాండ్యా, వాషింగ్టన్ సుందర్, సిరాజ్, శార్దుల్, కుల్దీప్, షమీ/ఉమ్రాన్.

న్యూజిలాండ్: లాథమ్ (కెప్టెన్), అలెన్, కాన్వే, నికోల్స్/చాప్‌మన్, మిచెల్, ఫిలిప్స్, బ్రేస్‌వెల్, సాన్‌ట్నర్, షిప్లే/డఫీ, టిక్నర్, ఫెర్గూసన్.



లాథమ్



ప్రాక్టీస్‌లో రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్

మహాకాళేశ్వరుడి సేవలో...

ఇండోర్‌లోని సుప్రసిద్ధ శైవక్షేత్రం ఉజ్జయినిలోని శ్రీ మహాకాళేశ్వరుడిని భారత క్రికెటర్లు, అంపైర్లు, మ్యాచ్ అధికారులు దర్శించుకున్నారు. సోమవారం ఉదయం భస్మా హారతి సేవలో ఆటగాళ్లంతా తరించారు. వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, సూర్యకుమార్ యాదవ్‌లు జలాభిషేకం చేశారు. కారు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై జట్టుకు దూరమైన సహచరుడు రిషభ్ పంత్ త్వరగా కోలుకోవాలని ప్రార్థించినట్లు ఆటగాళ్లు తెలిపారు. స్వామి వారి దర్శనానంతరం ఉజ్జయిని లోక్‌సభ ఎంపీ అనిల్ ఫిరోజియా క్రికెటర్లను సత్కరించారు.



5 ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం వేదికగా ఇప్పటి వరకు భారత్ ఐదు వన్డేలు ఆడగా... ఐదింటిలోనూ విజయం సాధించింది. 2011లో వెస్టిండీస్‌తో ఇక్కడే జరిగిన వన్డేలో వీరేంద్ర సెహ్వాగ్ (219) డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. ఈ మైదానంలో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య తొలిసారి వన్డే జరగనుంది.

11 నేడు జరిగే వన్డేలో న్యూజిలాండ్‌పై భారత్ గెలిస్తే స్వదేశంలో 11వసారి ద్వైపాక్షిక సిరీస్ క్లీన్‌స్వీప్ అవుతుంది.

జొకోవిచ్ ఫటాఫట్...

- క్వార్టర్ ఫైనల్లో సెర్బియా స్టార్
- కేవలం ఐదు గేమ్‌లు చేజార్చుకొని ప్రిక్వార్టర్ ఫైనల్లో విజయం

మెల్‌బోర్న్: తనకెంతో కలిసొచ్చిన ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో పదోసారి విజేతగా నిలిచేందుకు సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ మూడు విజయాల దూరంలో ఉన్నాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ జొకోవిచ్ 6-2, 6-1, 6-2తో 22వ సీడ్ అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా)పై అలవోకగా గెలిచాడు. 126 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ కేవలం ఐదు గేమ్‌లను మాత్రమే తన ప్రత్యర్థికి కోల్పోయాడు. ఆరుసార్లు అలెక్స్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ 26 విన్నర్స్ కొట్టాడు. నెట్ వద్దకు 21 సార్లు దూసుకొచ్చి 14 సార్లు పాయింట్లు నెగ్గిన అతను తన సర్వీస్‌లో ఒక్కసారి కూడా ప్రత్యర్థికి బ్రేక్ పాయింట్ అవకాశం ఇవ్వలేదు. మరోవైపు ఐదో సీడ్ ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా) ఐదు సెట్‌ల హోరాహోరీ పోరులో గట్టెక్కి రెండోసారి ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్నాడు. 3 గంటల 37 నిమిషాలపాటు జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో రుబ్లెవ్ 6-3, 3-6, 6-3, 4-6, 7-6 (11/9)తో హోల్గర్ రూన్ (డెన్మార్క్)పై విజయం సాధించాడు.

అమెరికాకు చెందిన అన్‌సీడెడ్ క్రీడాకారులు టామీ పాల్, బెన్ షెల్టన్ తమ సంచలన ప్రదర్శన కొనసాగిస్తూ తమ కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు.



జొకోవిచ్

ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో టామీ పాల్ 6-2, 4-6, 6-2, 7-5తో 24వ సీడ్ బాటిస్టా అగుట్ (స్పెయిన్)పై, బెన్ షెల్టన్ 6-7 (5/7), 6-2, 6-7 (4/7), 7-6 (7/4), 6-2తో జేజే వుల్ఫ్ (అమెరికా)పై గెలిచారు. క్వార్టర్ ఫైనల్స్‌లో రుబ్లెవ్‌తో జొకోవిచ్; బెన్ షెల్టన్‌తో టామీ పాల్ తలపడతారు.

నాలుగో సీడ్ గార్సియాకు షాక్

మహిళల సింగిల్స్ విభాగంలో నాలుగో సీడ్ కరోలినా గార్సియా (ఫ్రాన్స్) కథ ప్రిక్వార్టర్ ఫైనల్లో ముగిసింది. ప్రపంచ 45వ ర్యాంకర్ మగ్దా లినెట్టి (పోలాండ్) 7-6 (7/3), 6-4తో గార్సియాను ఓడించింది. ఈ గెలుపుతో 30 ఏళ్ల మగ్దా లినెట్టి తన 30వ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలిసారి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ఐదో సీడ్ సబలెంకా (బెలారస్) 7-5, 6-2తో 12వ సీడ్ బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్)పై, డొనా వెకిచ్ (క్రొయేషియా) 6-2, 1-6, 6-3తో ప్రవిర్తోవా (చెక్ రిపబ్లిక్)పై, 30వ సీడ్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) 6-0, 6-4తో షుయె జాంగ్ (చైనా)పై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.



గార్సియా

'మిక్స్‌డ్' క్వార్టర్స్‌లో సానియా-బోపన్న జోడీ

తన కెరీర్‌లో చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడుతున్న భారత మహిళా టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మిక్స్‌డ్ డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. సోమవారం జరిగిన రెండో రౌండ్‌లో సానియా మీర్జా-రోహన్ బోపన్న (భారత్) జోడీ 6-4, 7-6 (11/9)తో మకోటో నినోమియా (జపాన్)-ఏరీల్ బెహర్ (ఉరుగ్వే) ద్వయంపై విజయం సాధించింది.



ఇంటివాడైన కేఎల్ రాహుల్



భారత స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్ ఓ ఇంటివాడయ్యాడు. బాలీవుడ్ నటి అతియా శెట్టిని సోమవారం రాహుల్ పెళ్లి చేసుకున్నాడు. కొన్నేళ్లుగా వీరిద్దరు ప్రేమలో ఉన్నారు. ముంబైలో అతియా శెట్టి తండ్రి, బాలీవుడ్ నటుడు సునీల్ శెట్టికి చెందిన ఫామ్‌హౌస్‌లో అతి కొద్ది మంది సన్నిహితుల మధ్య ఈ వివాహ వేడుక జరిగింది. 30 ఏళ్ల అతియా 2015లో 'హీరో' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. అనంతరం 'ముబాకరాన్' ... 'నవాబ్‌జాదే'... 'మోతీచూర్ చక్నాచూర్' సినిమాల్లో నటించింది. 30 ఏళ్ల రాహుల్ ప్రస్తుతం భారత టెస్టు జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ప్రస్తుతం న్యూజిలాండ్‌తో జరుగుతున్న సిరీస్‌కు రాహుల్ దూరంగా ఉన్నాడు.

మేరీకోమ్ సారథ్యంలో...

రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిపై విచారణకు కేంద్ర క్రీడా శాఖ కమిటీ ఏర్పాటు



న్యూఢిల్లీ: భారత బాక్సింగ్ దిగ్గజం మేరీకోమ్ ఒకేసారి రెండు కీలకమైన బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమైంది. స్టార్ రెజ్లర్లు భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు దర్యాప్తు చేసే కమిటీకి ఆమె నేతృత్వం వహించనుంది. అలాగే సమాఖ్య రోజువారీ వ్యవహారాల్ని చూసుకునే బాధ్యత కూడా మేరీకోమ్‌కే కట్టబెట్టారు. ఐదుగురు సభ్యుల కమిటీలో ఆమెతో పాటు 2012 లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, స్టార్ రెజ్లర్ యోగేశ్వర్ దత్, మాజీ షట్లర్ తృప్తి ముర్గుండే, మాజీ 'టాప్స్' సీఈఓ రాజగోపాలన్, 'సాయ్' మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధిక శ్రీమాన్ ఇతర సభ్యులుగా ఉన్నారు. 'రెజ్లింగ్ అధ్యక్షుడిని బాధ్యతల నుంచి తొలగించలేదు. ఆరోపణల నేపథ్యంలో దైనందిన సమాఖ్య వ్యవహారాల నుంచి తాత్కాలికంగా తప్పించాం. ఇప్పుడు మేరీకోమ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల విచారణ కమిటీయే రెజ్లర్ల ఆరోపణలపై దర్యాప్తు చేస్తుంది. సమాఖ్యను నడిపిస్తుంది' అని కేంద్ర క్రీడా శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. నెల రోజుల గడువుతో కమిటీ పనిచేస్తుందని, వారిచ్చే నివేదికను బట్టి చర్యలు చేపడతామని ఆయన చెప్పారు.

సినిమా

స్టార్ వార్



ప్రభాస్ • విజయ్ • అల్లు అర్జున్

బాక్సాఫీస్ వసూళ్ల కోసం గ్యాంగ్‌వార్‌కు రంగం సిద్ధమవుతోంది. ఆల్రెడీ కొందరు స్టార్స్ వార్ డిక్లేర్ చేసి సెట్స్‌లో బిజీగా ఉన్నారు. మరికొందరు రెడీ అవుతున్నారు. ఈ బాక్సాఫీస్ గ్యాంగ్‌వార్ పై ఓ లుక్ వేద్దాం.

పోలీసాఫీసర్‌గా ప్రభాస్ నటించనున్న సినిమా 'స్పిరిట్'. 'అర్జున్‌రెడ్డి' ఫేమ్ సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహించనున్న ఈ సినిమా పనులు ఈ ఏడాది చివర్లో ప్రారంభం కానున్నాయి. ప్రభాస్ కెరీర్‌లో 25వ చిత్రంగా తెరకెక్కనున్న ఈ 'స్పిరిట్' ముంబైలో జరిగే గ్యాంగ్‌వార్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందనే టాక్ వినిపిస్తోంది. అలాగే సందీప్‌రెడ్డి ప్రస్తుతం తెరకెక్కిస్తున్న హిందీ 'యానిమల్' కూడా ఇలాంటి తరహా చిత్రమే. రణ్‌బీర్ కపూర్ హీరోగా రూపొందుతున్న కంప్లీట్ గ్యాంగ్‌స్టర్ ఫిల్మ్ ఇది. తండ్రి కోసం ఓ యువకుడు గ్యాంగ్‌వార్‌లో ఎలా చిక్కుకున్నాడు? అనే కోణంలో ఈ సినిమా సాగుతుందని బాలీవుడ్ టాక్. ఈ ఏడాది ఆగస్టులో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఇక దర్శకుడు సుజిత్ తెరకెక్కించనున్న సినిమాలో పవన్ కల్యాణ్ హీరోగా నటించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ టైమ్‌లో 'దే కాల్ హిమ్ ఓజీ' అనే ట్యాగ్‌లైన్ తెరపైకి వచ్చింది. 'ఓజీ' అంటే ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్ అని ప్రచారం జరిగింది. దీంతో పవన్-సుజిత్ కాంబినేషన్‌లోని మూవీ గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్ అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఎర్రచందనం స్మగ్లింగ్ సిండికేట్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన సినిమా 'పుష్ప'. ఆల్రెడీ విడుదలైన 'పుష్ప' తొలి భాగం 'పుష్ప: ది రైజ్'లో కొన్ని గ్యాంగ్‌వార్ సీన్స్ చూశాం. అలాగే 'పుష్ప: ది రైజ్'కు కొనసాగింపుగా రానున్న 'పుష్ప: ది రూల్'లోనూ కొన్ని గ్యాంగ్ వార్ సన్నివేశాలు ఉంటాయనుకోవచ్చు. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప' సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. కాగా సీనియర్ యాక్టర్ రాజశేఖర్ సైతం ఈ వెండితెర గ్యాంగ్‌వార్‌లో భాగమయ్యారు. పవన్ సాధినేని దర్శకత్వంలో రాజశేఖర్ హీరోగా తెరకెక్కుతున్న 'మాన్‌స్టర్' గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్. ఈ సినిమాను ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. అలాగే యువ హీరో సందీప్ కిషన్ టైటిల్ రోల్‌లో, విజయ్ సేతుపతి ఓ లీడ్ రోల్‌లో నటించిన 'మైఖేల్' కూడా గ్యాంగ్‌స్టర్ డ్రామానే. ఇంకోవైపు 'మాస్టర్' చిత్రం తర్వాత తమిళ ప్రముఖ హీరో విజయ్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో తాజాగా మరో సినిమా రూపొందనుంది. ముంబై నేపథ్యంలో సాగే గ్యాంగ్‌వార్‌గా ఈ సినిమా ఉంటుందనే టాక్ ఆల్రెడీ కోలీవుడ్‌లో మొదలైంది. ఈ సినిమాలో సంజయ్ దత్, ఫాహద్ ఫాజిల్ కీలక పాత్రలు చేయనున్నారనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ సినిమా షూటింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేసి ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు లోకేష్ అండ్ కో. అదే విధంగా ఈ సినిమా తర్వాత కార్తీతో 'ఖైదీ'కి సీక్వెల్‌గా 'ఖైదీ 2' తీయనున్నారు లోకేష్. డ్రగ్స్ మాఫియా నేపథ్యంలో సాగిన 'ఖైదీ' సినిమాకు సీక్వెల్‌గా రానున్న 'ఖైదీ 2' గ్యాంగ్‌వార్ ఫిల్మ్ అట. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. అటు కన్నడంలో ఉపేంద్ర, కిచ్చా సుదీప్, శ్రియ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కబ్జా'. ఆర్. చంద్రు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా 1960-1984 బ్యాక్‌డ్రాప్‌లోని గ్యాంగ్‌స్టర్ ఫిల్మ్ అని తెలుస్తోంది. కాగా, 'సీతారామం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైన దుల్కర్ సల్మాన్ చేస్తున్న మలయాళ చిత్రం 'కింగ్ ఆఫ్ కోతా'. పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే ఈ సినిమాకు అభిషేక్ జోషి దర్శకుడు. దుల్కర్ కెరీర్‌లో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానున్నట్లుగా తెలుస్తోంది. ఈ సినిమాలతో పాటు మరికొన్ని చిత్రాలు గ్యాంగ్‌వార్ నేపథ్యంలో ప్రేక్షకులను అలరించనున్నాయి.



రణ్‌బీర్



కార్తీ



దుల్కర్



రాజశేఖర్



ఉపేంద్ర, సుదీప్

ఆర్ఆర్ఆర్‌కు జపాన్ అకాడమీ అవార్డు



రామ్‌చరణ్, ఎన్టీఆర్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' ఇప్పటికే పలు అంతర్జాతీయ అవార్డులు సాధించిన విషయం తెలిసిందే. తాజాగా 46వ జపాన్ అకాడమీ ఫిల్మ్ ప్రైజ్‌కు సంబంధించి 'అవుట్ స్టాండింగ్ ఫారిన్ ఫిల్మ్' విభాగంలో 'ఆర్ఆర్ఆర్' అవార్డు సాధించింది. 'అవతార్: ద వే ఆఫ్ వాటర్', 'టాప్‌గన్: మ్యావరిక్' వంటి హాలీవుడ్ చిత్రాలను దాటి 'ఆర్ఆర్ఆర్' ఈ జపాన్ అవార్డును సాధించడం విశేషం. గత ఏడాది జపాన్‌లో విడుదలైన 'ఆర్ఆర్ఆర్' అక్కడి బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబడుతున్న సంగతి తెలిసిందే. ఇక 95వ ఆస్కార్ అవార్డ్స్‌కు బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో 'నాటు నాటు' పాట (మరి కొన్ని విభాగాల్లో 'ఆర్ఆర్ఆర్' నామినేషన్ పోటీలో ఉంది), 'బెస్ట్ ఫారిన్ ఫిల్మ్' విభాగంలో గుజరాతీ ఫిల్మ్ 'ఛెల్లో షో', డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో 'ఆల్ దట్ బ్రీత్స్', డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ 'ఎలిఫెంట్ విష్పర్స్' ఆస్కార్స్ షార్ట్ లిస్ట్ జాబితాలో ఉన్నాయి. 'ఆర్ఆర్ఆర్', 'ఛెల్లో షో'లతో కలిపి పది ఇండియన్ చిత్రాలు ఆస్కార్ రిమైండర్ లిస్ట్‌లో ఉన్నాయి. కాగా నేడు ఆస్కార్ నామినేషన్స్ వెల్లడి కానున్నాయి. మరి.. ఎన్ని ఇండియన్ చిత్రాలు నామినేషన్స్ దక్కించుకుంటాయో చూడాలి..

హిట్ డైరెక్టర్‌తో...



వెంకటేశ్

వెంకటేశ్ తన కెరీర్‌లో 75వ మైలురాయి చేరుకుంటున్నారు. ఈ మైల్‌స్టోన్ మూవీ గురించి పూర్తి వివరాలు బుధవారం తెలుస్తాయి. అయితే 'హిట్' చిత్రదర్శకుడు శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్ 75వ చిత్రాన్ని నిర్మించనున్నామని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత వెంకట్ బోయనపల్లి సోమవారం తెలిపారు. ''శ్యామ్ సింగరాయ్'తో నిర్మాణంలోకి అడుగుపెట్టిన మేం ప్రొడక్షన్ నం. 2గా వెంకటేశ్ గారి సినిమా నిర్మించనున్నాం. వెంకటేశ్‌గారి కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెట్ సినిమాగా రూపొందించనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. కాగా.. ఈ సినిమా ప్రకటించిన సందర్భంగా వెంకటేశ్ ప్రీ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఇది యాక్షన్ జానర్ చిత్రం అని ఈ పోస్టర్ స్పష్టం చేస్తోంది.

యాక్షన్ వేద



శివరాజ్‌కుమార్

కన్నడ స్టార్ శివ రాజ్ కుమార్ హీరోగా రూపొందిన చిత్రం 'వేద'. ఈ చిత్రాన్ని శివ రాజ్‌కుమార్ భార్య గీతా శివ రాజ్‌కుమార్ నిర్మించారు. శివరాజ్ కుమార్‌కి 'వేద' 125వ సినిమా కావడంతో గీతా పిక్చర్స్‌లో తొలి ప్రాజెక్ట్‌గా నిర్మించారు. గత ఏడాది డిసెంబర్‌లో కన్నడంలో విడుదలైన ఈ చిత్రం కంచి కామాక్షి కలకత్తా కాళీ క్రియేషన్స్ ద్వారా తెలుగులో 'వేద' టైటిల్‌తోనే విడుదల కానుంది. ''పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం కన్నడంలో ఘన విజయం సాధించింది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఎ. హర్ష దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఘనవిలక్ష్మణ్, అదితీ సాగర్, శ్వేత చంగప్ప, ఉమాశ్రీ తదితరులు నటించారు.

ఈ జర్నీ మా మామయ్యకు అంకితం

- సుధీర్‌బాబు

'నన్ను సినిమాల్లోకి 'వెళ్లనివ్వాలా? వద్దా? అని ఇంట్లో కన్‌ఫ్యూజన్. 'కష్టపడితే సక్సెస్ అవుతాడు. చెయ్యనివ్వండి' అని మా మామయ్య కృష్ణ గారు అన్నారు. అంతే.. నా లైఫ్ టర్న్ తీసుకుంది. కృష్ణగారు వేల తారల్లో ఒక్కరిగా వెలిగిన సూర్యుడు. ఆయన ఒక కాగడాన్ని వెలిగించి వెళ్లిపోయారు. ఇప్పుడు దాన్ని పట్టుకుని ముందుకు నడవాల్సిన బాధ్యత మా కుటుంబానిది'' అని హీరో సుధీర్‌బాబు అన్నారు. సుధీర్‌బాబు హీరోగా, శ్రీకాంత్, భరత్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'హంట్'. మహేశ్ దర్శకత్వంలో ఆనందప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సుధీర్ బాబు మాట్లాడుతూ – ''నా ప్రతి సినిమా మార్నింగ్ షో తర్వాత కృష్ణగారి నుంచి నాకు ఒక ఫోన్ కాల్ వచ్చేది. ఇప్పుడు నేను అది మిస్ అవుతా. కృష్ణగారు ఎవరూ చేయని ప్రయోగాలు చేశారు. ఆ ధైర్యంతోనే 'హంట్' సినిమా చేశాను. ఆయన చనిపోవడానికి 20 రోజుల ముందు సినిమా ఏదైనా చూస్తారా? అని అడిగితే... మహేశ్, సుధీర్ సినిమాలు చూద్దామని అనుకుంటున్నానని అన్నారు. వందల సినిమాలు చేసిన సూపర్ స్టార్ నా సినిమాలు చూస్తానని కోరుకోవడం కంటే నాకేం కావాలి. ఎంత దూరం వెళతానో తెలియదు. ఈ జర్నీ మా మామయ్యకి అంకితం'' అన్నారు. ''ఇంగ్లిష్ టైటిల్‌తో వస్తున్న తెలుగు చిత్రం 'హంట్'' అన్నారు ఆనందప్రసాద్. ''ఈ సినిమాలో నాది పాజిటివ్ క్యారెక్టరా? నెగిటివా? అనేది సస్పెన్స్'' అన్నారు శ్రీకాంత్. ''విక్రమ్'కు, మా 'హంట్'కు సంబంధం లేదు'' అన్నారు మహేశ్. నటుడు గోపరాజు రమణ, ఎగ్జిక్యూటివ్ నిర్మాత అన్నే రవి పాల్గొన్నారు.



శ్రీకాంత్, భరత్, సుధీర్‌బాబు

అందరూ గర్వపడే సినిమా అవుతుంది

- సందీప్ కిషన్

సందీప్ కిషన్ హీరోగా నటించిన పాన్ ఇండియా మూవీ 'మైఖేల్'. విజయ్ సేతుపతి, గౌతమ్ మీనన్, దివ్యాంశ కౌశిక్, వరలక్ష్మీ శరత్‌కుమార్, వరుణ్ సందేశ్ ముఖ్య తారలుగా రంజిత్ జయకొడి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. నారాయణ్ దాస్ కె. నారంగ్ సమర్పణలో భరత్ చౌదరి, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 3న విడుదల కానుంది. సోమవారం ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సందీప్ కిషన్ మాట్లాడుతూ – ''మనల్ని అభిమానించేవాళ్లు మనం కాస్త నిరాశలో ఉన్నప్పుడు ఎనర్జీ ఇస్తుంటారు. ఆ ఎనర్జీ నుంచి కొన్ని మ్యాజికల్ సినిమాలు పుడుతాయి. 'మైఖేల్' అలాంటి సినిమానే. మనందరం గర్వపడే సినిమా అవుతుంది'' అన్నారు. వరుణ్ సందేశ్ మాట్లాడుతూ– 'నేనిప్పటివరకూ చేయని క్యారెక్టర్‌ను ఈ సినిమాలో చేశాను'' అన్నారు. ''ఫిబ్రవరి 3న అందరూ థియేటర్‌లోనే ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను'' అన్నారు రంజిత్ జయకొడి. ''ఈ సినిమా కంటెంట్, బిజినెస్ పరంగా మేం హ్యాపీ'' అన్నారు భరత్ చౌదరి.



సందీప్, వరుణ్ సందేశ్

సాక్షి బిజినెస్
మంగళవారం
24-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	320	60,941
నిఫ్టీ ▲	91	18,119

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,359	▲ 281
డోజోన్స్	33,656	▲ 218
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,784	▲ 14
డాక్స్	15,103	▲ 69
షాంఘై(శుక్రవారం ముగింపు)	3,265	▲ 25
నికాయ్	26,906	▲ 353

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	57,044
బంగారం (99.5 స్వచ్ఛత)	56,816
వెండి (కిలో)	68,273

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఖాతాదారునికి	79.56	83.24
£	బ్రిటన్ పౌండ్	ఖాతాదారునికి	86.37	90.91
€	యూరో	ఖాతాదారునికి	98.26	103.12
¥	జపాన్ ఎన్ (100)	ఖాతాదారునికి	0.50	0.75
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఖాతాదారునికి	54.63	59.45
S$	సింగపూర్ డాలర్	ఖాతాదారునికి	59.49	64.03
SAR	సౌదీ రియాల్	ఖాతాదారునికి	20.71	22.38
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాతాదారునికి	21.26	23.06
¥	చైనా యువాన్	ఖాతాదారునికి	10.87	12.95

మరోసారి డిజిటల్ ఇండియా సేల్



హైదరాబాద్: రిలయన్స్ తమ 'డిజిటల్ ఇండియా సేల్' మరోసారి తీసుకొచ్చింది. అత్యాధునిక టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలపై పలు ఆఫర్లు, డిస్కౌంట్లను పరిచయం చేసింది. ఈ నెల 29వ తేదీ వరకూ ఇది అమల్లో ఉంటుంది. డెబిట్/ క్రెడిట్ కార్డుతో చేసే కొనుగోళ్లపై రూ.20,000 వరకూ తక్షణ డిస్కౌంటు అందిస్తుంది. ఇంకా ఇతర ఆకర్షణీయమైన ఆఫర్లూ ఇస్తున్నట్లు రిలయన్స్ డిజిటల్ ఒక ప్రకటనలో వెల్లడించింది. రిలయన్స్ డిజిటల్, మై జియో స్టోర్లతోపాటు www.reliancedigital.inలో కొనుగోలు ద్వారా ఆఫర్లు పొందవచ్చు. కస్టమర్ల కోసం షరతులకు లోబడి ఇన్‌స్టా డెలివరీ, స్టోర్ పిక్-అప్ వంటి సదుపాయాలు అందిస్తున్నట్లు సంస్థ పేర్కొంది.

కెనరా బ్యాంక్ లాభం హైజంప్

క్యూ3లో రూ. 2,882 కోట్లు



ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో రూ. 2,882 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది (2021-22) ఇదే కాలంలో ఆర్జించిన రూ. 1,502 కోట్లతో పోలిస్తే ఇది 92 శాతం అధికం. మొండి రుణాలు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడ్డాయి. మొత్తం ఆదాయం రూ. 21,312 కోట్ల నుంచి రూ. 26,218 కోట్లకు జంప్ చేసింది. నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) సైతం రూ. 17,701 కోట్ల నుంచి రూ. 22,231 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో స్థూల మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) 7.8 శాతం నుంచి 5.89 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 2.86 శాతం నుంచి 1.96 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి 16.72 శాతంగా నమోదైంది.

క్యూ3 ఫలితాల నేపథ్యంలో కెనరా బ్యాంక్ షేరు 1.3% బలపడి రూ.323 వద్ద ముగిసింది.

ఈ ఏడాదే దేశీ 5జీ టెక్నాలజీ

- వచ్చే ఏడాదిలో ప్రపంచానికి అందిస్తాం
- భారత్‌లో యాపిల్ ఉత్పత్తుల తయారీ పెంపు
- బిజినెస్ 20 సదస్సులో కేంద్ర మంత్రుల వెల్లడి

గాంధీనగర్: దేశీయంగా అభివృద్ధి చేసిన 5జీ, 4జీ టెలికం సాంకేతికతలు, సాధనాలు (టెక్నాలజీ స్టాక్) ఈ ఏడాది భారత్‌లో అందుబాటులోకి రానున్నట్లు కేంద్ర టెలికం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. వీటిని వచ్చే ఏడాది నుంచి ప్రపంచ దేశాలకు అందించగలమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జీ20 కార్యక్రమాల్లో భాగంగా వ్యాపార వర్గాలతో పరిశ్రమల సమాఖ్య సీఐఐ గుజరాత్‌లోని గాంధీనగర్‌లో నిర్వహించిన బిజినెస్ 20 (బీ20) ప్రారంభ సదస్సులో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు తెలిపారు. ఇందులో ప్రభుత్వ వర్గాలు, దిగ్గజ సంస్థల సీఈవోలు తదితరులు పాల్గొంటున్నారు. ప్రపంచంలో కేవలం అయిదు దేశాల దగ్గర మాత్రమే 4జీ-5జీ టెలికం టెక్నాలజీ స్టాక్ ఉండగా, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో భారత్ సొంత సాంకేతికతను అభివృద్ధి చేసుకుందని మంత్రి చెప్పారు. దీన్ని ఏకకాలంలో 1 కోటి కాల్స్‌పై ప్రయోగాత్మకంగా పరీక్షించినట్లు వివరించారు. దేశీ టెక్నాలజీతో 2023లో 50,000 - 70,000 టవర్లు, సైట్లు ఏర్పాటు కానున్నాయని మంత్రి వివరించారు.



ఉత్పత్తి పెంపుపై యాపిల్ దృష్టి ..

భారత్‌లో వ్యాపారాలకు అనువైన పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అంతర్జాతీయ సంస్థలు మన దేశాన్ని తమకు కీలక కేంద్రంగా మార్చుకుంటున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. టెక్ దిగ్గజం యాపిల్ కూడా భారత్‌లో తమ ఉత్పత్తుల తయారీని పెంచుకునే యోచనలో ఉన్నట్లు ఆయన చెప్పారు. సంస్థ విక్రయించే ఉత్పత్తుల్లో ప్రస్తుతం 5-7 శాతం భారత్‌లో తయారవుతుండగా దీన్ని 25 శాతం వరకు పెంచుకోవాలని యాపిల్ భావిస్తోన్నట్లు తెలుస్తోందని ఆయన వివరించారు. యాపిల్ ఇటీవల ప్రవేశపెట్టిన కొన్ని మోడల్స్ భారత్‌లోనే తయారైనవని మంత్రి చెప్పారు. ఎర్త్ మూవర్స్ మెషీన్ రంగానికి చెందిన ఒక విదేశీ కంపెనీ ప్రస్తుతం భారత్ నుంచి 110 దేశాలకు తమ ఉత్పత్తులను చౌకగా సరఫరా చేస్తోందని, ఇక్కడి నుంచే కొత్త ఉత్పత్తులను కూడా ఆవిష్కరిస్తోందని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ వ్యయాలను తగ్గించడంలో, సామర్థ్యాలను పెంచుకోవడంలో, వ్యాపారాలకు ప్రయోజనాలు చేకూర్చడంలోనూ పీఎం గతి శక్తి కార్యక్రమం కీలక పాత్ర పోషించగలదని పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహ విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి అనురాగ్ జైన్ చెప్పారు.

అజెండా రూపకల్పనలో బీ20 కీలక పాత్ర..

జీ-20 దేశాలు, అలాగే మిగతా ప్రపంచ దేశాలకు మరింత విలువ చేకూర్చే దిశగా అజెండాను రూపొందించడంలో బిజినెస్-20 కీలక పాత్ర పోషించగలదని బీ20 ఇండియా చెయిర్ ఎన్ చంద్రశేఖరన్ చెప్పారు. ఈ వేదికకు భారత్ అధ్యక్షత వహించే కాలంలో అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ, సృజనాత్మక నైపుణ్యాలు, డిజిటల్ పరివర్తన తదితర అంశాల్లో పురోగతికి పలు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు, కర్బన ఉద్గారాలరహిత సుస్థిర భవిష్యత్ సాధన ప్రక్రియలో అందరినీ భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని ఐటీసీ సీఎండీ సంజీవ్ పురి అభిప్రాయపడ్డారు. జీ-20కి భారత్ అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో బీ20 ఇండియా సెక్రటేరియట్‌గా వ్యవహరించేందుకు సీఐఐ గతేడాది డిసెంబర్ 1న ఎంపికైంది. సాధారణంగా బీ20 చెయిర్‌గా జీ20 ఆతిథ్య దేశానికి చెందిన ప్రముఖ వ్యాపార దిగ్గజాన్ని జీ20 నియమిస్తుంది. ఈసారి టాటా సన్స్ చైర్మన్ అయిన ఎన్ చంద్రశేఖరన్ ఆ బాధ్యతలు చేపట్టారు.

యాక్సిస్ బ్యాంక్ క్యూ3 భళా

- నికర లాభం 62 శాతం జూమ్
- వడ్డీ ఆదాయం రూ. 11,459 కోట్లు



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో ప్రయివేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 56% ఎగసి రూ. 6,187 కోట్లను అధిగమించింది. స్టాండెలోన్ నికర లాభం మరింత అధికంగా 62% జంప్‌చేసి రూ. 5,853 కోట్లను తాకింది. గతేడాది (2021-22) ఇదే కాలంలో రూ. 3,614 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొండి రుణాలు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించాయి. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) సైతం 32 శాతం వృద్ధితో రూ. 11,459 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 0.73% బలపడి 4.26 శాతానికి చేరాయి. ఆదాయం రూ. 21,101 కోట్ల నుంచి రూ. 26,892 కోట్లకు చేరింది. యాక్సిస్ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) వార్షిక ప్రాతిపదికన 3.17% నుంచి 2.38%కి, నికర ఎన్‌పీఏలు 0.91% నుంచి 0.47%కి దిగివచ్చాయి.

క్యూ3 ఫలితాల నేపథ్యంలో యాక్సిస్ బ్యాంక్ షేరు యథాతథంగా రూ. 930 వద్దే ముగిసింది.

లాకర్ల తాజా ఒప్పందాలకు మరింత గడువు

ఈ ఏడాది చివరి వరకు చేసుకోవచ్చన్న ఆర్‌బీఐ



ముంబై: సవరించిన సేఫ్ డిపాజిట్ లాకర్ల ఒప్పందాలను కస్టమర్లతో బ్యాంక్‌లు కుదుర్చుకోవాల్సి ఉండగా, ఇందుకు ఈ ఏడాది చివరి వరకు గడువును ఆర్‌బీఐ పొడిగించింది. సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా లాకర్ల ఒప్పందాల్లో మార్పులు చేసి, వాటిపై కస్టమర్ల సమ్మతి తీసుకోవాలంటూ 2021 ఆగస్టులోనే ఆర్‌బీఐ అన్ని బ్యాంక్‌లను కోరింది. ''పెద్ద సంఖ్యలో కస్టమర్లు నవీకరించిన లాకర్ ఒప్పందాలపై సంతకాలు చేయాల్సి ఉన్నట్టు మా దృష్టికి వచ్చింది. గడువులోపు (2023 జనవరి 1 నాటికి) లాకర్ ఒప్పందాలను తిరిగి కుదుర్చుకోవాలంటూ కస్టమర్లకు చాలా వరకు బ్యాంక్‌లు తెలియజేయలేదు. కనుక 2023 ఏప్రిల్ 30 నాటికి లాకర్ ఒప్పందాలను తిరిగి కుదుర్చుకోవాల్సిన విషయాన్ని కస్టమర్లకు బ్యాంక్‌లు విధిగా తెలియజేయాలని కోరాం. జూన్ 30 నాటికి కనీసం 50%, సెప్టెంబర్ 30 నాటికి కనీసం 75% కస్టమర్లతో ఒప్పందాలు చేసుకోవాలి. ఒప్పందం కాపీని కస్టమర్‌కు అందించాలి'' అని తాజా ఆదేశాల్లో ఆర్‌బీఐ పేర్కొంది. జనవరి 1 నాటికి ఒప్పందాలు చేసుకుని లాకర్‌లను స్తంభింపజేస్తే, వాటిని తిరిగి విడుదల చేయాలని ఆదేశించింది.

ఈవీ మార్కెట్లోకి హోండా

- 2024 మొదట్లో తొలి టూ వీలర్
- వచ్చే నెల్లో ఆరంభ స్థాయి బైక్
- కంపెనీ ఎండీ అట్సుషి ఒగటా

న్యూఢిల్లీ: హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) విభాగంపై బలమైన ప్రణాళికలతో ఉంది. వచ్చే ఏడాది మార్చి నాటికి తొలి ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాన్ని విడుదల చేయనున్నట్టు కంపెనీ ఎండీ, ప్రెసిడెంట్, సీఈవో అట్సుషి ఒగటా తెలిపారు. యాక్టివా నూతన వెర్షన్ విడుదల సందర్భంగా కంపెనీ ఈవీ ప్రణాళికలను ఆయన వెల్లడించారు. ''మొదటి ఎలక్ట్రిక్ మోడల్‌ను 2024 మార్చిలో విడుదల చేయాలని అనుకుంటున్నాం. భారత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త ప్లాట్‌ఫామ్‌పై దీని అభివృద్ధి చేపట్టాం. మొదటి మోడల్ ఫిక్స్‌డ్ బ్యాటరీతో వస్తుంది. రెండో మోడల్ స్వాపబుల్ (మార్చిడికి వీలైన) బ్యాటరీతో ఉంటుంది. మందుగా దేశవ్యాప్తంగా మాకున్న 6,000 విక్రయ అవుట్‌లెట్ల వద్ద చార్జింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తాం. తర్వాత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా విస్తరణపై నిర్ణయం తీసుకుంటాం''అని ఒగటా వివరించారు. ఈవీ మార్కెట్లోకి ప్రవేశం ఆలస్యంపై స్పందిస్తూ.. ''గతేడాది నుంచి ఈవీ వ్యాపారంపై దృష్టి సారించాం. ఒక్కసారి భారత్‌లో ఈ వ్యాపారం ప్రారంభించామంటే అది స్వల్పకాలానికి కాకుండా దీర్ఘకాలం కోసమే అవుతుంది''అని బదులిచ్చారు.



న్యూజెర్సీలో తనిష్క్ కొత్త స్టోర్



హైదరాబాద్: ప్రముఖ ఆభరణాల సంస్థ తనిష్క్ అమెరికాలో తొలి స్టోర్‌ను ప్రారంభించింది. న్యూజెర్సీ రాష్ట్రంలో మినీ ఇండియాగా పేరొందిన 'ఓక్ ట్రీ రోడ్' అనే ప్రాంతంలో దీన్ని తెరిచింది. యూఎస్ చట్టసభ్యుడు మెనెండెజ్ కొత్త స్టోర్‌ను ప్రారంభించారు. ఇందులో 6,500కు పైగా ప్రత్యేక డిజైన్లను అందుబాటులో ఉంచారు. అమెరికాలోని భారతీయులకు అనుగుణంగా వీటిని రూపొందించారు. 'తనిష్క్‌ను అంతర్జాతీయ బ్రాండ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. అందులో భాగంగానే అమెరికాలో స్టోర్‌ను తెరిచాము. వచ్చే 2-3 ఏళ్లలో ఉత్తర అమెరికా, పశ్చిమాసియాలో 20-30 స్టోర్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము' అని తనిష్క్ మాతృసంస్థ టైటన్ కంపెనీ లిమిటెడ్ ఎండీ సీ.కే.వెంకటరామన్ తెలిపారు.

రెండు రోజుల నష్టాల్లోంచి లాభాల్లోకి

- ఐటీ, ఫైనాన్స్ షేర్ల దన్ను
- ప్రపంచ మార్కెట్ల సానుకూలతలు
- సెన్సెక్స్ లాభం 320 పాయింట్లు



ముంబై: ఐటీ, ఫైనాన్స్ షేర్లు రాణించడంతో దేశీయ స్టాక్ సూచీలు రెండు రోజుల నష్టాల్లోంచి లాభాల్లోకి మళ్లాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందాయి. ఇటీవల వెల్లడైన కార్పొరేట్ క్యూ3 ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాలు మెప్పించగలిగాయి. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 320 పాయింట్లు బలపడి 60,941 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 91 పాయింట్లు పెరిగి 18,119 వద్ద నిలిచింది. మెటల్, రియల్టీ రంగాల షేర్లు మాత్రమే నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.220 కోట్ల షేర్లను విక్రయించగా, దేశీయ ఇన్వెస్టర్లు రూ.435 కోట్ల కొన్నారు. గత శుక్రవారం అమెరికా మార్కెట్ల లాభాల ముగింపుతో ఆసియా, యూరప్ మార్కెట్లు సానుకూలంగా ముగిశాయి. నూతన సంవత్సరం(లూనార్) సెలవుల కారణంగా ఆసియాలో చైనా, సింగపూర్, దక్షిణ కొరియా, తైవాన్, హాంగ్‌కాంగ్ సూచీలు పనిచేయలేదు. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు లాభాల స్వీకరణ జరగడంతో ఆరంభ లాభాల్ని కోల్పోయి అరశాతం నష్టంతో రూ.2430 వద్ద ముగిసింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎల్ఐసీలో 9394 ఏడీవో పోస్టులు

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా ఉన్న ఎల్ఐసీ కార్యాలయాల్లో రెగ్యులర్ ప్రాతిపదికన అప్రెంటిస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(ఏడీవో) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేసింది. హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య జోనల్ కార్యాలయంలో వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 9394
- **జోన్ల వారీగా ఖాళీలు:** సెంట్రల్ జోనల్ ఆఫీస్ (భోపాల్)-561; ఈస్టర్న్ జోనల్ ఆఫీస్ (కోల్‌కతా) -1049; ఈస్ట్ సెంట్రల్ జోనల్ ఆఫీస్ (పాట్నా)-669; నార్తర్న్ జోనల్ ఆఫీస్ (న్యూఢిల్లీ)-1216;నార్త్ సెంట్రల్ జోనల్ ఆఫీస్ (కాన్పూర్)-1033; సదరన్ జోనల్ ఆఫీస్ (చెన్నై)-1516; సౌత్ సెంట్రల్ జోనల్ ఆఫీస్ (హైదరాబాద్) - 1408; వెస్టర్న్ జోనల్ ఆఫీస్ (ముంబై) -1942.
- **దక్షిణ మధ్య జోన్‌లో అప్రెంటిస్ ఏడీవో ఖాళీలు: 1408: డివిజన్ల వారీగా ఖాళీలు:** కడప-90, హైదరాబాద్-91, కరీంనగర్-42, మచిలీపట్నం-112, నెల్లూరు-95, రాజమహేంద్రవరం -69, సికింద్రాబాద్-94, విశాఖపట్నం-57, వరంగల్-62, బెంగళూరు1-115, బెంగళూరు2 -117, బెల్గాం-66, ధార్వాడ్-72, మైసూర్-108, రాయచూర్-83, షిమోగా-51, ఉడిపి-84.
- **అర్హత:** ఏదైనా విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ లేదా ముంబైలోని ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఫెలోషిప్ ఉన్నా దరఖాస్తు చేసుకోవచ్చు. లైఫ్ ఇన్సూరెన్స్ ఇండస్ట్రీ లేదా ఫైనాన్స్ ప్రొడక్ట్స్ మార్కెటింగ్ విభాగంలో కనీసం రెండేళ్ల పని అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుంది.
- **వయసు:** 01.01.2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** ఏడీవోగా ఎంపికైన అభ్యర్థులకు అప్రెంటిస్ సమయంలో నెలకు రూ.51,500 స్టైపెండ్‌గా చెల్లిస్తారు. తదనంతరం ప్రొబేషనరీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా నెలకు సుమారు రూ.56వేలకు పైగా వేతనం అందుతుంది.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్షలు(ప్రిలిమినరీ/మెయిన్ ఎగ్జామినేషన్), ఇంటర్వ్యూ, ప్రీ-రిక్రూట్‌మెంట్ మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** ప్రిలిమ్స్‌లో రీజనింగ్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్ సబ్జెక్టుల నుంచి 100 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం ఒక గంట. మెయిన్స్‌లో రీజనింగ్ ఎబిలిటీ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, జీకే, కరెంట్ అఫైర్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, ఇన్సూరెన్స్ అండ్ ఫైనాన్షియల్ మార్కెటింగ్ అవేర్‌నెస్ తదితర సబ్జెక్టుల్లో 160 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపు ప్రారంభతేది:** 21.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లించడానికి చివరి తేది:** 10.02.2023.
- **ఆన్‌లైన్ పరీక్ష కాల్‌లెటర్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 04.03.2023
- **ప్రిలిమినరీ పరీక్ష తేది:** 12.03.2023.
- **మెయిన్ పరీక్ష తేది:** 08.04.2023.
- **వెబ్‌సైట్:** www.licindia.in

ఇఫ్లూ దూరవిద్యలో ఎంఏ ఇంగ్లిష్‌లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ).. 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి దూర విద్యా విధానంలో ఎంఏ ఇంగ్లిష్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **వ్యవధి:** రెండేళ్లు(నాలుగు సెమిస్టర్లు).
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డీన్, స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ది ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్శిటీ, హైదరాబాద్ చిరునామాకు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 16.02.2023.
- **వెబ్‌సైట్:** efluniversity.ac.in

తెలంగాణ మైనారిటీ పాఠశాలల్లో, కళాశాలల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(టీఎంఆర్ఈఐఎస్).. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైనారిటీ పాఠశాలల్లో ఐదో తరగతితోపాటు 6, 7, 8 తరగతులు (బ్యాక్‌లాగ్), ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి 4, 5, 6, 7, 10వ తరగతుల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.01.2023
- **ధ్రువపత్రాల పరిశీలన తేది:** 24.04.2023 నుంచి 10.05.2023 వరకు.
- **వెబ్‌సైట్:** tmreis.telangana.gov.in

స్మార్ట్ హైరింగ్.. ఐటీ కొలువు!

» ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్‌కు టీసీఎస్ స్మార్ట్ హైరింగ్ టెస్ట్
» సైన్స్, కంప్యూటర్స్, ఒకేషనల్ డిగ్రీ ఉత్తీర్ణులకు అవకాశం
» స్మార్ట్ హైరింగ్ ద్వారా 40 వేల మందికి కొలువులు
» ఫిబ్రవరి 10న టీసీఎస్ స్మార్ట్ హైరింగ్ టెస్ట్

సాఫ్ట్‌వేర్ కొలువు.. ఐటీ రంగంలో కెరీర్.. దేశంలో డిగ్రీ స్థాయి కోర్సులు చదువుతున్న ప్రతి ఒక్కరి స్వప్నం! చదివిన డొమైన్‌తో సంబంధం లేకుండా.. ఇప్పుడు అధికశాతం మంది ఐటీ జాబ్స్ కోసం అన్వేషణ సాగిస్తున్న పరిస్థితి! కాని క్యాంపస్ డ్రైవ్స్ కేవలం ఇంజనీరింగ్ నేపథ్యం ఉన్న టాప్ కాలేజీల విద్యార్థులకే లభిస్తున్నాయనే భావన! ఇలాంటి వారు తమ సాఫ్ట్‌వేర్ కొలువు కలను సాకారం చేసుకునేందుకు మార్గం.. టీసీఎస్ స్మార్ట్ హైరింగ్!! దేశంలో టాప్-5 ఐటీ కంపెనీల జాబితాలో నిలిచిన సాఫ్ట్‌వేర్ సంస్థ టీసీఎస్.. ఆఫ్ క్యాంపస్ పద్ధతిలో చేపడుతున్న నియామక విధానమే.. స్మార్ట్ హైరింగ్! తాజాగా స్మార్ట్ హైరింగ్-2023 ప్రక్రియను టీసీఎస్ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో.. స్మార్ట్ హైరింగ్‌కు దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, సిలబస్ తదితర వివరాలు..


ఐటీ కంపెనీల్లో నాన్-ఇంజనీరింగ్ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కొలువు అందని ద్రాక్షే అనే అభిప్రాయముంది. దీనికి భిన్నంగా.. సైన్స్, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఒకేషనల్, కంప్యూటర్స్/ఐటీ సబ్జెక్ట్‌లతో బ్యాచిలర్ డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ జాబ్ ఖరారు చేసేందుకు ప్రముఖ ఐటీ కంపెనీ టీసీఎస్..ఆఫ్ క్యాంపస్ విధానంలో చేపడుతున్న నియామక ప్రక్రియే.. టీసీఎస్ స్మార్ట్ హైరింగ్.

అర్హతలు

- నిర్దేశిత గ్రూప్‌లలో 2023లో డిగ్రీ పూర్తి చేసుకోనున్న విద్యార్థుల కోసం స్మార్ట్ హైరింగ్ ప్రక్రియను టీసీఎస్‌లో ప్రారంభించింది.
- బీసీఏ, బీఎస్సీ(మ్యాథమెటిక్స్/స్టాటిస్టిక్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/ఎలక్ట్రానిక్స్/బయో కెమిస్ట్రీ/కంప్యూటర్ సైన్స్/ఐటీ), కంప్యూటర్ సైన్స్/ఐటీలో బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సులను 2023లో పూర్తి చేసుకోనున్న విద్యార్థులను అర్హులుగా పేర్కొంది.
- పదో తరగతి నుంచి బ్యాచిలర్ డిగ్రీ వరకు ప్రతి స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు లేదా 5 సీజీపీఏతో ఉత్తీర్ణత సాధించాలి.
- బ్యాచిలర్ డిగ్రీలో ఒక బ్యాక్‌లాగ్ మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు.
- అకడమిక్‌గా గ్యాప్ రెండేళ్ల కంటే ఎక్కువ ఉండకూడదని కూడా పేర్కొన్నారు.
- దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వయసు 18-28 ఏళ్ల మధ్య ఉండాలి.

'సైన్స్ టు సాఫ్ట్‌వేర్'

టీసీఎస్ స్మార్ట్ హైరింగ్ ప్రధాన ఉద్దేశం..ఆఫ్ క్యాంపస్ డ్రైవ్‌ను విస్తృతం చేయడం.అదే విధంగా.. నిర్దేశిత సబ్జెక్ట్ గ్రూప్‌లతో డిగ్రీ పూర్తి చేసిన వారికి సాఫ్ట్‌వేర్ కొలువులు ఖరారు చేయడం. ఇందుకోసం ప్రత్యేకంగా సైన్స్ టు సాఫ్ట్‌వేర్ పేరుతో వినూత్న ప్రోగ్రామ్‌ను అమలు చేస్తోంది. దీనిలో భాగంగా మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, బయో కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్‌లతో బీఎస్సీ.. అదే విధంగా బీసీఏ,సీఎస్/ఐటీలో బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సు చివరి సంవత్సరం విద్యార్థుల కోసం స్మార్ట్ హైరింగ్ ప్రక్రియను చేపడుతోంది.



సమయం ఆదా

టీసీఎస్ స్మార్ట్ హైరింగ్ ప్రక్రియలో మరో ప్రధాన ఉద్దేశం.. సమయం ఆదా చేయడం. వాస్తవానికి క్యాంపస్ డ్రైవ్ విధానంలో నియామక ప్రక్రియ పూర్తయి.. అభ్యర్థుల ఎంపిక ఖరారు చేసేందుకు దాదాపు మూడు నెలల సమయం పడుతోంది. దీంతో అటు విద్యార్థులకు, ఇటు సంస్థకు సమయం ఆదా అయ్యేలా టీసీఎస్ స్మార్ట్ హైరింగ్ ప్రక్రియ దోహదపడుతుంది.

40 వేల మంది

టీసీఎస్ స్మార్ట్ హైరింగ్ ప్రక్రియ ద్వారా ఏటా దాదాపు 35 వేల నుంచి 40 వేల మంది వరకూ ఫ్రెషర్స్‌ను రిక్రూట్ చేసుకుంటోంది. ఈ సంఖ్యను ప్రతి ఏటా సంస్థ నియామక ప్రణాళిక ఆధారంగా నిర్ధారిస్తున్నారు. జాతీయ స్థాయిలో దాదాపు రెండువేలకు పైగా ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులకు ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనే అవకాశం కల్పిస్తోంది.

ఆరు నెలల శిక్షణ

టీసీఎస్ స్మార్ట్ హైరింగ్ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి ఆఫర్ ఖరారు చేసుకున్న వారికి ఆరు నెలల పాటు శిక్షణ అందిస్తారు. కోడింగ్, ప్రోగ్రామింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీ అంశాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, బిహేవియర్ స్కిల్స్, ఇతర సాఫ్ట్ స్కిల్స్‌లోనూ నైపుణ్యం పొందేలా శిక్షణ ఉంటుంది. శిక్షణ పూర్తయిన తర్వాత అభ్యర్థులకు వారి ఆసక్తి మేరకు ఐటీ లేదా బీపీఎస్ విభాగాల్లో నియామకాలు ఖరారు చేస్తారు. రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వార్షిక వేతనం లభిస్తుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

టీసీఎస్ స్మార్ట్ హైరింగ్ విధానంలో మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి..రాత పరీక్ష, టెక్నికల్ ఇంటర్వ్యూ, హెచ్‌ఆర్ రౌండ్ ఇంటర్వ్యూ. తొలిదశ రాత పరీక్ష ఫిబ్రవరి 10వ తేదీన టీసీఎస్ ఐయాన్ సెంటర్లలో జరుగుతుంది.

రాత పరీక్ష.. మూడు విభాగాలు

తొలుత ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహిస్తారు. మొత్తం మూడు విభాగాల(వెర్బల్ ఎబిలిటీ, రీజనింగ్ ఎబిలిటీ, న్యూమరిక్ ఎబిలిటీ) నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో విభాగం నుంచి 15-20 ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. పరీక్ష వ్యవధి 50 నిమిషాలు.

రెండో దశ.. టెక్నికల్ ఇంటర్వ్యూ

ఆన్‌లైన్ టెస్ట్‌లో సంస్థ నిర్దేశించిన కటాఫ్ మార్కులు సాధించిన వారిని తదుపరి దశ టెక్నికల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఈ దశలో ఐటీ రంగానికి సంబంధించిన అభ్యర్థుల ప్రాథమిక పరిజ్ఞానం, సాఫ్ట్‌వేర్ రంగంపై ఆసక్తి, అకడమిక్ నేపథ్యం ఆధారంగా సంబంధిత సబ్జెక్ట్‌లలో నైపుణ్యాలను పరీక్షిస్తారు.

చివరగా హెచ్ఆర్ ఇంటర్వ్యూ

టెక్నికల్ ఇంటర్వ్యూలోనూ విజయం సాధించిన వారికి చివరగా హెచ్ఆర్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని,నాయకత్వ లక్షణాలను,సాఫ్ట్ స్కిల్స్‌ను పరిశీలిస్తారు. ఈ ప్రక్రియలోనూ విజయం సాధిస్తే.. నియామకం ఖరారు చేసి.. ఆరు నెలలపాటు నిర్వహించే శిక్షణకు పంపుతారు.

రాత పరీక్షలో విజయం ఇలా

తొలి దశగా నిర్వహించే రాత పరీక్షలో.. 3 విభాగాల నుంచి ప్రశ్నలు అడిగే అవకాశముంది. అవి..

వెర్బల్ ఎబిలిటీ

యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ది ఎర్రర్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్స్, యాక్టివ్-ప్యాసివ్ వాయిస్, క్లోజ్ టెస్ట్, వెర్బల్ అనాలజీస్, సెంటెన్స్ కరెక్షన్, పేరా రైటింగ్, కాంప్రహెన్షన్, ఇడియమ్స్, ఫ్రేజెస్, డైరెక్ట్-ఇన్‌డైరెక్ట్ స్పీచ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఇంగ్లిష్ గ్రామర్‌పై పదో తరగతి స్థాయిలో పూర్తి అవగాహన పొందాలి. అదే విధంగా సెంటెన్స్ ఫార్మేషన్, కరెక్షన్, కాంప్రహెన్షన్‌ల కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్స్ చదవడం ఉపయుక్తంగా ఉంటుంది.

రీజనింగ్ ఎబిలిటీ

ఈ విభాగంలో కోడింగ్, డీ కోడింగ్, స్టేట్‌మెంట్స్ అండ్ ఆర్గ్యుమెంట్స్, బ్లడ్ రిలేషన్స్, అనాలజీ, సిరీస్, పజిల్స్, లెటర్ సిరీస్, వెన్ డయాగ్రమ్స్, విజువల్ రీజనింగ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

న్యూమరికల్ ఎబిలిటీ

ఈ విభాగంలో ఫ్రాక్షన్స్,ప్రాబబిలిటీ, సిరీస్ అండ్ ప్రోగ్రెషన్స్, యావరేజెస్, ఈక్వేషన్స్, ఏరియా, స్పేస్, పెరిమీటర్, రేషియోస్, ప్రాఫిట్ అండ్ లాస్, వర్క్ అండ్ టైమ్, టైమ్ అండ్ డిస్టెన్స్, జామెట్రీ, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, నంబర్ సిస్టమ్, ఎల్‌సీఎం, హెచ్‌సీఎం, పర్సంటేజెస్ వంటి ప్యూర్ మ్యాథ్స్, అర్థమెటిక్‌కు సంబంధించిన అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. వీటికి సమాధానం ఇవ్వడం కోసం 12వ తరగతి స్థాయిలో ప్యూర్ మ్యాథ్స్, అదే విధంగా అర్థమెటిక్ పుస్తకాలు అధ్యయనం చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

ప్రతి విభాగంలో ప్రతి ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు సగటున 50 సెకన్ల నుంచి ఒక నిమిషం వ్యవధి మాత్రమే అందుబాటులో ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి.

రిజిస్ట్రేషన్ ఇలా

- టీసీఎస్ స్మార్ట్ హైరింగ్-2023కు హాజరుకావాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.
- అందుకోసం https://nextstep.tcs.com/campus/#/లో లాగిన్ ఐడీ,పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి.
- ఆ తర్వాత ఐటీ, బీపీఎస్ విభాగాల్లో తమకు ఆసక్తి ఉన్న విభాగంపై క్లిక్ చేయాలి.
- తర్వాత దశలో ఆన్‌లైన్ అప్లికేషన్‌ను పూర్తి చేయాలి. అదే విధంగా నిర్దేశిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- ఆన్‌లైన్ అప్లికేషన్ సమయంలోనే టెస్ట్ సెంటర్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది.
- ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయితే అభ్యర్థులకు కన్ఫర్మేషన్ వస్తుంది.
- ఆ తర్వాత పరీక్ష తేదీకి నాలుగు రోజుల ముందుగా వారికి కేటాయించిన టెస్ట్ సెంటర్ వివరాలను తెలియజేస్తారు.

ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జనవరి 31, 2023
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** ఫిబ్రవరి 10, 2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.tcs.com/careers/india/tcs-smart-hiring-2023
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్:** https://nextstep.tcs.com/campus/#/

ప్రగతి వెంబడి పరుగులు..!


రెండో దశలో చంద్రపాలెం పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు గదులు

- శరవేగంగా నాడు–నేడు రెండో దశ పనులు
- విశాఖ జిల్లాలో 321 పాఠశాలల అభివృద్ధి
- జిల్లాకు రూ. 126.19 కోట్ల కేటాయింపు
- హైస్కూళ్లకు ప్రాధాన్యం
- ఇప్పటికే రూ.20.54 కోట్లు పనుల పూర్తి

విశాఖ విద్య: జిల్లాలో 321 పాఠశాలలను నాడు–నేడు రెండో విడతలో అభివృద్ధి చేస్తున్నారు. ఇందు కోసం ప్రభుత్వం జిల్లాకు రూ.126.19 కోట్లు మంజూరు చేసింది. ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేందుకని నాడు–నేడు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నేపథ్యంలో పనులు సకాలంలో పూర్తి చేసేలా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున జిల్లా విద్యాశాఖాధికారులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. నాడు–నేడు తొలి విడతలో ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.325.49 కోట్లుతో 1,130 పాఠశాలలను అభివృద్ధి చేశారు. దీనికి కొనసాగింపుగా రెండో విడతలో మరింత పారదర్శకంగా పనులు చేపట్టేలా దృష్టి పెట్టారు. జాతీయ విద్యా విధానం అమలు మేరకు పాఠశాలల్లో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేలా జిల్లా విద్యాశాఖాధికారులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు.

విద్యాశాఖ చరిత్రలో ఇదే తొలిసారి

విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణల నేపథ్యంలో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో అవసరమైన చోట్ల అదనపు గదుల నిర్మాణానికి నాడు–నేడు రెండో దశలో ప్రాధాన్యత ఇచ్చారు. విశాఖపట్నం జిల్లా లోని 115 హైస్కూళ్లలో 540 అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. ఒక్కో అదనపు గది నిర్మాణానికి రూ.12 లక్షలు వెచ్చించనున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏదైనా పాఠశాలలో అదనపు గది నిర్మాణానికి నిధుల కోసమని ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. కానీ, ఒకే సారి ఈ రీతిన అదనపు గదులు నిర్మిస్తుండడం విశాఖ జిల్లా విద్యాశాఖ చరిత్రలో ఇదే తొలిసారి అని విద్యావేత్తలు, ఉపాధ్యాయులు అంటున్నారు. గతంలో పనులు చేపట్టి, వివిధ కారణాలతో అసంపూర్తిగా వదిలేసిన భవనాలను సైతం వినియోగంలోకి తీసుకొచ్చేలా నిధులు కేటాయించారు.



నాడు-నేడు మొదటి దశలో అభివృద్ధి చేసిన విశాఖ నగరంలోని మధురానగర్ స్కూల్

భవిష్యత్ అవసరాలు తీర్చేలా..

ప్రభుత్వ పాఠశాలల్లో భవిష్యత్ అవసరాలను తీర్చేలా పనుల గుర్తింపులో విద్యాశాఖాధికారులు శ్రద్ధ తీసుకున్నారు. తల్లిదండ్రుల కమిటీ సభ్యులను భాగస్వామ్యులను చేసి సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, అవసరమైన పనులు గుర్తించడంతో పాటు, వారంతా కలసి పనులు పూర్తి చేసేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. పేరెంట్స్ కమిటీలకు ఆర్థిక భారం లేకుండా, పనులు చేపట్టేందుకని ముందస్తు పెట్టుబడిగా(రివాల్వింగ్ ఫండ్) ఇప్పటికే రూ.18 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. పనులు పూర్తయ్యేంత వరకు విడతల వారీగా ఇలా ముందస్తు పెట్టుబడి నిధులు విడుదల చేసేలా అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. తాగు నీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫర్నిచర్, గ్రీన్ చాక్‌బోర్డు, ఎల్ఈడీ టీవీలు ఇలా సకల సౌకర్యాలు కల్పించేలా పాఠశాలల్లో శరవేగంగా పనులు జరుగుతున్నాయి.


పాఠశాలలో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాప్‌లు

నియోజకవర్గాల వారీగా రెండో దశలో చేపడుతున్న పనులు

నియోజకవర్గం	పాఠశాలల సంఖ్య	మంజూరైన నిధులు(రూ.లక్షల్లో)	విడుదలైన రివాల్వింగ్ ఫండ్(రూ. లక్షల్లో)
భీమునిపట్నం	156	5533.54	806.86
గాజువాక	70	2416.64	349.92
పెందుర్తి	58	2380.86	338.65
విశాఖ తూర్పు	17	931.62	123.95
విశాఖ దక్షిణం	6	651.85	97.79
విశాఖ పశ్చిమం	14	704.78	81.61
మొత్తం	321	12619.29	1798.78

పనులపై ప్రత్యేక దృష్టి



నాడు–నేడు పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనులు పర్యవేక్షిస్తున్నందున ఈసారి హెచ్ఎంలకు భారం తగ్గుతుంది. పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సౌకర్యాలు సమకూరుతాయి. హైస్కూళ్లలో అదనపు గదుల నిర్మాణం వల్ల తరగతుల నిర్వహణ ఎంతో సౌలభ్యంగా ఉంటుంది.

– డి.అప్పలనాయుడు, ఏపీవో, సమగ్ర శిక్ష, విశాఖ జిల్లా

మీన లోకం.. పిలుస్తోంది


అండర్ వాటర్ టన్నెల్

- ప్రత్యేక ఆకర్షణగా అండర్ వాటర్ టన్నెల్
- కనువిందు చేస్తున్న వందలాది వెరైటీ చేపలు

ఏయూక్యాంపస్: అదో అద్భుత ప్రపంచం. అక్కడ అడుగు పెట్టామంటే ఊహల్లో తేలిపోయే అనుభూతి. సముద్ర గర్భంలో సంచరిస్తున్నామన్న భావన. మైమరపించే సముద్ర గర్భ దృశ్యాలు. చుట్టూ వందల సంఖ్యలో అందమైన చేపలు.. వాటి కేరింతలు..అదో ప్రపంచాన్ని తలపిస్తోంది. మత్స్యలోకంలో విహరించే అనుభూతిని కలిగిస్తోంది. ఒకటా రెండా.. వందల రకాలు మత్స్యాలు మురిపిస్తున్నాయి. రా రమ్మని ఆహ్వానిస్తున్నాయి. ఇంకెందుకు ఆలస్యం ఓ సాయంత్రం వేళ అలా..విశాఖనగరంలో ఏర్పాటు చేసిన అండర్ వాటర్ టన్నెల్‌ను సందర్శిద్దామా..

ఇప్పటి వరకు అక్వేరియంలో మాత్రమే చేపల్ని చూసిన నగరవాసులకు అండర్ వాటర్ టన్నెల్ మరొక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. బీచ్‌రోడ్డులోని ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో ఏర్పాటు చేసిన మీనా లోకం విశాఖ నగరానికి మరొక మణిహారంగా నిలుస్తోంది. ఇక్కడ ఏర్పాట చేసిన ఫన్ ఫెయిర్, హ్యాండీ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన మత్స్య లోకం మంత్రముగ్ధులను చేస్తోంది.

కేరళ టు విశాఖ

అండర్ వాటర్ టన్నెల్ ప్రత్యేకంగా రూపకల్పన చేశారు. దీనికోసం కేరళకు చెందిన నిపుణులైన సిబ్బంది 20 మందికిపైగా నెలరోజుల పాటు పని చేశారు. కేరళ నుంచి ప్రత్యేకమైన కంటైనర్లలో వివిధ రకాల చేపలను విశాఖకు తీసుకువచ్చారు. రెండు వరుసల్లో 40కిపైగా భారీ అక్వేరియంలు నిర్మించి వీటిలో పలు జాతుల చేపలను ఉంచారు. వీటిని చూసి తరువాత కొంత ముందుకు వెళ్లగానే మూడో వరుసలో అండర్ వాటర్ టన్నెల్ అక్వేరియం కనువిందు చేస్తుంది. మనం కింద నుంచి నడుచుకుంటూ వెళుతుంటే మన చుట్టూ నీట్లో సంచరిస్తున్న అందమైన రంగురంగుల చేపలు కనువిందు చేస్తాయి. విశాఖ నగరంలో గతంలో ఎన్నడూ ఇటువంటి అండర్ వాటర్ టన్నెల్ ఏర్పాటు కాలేదు. తొలిసారిగా ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి దీనిని ఏర్పాటు చేశారు.

మంచినీరు.. సముద్రపు నీరు

మత్స్యలోకంలో ఏర్పాటు చేయడం అంత సులభమైన విషయం కాదు. చేపలను సంరక్షించడం, వాటికి అవసరమైన ఆక్సిజన్ అందించడం, ఆహారం అందించడం వంటివి నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. కొన్ని చేపలు మంచి నీటిలో జీవనం సాగిస్తుండగా, మరికొన్ని సముద్రపు నీటిలో మాత్రమే జీవనం సాగిస్తాయి. దీనికోసం ప్రత్యేకంగా ఒక ఆక్సిజన్ ప్లాంట్‌ను సైతం ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం పదుల సంఖ్యలో చేపలు అక్వేరియంలో, టన్నల్‌లో చనిపోవడం జరుగుతుంది. వీటిని తొలగిస్తూ కొత్తవాటిని తీసుకురావడం నిరంతరం జరుగుతుంది. సముద్రపు నీటిలో జీవించే చేపలకు అవసరమైన సముద్రపు నీటిని తీసుకువచ్చి అక్వేరియంలో నీటిని తరచూ మార్చడం జరుగుతుంది. అదే విధంగా అధిక శాతం చేపలకు చికెన్‌ను ఆహారంగా అందించడం జరుగుతోంది. అండర్ వాటర్ టన్నెల్‌లో ఏసీలను ఏర్పాటు చేసి ఉష్ణోగ్రతలను ఎప్పటికప్పుడూ క్రమబద్ధీకరిస్తూ సంరక్షిస్తున్నారు.







జపాన్‌కు చెందిన కోయికార్ప్ చేపలు

వందల రకాలు

శాఖాహారం తీసుకుని జీవించే జెయింట్ గౌరింగ్, అత్యంత ఖరీదైన పులివాగ, అరవాన చేపలు ఇక్కడ ఉన్నాయి. కోయికార్ప్, కబూత, నల్లని, తెల్లని రంగుల్లో ఉండే పిరానా చేపలు, నల్లని, తెల్లని షార్క్ చేపలు, తనను తాను రక్షించుకోవడానికి విద్యుత్ తరంగాలను విడుదల చేసే ప్రమాదకరమైన పొడవైన ఎలక్ట్రిక్ ఈల్ చేప, ఇతర ప్రాణుల నుంచి తననుతాను రక్షించుకోవడానికి విషపూరితమైన ముళ్లను శరీరంపై కలిగి ఉండే లయన్ ఫిష్, రంగులు మార్చే ఆస్కార్ టైగర్, చైనాలో లభించే అరోనా చేప, పొడవాటి మీసాలతో ఎక్కువ కాలం జీవించే రెడ్ టైల్, చూడటానికి పువ్వులు, మొక్కలను పోలిన విధంగా ఉండే హనీమూన్ ఫిష్ వంటివి చూడాలంటే ఇక్కడకు వెళ్లాల్సిందే. వీటితో పాటు హెలికాప్టర్ ఫిష్, ఏంజల్ ఫిష్, ఫ్లవరాన్ ఫిష్, స్టార్ ఫిష్ ఇలా వివిధ వెరైటీల చేపలు ఇక్కడ మనుసుని కట్టిపడేస్తాయి. పులిగామ, అమెజాన్ నదుల్లో లభించే అరవాన చేప రూ.6 లక్షలు వరకు ధర ఉంటుంది. హర్షైమ, ఈల్ చేపలు జత రూ. 3.5 లక్షలు వరకు ధర పలుకుతాయి.

ఆదరణ బాగుంది



నగరానికి వస్తున్న ఇతర రాష్ట్రాల పర్యాటకు సైతం పెద్దసంఖ్యలో అండర్ వాటర్ టన్నెల్‌ను చూడటానికి వస్తున్నారు. వైవిధ్యతను విశాఖ ప్రజలకు అందించడానికి ప్రతి ఏడాది కృషిచేస్తున్నాం. విశాఖ ప్రజలు ఎల్లప్పుడూ కొత్తదనాన్ని స్వాగతిస్తారు. త్వరలో మరిన్ని జాతుల చేపలను ప్రత్యేకంగా కేరళ నుంచి తీసుకువస్తాం.

– రాజారెడ్డి, ఎగ్జిబిషన్ నిర్వాహకుడు

ఆర్టీసీకి సంక్రాంతి

- పండగలో రాబడిని పెంచిన స్పెషల్స్
- వివిధ ప్రాంతాలకు 670 ప్రత్యేక బస్సులు
- వీటి ద్వారా రూ.కోటిన్నరకు పైగా ఆదాయం
- కిలోమీటరుకు రూ.40 చొప్పున ఆర్జన
- గత ఏడాదికంటే పెరిగిన ప్రయాణికుల రద్దీ
- మెరుగుపడిన ఆక్యుపెన్సీ రేషియో


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ద్వారకా బస్‌స్టేషన్

సాక్షి, విశాఖపట్నం: ఆర్టీసీకి సంక్రాంతి పెద్ద పండగే అయింది. ఈ ఏడాది ఊహించిన దానికంటే అధిక ఆదాయాన్ని ఆర్జించింది. ఆర్టీసీ విశాఖ జిల్లా అధికారులు ఈ సంక్రాంతికి వచ్చి, వెళ్లే వారి కోసం తొలుత 550 స్పెషల్ బస్సులను నడపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటిని ఈనెల 10 నుంచి 22 వరకు 19 రూట్లలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్‌కు తిప్పాలని నిర్ణయించారు. అయితే ప్రయాణికుల రద్దీ పెరగడంతో ఈ ఏడాది సంక్రాంతికి లక్ష్యానికి మించి 670 స్పెషల్ బస్సులను నడిపారు. సంక్రాంతి ముందు వరకు 525, ఆ తర్వాత 21వ తేదీ వరకు మరో 145 ప్రత్యేక బస్సులను సమకూర్చారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా విశాఖపట్నం నుంచి హైదరాబాద్, శ్రీకాకుళం, పార్వతీపురం, పలాస, పాలకొండ, రాజాం, రాజమండ్రి, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, అమలాపురం ప్రాంతాలకు ఎక్కువ సర్వీసులు తిప్పారు. ఈ స్పెషల్ బస్సుల ద్వారా సంక్రాంతి దాకా రూ.84.57 లక్షలు, అనంతరం రూ.67 లక్షలు వెరసి రూ.కోటిన్నరకు పైగా రాబడి వచ్చింది. సంక్రాంతికి ముందు 60 శాతం, అనంతరం 66 శాతం ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) లభించింది. మొత్తమ్మీద కిలోమీటరుకు రూ.40కి పైగా ఆదాయం జిల్లా ఆర్టీసీకి సమకూరింది. కాగా సంక్రాంతికి వచ్చి తిరుగు ప్రయాణమయ్యే వారిని దృష్టిలో ఉంచుకుని ఆదివారం కూడా మరికొన్ని ప్రత్యేక బస్సులను నడపనున్నారు.

గత సంక్రాంతికంటే మెరుగు

గత ఏడాది సంక్రాంతికి ఈ రీజియన్ నుంచి 492 ప్రత్యేక బస్సులను నడిపారు. వీటి ద్వారా రూ.87 లక్షల ఆదాయాన్ని మాత్రమే ఆర్జించగలిగింది. కోవిడ్ మూడో వేవ్ ప్రభావంతో అప్పట్లో సంక్రాంతికి రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య తగ్గింది. ఈ సంక్రాంతికి కోవిడ్ పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో ప్రయాణికుల రద్దీ బాగా పెరిగింది.

కలిసొచ్చిన వ్యూహం

సాధారణంగా ఆర్టీసీ దసరా, సంక్రాంతి వంటి పండగలకు నడిపే ప్రత్యేక బస్సుల్లో టికెట్టు ధరపై 50 శాతం అదనంగా వసూలు చేస్తారు. ఈసారి అదనపు వడ్డన లేకుండా ప్రయాణికుల నుంచి రెగ్యులర్ (సాధారణ) చార్జీలనే వసూలు చేయాలని ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. ఈ విషయం చాలా మందికి ముందుగానే తెలియడంతో స్పెషల్ బస్సుల్లో ఎక్కువ మంది ప్రయాణించడానికి ఆసక్తి చూపడం ద్వారా సంస్థకు ఆదాయం పెరగడానికి దోహదపడిందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఈ సంక్రాంతికి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు చేసిన ప్రజలకు, రేయింబవళ్లు సేవలందించి సంస్థ రాబడి పెరగడానికి కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు కృతజ్ఞతలు తెలిపారు.

భరతమాత రక్షకులకు తర్ఫీదు

- ఓ మాజీ సైనికుడి గొప్ప మనసు
- రక్షణ రంగంలో చేరాలనుకునే వారికి శిక్షణ
- ఇప్పటికే పలువురికి ఉద్యోగాలు

పెదగంట్యాడ: అతనో సైనికుడు.. దేశ రక్షణ కోసం ఆర్మీలో చేరి 15 ఏళ్ల పాటు సేవలందించారు.. అక్కడితో ఆగిపోకుండా.. ఆర్మీలో చేరేందుకు ఉత్సాహం ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితుల కారణంగా వెనకడుగు వేస్తున్న వారిని గుర్తించి.. వారిలో ఉత్సాహం నింపి శిక్షణ ఇచ్చి.. నిష్ణాతులుగా మార్చి.. ఉద్యోగాలు పొందే వరకూ అలుపు లేకుండా తర్ఫీదు ఇస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు పెదగంట్యాడ మండలం నడుపూరుకు చెందిన రౌతు గోవిందరావు. 2000వ సంవత్సరంలో ఆర్మీలో చేరిన గోవిందరావు 15 ఏళ్ల పాటు జనరల్ డ్యూటీ సోల్జర్‌గా సేవలందించి ఉద్యోగ విరమణ పొందారు.. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పని చేసిన ఆయన దేశ రక్షణ కోసం అహర్నిశలు పాటుపడ్డారు. ప్రస్తుతం దేశ రక్షణ కోసం తనలాగే ఎంతోమందిని తీర్చిదిద్దే పనిలో ఉన్నారు. ఇప్పటికే ఆయన తనకంటూ ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారు.. ఆర్మీలో చేరాలని.. సైన్యంలో చేరి సేవలందించాలనే తపన ఉన్నప్పటికీ.. పెద్ద పెద్ద శిక్షణ సంస్థల్లో చేరి తర్ఫీదు పొందే అవకాశం లేని ఎంతోమంది పేద, మధ్యతరగతి యువకులు ఇప్పుడు ఆర్మీ గోవింద్ వద్ద ఉచితంగా శిక్షణ పొందుతున్నారు.

2017 నుంచి శిక్షణ

2017 నుంచి ఇటువంటి వారికి గోవింద్ శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా పలువురు యువకులు ప్రస్తుతం ఆర్మీ, నేవీలో పని చేస్తున్నారు. తన దగ్గరకు వచ్చిన యువకులకు ముందుగా ఆయన దేశభక్తిని పెంపొందించే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. అనంతరం వారితో శరీర దృఢత్వం కోసం వివిధ రకాల కసరత్తులు చేయిస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఆదర్శగ్రౌండ్‌లో తర్ఫీదు ఇస్తున్నారు. అక్కడకు వచ్చిన యువతకు పరుగుతోపాటు లాంగ్ జంప్, హైజంప్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సమయానికి వారిని తీర్చిదిద్దుతున్నారు.


ఆర్మీ శిక్షణలోని యువతతో గోవింద్

రుణపడి ఉంటా



గోవింద్ గారికి రుణపడి ఉంటా. నేను ఆర్మీలో ఉద్యోగం సాధించడానికి ఆయన ఇచ్చిన శిక్షణే కారణం. దేశ రక్షణలో నేను ఒక సైనికుడినయ్యా. చాలా గర్వంగా ఉంది. ఆయన శిక్షణలో ఎంతో మంది ఉద్యోగాలు పొందారు.

– టి.అశోక్, ఆర్మీ ఉద్యోగి

దేశ రక్షణలో భాగస్వామ్యం చేస్తున్నా



నేటి యువత చెడు మార్గంలో కాకుండా దేశ రక్షణకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ ఇస్తున్నా. లాభాపేక్ష లేకుండా పేద, మధ్యతరగతి వారిని గుర్తించి శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతున్నా. దీంతో తాను పుట్టి పెరిగిన గ్రామానికి కూడా విశేష సేవలందిస్తున్నా. ఇప్పటికే మండల పరిధిలోని పలు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించా. స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాల్లోనూ యువతను భాగస్వాములను చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.

– గోవిందరావు, మాజీ సైనికుడు

ఆరోగ్య ఆహార ప్రయాణం

- భార్య ఆరోగ్యం కోసం భర్త ప్రయత్నం
- ఆ ఆలోచనల్లోంచి పుట్టిందే 'అవినాష్'
- సిరిధాన్యాలతో చపాతీ పిండి తయారీ

ఏయూక్యాంపస్: తన భార్య ఆరోగ్యం కోసం మంచి ఆహారం అందించాలని ఓ భర్తకు వచ్చిన ఆలోచన.. నూతన స్టార్టప్‌ను ప్రారంభించే దిశగా నడిపించింది. ఆహారమే ఔషధంగా పని చేస్తుందని నిరూపించి.. చేసే పనిలో విజయవంతమయ్యారు ప్రజ్ఞానంద్. తన భార్య సాయిపద్మకు సంపూర్ణ ఆరోగ్యం అందిస్తూ.. పలువురు మహిళలకు ఉపాధి కల్పిస్తూ.. స్టార్టప్ సంస్థ అవినాష్‌ను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సిరిధాన్యాలతో సులభంగా రొట్టెలు చేసుకునే విధానాన్ని ఆయన రూపొందించారు. ఇందుకు పేటెంట్ కోసం దరఖాస్తు కూడా చేశారు. వృత్తిరీత్యా దేశ వ్యాప్తంగా విభిన్న ప్రాంతాల్లో నివసించిన ప్రజ్ఞానంద్.. ప్రస్తుతం విశాఖలో స్థిరపడి ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించే పనిలో తలమునకలై ఉన్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రజ్ఞానంద్ 2014లో యోగాలో పీజీ కోర్సు పూర్తి చేసి బంగారు పతకం సాధించారు. యోగా అభ్యాసకుడిగా, శిక్షకుడిగా మారారు. తన భార్య సాయిపద్మకు ఉన్న ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి, సంపూర్ణ ఆరోగ్యవంతురాలిగా తీర్చిదిద్దడానికి యోగా, ఆహారంపై విస్తృతంగా అధ్యయనం చేయడం ప్రారంభించారు. శరీరంలో డిటాక్సిఫికేషన్(నిర్విషీకరణ)కు వివిధ జూస్‌లు సహజ సిద్ధంగా తయారుచేయడం, వినియోగించడం, ఫలితాలు బేరీజు వేసుకుంటూ ముందుకు సాగారు. తద్వారా ఆరోగ్య ఆహార ప్రయాణాన్ని ప్రారంభించారు. తన భార్య ఆరోగ్యం గణనీయంగా మెరుగవడంతో దీనిని అందరికీ పంచాలనే ఉద్దేశంతో ముందడుగు వేశారు.

చపాతీ పిండి తయారీ

ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే సిరిధాన్యాలతో రొట్టెల తయారీ కొంత సంక్లిష్టమైన ప్రక్రియ. ఇందుకోసం ప్రజ్ఞానంద్ సొంతంగా ఓ విధానం రూపొందించారు. మైదా, గోధుమ పిండి కలపకుండా కేవలం సిరిధాన్యాల పిండికి, కొద్ది మోతాదుల్లో వివిధ మూలికల పొడి, కూరగాయల పొడిని జోడించి సులభంగా రొట్టెలు తయారు చేస్తున్నారు. దీని పేటెంట్ కోసం దరఖాస్తు చేశారు. ప్రస్తుతం ఆర్డర్‌పై రొట్టెలు తయారు చేసి అందించడం, విడిగా పొడిని విక్రయిస్తున్నారు. సిరిధాన్యాలతో చపాతీ పిండి తయారీ విజయవంతం కావడానికి దాదాపు 800 కిలోల పిండిని వినియోగించి, వివిధ రూపాల్లో ప్రయోగాలు చేశారు.



రైతులతో జతకట్టారు

తనకు అవసరమైన సిరిధాన్యాలను ప్రకృతి విధానంలో సాగుకు రైతులతో జతకట్టారు. ఆదివాసీ, గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అవగాహన కల్పించి ఆర్గానిక్ విధానంలో వీటిని పండించే విధంగా ప్రోత్సహిస్తున్నారు. రైతులకు మద్దతు ధరకంటే అధికంగా అందజేసిచ వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తూ.. సిరిధాన్యాలు సేకరిస్తున్నారు. అత్యధిక పోషకాలు జింక్, ఐరన్ కలిగిన ఇంద్రావతి రాగిని రైతులతో సాగు చేయిస్తున్నారు.


హైదరాబాద్‌లో జరిగిన ఎగ్జిబిషన్‌లో చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న ప్రజ్ఞానంద్

విభిన్న ఉత్పత్తులు

ప్రస్తుతం చపాతీ పిండితో పాటు, రవ్వ, ఇడ్లీ, దోశ పిండి, సిరిధాన్యాలతో చేసిన లడ్డూలు, నూడిల్స్, సజ్జలతో చేసిన అప్పడాలు, పిజ్జాకు వినియోగించే బేస్ వంటివి తయారు చేసి వాణిజ్యపరంగా తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి ఉత్పత్తుల్లో పాయసం, మిక్చర్, కుకీస్, బిస్కట్లు, పనసకాయ–మిల్లెట్స్ బిరియాని, బీట్‌రూట్ లడ్డూ బాగా ఫేమస్. ఈ రంగంలో పనిచేస్తున్న ఇతర స్టార్టప్ సంస్థల నుంచి కూడా కొన్ని ఉత్పత్తులు తీసుకువచ్చి.. సమష్టిగా పనిచేయాలనే సందేశాన్ని చాటుతున్నారు.

రూ.22 లక్షల స్టార్టప్ గ్రాంట్ విడుదల

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ తరపున వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రజ్ఞానంద్ చేస్తున్న కృషిని గుర్తించి రూ.22లక్షల స్టార్టప్ గ్రాంట్‌ను మంజూరు చేసింది. తొలి విడతగా 8.8 లక్షలు విడుదలయ్యాయి. ఈ మొత్తాన్ని వినియోగించి వాణిజ్య విధానంలో సిరిధాన్యాలతో రొట్టెలు తయారు చేసే యంత్రాన్ని తయారు చేసే పనిలో ప్రజ్ఞానంద్ ఉన్నారు. అవినాష్ సంస్థలో పనిచేసే వారంతా మహిళలే కావడం విశేషం. వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న మహిళలకు ఆర్థిక స్వావలంబన అందించేందుకు ఈ సంస్థ కృషి చేస్తోంది.


అవినాస్ సంస్థ నిర్వాహకులు ప్రజ్ఞానంద్, సాయిపద్మ


అవినాష్ సంస్థ తయారు చేస్తున్న ఉత్పత్తులు

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943